సత్యమేవ జయతే

సాక్షి



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 298

SUNDAY Special

ఆదివారం 19-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

'చాంపియన్స్' సమరానికి సిద్ధం



ఐసీసీ వన్డే టోర్నీ చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. రోహిత్ శర్మ నాయకత్వంలో 15 మంది సభ్యుల జట్టులో బుమ్రాకు అవకాశం లభించగా.. సిరాజ్‌కు చోటు దక్కలేదు.

- వివరాలు 14లో

కేన్సర్ కాటు..? వద్దు కుంగుబాటు



కేన్సర్ వచ్చిందని తెలియగానే బాధితులు కుంగిపోతారు. నీరసం మరింత కుంగుబాటుకు గురిచేస్తుంది. దీనినే 'కేన్సర్ ఫెటీగ్' అంటారు. దీన్ని ఎలా అధిగమించాలో తెలియజేసే ప్రత్యేక కథనం.

- వివరాలు 13లో

కేజ్రీవాల్ కారుపై దాడి: ఆప్



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ కారుపై బీజేపీ మద్దతుదారులు దాడికి పాల్పడ్డారని 'ఆప్' ఆరోపించింది.

- వివరాలు 6లో▶

మనోళ్లపై ప్రభావమెంత?



అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ పునరాగమనం ప్రవాస భారతీయులకు అవకాశాలతోపాటు సవాళ్లు కూడా మోసుకురానుంది.

- వివరాలు 6లో▶


అనుమానితుడి అరెస్ట్



సైఫ్ అలీఖాన్‌పై హత్యాయత్నం కేసులో ఓ అనుమానితుడిని ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

- వివరాలు 6లో▶

వికాస్ ఇంజిన్ రీస్టార్ట్ సక్సెస్



తమిళనాడు మహేంద్రగిరిలోని ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో వికాస్ లిక్విడ్ ఇంజిన్‌ను విజయవంతంగా రీస్టార్ట్ చేసినట్లు ఇస్రో తెలిపింది.

- వివరాలు 6లో▶

డేటా సెంటర్లకు రాజధాని

హైదరాబాద్‌లో ఎస్టీ టెలిమీడియా క్యాంపస్ ఏర్పాటు కానుండటమే ఉదాహరణ: సీఎం రేవంత్

- సింగపూర్ పర్యటన రెండో రోజున పలు సంస్థలు, ప్రభుత్వ ప్రతినిధులతో రాష్ట్ర బృందం భేటీలు
- రూ.3,500 కోట్లతో ఎస్టీ టెలిమీడియా 'గ్లోబల్ డేటా సెంటర్' ఏర్పాటుకు ఒప్పందం
- ముచ్చర్ల సమీపంలోని మీర్‌ఖాన్‌పేటలో స్థాపనకు నిర్ణయం
- సింగపూర్ వాణిజ్య మంత్రితోనూ సీఎం రేవంత్ బృందం భేటీ
- వివిధ రంగాల్లో భాగస్వామ్యం కావాలని ఆహ్వానం
- సంయుక్తంగా చేపట్టే ప్రాజెక్టులపై అధ్యయనం కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటుకు నిర్ణయం
- రాష్ట్రంలో సెమీకండక్టర్ల రంగ పరిశ్రమల ఏర్పాటుకు ఎస్ఎస్ఐఏ ఆసక్తి



సింగపూర్ వాణిజ్య, పర్యావరణ మంత్రి గ్రేస్ ఫు హెయిన్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ త్వరలోనే డేటా సెంటర్లకు రాజధానిగా అవతరిస్తుందని, సింగపూర్‌కు చెందిన ఎస్టీ టెలి మీడియా భారీ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకురావడం దీనిని చాటి చెబుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలు, ప్రపంచస్థాయి అనుకూలతలు ఉన్నాయని చెప్పారు. సింగపూర్ పర్యటనలో భాగంగా రెండో రోజు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఎస్టీ టెలి మీడియా కేంద్ర కార్యాలయాన్ని సందర్శించింది. ఆ కంపెనీ ప్రతినిధులతో చర్చించింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో రూ.3,500 కోట్ల పెట్టుబడితో 'గ్లోబల్ డేటా సెంటర్' ఏర్పాటుకు ఎస్టీ టెలి మీడియా ముందుకొచ్చింది. ముచ్చర్ల సమీపంలోని మీర్‌ఖాన్‌పేటలో ఏఐ ఆధారిత అత్యాధునిక డేటా సెంటర్ క్యాంపస్ స్థాపించేందుకు అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఒప్పంద పత్రాలపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ఎస్టీటీ గ్రూప్ ప్రెసిడెంట్, సీఈఓ బ్రూనో లోపెజ్ సంతకాలు చేశారు. భారతదేశంలోని అతిపెద్ద డేటా సెంటర్లలో ఒకటిగా నిలిచే ఎస్టీటీ గ్లోబల్ డేటా సెంటర్ తెలంగాణలో ఏర్పాటు కానుండటం... ఇక్కడి మౌలిక సదుపాయాలు, ప్రపంచస్థాయి అనుకూలతలను చాటి చెప్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ ఆధారిత రంగాల్లో వస్తున్న మార్పుల్లో హైదరాబాద్ కీలకపాత్ర పోషిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఇక తెలంగాణలో మౌలిక వసతులు, ప్రభుత్వ ప్రగతిశీల విధానాలు ఆవిష్కరణలను ప్రోత్సహించేలా ఉన్నా యని ఎస్టీ టెలిమీడియా గ్లోబల్ డేటా సెంటర్స్ ప్రెసిడెంట్, సీఈవో బ్రూనో లోపెజ్ ప్రశంసించారు.

భారీగా విస్తరణ దిశగా..

ఇప్పటికే హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో డేటా సెంటర్‌ను నిర్వహిస్తున్న మిగతా 12వ పేజీలో ▶

తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కండి

- ప్రవాస తెలంగాణీయులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

12 లో

పేరు మార్పు, ఖాతా బదిలీ చందాదారులే చేయొచ్చు

యాజమాన్యంతో పనిలేదన్న ఈపీఎఫ్ఓ

- ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాలను మార్చుకోవచ్చు..
- ఈపీఎఫ్ ఖాతాను సైతం బదిలీ చేసుకోవచ్చు
- ఈపీఎఫ్ఓ చందాదారులకు కొత్త సౌకర్యం

న్యూఢిల్లీ

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) 7.6 కోట్లకుపైగా చందాదార్లకు శుభవార్త చెప్పింది. యాజమాన్యం (కంపెనీ) నుంచి తనిఖీ లేదా ఈపీఎఫ్ఓ ఆమోదం లేకుండా ఉద్యోగులే వారి పేరు, పుట్టిన తేదీ, జాతీయత, లింగం, తల్లి/తండ్రి పేరు, జీవిత భాగస్వామి పేరు, కంపెనీలో చేరిన/రాజీనామా చేసిన తేదీ వంటి వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్‌లో మార్చుకునే వెసులుబాటును అందుబాటులోకి తెచ్చింది. అంతేగాక ఆధార్ ఓటీపీ సాయంతో ఈపీఎఫ్ ఖాతాను కొత్త కంపెనీకి బదిలీ చేసుకోవచ్చు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నట్టయితే యజమాని వద్ద పెండింగ్‌లో ఉన్న బదిలీ క్లెయిమ్ అభ్యర్థనను తొలగించి.. చందాదార్లు నేరుగా ఈపీఎఫ్ఓకు క్లెయిమ్‌ను సమర్పించవచ్చు. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఈ సేవలను శనివారం పరిచయం చేశారు. '2017 అక్టోబర్ 1 తర్వాత యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్) పొందిన సభ్యులకు ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ఎటువంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. 2017 అక్టోబర్ 1 కంటే ముందు యూఏఎన్ జారీ అయితే ఈపీఎఫ్ఓ



ఆమోదం లేకుండా యాజమాన్యాలు ఈ వివరాలను సరిచేయవచ్చు. అటువంటి సందర్భాలలో పత్రాల ఆవశ్యకత కూడా సరళీకృతం చేశాం. ఆధార్‌తో యూఏఎన్ అనుసంధానం కాకపోతే ఏదైనా దిద్దుబాటు కోసం పత్రాలను యజమానికి భౌతికంగా సమర్పించాలి. ధ్రువీకరణ తర్వాత యాజమాన్యాలు ఆమోదం కోసం ఈపీఎఫ్ఓకు పంపాల్సి ఉంటుంది' అని వివరించారు. సభ్యులు దాఖలు చేసిన ఫిర్యాదుల్లో దాదాపు 27 శాతం ప్రొఫైల్/కేవైసీ సమస్యలకు సంబంధించినవేనని మంత్రి తెలిపారు. ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల భవిష్యనిధి సంస్థకు ఫిర్యాదులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు.

న్యూస్‌రీల్

ఉగాది నుంచి గద్దర్ అవార్డులు ప్రదానం



ఉగాది నుంచి గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డులను అందజేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. సచివాలయంలో గద్దర్ అవార్డుల కమిటీతో సమావేశం నిర్వహించారు.

- వివరాలు 16లో▶

అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు



అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని, ఆందోళన అవసరం లేదని తెలిపింది.

- వివరాలు 3లో▶

'ఇందిరమ్మ' కటాఫ్ 1994



ఉమ్మడి రాష్ట్రంలో 1994కు ముందు ప్రభుత్వ పథకంలో ఇంటిని పొందిన నిరుపేదలు ఇప్పుడు ఇందిరమ్మ పథకంలో కూడా ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

- వివరాలు 3లో▶

బ్యాంకులో రైతు ఆత్మహత్య



తీసుకున్న రుణం చెల్లించాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురైన ఓ రైతు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాదకర ఘటన శనివారం ఆదిలాబాద్‌లో జరిగింది.

- వివరాలు 5లో▶

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

మీడియాతో చిట్‌చాట్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి ఆరెస్సెస్ నేపథ్యం అవసరం లేదు
- వారం తర్వాత కొత్త అధ్యక్షుడి ప్రకటన
- 3 ఎమ్మెల్సీ సీట్లను గెలుచుకుంటాం
- 10 సీట్లలో ఉప ఎన్నికలు అంటూ కేటీఆర్ 'సుప్రీం'జడ్జి అయిపోయారు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గత పదకొండేళ్లుగా రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు కేంద్రం నేరుగా నిధులు విడుదల చేసిందని, ఈ దృష్ట్యా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు బీజేపీకి మాత్రమే ఉందని అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో ఏ పార్టీతోనూ తమకు పొత్తు ఉండదని ఆయన స్పష్టం చేశారు. స్థానికంగా ఉండే కులసంఘాలు, ఇతర సంస్థలతో కలసి పనిచేస్తామన్నారు. శనివారం కిషన్‌రెడ్డి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ స్థానిక సంస్థలకు నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేసిన విషయాన్ని ప్రజలకు వివరిస్తామని చెప్పారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డిని నియమించే అవకాశముందని వస్తున్న వార్తలపై స్పందించాలని విలేకరులు కోరినపుడు.. కేంద్ర మంత్రిగా ప్రజలకు, తన శాఖలో పనిచేస్తున్న వారికి సేవ చేయాలని అనుకుంటున్నానని ఆయన బదులిచ్చారు. తన బొగ్గు, గనుల శాఖ పరిధిలో 6 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి రూ.కోటి బీమా పథకాన్ని త్వరలోనే ప్రకటిస్తామని ఆయన చెప్పారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఎవరిని నియమించే అవకాశం ఉందనే ప్రశ్నకు మిగతా 15వ పేజీలో ▶



సింగరేణి 'ఎకో వనాలు'

మూసేసిన గనుల్లో అడ్వెంచర్ పార్క్‌లు

కొత్తగూడెంలో ఇప్పటికే సిద్ధమైన ఎకో పార్క్

- మిగిలిన ఏరియాల్లోనూ నిర్మాణానికి సన్నాహాలు
- ఎకో టూరిజం అభివృద్ధికి సింగరేణి ప్రోత్సాహం
- భారీ వ్యయంతో అత్యాధునిక సదుపాయాల కల్పన

16 లో

"ట్రెక్కింగ్, సైక్లింగ్ పాత్‌లు రెడీ

కొత్తగూడెం ఎకో పార్కు ఇప్పటికే సిద్ధమైంది. ఇక్కడే ట్రెక్కింగ్, సైక్లింగ్ పాత్‌లు రెడీ చేస్తున్నాం. త్వరలోనే బ్లాస్టింగ్ వ్యూ పాయింట్ రెడీ చేస్తాం. ఇక్కడికి వస్తే రోజంతా పర్యాటకులు ఇబ్బంది లేకుండా గడిపేలా ఏర్పాట్లు చేస్తాం. భవిష్యత్‌లో వీటిని పర్యాటక రంగానికి అప్పగించే ఆలోచన సింగరేణికి ఉంది.

- శ్రీరమేశ్, ప్రాజెక్ట్ ఆఫీసర్, గౌతం ఖని, కొత్తగూడెం ఏరియా

సంజయ్ రాయ్ దోషే

కోల్‌కతా జూనియర్ వైద్యురాలి హత్యాచార కేసులో నిందితుడి నేరాన్ని నిర్ధారించిన బెంగాల్ కోర్టు

- రేపు తుది తీర్పు, శిక్ష ఖరారు చేస్తామన్న న్యాయమూర్తి
- మృతురాలి తండ్రి లేవనెత్తిన అంశాలకు సైతం తీర్పులో బదులిస్తానని వెల్లడి
- దోషులందరికీ శిక్ష పడాల్సిందే: మృతురాలి తల్లి
- అప్పటిదాకా పోరు: జూనియర్ వైద్యులు
- తనను కేసులో ఇరికించారంటూ చెప్పుకొచ్చిన రాయ్



"తెల్లవారుజాము 4 గంటల సమయంలో ఆస్పత్రిలోకి చొరబడ్డావు. సెమినార్ హాల్‌లో నిద్రిస్తున్న ఆన్‌డ్యూటీ వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డావు. ఆమెకు ఊపిరాడకుండా చేసి ప్రాణాలు తీశావు. సంబంధిత సాక్ష్యాధారాలు పరిశీలించి, వాదనలు విన్న మీదట నువ్వే దోషివని నిర్ధారించా. నిన్ను శిక్షించాల్సిందే

- నిందితుడిని ఉద్దేశించి జడ్జి

6 లో

టీటీడీలో వరుస ఘటనలపై కేంద్రం సీరియస్

తొక్కిసలాట, అగ్ని ప్రమాదంపై నివేదిక పంపాలని ఆదేశం

- నిగ్గు తేల్చేందుకు అడిషనల్ సెక్రటరీని పంపుతామని సమాచారం
- టీటీడీ చరిత్రలో తొలిసారిగా కేంద్రం జోక్యం
- 7 నెలల్లోనే పవిత్ర తిరుమలను భ్రష్టు పట్టించిన 'పెద్దలు'



సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుమలలో వరుస ఘటనలను కేంద్ర హోం శాఖ తీవ్రంగా పరిగణించింది. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ ఏకంగా ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించడం.. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా ఈ నెల 8న తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతి చెందడం, పదుల సంఖ్యలో భక్తులు గాయపడటం.. ఈ ఘటన గురించి మరచిపోకముందే 13వ తేదీన లడ్డూ కౌంటర్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంపై కేంద్రం దృష్టి సారించింది. ఈ క్రమంలో తొక్కిసలాట, అగ్ని ప్రమాదంపై టీటీడీ నుంచి నివేదిక కోరింది. వరుస పరిణామాలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పర్యటించి, వాస్తవాలు తెలుసుకోవాలని మిగతా 12వ పేజీలో ▶



ఇక్కడ మాజీ ప్రధానులకు జైలు శిక్షలు ఆనవాయితీ సార్!




కాంకేర్ ఎన్‌కౌంటర్‌లో బడే దామోదర్ మృతి

- ప్రకటించిన మావోయిస్టు పార్టీ సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీ..
- హరిభూషణ్ తర్వాత మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు
- ములుగు జిల్లా కాల్వపల్లికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌గా గుర్తింపు
- ముగిసిన మూడు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానం..

15 లో

ఇన్‌కం.. లేదు నమ్మకం!

- దేశంలో 24 శాతం మంది మాత్రమే ఈ ఏడాది తమ ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు
- 48 శాతం గతేడాది కన్నా తగ్గుతుందని ఆందోళన చెందుతున్నారు... లోకల్ సర్కిల్స్ సర్వేలో వెల్లడి



దేశంలో 24 శాతం మంది మాత్రమే 2025లో తమ కుటుంబ ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు. అదే విధంగా 48 శాతం మంది తమ సంపాదన ఈ ఏడాది 25 శాతం వరకూ లేదా అంతకన్నా ఎక్కువ తగ్గొచ్చని ఆందోళన చెందుతున్నారు. 'లోకల్ సర్కిల్స్' నిర్వహించిన సర్వేలో ఈ మేరకు తేలింది. ఈ సర్వేలో 16,111 మంది పాల్గొన్నారు. సేవింగ్స్ గురించి ప్రశ్నించగా.. 27 శాతం మంది మాత్రమే ఈ ఏడాది తమ సేవింగ్స్ పెరుగుతాయని చెబితే.. 45 శాతం మంది 25 శాతం మేర తగ్గుతాయని చెప్పారు. 'దేశవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితి నెలకొనిఉన్న నేపథ్యంలో కేంద్ర బడ్జెట్లో ఆయా వర్గాల వారికి ఉపశమనం కలిగించేలా తగు చర్యలు తీసుకోవాలి' అని లోకల్ సర్కిల్స్ నివేదిక పేర్కొంది. ప్రజల ఆదాయంలో వృద్ధి లేకపోవడం.. అలాగే ధరల పెరుగుదల వల్ల 2024లో నిత్యావసరాలుకాని వస్తువుల కొనుగోలు తగ్గిందని.. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, వ్యక్తిగత వాహనాల కొనుగోళ్లలో తాము ఆశించినంత వృద్ధి కనపడలేదని రిటైలర్లు పేర్కొన్నట్లు తెలిపింది. ఈ ఏడాది కూడా ధరలు మరింత పెరుగుతాయని ప్రజలు నమ్ముతున్నట్లు తన నివేదికలో తెలిపింది.

- సాక్షి సెంట్రల్ డెస్క్


A quality product from
PAN BAHAR
PAN BAHAR
ది హెరిటేజ్ ఇలాచి
విజయానికి గుర్తింపు
NEW PACK
PAN BAHAR
THE HERITAGE
ELAICHI
TOLL FREE NO.: 1800 257 2258
www.panbahar.in

క్లుప్తంగా...

26న ఉపాధి కూలీలకు రూ.12 వేల చేయూత

మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న.. సొంత భూమిలేని ఉపాధి హామీ కూలీలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం'కింద ఏటా రూ.12 వేల ఆర్థిక చేయూతను ప్రభుత్వం అందించనుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఆమె శనివారం మిషన్ భగీరథ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. గ్రామసభ వేదికగానే అర్హుల గుర్తింపు, లబ్ధిదారుల ఎంపిక జరగాలని స్పష్టం చేశారు. గ్రామ సభల్లో కవ్వింపు చర్యలకు పాల్పడే అవకాశాలున్నాయని.. కూలీలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాగా, మాజీ మంత్రి హరీశ్‌రావుకు పంచాయతీ కార్మికుల వేతనాలపై మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. హరీశ్‌రావు ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడే నెలల తరబడి జీతాలు రాక పంచాయతీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. తమ వేతనాల గురించి గతంలో కలెక్టరేట్ల ఎదుట నిరసన తెలపడాన్ని ఆయన మరిచారా? అని ప్రశ్నించారు.

బీఆర్‌ఎస్ చేసిందేంటో ప్రజల ముందుంది

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ తెలంగాణ కోసం పుట్టిన పార్టీ అని, తెలంగాణకు బీఆర్‌ఎస్ చేసిందేంటో ప్రజల ముందు ఉందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, పట్నం నరేందర్ రెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలను కాలువలు తవ్వమంటే గతాన్ని తవ్వుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే సెక్షన్ 3 ప్రకారం నీళ్ల పంపిణీ జరగాలని కేంద్రానికి లేఖ రాశారని శ్రీనివాస్‌గౌడ్ గుర్తు చేశారు. దీనిపై నీటి పారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లా డాలని, కేసీఆర్‌ను ఇంకా విమర్శిస్తూ ఉంటే ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క ప్రాజెక్టు పనైనా ముందుకు సాగిందా? అని ప్రశ్నించారు.

దాశరథి శతజయంతిని ఘనంగా నిర్వహించాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర సాంస్కృతిక, టూరిజం శాఖమంత్రి జూపల్లి కృష్ణారావుకు శనివారం లేఖ రాశారు. హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ కూడలిలో దాశరథి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దాశరథి జన్మించిన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో స్మృతివనం ఏర్పాటుతో పాటు గ్రామస్తులు ఏర్పాటు చేసిన దాశరథి గ్రంథాలయానికి కొత్త భవనం నిర్మించాలని కోరారు. దాశరథి శత జయంత్యుత్సవాలను అధికారికంగా నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. నేటికీ కార్యక్రమాలు జరిగిన దాఖలాలు లేవని కవిత విమర్శించారు.

అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

బీఆర్‌ఎస్ మహిళా విభాగం ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావుపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ మహిళా విభాగం కోరింది. ఈ మేరకు సైబరాబాద్ డీసీపీకి శనివారం పార్టీ మహిళా విభాగం నేతలు సుశీలారెడ్డి, మెట్టుగూడ కార్పొరేటర్ సునీత, కీర్తిలతా గౌడ్, మంజుల తదితరులు ఫిర్యాదు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై వస్తున్న తీవ్ర వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు సోషల్ మీడియా ద్వారా అసత్య వార్తలు ప్రచారం చేస్తూ కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయ కులు వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఫిర్యా దులో పేర్కొన్నారు. కేసీఆర్ వ్యక్తిత్వంపై దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ సోషల్ మీడియా ఖాతాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రేవంత్‌ను అధిష్టానం నమ్మడం లేదు

బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం రేవంత్‌ను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నమ్మడం లేదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఆయన ఎన్నిసార్లు ఢిల్లీకి వచ్చి మొర పెట్టుకున్నా.. మంత్రివర్గ విస్తరణ చేయడం లేదన్నారు. దీనికి కారణం రేవంత్‌ను కాంగ్రెస్ అధిష్టానం నమ్మకపోవడమేనని స్పష్టం చేశారు. ప్రభాకర్ శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అధిష్టానాన్ని ఒప్పించేందుకు, మెప్పించేందుకు రేవంత్ పదేపదే మోదీని, ఆర్‌ఎస్‌ఎస్‌ను విమర్శిస్తున్నట్లు ఎద్దేవా చేశారు.

చర్లపల్లి తరహాలో మరిన్ని స్టేషన్లు..

- తెలంగాణ రైల్వే స్టేషన్లకు ఆధునిక రూపు
- రూ.2,737 కోట్లతో 40 స్టేషన్లకు ఆధునిక కొత్త భవనాలు
- అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా అభివృద్ధి
- నాంపల్లి స్టేషన్ పనులు మొదలు

సాక్షి, హైదరాబాద్: ఆధునిక రైళ్లను పట్టాలెక్కిస్తున్న రైల్వే శాఖ ఇప్పుడు రైల్వే స్టేషన్లకు ఆధునిక రూపు కల్పించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. హైదరాబాద్‌లో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లపై ఉన్న భారాన్ని తగ్గించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో నగర శివారులోని చర్లపల్లి స్టేషన్‌కు ఆధునిక భవనాన్ని నిర్మించిన తరహాలో.. రాష్ట్రంలోని ముఖ్య స్టేషన్లను సమూలంగా మార్చనుంది. రాష్ట్రంలో 40 స్టేషన్లకు కొత్త ఆధునిక భవనాలను నిర్మించేందుకు రూ.2,737 కోట్లను మంజూరు చేసింది. అమృత్ భారత్ స్టేషన్లుగా వీటిని గుర్తించిన రైల్వే శాఖ ఈమేరకు ఇటీవల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం దేశంలోనే పెద్ద స్టేషన్‌లలో ఒకటైన సికింద్రాబాద్ లాంటి స్టేషన్లలో కూడా సరైన వసతులు లేవు. వాటిని ఆధునీకరించకపోవటం, క్రమంగా రద్దీ విపరీతంగా పెరిగిపోవటంతో ప్రయాణికులు చాలా రకాల ఇబ్బందులు పడుతున్నారు. ఒకేసారి నాలుగైదు ముఖ్య రైళ్లు వచ్చిన సమయంలో, వాటిల్లోంచి ఎక్కి దిగే ప్రయాణికులతో పరిసరాలు కిక్కిరిసిపోయి సకాలంలో రైళ్ల వద్దకు చేరుకోలేక అవి వెళ్లిపోతున్న సందర్భాలు నిత్యకృత్యంగా మారాయి. సికింద్రాబాద్ స్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై ఆ సమయంలో ప్రయాణికులు ఎక్కడివారక్కడ నిలిచిపోయేంత రద్దీ ఉంటోంది. చూస్తుండగానే రైళ్లు వెళ్లిపోయి ప్రయాణికులు ఉసూరుమంటున్నారు. ఇక టికెట్ల జారీ, నిరీక్షణ సమయం, వీల్ చైర్లు, టాయిలెట్లు, ప్లాట్‌ఫామ్స్ మారే సమయం.. ఇలా అన్నీ ఇబ్బందులే. పెద్ద స్టేషన్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే, చిన్నవాటిల్లో సమస్యలు మరింత తీవ్రంగా ఉంటున్నాయి. వీటన్నింటినీ పరిష్కరించటంతోపాటు కొత్త వసతులు కల్పించటమే ఈ పథకం ఉద్దేశం. సాధారణ మరమ్మతులు కాకుండా, విమానాశ్రయ తరహాలో ఆకృతి ఇస్తూ ఆధునిక రూపు కల్పించాలన్నది ప్రధాని మోదీ ఆదేశం. విశాలమైన పార్కింగ్ ప్రాంతం, హైలెవల్ ప్లాట్‌ఫామ్స్, ఆధునిక వెయిటింగ్ హాల్స్, అవసరమైన చోట్ల ఎస్కలేటర్లు, వేగంగా టికెట్లు జారీ అయ్యేలా కౌంటర్లు, సరికొత్త అనౌన్స్‌మెంట్ వ్యవస్థ, సోలార్ విద్యుత్ ఏర్పాట్లు, విశాలమైన పార్కింగ్ లాట్స్, విశాలమైన అప్రోచ్ రోడ్లు, భద్రతా స్కానింగ్ సెంటర్లు, ఆకర్షణీయమైన భవనం.. ఇలా అన్ని వసతులతో ఇవి ఆకట్టుకుంటాయి.



నాంపల్లి ఆధునీకరించాక ఇలా..

14 స్టేషన్లకు ఆధునిక హంగులు

అమృత్‌భారత్‌లో చోటు దక్కించుకున్న స్టేషన్లలో 14 హైదరాబాద్‌కు చెందినవే కావటం విశేషం. అమృత్‌భారత్‌లో భాగమైనప్పటికీ, సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, చర్లపల్లి స్టేషన్లను భారీ ప్రాజెక్టుల కోటాలో ఉంచారు. వీటికి భారీ నిధులు కేటాయించారు. రూ.430 కోట్లతో మినీ ఎయిర్‌పోర్టు తరహాలో రూపుదిద్దుకున్న చర్లపల్లి టెర్మినల్‌ను ఇటీవలే ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రస్తు తం వేగంగా పనులు జరుపుకొంటున్న సికింద్రాబాద్, ఇటీవలే పనులు మొదలైన నాంపల్లి, త్వరలో పనులు ప్రారంభించుకోనున్న కాచిగూడ స్టేషన్లకు భారీగా నిధులు కేటాయించారు. ఇప్పటికే రూ.700 కోట్లతో సికింద్రాబాద్ స్టేషన్‌కు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భారీ భవనాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మరో ఏడాదిన్నరలో ఇది పూర్తి కానుంది. ఈ ఏడాది డిసెంబరు నాటికి కొత్త భవనం అందుబాటులోకి రావాల్సి ఉన్నా, సకాలంలో పనులు పూర్తయ్యేలా లేవు. దీంతో వచ్చే ఏడాది జూలై నాటికి సిద్ధమవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీని పనులు కొలిక్కి వస్తున్న తరుణంలో, నగరంలో మరో ముఖ్య స్టేషన్ అయిన నాంపల్లి (హైదరాబాద్) స్టేషన్ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. పాత క్వార్టర్ భవనాలు, చుట్టూ గోడలు కూల్చి వేశారు. ప్రధాన నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంది. ఈ స్టేషన్ భవనానికి రూ.327.27 కోట్లు కేటాయించారు.

కొత్త రూపు సంతరించుకోనున్న స్టేషన్లు ఇవే..



లింగంపల్లి ఆధునీకరించాక ఇలా..

- చర్లపల్లితోపాటు సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి, హఫీజ్‌పేట, హైటెక్ సిటీ, ఉప్పుగూడ, మలక్‌పేట, మల్కాజిగిరి, బేగంపేట, మేడ్చల్, యాకుత్‌పురా, ఉందానగర్, ఆదిలాబాద్, భద్రాచలం రోడ్, జనగామ, కామారెడ్డి, కరీంనగర్, కాజీపేట జంక్షన్, ఖమ్మం, మధిర, మహబూబ్‌నగర్, నిజామాబాద్, రామగుండం, తాండూరు, జహీరాబాద్, యాదాద్రి, బాసర, గద్వాల, జడ్చర్ల, మంచిర్యాల, మెదక్, మిర్యాలగూడ, నల్లగొండ, పెద్దపల్లి, షాద్‌నగర్, వికారాబాద్, వరంగల్, జోగుళాంబ.

26 నుంచి రైతు భరోసా

- రూ.8,400 కోట్ల పంపిణీకి ప్రాథమిక అంచనా
- 26 తర్వాత రైతు ఆత్మీయ భరోసా తొలి విడత
- ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం
- దావోస్ నుంచి సీఎం ఈసారి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తెస్తారు
- జూనియర్ అసిస్టెంట్లకు నియామక పత్రాల పంపిణీలో భట్టి విక్రమార్క



నియామక పత్రం అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా వర్తింపజేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26 నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు జమ చేస్తామని చెప్పారు. పథకం కోసం రూ.8,400 కోట్లను వెచ్చించడానికి ప్రాథమికంగా అంచనా వేశామని వెల్లడించారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎన్పీడీసీఎల్)లో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎంపికైన 92 మందికి శనివారం సాయంత్రం సచివాలయం ఎదుట ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. భూమి లేని రైతుకూలీల కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఈ నెల 26వ తేదీ తర్వాత మొదటి విడత వాయిదా (ఇన్‌స్టాల్‌మెంట్) డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు.

అబద్ధాల పార్టీ.. పదేపదే అబద్ధాలు

అబద్ధాల మీద పుట్టిన రాజకీయ పార్టీవాళ్లు పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు భ్రమలు కల్పించి బతికారని, ఇప్పుడు మళ్లీ అవే అబద్ధాలతో తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్‌ఎస్‌పై భట్టి విక్రమార్క మండిపడ్డారు. మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు తగ్గకుండా సాగునీరు ఇస్తామని గత పాలకులు హామీ ఇచ్చి గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని తెలిపారు. రాష్ట్రానికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తీసుకురావడానికి సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు దావోస్ వెళ్లారని భట్టి తెలిపారు.

యాసంగిలో నాణ్యమైన విద్యుత్: తుమ్మల

యాసంగి సీజన్ రైతులు పండిస్తున్న వరి పంటలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో 35 శాతం నిధులు కేటాయించామని చెప్పారు. పంటలసాగు విస్తీర్ణంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, డిస్కంల సీఎండీలు ముషారఫ్ ఫారూఖీ, వరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు డీఏ

విద్యుత్ ఉద్యోగుల పెండింగ్ డీఏను మంజూరు చేస్తూ జారీచేసిన ఉత్తర్వులను సభా వేదికగా భట్టి విక్రమార్క విడుదల చేశారు. 11.78% నుంచి 14.074 శాతానికి పెరిగిన డీఏను గతేడాది జూలై 1 నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపజేయనున్నారు. విద్యుత్ ఉద్యోగులకు వేతన అడ్వాన్స్‌లు, రుణాల చెల్లింపుల కోసం విద్యుత్ సంస్థలు ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో 28 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం రూ.8,729 కోట్లను అందజేస్తున్నామని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2004లో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా రూ.148.5 కోట్ల చొప్పున ఇప్పటివరకు రూ.1,485 కోట్ల బిల్లులను చెల్లించిందని తెలిపారు. రాష్ట్రంలో 25 గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సోలార్ గ్రామాలుగా మార్చబోతున్నామని, వ్యవసాయ పంపు సెట్లకు, గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తామని వివరించారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు

- గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ.. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- జిల్లా కలెక్టర్లతో మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రి తుమ్మల, సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని, దీనిపై ఆందోళన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చినవీ పరిశీలించాలని కలెక్టర్లకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రేషన్‌కార్డుల లబ్ధిదారుల జాబితా సమగ్ర కుల సర్వే ఆధారంగా తయారు చేసిందని, ఇది తుది జాబితా కాదని వివరించింది. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, గ్రామసభల నిర్వహణ తదితర అంశాలపై శనివారం సచివాలయం నుంచి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సంయుక్తంగా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. తమ ప్రభుత్వ ఆలోచనలను కొన్ని విపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని, ఈ ట్రాప్‌లో అధికారులు పడకూడదన్నారు. గతంలో జరిగిన ప్రజాపాలన సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుల జాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉందన్నారు.

అన్నీ పరిశీలించాకే అర్హుల జాబితా

ఈ నెల 21 నుండి ప్రారంభమయ్యే గ్రామసభల్లో ప్రజాభిప్రాయాలు, ఫీడ్‌బ్యాక్ తీసుకోవడంతో పాటు ఈ గ్రామసభలు, ప్రజాపాలన సేవా కేంద్రాలలో కొత్తగా తీసుకున్న దరఖాస్తులు, ఇప్పటికే ఉన్న దరఖాస్తులను పరిశీలించిన తర్వాతే లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటిస్తామని మంత్రులు స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇంటి స్థలం ఉన్న, లేని వారి రెండు జాబితాలను గ్రామసభల్లో ప్రదర్శించాలని సూచించారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా రైతుభరోసా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కనీసం ఇరవై రోజుల పాటు పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయభరోసా వర్తింపచేస్తారని, కుటుంబంలోని మహిళల బ్యాంకు ఖాతాలకే ఈ మొత్తాన్ని బదిలీ చేస్తామన్నారు.

ఇందిరమ్మ ఇంటికి కటాఫ్.. 1994

- అంతకుముందు ప్రభుత్వ పథకం కింద ఇల్లు పొందినా 'ఇందిరమ్మ'కు అర్హులే
- ఆ తర్వాత పొందిన వారు అనర్హులు
- 30 ఏళ్లలో నాటి ఇళ్లు శిథిలమై ఉంటాయన్న అంచనాతో సర్కారు తాజా నిర్ణయం!



సాక్షి, హైదరాబాద్: 'ఇప్పటికే ఓ పర్యాయం పేదల కోసం ప్రభుత్వం కట్టిచ్చే ఇంటిని పొందిన వారు ఇందిరమ్మ పథకంలో ఇంటిని పొందేందుకు అర్హులు కాదు' అని ఇటీవలే స్పష్టం చేసిన ప్రభుత్వం ఇప్పుడు దానికి చిన్న సవరణ చేసింది. 1994 సంవత్సరాన్ని కటాఫ్‌గా నిర్ణయించినట్లు తెలిసింది. 1994కు ముందు ప్రభుత్వ పథకంలో ఇంటిని పొందిన నిరుపేదలు ఇప్పుడు ఇందిరమ్మ పథకంలో కూడా ఇంటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం. ఆ కటాఫ్ సంవత్సరం తర్వాత ప్రభుత్వం నుంచి పేదల ఇంటిని పొందిన వారు మాత్రం ఇందిరమ్మ పథకానికి అనర్హులవుతారు.

ఆ ఇళ్లు శిథిలమై ఉంటాయన్న ఉద్దేశంతో..

రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టి సాచురేషన్ పద్ధతిలో ఇళ్లను మంజూరు చేశారు. 2004 నుంచి పదేళ్ల కాలంలో తెలంగాణలో దాదాపు 19 లక్షల ఇళ్లను నిర్మించి ఇచ్చారు. అప్పట్లో ఈ ఇళ్లను పొందిన వారు ఇప్పుడు ఇందిరమ్మ పథకం కింద మళ్లీ దరఖాస్తు చేసుకోవటానికి వీలు లేదని ప్రభుత్వం ఇప్పటికే చెప్పింది. ఈ పథకం కింద ఇల్లు పొందిన వారి పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నందున, ఆ లబ్ధిదారులకు మళ్లీ ఇల్లు కేటాయించకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంది. ఆధార్ నంబర్‌తో కూడా ఆ వివరాలను అనుసంధానించినందున వడపోత సులభంగా జరుగుతుంది. అంతకుముందు వరకు ప్రభుత్వ పక్షాన ఇలా ఉధృతంగా ఇళ్ల నిర్మాణం జరిగేది కాదు. పరిమిత సంఖ్యలో ఇళ్లను నిర్మించేవారు. 1995కు పూర్వం అర్బన్ పర్మినెంట్ హౌసింగ్, రూరల్ పర్మనెంట్ హౌసింగ్ పేరుతో ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందేది. ఆ సమయంలో గ్రామాల్లో వ్యక్తిగత పెంకుటిల్లు నిర్మించి ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో కూడా వ్యక్తిగత ఇళ్లను నిర్మించారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం కూడా ఇందిరమ్మ ఆవాస్ యోజన పేరుతో పేదల ఇంటికి ఆర్థిక సాయం అందించింది. ఇలాంటి పథకాల్లో లబ్ధి పొందిన వారు ఇప్పుడు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పిస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఆ ఇళ్లు పెంకులతో కూడినవి కావటం, 30 ఏళ్ల సమయం అవటం.. వెరసి అవి శిథిలావస్థకు చేరి ఉంటాయన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మొదటి విడతలో సొంత జాగా ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించినందున, వీరిని కూడా అర్హుల జాబితాలో చేర్చింది. 1994కు ముందు అలా ఇల్లు పొందిన వారు కూడా అర్హులవుతారు. ఇప్పటికీ ఆ ఇళ్లలోనే ఉంటున్నవారూ దరఖాస్తు చేసుకునేలా వెసులుబాటు కల్పించనున్నట్టు అధికారవర్గాల సమాచారం.

కొత్తగా రెండు డిపోలు, ఏడు బస్ స్టేషన్లు

ఆర్టీసీ బోర్డు సమావేశంలో తీర్మానం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెండు కొత్త బస్సు డిపోలతో పాటు ఏడు ప్రాంతాల్లో కొత్త బస్టాండ్ల నిర్మాణానికి ఆర్టీసీ బోర్డు నిర్ణయించింది. శనివారం జరిగిన ఆర్టీసీ పాలకమండలి సమావేశం ఈ మేరకు తీర్మానించింది. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కొత్త డిపో ఏర్పాటు చేయనున్నందున ఇక్కడ డిపో నిర్మాణానికి రూ.11.70 కోట్లు, ములుగు జిల్లా ఏటూరు నాగారంలో డిపో నిర్మాణానికి రూ.6.28 కోట్లు కేటాయించేందుకు పాలక మండలి అనుమతించింది. ములుగులో కొత్త బస్‌స్టేషన్ నిర్మాణం కోసం రూ. 5.11 కోట్లు, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో కొత్త బస్టాండు కోసం రూ.3.75 కోట్లు, సూర్యాపేట జిల్లా కోదాడలో ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ. 17.95 కోట్లు, ఖమ్మం జిల్లా మధిరలో ఆధునిక బస్సు ప్రాంగణం కోసం రూ.10 కోట్లు, పెద్దపల్లి జిల్లా మంథనిలో నిర్మాణం కోసం రూ.95 లక్షలు, ములుగు జిల్లా మంగపేట బస్ స్టేషన్ కోసం రూ.51 లక్షలు, సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో కొత్త బస్టాండు నిర్మాణం కోసం రూ.3.95 కోట్లను కేటాయించేందుకు అనుమతులు మంజూరు చేసింది. ఇక కొత్త నియామకాల్లో మహిళా కోటాకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వును అడాప్ట్ చేసుకునేందుకు తీర్మానించింది. త్వరలో ఆర్టీసీలో వివిధ విభాగాల్లో నాలుగున్నర వేల ఖాళీల భర్తీ జరగనుంది. ఇందులో మహిళలకు ఆ ఉత్తర్వు దామాషా మేరకు పోస్టులు కేటాయిస్తారు.


అప్పటి ఆదాయ పరిమితితోనే కొత్త రేషన్ కార్డులు

2014 నిబంధనలనే ప్రామాణికంగా తీసుకున్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈనెల 26వ తేదీ నుంచి జారీ చేయనున్న కొత్త ఆహార భద్రత (రేషన్) కార్డులకు పదేళ్ల క్రితం నిర్ణయించిన ఆదాయ పరిమితినే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకొంది. 2014 నవంబర్ 28న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆహార భద్రతా కార్డుల జారీకి మార్గదర్శకాలపై జారీ చేసిన మెమో (నంబర్ 900)లో కొన్ని అర్హతలను నిర్దేశించారు. కాగా ఇప్పుడు జారీ చేస్తున్న కార్డులకు కూడా నాటి అర్హతలనే ప్రాతిపదికగా తీసుకోవడం గమనార్హం. అప్పటి ఉత్తర్వుల ప్రకారం.. ఆహార భద్రతా కార్డులు పొందడానికి గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు కాగా, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షలుగా నిర్ణయించారు. అలాగే గ్రామాల్లో 3.50 ఎకరాలు అంతకన్నా తక్కువ విస్తీర్ణంలో తరి పొలం ఉన్న రైతులు, 7.5 ఎకరాలు అంతకన్నా తక్కువగా మెట్ట (కుష్కి) ఉన్న రైతులు అర్హులు. ఈ నిబంధనలనే కొత్తగా ఇచ్చే ఆహార భద్రతా కార్డుల జారీకి అమలు చేయనున్నారు. అప్పటి నిబంధనలనే ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

కోతలపైనే సర్కారు దృష్టి

- రేషన్ కార్డుల జారీలో లబ్ధిదారులను కుదిస్తున్నారు
- ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఆదాయ పరిమితిని పెంచాలి
- సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టకుండా, కోతలు విధించడంపైనే ఎక్కువగా దృష్టి పెడుతోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆరు గ్యారంటీల హామీతో అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం వాటిని నిజాయితీగా అమలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. రేషన్ కార్డులు, వ్యవసాయ కూలీలకు భరోసా, రైతుబంధు, పేదల గృహ నిర్మాణ పథకాల్లో లబ్ధిదారుల సంఖ్యను భారీగా కుదిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, చింత ప్రభాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, పెద్ది సుదర్శన్ రెడ్డి, పార్టీ నాయకుడు దేవీప్రసాద్‌తో కలసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రేషన్ కార్డుల జారీ విషయంలో ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తూ ఈ సందర్భంగా హరీశ్‌రావు బహిరంగ లేఖను విడుదల చేశారు. 'రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపికను గ్రామాల్లో చేయకుండా, కులగణన సర్వే ఆధారంగా జాబితా తయారు చేశారు. గతంలో ప్రజాపాలనలో వచ్చిన 11 లక్షల దరఖాస్తులతో పాటు రేషన్ కార్డుల కోసం మీ సేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను చెత్తబుట్టలో వేశారు' అని ఆయన ధ్వజమెత్తారు.

ఆదాయ పరిమితి పెంచాలి..

'పదేళ్ల క్రితం బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదల ఆదాయ పరిమితిని పెంచి కొత్తగా 6.47 లక్షల రేషన్‌కార్డులు ఇచ్చాం. ఇప్పుడు కూడా పెరిగిన ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, ప్రైవేటు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, పేద వర్గాలకు లాభం జరిగేలా ఆదాయ పరిమితిని పెంచాలి. లేకుంటే అనేక కుటుంబాలు కొత్త రేషన్‌కార్డులకు అర్హత కోల్పోతాయి. అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వకుంటే బీఆర్‌ఎస్ తరఫున నిలదీస్తాం. వ్యవసాయ కూలీలకు ఇచ్చే భరోసా విషయంలోనూ క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులను గుర్తించడం లేదు. 20 రోజుల పనిదినాలు అనే నిబంధనతో అర్హుల సంఖ్యను ఆరు లక్షలకు కుదించారు. రైతు రుణమాఫీలో రేవంత్ చేసిన మోసంతో ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారాన్ని ఆ రైతు కుటుంబానికి చెల్లించాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

నెలలు గడిచినా వేతనాలేవీ..

ముఖ్యమంత్రి పాలనలో చిరుద్యోగులకు నెలల తరబడి వేతనాలు అందడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. చిరుద్యోగుల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తే మంత్రి సీతక్క రాజకీయం చేస్తున్నారంటూ విమర్శిస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు.



నీ పొరుగువాడు నీయొద్ద నిర్భయముగా నివసించుచుండగా వానికి అపకారము కల్పింపవద్దు.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** బ.పంచమి ఉ.7.08 వరకు తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ఉత్తర సా.5.26 వరకు తదుపరి హస్త, **వర్జ్యం:** రా.2.43 నుండి 4.27 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.20 నుండి 5.08 వరకు, **అమృత ఘడియలు:** ఉ.9.30 నుండి 11.01 వరకు.

సూర్యోదయం : 6.39
సూర్యాస్తమయం : 5.43
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

డోనాల్డ్ ట్రంప్ (ఎన్నికైన ప్రెసిడెంట్) రాయని డైరీ

మాధవ్ శింగరాజు

జీవితంలో ప్రతిదీ అదృష్టమే. జీవితంలోని వేడి, జీవితంలోని చల్లదనం కూడా!

పామ్ బీచ్ 'మరలాగో' రెసిడెన్స్‌లో ఉన్నాం నేను, మెలానియా. అద్దాల్లోంచి బయట ఫ్లోరిడా నగరం అస్పష్టంగానైనా కనిపించటం లేదు! దట్టంగా పొగమంచు. లోపల మా శరీర ఉష్ణోగ్రతలకు తగ్గట్లుగా మా వేర్వేరు గదుల గోడలు వాటికవి తమ సెంటీగ్రేడ్‌ల హెచ్చుతగ్గులను అప్పటికప్పుడు సర్దుబాటు చేసుకుంటూ ఉంటాయి. భార్యాభర్తలు కూడా అలా ఉండకూడదా, ఒకరి కోసం ఒకరు?!

'రేపు ఈ సమయానికి మనం వైట్ హౌస్ గోడల మధ్యకు మారి ఉంటాం...' అన్నాను, మెలానియాతో మాట కలుపుతూ.

ఆమెకు వైట్ హౌస్ నచ్చదు. "ఒకవేళ నువ్వు అమెరికా అధ్యక్షుడిగా మళ్లీ ఎన్నికైనా నేను మాత్రం ఇక్కడే పామ్ బీచ్‌లోనో, లేదంటే న్యూయార్క్ సిటీలోనో ఉండిపోతాను..." అని ఎన్నికలకు ముందే ఆమె చెప్పేసింది.

వైట్ హౌస్ ఆమెకు నచ్చకపోవటానికి కారణం... నేను ఆమెకు నచ్చకపోవడం! నచ్చని మనిషితో కలిసి ఉండాల్సి వచ్చినప్పుడు, ఉన్నది స్వర్గమే అయినా అది నరకంలా అనిపిస్తుంది.



మెలానియా తనకు నచ్చినట్లు తను ఉంటుంది. ఆమె 'ఎస్'లు, ఆమె 'నో' లు ఆమెకు ఉన్నాయి. ఆమె నా ఎలక్షన్ ర్యాలీలకు రాలేదు. నేను గెలిచాక, ఫ్యామిలీ గ్రూప్ ఫొటోకి రాలేదు. ఇప్పుడైనా వైట్ హౌస్‌కి వస్తాను అనటం లేదు. వస్తుంటాను అంటోంది! అదృష్టం ఏమిటంటే – 'రేపు నేను రావటం లేదు' అని ఇప్పటివరకైతే తను అనలేదు.

మెలానియా తిరిగి తన గదిలోకి వెళ్లిపోయింది. నాతో ఏం చెప్పాలని వచ్చిందో, ఏం చెప్పకూడదని అనుకుందో ఆమె చెబితే తప్ప నాకు ఎప్పటికీ తెలిసే అవకాశం లేదు.

"గుడ్ మార్నింగ్ మిస్టర్ ప్రెసిడెంట్..." అంటూ జేడీ వాన్స్ వచ్చి కూర్చున్నాడు. అతడు మనిషిలా లేడు. మంచు ముద్దలా ఉన్నాడు! అతడి వాలకం చూస్తుంటే బయటి ఉష్ణోగ్రతలు జీరోకు పడిపోయి ఉంటాయని అనిపిస్తోంది.

వాన్స్ నా వైస్ ప్రెసిడెంట్. క్యాపిటల్ హిల్‌లో రేపు నాతో పాటు ప్రమాణ స్వీకారం చేయబోతున్నాడు. నా జీవితానికి పట్టిన మరొక అదృష్టం అతడు.

వాన్స్ నన్ను 'ఇడియట్' అన్నాడు. 'నేనెప్పటికీ ట్రంప్‌ను ఇష్టపడను' అన్నాడు. 'ట్రంప్ ఒక చెత్త వెధవా లేక అమెరికన్ హిట్లరా అన్నది తేల్చుకోలేకపోతున్నాను' అన్నాడు. చివరికి నా రన్నింగ్ మేట్‌గా వచ్చేశాడు.

అభిప్రాయాలు మార్చుకునే వాళ్లే నిజమైన స్నేహితులు. జీవితమంతా ఒకే అభిప్రాయంతో ఉండేవారు భార్యలు లేదా శత్రువులు.

"చెప్పండి మిస్టర్ వైస్ ప్రెసిడెంట్! వెచ్చగా ఏమైనా సేవిస్తారా?" అని అడిగాను.

"వెచ్చగా కాదు, వేడిగా ఏమైనా తెప్పించండి ప్లీజ్..." అన్నాడు వాన్స్, అరిచేతుల్ని ఒరిపిడిగా రుద్దుకుని, చెవులపై బిగింపుగా అద్దుకుంటూ.

లోపల పింగాణీ కప్పుల చప్పుడవుతోంది! మెలానియా సూప్‌ను సిద్ధం చేయించే పనిలో పడినట్లుంది.

"మిస్టర్ ప్రెసిడెంట్! నేషనల్ వెదర్ సర్వీస్ రిపోర్ట్ చూశారా? జనవరి 20న చలి, మంచు, ఈదురు గాలులు అంటున్నారు. ఉష్ణోగ్రతలు కనుక 7 డిగ్రీల కంటే కిందికి పడిపోతే, రోనాల్డ్ రీగన్ తర్వాత మీదే కోల్డెస్ట్ ఇనాగరేషన్ అవుతుంది..." అని నవ్వారు వాన్స్. 2016 ఇనాగరేషన్‌లో 48 డిగ్రీల వేడిలో చెమటలు తుడుచుకోవటం గుర్తొచ్చి నేనూ నవ్వాను.

"మేడమ్ ఫస్ట్ లేడీకి నా వైఫ్ ఉష తన బెస్ట్ విషెస్ చెప్పమంది..." అంటూ, తను తెచ్చిన పూలబొకేను టేబుల్ మీద ఉంచాడు వాన్స్.

మెలానియాకు 'ఫస్ట్ లేడీ' అనిపించుకోవటం ఇష్టం లేదు. ఫస్ట్ లేడీ అనిపించుకోవాలని తనకు అనిపించేలా నేను ఏనాడూ బిహేవ్ చేయలేదని ఆమె కంప్లైంట్!

కంప్లైంట్‌లు కూడా జీవితం ప్రసాదించే అదృష్టాలే. అయితే అవి పరీక్షించుకోవలసిన అదృష్టాలు కావచ్చు!

అప్పారావు చిటికెల పందిరి!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం ఏడు మాసాలు పూర్తి చేసుకొని ఎనిమిదో నెలలో ప్రవేశించి ఓ వారం గడిచిపోయింది. అష్టమంలోకి బుధుడు ఎంట్రీ ఇచ్చినట్టున్నాడు. గణాంకాలూ, లెక్కలూ వగైరా సబ్జెక్టులు బుధ గ్రహం పోర్టుఫోలియోలని చెబుతారు. అవసరమున్నా లేకపోయినా సరే ఈ మధ్య ముఖ్యమంత్రి సంపద సృష్టి లెక్కలు చెప్పడం మొదలుపెట్టారు. ఇలా ఆర్థిక శాస్త్ర అధ్యాపకుని అవతారం ఎత్తడం వెనుక ఆయన మనోభావాలేమిటో గ్రహించాలి.

కొత్త ప్రభుత్వ పనితీరును మొదటి ఆరు మాసాలపాటు జనం పెద్దగా పట్టించుకోరని మన రాజకీయ నాయకులు అభిప్రాయపడతారు. ఏడో నెల నుంచి మాత్రం నఖశిఖ పర్యంతం పరిశీలిస్తారు. అందుకే కొత్త ప్రభుత్వాలకు తొలి ఆరు నెలలు 'హనీమూన్ పీరియడ్' అనే ముద్దుపేరును తగిలించుకున్నారు. ఆ మురిపాల కాలం కరిగిపోయి ఐదు వారాలైంది. జనం ప్రశ్నించడం మొదలైంది. వీధుల్లోకి రావడం కూడా ప్రారంభమైంది. జనం దృష్టి మళ్లింపు ఎత్తుగడలతో నెట్టుకురావడం ఇక కుదరదు. ఏదో ఒకటి చెప్పాలి. ఇచ్చిన హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలి. ఎందుకు ఇంకా అమలు చేయడం లేదో విడమర్చి వివరించాలి.

ఎన్నికలకు ముందు మూడు పార్టీల కూటమి ఎడాపెడా చేసిన వాగ్దానాల సంగతి తెలిసినదే! వాటిలో ఓ ఆరింటిని అతి ప్రధానాంశాలుగా గుర్తించి 'సూపర్ సిక్స్' పేరుతో తక్షణం అమలు చేస్తామని ఊదరగొట్టిన వైనమూ తెలిసినదే! 'సూపర్ సిక్స్'లో భాగంగా యువతకు 20 లక్షల ఉద్యోగాలిస్తామనీ, నిరుద్యోగులకు నెలకు 3 వేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామనీ హామీ ఇచ్చారు. ఒక ఇంటిలోంచి ఎంతమంది విద్యార్థులు బడికెళ్తే అంతమందికీ ఏటా రూ.15 వేలు ఇచ్చి ఆ తల్లికి వందనం చేస్తామన్నారు. ప్రతి రైతుకూ ఏటా ఇరవై వేల పెట్టుబడి సాయం అందజేస్తామన్నారు. ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లన్నారు. మహిళలందరికీ ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలోని మహిళలందరికీ నెలకు 15 వందల రూపాయలిస్తామన్నారు.

ఎనిమిదో నెల వచ్చినా ఇందులో ఒక్కటి కూడా అమలు చేయలేదు. ఆరింటిలో ఆర్థిక భారం పెద్దగా పడని గ్యాస్ సిలిండర్ల హామీని తీసుకొని పాక్షికంగా అమలు చేశారు. మూడుకు బదులు ఒకే సిలిండర్‌ను తొలి ఏడాదికి పరిమితం చేశారు. రెండో సంవత్సరం నుంచైనా మూడు సిలిండర్లిస్తారో ఒక్కదానితోనే సరిపెడతారో చూడాలి. మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాల్లో అతి ప్రధానమైనవిగా ఎంపిక చేసుకున్న 'సూపర్ సిక్స్'కే ఈ గతి పడితే మిగిలిన వాటి సంగతేమిటో అర్థం చేసుకోవచ్చు.

ఎకనామిక్స్ పాఠాల ప్యాకేజీలో భాగంగా ఎన్నికల హామీలను తాము అమలు చేయబోవడం లేదనే సంగతిని నర్మగర్భంగా చంద్రబాబు చెప్పేశారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) తొలి అంచనాల పేరుతో మీడియా ద్వారా రాష్ట్ర ప్రజలకు ఓ క్లాస్ తీసుకున్నారు. పవర్ పాయింట్ ద్వారా ఓ పదిపదిహేను గణాంకాల టేబుళ్లను ప్రదర్శించారు. ఈ సంవత్సరం జీఎస్‌డీపీ పెరుగుదల రేటు 12.94 శాతంగా ఉండబోతున్నదని జోస్యం చెప్పారు. ఈ అంచనాకు ఆధారమేమిటో ఆయన చెప్పలేదు.

ఈ జోస్యం ఇంతటితో ఆగలేదు. ఆయన వేసిన చిటికెల పందిరి ఆకాశం దాకా ఎగబాకింది. ఏటా పదిహేను శాతం చొప్పున జీఎస్‌డీపీ పెరుగుతూ పోతే 2047 నాటికి 2.74 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ అవతరిస్తుందనీ, తలసరి ఆదాయం 58,14,916 రూపాయలకు పెరుగుతుందనీ చెప్పారు. మన ఆర్థిక వ్యవస్థ ఎంత బలంగా ఎదిగినా డాలర్ కూడా ఇంకా బలపడుతుందట! అది కూడా ఆయనే చెప్పారు. 2047 నాటికి డాలర్ విలువ 127 రూపాయలుగా ఉండబోతున్నదట! వచ్చే సంవత్సరం తమ పిల్లల్ని అమెరికా చదువులకు పంపించాలనుకునే వాళ్లు అప్పటికి డాలర్ రేటు ఎంతుంటుందోనని కంగారుపడే అవసరం లేదు. చంద్రబాబు సర్కార్‌ను సంప్రదిస్తే తెలిసిపోతుంది. వారికి డాలర్ జ్యోతిషం తెలుసు.



చంద్రబాబు మొదటి ఐదేళ్ల (2014-19) కాలంలో దేశ జీడీపీలో ఏపీ వాటా 4.45 శాతంగా ఉంటే వైఎస్ జగన్ హయాంలో (2019-24) 4.82 శాతంగా నమోదైంది. ఈ లెక్కలను చంద్రబాబు ప్రెజెంటేషన్‌లో కూడా దాచి పెట్టలేకపోయారు. వాస్తవాలు ఇలా ఉంటే జగన్ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందనే దగుల్బాజీ ప్రచారాన్ని ఇంకా కొనసాగిస్తున్నారు. ఒకపక్క పరిపాలనా వైఫల్యం, దివాళా తీస్తున్న ఆర్థిక రంగం, మరోపక్క ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను దారుణంగా వంచించడం... వీటి నుంచి దృష్టి మళ్లించడానికి తప్పుడు ప్రచారాలనూ, హెచ్చుల 'విజన్'లనూ బాబు సర్కార్ ఆశ్రయిస్తున్నది.

ఏడు మాసాల్లో 4 లక్షల కోట్ల పెట్టుబడులను రప్పించామని డప్పు వేసుకోవడం ఒక వంచన. 1 లక్షా 85 వేల కోట్ల పెట్టుబడి పెడుతుందని చంద్రబాబు చెబుతున్న ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందాలపై జగన్ ప్రభుత్వ హయాంలోనే సంతకాలు పూర్తయ్యాయి. నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్ కథ కూడా ఇంతే! కానీ చంద్రబాబు సర్కార్ మాత్రం ఆ ఘనతను తన ఖాతాలోనే వేసుకొని ప్రచారం చేసుకుంటున్నది.

ఈవిధంగా ఏటా 15 శాతం చొప్పున జీఎస్‌డీపీ పెరుగుతూ పోతే ఈ ఐదేళ్లలో 4 లక్షల 35 వేల కోట్ల రూపాయల కొత్త అప్పులు చేయవచ్చట! వాటి ఆధారంగా సంక్షేమ పథకాలను అమలు చేయవచ్చనే చావు కబురు చల్లగా చెప్పారు. 'ఈ సంవత్సరం మంచి వర్షాలు కురవాలి. అతివృష్టి, అకాల వర్షాలు ఉండరాదు. పశు, పక్ష్యాదుల దాడి ఉండకూడదు. పంట తెగుళ్ల బారిన పడకూడదు. మంచి దిగుబడి రావాలి. అద్భుతమైన ధర మార్కెట్‌లో పలకాలి. అప్పుడు తప్పకుండా విందు చేసుకుందాం' అనే సందేశాన్ని ఆయన సంక్షేమ పథకాల అమలుకు వర్తింపజేశారు.

ఇటువంటి పాలకులను ఉద్దేశించే కావచ్చు – వందేళ్ల క్రితమే సుప్రసిద్ధ ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ చెప్పిన ఒకమాట ప్రసిద్ధ కొటేషన్‌గా మారింది. ''ఇన్ ద లాంగ్ రన్ వి ఆర్ ఆల్ డెడ్''. సుదూర భవిష్యత్తులో మనమంతా విగత జీవులమే అనే మాటను తక్షణ సమస్యల పరిష్కారం అవసరాన్ని పాలకులకు చెప్పడం కోసం వాడారనే అభిప్రాయం ఉన్నది. ఇప్పుడు పరిష్కారం కావలసిన ఆర్థిక సమస్యలను భవిష్యత్ మార్కెట్ పరిస్థితులు పరిష్కరిస్తాయని నమ్మేవారిపై కీన్స్ వేసిన సెటైర్‌గా దాన్ని చెబుతారు. ఇది మన ఏపీ సర్కార్‌కు బాగా నప్పుతుంది.

చంద్రబాబుకు అత్యంత ప్రీతిపాత్రమైన ప్రపంచ బ్యాంకు ఇచ్చే నివేదికలను సైతం ఆయన లెక్కలోకి తీసుకోవడం లేదని పిస్తున్నది. గ్లోబల్ ఎకానమీ మీద ఈ జనవరిలోనే ప్రపంచ బ్యాంకు ఒక నివేదికను విడుదల చేసింది. ఈ శతాబ్దపు తొలి క్వార్టర్ (2000–2025) ఇచ్చినంత ఉత్తేజం ఆర్థిక రంగానికి రెండో క్వార్టర్ (2026–2050) ఇచ్చే అవకాశం లేదని ఈ నివేదిక అభిప్రాయపడింది. గ్లోబల్ జీడీపీ పెరుగుదల రేటు 2.7 శాతంగానే ఉండబోతున్నట్టు ఇది అంచనా వేసింది. రెండు ఖండాల్లో యుద్ధాలు, పెద్ద దేశాలు అవలంబిస్తున్న రక్షణాత్మక వాణిజ్య విధానాలు కూడా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపెడుతున్నాయి. మిగతా ప్రాంతాలతో పోలిస్తే లాటిన్ అమెరికా, పశ్చిమాసియా, దక్షిణాసియా ప్రాంతాల పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉండొచ్చనీ, ఆ యా ప్రాంతాల్లోని స్థానిక వినిమయ మార్కెట్‌లు బలపడడం అందుకు కారణమనీ ఈ నివేదిక పేర్కొన్నది.

దక్షిణాసియా దేశాల్లో స్థానిక వినిమయ మార్కెట్‌లు బలపడుతుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఆ అవకాశం లేకుండా చంద్రబాబు హరించారు. ఆయన అధికారంలోకి వచ్చిన తొలి ఆరు మాసాల్లో తగ్గిపోయిన జీఎస్టీ వసూళ్లే అందుకు నిదర్శనం. ఏటికేడు పెరుగుతూ వస్తున్న జీఎస్టీ వసూళ్లు చంద్రబాబు తొలి ఆరు నెలల కాలంలో తొలిసారిగా నేల చూపులు చూస్తూ వచ్చాయి. లిక్కర్ అమ్మకాల పుణ్యమా అని ఒక్క అక్టోబర్ మాసంలోనే కొంత ఎదుగుదల నమోదైంది. ఈ జీఎస్టీ లెక్కలు చంద్రబాబు చెబుతున్న ఆకాశ రామన్న లెక్కలు కావు. స్వయానా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే లెక్కలివి. ఒకపక్క ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో సాక్ష్యాధారాలతో కనిపిస్తున్నది. కానీ జీఎస్‌డీపీ పెరుగుదల మాత్రం తారాజువ్వలను తలదన్నేలా ఉంటుందని చంద్రబాబు విడుదల చేసిన ఆకాశ రామన్న లెక్కలు చెబుతున్నాయి. ఇదెలా సాధ్యమవుతుందో చెప్పడం తలపండిన ఆర్థికవేత్తలకు కూడా సాధ్యం కాకపోవచ్చు.

చంద్రబాబు తొలి ఆరు మాసాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి తన సొంత ఆదాయ మార్గాల ద్వారా వచ్చే ఆదాయంలో 1.69 శాతం క్షీణత నమోదైంది. అక్టోబర్‌లో లిక్కర్ వేలంపాటల ఆదాయం ఆదుకోకపోయి ఉంటే ఈ క్షీణత ఇంకా ఎక్కువే ఉండేది. అంతకుముందు సంవత్సరం (2023) అదే నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో 12.19 శాతం వృద్ధి నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయాలంటే ఏముంటాయి? జీఎస్టీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, సేల్స్ ట్యాక్స్ (పెట్రోలియం ఉత్పత్తులు ఈ కేటగిరీలో వస్తాయి), మైనింగ్ వగైరా పన్నేతర ఆదాయం... ప్రధానంగా ఇవే! ఈ వసూళ్లు క్షీణించడమంటే ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్నట్టు అర్థం. ఈ వసూళ్లలో వృద్ధి కనిపిస్తేనే జీఎస్‌డీపీలో ఎదుగుదల కనిపిస్తుంది.

ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో మూడు పార్టీల కూటమి ఎడాపెడా చేసిన వాగ్దానాల సంగతి తెలిసినదే! వాటిలో ఓ ఆరింటిని అతి ప్రధానాంశాలుగా గుర్తించి 'సూపర్ సిక్స్' పేరుతో తక్షణం అమలు చేస్తామని ఊదరగొట్టిన వైనమూ తెలిసినదే!

ఎనిమిదో నెల వచ్చినా ఇందులో ఒక్కటి కూడా అమలు చేయలేదు. ఆరింటిలో ఆర్థిక భారం పెద్దగా పడని గ్యాస్ సిలిండర్ల హామీని తీసుకొని పాక్షికంగా అమలు చేశారు. మూడుకు బదులు ఒకే సిలిండర్‌ను తొలి ఏడాదికి పరిమితం చేశారు. రెండో సంవత్సరం నుంచైనా మూడు సిలిండర్లిస్తారో ఒక్కదానితోనే సరిపెడతారో చూడాలి. మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాల్లో అతి ప్రధానమైనవిగా ఎంపిక చేసుకున్న 'సూపర్ సిక్స్'కే ఈ గతి పడితే మిగిలిన వాటి సంగతేమిటో అర్థం చేసుకోవచ్చు.

చంద్రబాబు మొదటి ఐదేళ్ల (2014–19) కాలంలో దేశ జీడీపీలో ఏపీ వాటా 4.45 శాతంగా ఉంటే వైఎస్ జగన్ హయాంలో (2019–24) 4.82 శాతంగా నమోదైంది. ఈ లెక్కలను చంద్రబాబు ప్రెజెంటేషన్‌లో కూడా దాచిపెట్టలేకపోయారు. వాస్తవాలు ఇలా ఉంటే జగన్ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందనే దగుల్బాజీ ప్రచారాన్ని ఇంకా కొనసాగిస్తున్నారు. ఒకపక్క పరిపాలనా వైఫల్యం, దివాళా తీస్తున్న ఆర్థిక రంగం, మరోపక్క ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను దారుణంగా వంచించడం... వీటి నుంచి దృష్టి మళ్లించడానికి తప్పుడు ప్రచారాలనూ, హెచ్చుల 'విజన్'లనూ బాబు సర్కార్ ఆశ్రయిస్తున్నది.

ఏడు మాసాల్లో 4 లక్షల కోట్ల పెట్టుబడులను రప్పించామని డప్పు వేసుకోవడం ఒక వంచన. 1 లక్షా 85 వేల కోట్ల పెట్టుబడి పెడుతుందని చంద్రబాబు చెబుతున్న ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందాలపై జగన్ ప్రభుత్వ హయాంలోనే సంతకాలు పూర్తయ్యాయి. నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్ కథ కూడా ఇంతే! కానీ చంద్రబాబు సర్కార్ మాత్రం ఆ ఘనతను తన ఖాతాలోనే వేసుకొని ప్రచారం చేసుకుంటున్నది. తాజాగా విశాఖ ఉక్కు విషయంలోనూ ఇదే తంతు. కేంద్రం చేత 11 వేల కోట్లు విడుదల చేయించి తాము ఘనకార్యం చేశామనీ, ప్రైవేటీకరణ ఆగిపోయిందనీ కూటమి నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ ఈ ప్రకటన చేసిన కేంద్ర మంత్రి కుమారస్వామి చెప్పిన విషయాన్ని మాత్రం యెల్లో మీడియా మరుగున పడేసింది. జగన్‌మోహన్‌రెడ్డి అడ్డుకున్నందు వల్లనే ప్రైవేటీకరణ ఆగిపోయిందని ఆయన మీడియా సమక్షంలోనే కుండబద్దలు కొట్టారు.

కేంద్రం ఆర్థిక సాయాన్నయితే ప్రకటించింది గానీ ప్రైవేటీకరణను ఆపేస్తామని ఎక్కడా చెప్పలేదు. కార్మిక సంఘాల ఇతర ప్రధాన డిమాండ్లయిన సొంత గనుల కేటాయింపు, 'సెయిల్'లో విలీనంపై ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఇవేమీ లేకుండా 26 వేల కోట్ల అప్పులున్న సంస్థకు 11 వేల కోట్లు సాయం చేస్తే అప్పులూ, బకాయిలూ తీర్చి, సామర్థ్యాన్ని పెంచుకొని భారీ ఉత్పత్తులు సాధించి లాభాల బాటలో పయనిస్తుందా? పోలవరం, బనకచర్ల వంటి అంశాల్లోనూ మోసపూరితమైన తప్పుడు ప్రచారాలే! ఇటువంటి నయవంచనను ప్రతిఘటించవలసిన బాధ్యత కేవలం ప్రతిపక్ష రాజకీయ పార్టీలదే కాదు – విద్యార్థులు, మేధావులు, ప్రజా సంఘాలది కూడా! అప్పుడే మన ప్రజాస్వామ్యం పరిణతి చెందినట్టు! లేకపోతే అప్పుల అప్పారావులు వేసే చిటికెల పందిళ్లు ఎప్పటికి పూర్తవుతాయోనని కళ్లప్పగించి చూస్తూ ఉండాల్సిందే!

vardhelli1959@gmail.com

'స్వింగ్' ఓటరే కింగ్ మేకర్!

విశ్లేషణ



జి. మురళీ కృష్ణ

హస్తిన ఓటర్లు వైవిధ్యమైన తీర్పు ఇస్తుండడంతో లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పూర్తి భిన్నమైన ఫలితాలు వస్తున్నాయి. 'మినీ ఇండియా'గా పిలవబడే దేశ రాజధాని ఢిల్లీలో అన్ని వర్గాలు ఎంతో విజ్ఞతతో స్థానిక అంశాల ఆధారంగా అసెంబ్లీ ఎన్నికను, జాతీయ అంశాల ఆధారంగా పార్లమెంట్ ఎన్నికలను శాసిస్తున్నారు. ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధిపత్యం కొనసాగిస్తున్న వేళ... ఫిబ్రవరి 5వ తేదీన జరగనున్న శాసనసభ ఎన్నికల్లో ప్రజా తీర్పు ఎలా ఉండనుందో 'పీపుల్స్ పల్స్' అధ్యయనం చేయగా దాదాపు 30 శాతం మంది ఓటర్లు ఆ యా ఎన్నికల్లో భిన్నంగా స్పందిస్తుండడంతో ఈ స్వింగ్ ఓటర్లే రాబోయే ఎన్నికల్లో కీలకంగా మారనున్నారని తేలింది.

ఢిల్లీలో 2013 అసెంబ్లీ ఎన్నికలు రాజకీయ మార్పులకు తెరలేపాయి. అప్పుడు మొదటిసారిగా బరిలోకి దిగిన ఆప్ ఊహించని విధంగా 30 శాతం ఓట్లు సాధించి జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు సవాలు విసిరింది. అప్పటికే మూడు పర్యాయాలు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ ఈ ఎన్నికల్లో 33 శాతం ఓట్లతో పెద్ద పార్టీగా నిలిచినా అధికారం చేపట్టలేకపోయింది. వరుసగా మూడు సార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ 25 శాతం ఓట్లతో మూడో స్థానానికి పరిమితమయ్యింది.

2013 అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీకి 4 స్థానాలు తక్కువగా పొంది 32 స్థానాలకు పరిమితమై అధికారానికి దూరంగా ఉన్న బీజేపీ 2014 లోక్‌సభ ఎన్నికల్లో 46 శాతం ఓట్లతో మొత్తం 7 ఎంపీ స్థానాల్లో గెలిచింది. ఆప్ అసెంబ్లీ ఎన్నికల కంటే 3 శాతం అధికంగా 36 శాతం ఓట్లు పొందినా ఒక్క స్థానం కూడా సాధించలేదు. కాంగ్రెస్ 15 శాతం ఓట్లే పొందింది. 2015 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఆప్ భారీగా 36 శాతం ఓట్లు కోల్పోగా, బీజేపీ 25 శాతం, కాంగ్రెస్ 13 శాతం ఓట్లు అధికంగా పొందాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ తిరిగి 7 స్థానాల్లో గెలిచింది. 2020 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నుండి చెరో 18 శాతం ఓట్లు చీల్చిన ఆప్ 2019లో తాను కోల్పోయిన 36 శాతం ఓట్లను తిరిగి పొంది అధికారం చేపట్టింది. 2020 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఆప్ 30 శాతం ఓట్లను నష్టపోగా, బీజేపీ 16 శాతం ఓట్లు ఎక్కువ సాధించి మళ్లీ మొత్తం 7 స్థానాలనూ గెల్చుకుంది. ఒక్క ఎంపీ సీటూ రాకపోయినా కాంగ్రెస్ 15 శాతం ఓట్లు అధికంగా పొందింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో భిన్నంగా స్పందిస్తున్న దాదాపు 30 శాతం మంది ఢిల్లీ ఓటర్లే ఆప్‌కు కీలకంగా మారుతున్నారు.

గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అగ్రవర్ణ ఓటర్ల గణాంకాలను అధ్యయనం చేస్తే... 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 75 శాతం వీరి మద్దతు పొందిన బీజేపీ 2020 ఎన్నికల్లో 54 శాతానికి పరిమితం అయ్యింది. కాంగ్రెస్‌కు 2019లో అగ్రవర్ణాల మద్దతు 12 శాతం లభించగా, 2020లో అది 3 శాతానికి పడిపోయింది. మరోవైపు ఆప్‌కు 2019లో 13 శాతమే మద్దతివ్వగా, 2020లో అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి 41 శాతం మద్దతిచ్చారు.



ఓబీసీ ఓటర్ల తీర్పును పరిశీలిస్తే... 2019లో బీజేపీకి 64 శాతం మంది మద్దతివ్వగా 2020 ఎన్నికలు వచ్చేసరికి అది 50 శాతానికి పడిపోయింది. 2019లో 18 శాతం మంది ఓబీసీలు కాంగ్రెస్‌కు మద్దతివ్వగా 2020లో 16 శాతమే మద్దతిచ్చారు. ఆప్‌కు 2019లో ఓబీసీల మద్దతు 18 శాతమే లభించగా, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 49 శాతం మద్దతు సంపాదించగలిగింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్ 29 శాతం ఓబీసీ ఓట్లు కోల్పోయింది.

దళిత ఓటర్లు 2019 లోక్‌సభ ఎన్నికల్లో 44 శాతం బీజేపీకి మద్దతివ్వగా 2020 అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి 25 శాతానికి పడిపోయింది. కాంగ్రెస్ 2019లో 20 శాతం ఓట్లు పొందగా, 2020లో 6 శాతానికి పరిమితమైంది. 2019లో 22 శాతం దళితుల మద్దతు పొందిన ఆప్ 2020లో ఏకంగా 69 శాతం దళితుల మద్దతు పొందింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్ 41 శాతం దళితుల ఓట్లను కోల్పోయింది.

ముస్లిం ఓటర్ల గణాంకాలను పరిశీలిస్తే... 2019 లోక్‌సభ ఎన్నికల్లో ముస్లింల మద్దతు బీజేపీకి 7 శాతం, ఉండగా, 2020 అసెంబ్లీ ఎన్నికల నాటికి అది 3 శాతానికి దిగజారింది. కాంగ్రెస్‌కు 2019 ఎన్నికల్లో 66 శాతం ముస్లింలు మద్దతివ్వగా, 2020 నాటికి అది 13 శాతానికి పరిమితమైంది. ఆప్‌కు 2019లో 28 శాతం ముస్లింలు మద్దతివ్వగా, 2020 నాటికి భారీగా 83 శాతం ఆ పార్టీకి మద్దతుగా నిలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్ 34 శాతం ముస్లింల మద్దతు కోల్పోగా, అవి 11 శాతం బీజేపీకి, 21 శాతం కాంగ్రెస్‌కు బదిలీ అయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన ఆప్, కాంగ్రెస్ ఇప్పుడు విడివిడిగా పోటీ చేస్తుండడంతో త్రిముఖ పోటీలో ప్రధానంగా ముస్లిం, దళిత ఓట్ల చీలికతో ఆప్‌కు నష్టం జరిగే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి.

2020 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఆప్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆర్థిక, సామాజిక వర్గాలవారీగా ఓట్లను పరిశీలిస్తే... పేదల్లో 37 శాతం ఓటర్ల మద్దతును ఆప్ కోల్పోగా, వారిలో 19 శాతం బీజేపీకి, 17 శాతం కాంగ్రెస్ వైపు మళ్లారు. మధ్యతరగతి కుటుంబాల ఓటర్ల లెక్కలను గమనిస్తే ఆప్ 21 శాతం మద్దతు కోల్పోగా, అందులో బీజేపీకి 11 శాతం, కాంగ్రెస్‌కు 12 శాతం లభించింది.

రాజధాని ఢిల్లీలో పరిపాలన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల చేతుల్లో ఉండడంతో ఓటర్లు కూడా పరిణతితో కూడిన తీర్పు ఇస్తున్నారు. 'పీపుల్స్ పల్స్' బృందం క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు ఢిల్లీకి కేజ్రీవాల్, భారత్‌కు మోదీ నాయకత్వం కావాలని బలంగా కోరుకుంటున్నట్టు కనిపించింది. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన సర్వేలో 'రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎవరికి మద్దతిస్తారని' ఓటర్లను ప్రశ్నించగా ఆప్‌కు 49 శాతం, బీజేపీకి 33 శాతం మంది ఆమోదం తెలపడంతో ఈ రెండు పార్టీల మధ్య అప్పుడే 16 శాతం వ్యత్యాసం కనిపించింది.

అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కు ఇప్పటి వరకు అనుకూలంగా ఉంటున్న 30 శాతం స్వింగ్ ఓట్లను బీజేపీ, కాంగ్రెస్‌లు చెరో 5 శాతం చీలిస్తే ఆప్ 44 శాతానికి పరిమితమవడంతో పాటు బీజేపీ 44 శాతానికి పెరిగి ఎన్నికలు పోటాపోటీగా జరుగుతాయి. గతంలో వలే బీజేపీ, కాంగ్రెస్‌ల నుండి చెరో 15 శాతం ఓటింగ్‌ను తమకు అనుకూలంగా మల్చుకుంటే హస్తిన మరోసారి ఆప్ హస్తగతమవుతుంది. ఆప్‌కు అగ్నిపరీక్షగా మారిన కీలకమైన 30 శాతం స్వింగ్ ఓట్లను ఎప్పటిలాగే తమ వైపుకు తిప్పుకోగలిగితేనే మరోసారి ఆ పార్టీ అందలమెక్కుతుంది.

వ్యాసకర్త పీపుల్స్ పల్స్ రిసెర్చ్ సంస్థలో సీనియర్ రిసెర్చర్

అలవికాని చోట...

ఎదుటివారు తమకంటే బలమైన వారు అయినప్పుడు, వారి అధిపత్యాన్ని ఎదిరించటానికి వీలులేనప్పుడు, వారి బారిన పడకుండా, సమయం కలిసి వచ్చినపుడు తలెత్తుకుని, తమ జీవితాన్ని గడుపుకోవటం యుక్తిపరుల లక్షణం. ఒక్కోసారి పరిస్థితులకు తలవంచక తప్పదు. ప్రతికూల సమయాల్లో తలవంచుకుని తరవాత నిటారుగా నిలబడటం తెలివైనవారి పని.

జ్యోతిర్మయం

ఒకసారి సముద్రం, నదులతో ఆనందంగా సంభాషణ సాగిస్తూ... 'మీరు మంచి ఉరవడితో ప్రవహించేటప్పుడు మీ గట్ల మీద చెట్లు కూలి పడిపోతుంటాయి కదా! మరి, ప్రబ్బలి చెట్లు అలా పడిపోవెందుకని? అవేమైనా మీకు ప్రత్యేకమా! మిమ్మల్ని ఏ విధంగానైనా సంతోషపెట్టాయా ఏమిటి? వాటిని పెళ్లగించటం మీ వల్ల కావట్లేదా? మీ నీటి ఉధృతానికి వాటి మొదళ్లు ఎందుకు పెకిలించబడటం లేదు?' అని అడిగింది. అప్పుడు గంగా నది 'మా గట్ల మీద చెట్లన్నీ తమ బింకం సడలనీయకుండా నిలబడతాయి. అందువలన నీటి వేగాన్ని తట్టుకోలేక నిట్ట నిలువునా కూలిపోతాయి. ప్రబ్బలి చెట్లు అలా కాకుండా నీటి వేగాన్ని బట్టి వంగి ఉండి, ఆ ఉరవడి తగ్గాక చక్కగా నిలబడి ఉంటాయి' అని చెప్పింది.

ప్రబ్బలి చెట్టు నదిని అనుకుని ఒడ్డున పెరుగుతుంది. అలలు వచ్చినప్పుడు ఒంగుతుంది. అవి తగ్గాక తలెత్తుకుని నిలబడుతుంది. ఈ ప్రబ్బలి చెట్ల ప్రస్తావన ప్రాచీన కావ్యాలలో ఉంది. ఈ సున్నితమైన చెట్టు వరద నీటికి కొట్టుకుపోకుండా ఎలా నిలబడుతోందో, మనుషులు కూడా అనుకూల పరిస్థితుల్లో కుంగి పోకుండా, మౌనంగా ఉంటూ, కాలం కలిసివచ్చాక తలెత్తుకుని జీవించాలి. ప్రతికూల పరిస్థితుల్లో ఎలా ఉండాలో చెపుతుంది ప్రబ్బలి చెట్టు.

మహాభారతం శాంతి పర్వంలో, శత్రువు అధిక బలం కలవాడైతే అల్పబలం కల రాజు ఆపద నుంచి ఎలా గట్టెక్కాలి? అని ధర్మరాజు భీష్ముని అడిగినప్పుడు, భీష్ముడు చెప్పిన కథ ఇది. సర్వకాలాల్లో మనుషులందరికీ వర్తించే కథ ఇది.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

సర్వర్ 'అన్ అవైలబుల్'!

పది రోజులుగా మొరాయిస్తున్న ధరణి సర్వర్..

- వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు తీవ్ర ఇబ్బంది
- డాక్యుమెంట్ల అప్‌లోడ్, స్కానింగ్ ప్రక్రియలో జాప్యం
- మళ్లీ మళ్లీ అప్‌లోడ్ చేయాల్సి వస్తోందంటున్న రెవెన్యూ వర్గాలు
- రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్న రైతులు
- ఎన్‌ఐసీకి రికార్డుల బదిలీతో కొంత ఇబ్బంది అంటున్న ఉన్నతాధికారులు
- నెలల తరబడి బదిలీ ఏమిటనే ప్రశ్నలు.. సరైన మార్గనిర్దేశం లేకే సమస్య అనే విమర్శలు



సాక్షి, హైదరాబాద్: 'సర్వర్ అన్ అవైలబుల్'.. సుమారు పది రోజులుగా ధరణి పోర్టల్‌లో దర్శనమిస్తున్న సందేశమిది. సాంకేతిక సమస్యల కారణంగా ధరణి సర్వర్ మొరాయిస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది ఎదురవుతోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగమైన డాక్యుమెంట్లు, క్రయవిక్రయదారుల వివరాలను అప్‌లోడ్ చేసే సమయంలో, స్కానింగ్ చేసే సమయంలో అకస్మాత్తుగా సర్వర్ డౌన్ అవుతోందని.. దానితో మొదటి నుంచీ మళ్లీ ప్రక్రియ ప్రారంభించాల్సి వస్తోందని క్షేత్రస్థాయి సిబ్బంది వాపోతున్నారు. దీనితో ఒక్కో రిజిస్ట్రేషన్ కోసం రైతులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. దీనికి సాంకేతిక సమస్యలే కారణమని ఉన్నతాధికారులు చెప్తున్నారని రెవెన్యూ అధికారులు అంటున్నారు. టెరాసిస్ కంపెనీ నుంచి నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ)కు పోర్టల్‌లోని రికార్డులు బదిలీ అవుతున్న నేపథ్యంలో సమస్య వస్తోందని.. ఆ రికార్డుల బదిలీ పూర్తయ్యేంతవరకు ఏమీ చేయలేమని పేర్కొంటున్నట్టు తెలిసింది. ఇలా ధరణి సర్వర్ మొరాయిస్తుండటంతో ప్రతిరోజూ సగటున జరిగే లావాదేవీల్లో సగం మేరకు మాత్రమే చేయగలుగుతున్నామని.. అది కూడా రాత్రి 7 గంటల వరకు కంప్యూటర్ ఆపరేటర్లను బలవంతంగా పనిచేయించాల్సి వస్తోందని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. ఈ సర్వర్ డౌన్ అంశాన్ని వీలైనంత త్వరగా సరిచేయాలని కోరుతున్నాయి. ఉన్నతస్థాయి వర్గాలు మాత్రం ధరణి పోర్టల్ సర్వర్ డౌన్ అంశాన్ని ప్రతిరోజూ పరిశీలిస్తున్నామని.. వ్యవస్థ మార్పు క్రమంలో ఇబ్బందులు తప్పవనే ధోరణిలో వ్యవహరిస్తున్నాయని పేర్కొంటున్నాయి.

రికార్డుల మార్పిడి ఇంకెన్నాళ్లు?

వాస్తవానికి ధరణి పోర్టల్ నిర్వహణను టెరాసిస్ నుంచి ఎన్‌ఐసీకి అప్పగిస్తూ గత ఏడాది అక్టోబర్‌లోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ ఏడాది నవంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు రికార్డుల మార్పిడి కోసం ట్రాన్సిట్ పీరియడ్‌ను ప్రకటించింది. ఈ గడువులోగా పూర్తిస్థాయిలో డేటా మార్పిడి జరుగుతుందని పేర్కొంది. అయితే ధరణి పోర్టల్ వ్యవహారం నిత్యం వేలాది మందితో ముడిపడిన అంశం కావడంతో.. రికార్డుల మార్పిడిపై హైప్రొఫైల్ టెక్నికల్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, రెవెన్యూతోపాటు సాఫ్ట్‌వేర్ నిపుణులను నియమించి ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని గతంలోనే నిపుణులు సూచించారు. కానీ రెవెన్యూ ఉన్నతాధికారులు మాత్రం ఈ రికార్డుల మార్పిడి వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోలేదనే విమర్శలున్నాయి. కేవలం నలుగురైదుగురు కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవో లు, తహసీల్దార్లతో కమిటీ ఏర్పాటు చేసి చేతులుదులుపు కొన్న పరిస్థితి. వారంతా తమ రోజువారీ పనులు చేసుకుంటూనే.. ఈ రికార్డుల మార్పిడి వ్యవహారాన్ని పర్యవేక్షించాల్సి ఉంటుందని, దీనితో సరైన మార్గదర్శనం లేక సాంకేతిక సమస్యలు వస్తున్నాయని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికైనా రికార్డుల మార్పిడి, ధరణి పోర్టల్ నిర్వహణ పూర్తిగా గాడిన పడేంతవరకు ఎన్‌ఐసీకి సహకరించేలా టెరాసిస్ ప్రతినిధులు, డెడికేటెడ్ టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేసుకుంటే మంచిదన్న సూచనలు వస్తున్నాయి.

ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

- రెయిలింగ్‌ను ఢీ కొట్టిన బస్సు
- 59 మంది సురక్షితం



రెయిలింగ్ అవతలికి వెళ్లిపోయిన బస్సు

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వరం కొండపై ఓ ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఆర్టీసీ డిపో రంగాపూర్ నుంచి భోగమహేశ్వరం, అక్కడి నుంచి ఉమామహేశ్వరం కొండపైకి ఆర్టీసీ బస్సులను నడుపుతోంది. శనివారం మధ్యాహ్నం కొండపై నుంచి బస్సు 59 మంది ప్రయాణికులతో కిందకు వస్తున్న క్రమంలో చివరి మూలమలుపు వద్ద అదుపుతప్పి ముందుకెళ్లింది. రెయిలింగ్, పెద్ద బండరాయిని ఢీకొట్టి అక్కడే నిలిచిపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్, కండక్టర్ రెండు రోజులపాటు విధుల్లో ఉండటం, కండీషన్ లేని బస్సు కావడంతో ఇలా జరిగిందని భక్తులు ఆరోపించారు. ఈ విషయమై డీఎం మురళీదుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా సంఘటన స్థలాన్ని పరిశీలించామని, మూలమలుపు వద్ద చివరి క్షణంలో బస్సు వేగంగా ఉండటంతో తిరగలేకపోయిందన్నారు. అదే బస్సులో తాను ప్రయాణికులతో కలిసి ప్రయాణం చేశానని, బస్సు కండిషన్‌లోనే ఉందని తెలిపారు.

అప్పులు తీర్చలేక వృద్ధ దంపతుల బలవన్మరణం

- చెరువులో దూకి ఆత్మహత్య



కృష్ణారావు, సీత

సత్తుపల్లి: నెలక్రితం రిపేర్‌కు వచ్చిన ఆటోను బాగు చేయించేందుకు అప్పు పుట్టక, అప్పటికే చేసిన అప్పులు తీర్చే మార్గంలేక ఓ వృద్ధుడు భార్యతో సహా బలవన్మరణానికి పాల్పడ్డాడు. తాను లేకపోతే భార్య ఎలా జీవిస్తుందోనన్న బెంగతో ఆమెను కూడా ఆత్మహత్యకు ఒప్పించినట్లు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. సత్తుపల్లి ఎన్టీఆర్ నగర్‌కు చెందిన పంతంగి కృష్ణారావు (60) సీత (55) దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉండగా అందరికీ పెళ్లిళ్లయ్యాయి. గతంలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసిన కృష్ణారావు ఐదేళ్లుగా మండలంలోని బుగ్గపాడులో నివాసం ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, ఆటో మరమ్మతుకు రాగా రిపేర్ చేయించేందుకు ఎక్కడా అప్పు పుట్టలేదని తెలుస్తోంది. అంతకుముందు చేసిన పాత అప్పులు తీర్చలేక, కొత్తగా రుణం పుట్టకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. దీంతో భార్యను కూడా ఒప్పించి ఇద్దరూ కలిసి గ్రామంలోని రావి చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. శనివారం ఉదయం మృతదేహాలు తేలడంతో పోలీసులు బయటకు తీయించారు. మృతులను కృష్ణారావు, సీతగా స్థానికులు గుర్తించారు.

బ్యాంకులో రైతు ఆత్మహత్య

- తీసుకున్న రుణం చెల్లించాలని ఒత్తిడి
- అధికారుల ఎదుటే పురుగు మందు తాగిన రైతు
- ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన



అపస్మారక స్థితిలో కుర్చీలో రైతు జాదవ్ దేవ్‌రావ్

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్‌రూరల్: తీసుకున్న రుణం చెల్లించాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురైన ఓ రైతు.. బ్యాంకులోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శనివారం ఆదిలాబాద్‌లో ఈ ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. బేల మండలంలోని రేణుగూడ గ్రామానికి చెందిన రైతు జాదవ్ దేవ్‌రావు (55) కొంతకాలం క్రితం జిల్లా కేంద్రంలోని ఐసీఐసీఐ బ్యాంకులో రూ.3 లక్షల 40 వేల రుణం తీసుకున్నారు. ప్రస్తుతం వడ్డీతో కలిపి అది రూ.3 లక్షల 78 వేలు అయింది. తన భార్య కిడ్నీ చెడిపోవడంతో వైద్యంకోసం రెండున్నర ఎకరాల భూమిని కుదువపెట్టి ఆయన ఈ అప్పు తీసుకున్నారు. ఆరు నెలలకోసారి రూ.25 వేల చొప్పున కిస్తీలు (ఈఎంఐ) చెల్లిస్తున్నారు. అయితే ఆర్థిక పరిస్థితి బాగా లేక రెండు కిస్తీలు చెల్లించలేకపోయారు. అలాగే పత్తి పంట దిగుబడి సరిగా రాక నష్టపోయారు. ఈ క్రమంలో బ్యాంకు అధికారులు తరచూ జాదవ్‌ను డబ్బులకోసం ఒత్తిడి చేయడంతో ఆయన మనస్తాపానికి గురయ్యారు. మూడు రోజుల క్రితం ఆయన సొంత గ్రామానికి సైతం వెళ్లి వాగ్వాదానికి దిగారు. బ్యాంకు అధికారులు మళ్లీ ఫోన్ చేయడంతో శనివారం బ్యాంకుకు వచ్చిన జాదవ్ దేవ్‌రావు అధికారులను ప్రాధేయపడినా కనికరించలేదని, అప్పు చెల్లించాల్సిందేనని ఒత్తిడి తీసుకువచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో వెంట తెచ్చుకున్న పురుగు మందును ఆయ న అధికారుల ముందే తాగా రు. ఈ సమ యంలో సిబ్బంది, బ్యాంకు అధికారులు ఆయనను అడ్డుకోకుండా చూస్తుండిపోయారని కుటుంబ సభ్యులు చెప్పారు. కాగా, పురుగు మందు తాగిన తర్వాత ఆ విషయాన్ని జాదవ్ తన కుమారుడు ఆకాశ్‌కు ఫోన్ చేసి చెప్పారు. దీంతో జిల్లా కేంద్రంలో డిగ్రీ చదువుతున్న ఆకాశ్ తన బంధువులకు ఈ విషయం చెప్పి బ్యాంకుకు చేరుకున్నాడు. అప్పటికే జాదవ్ అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే ఆయనను రిమ్స్‌కు తరలించినప్పటికీ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రిమ్స్‌కు కూతవేటు దూరంలోనే బ్యాంకు ఉందని, అక్కడి సిబ్బంది ఆయనను సకాలంలో ఆస్పత్రికి తరలించి ఉంటే ప్రాణాలు దక్కేవని మృతుడి కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి భార్య కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా, ప్రస్తుతం డయాలసిస్ చేయిస్తున్నారు. ఒక వైపు ఆమె మంచానికి పరిమితమై ఉండగా మరో వైపు ఇంటి పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

న్యాయం చేయాలని బంధువుల ఆందోళన

జాదవ్ దేవ్‌రావు మృతితో ఆయన కుటుంబానికి న్యాయం చేయాలంటూ స్థానికులు, బంధువులు బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళన దాదాపు ఆరు గంటలపాటు కొనసాగింది. బ్యాంకు ఉద్యోగులు, పోలీసులు నచ్చజెప్పినా వారు పట్టించుకోకుండా అక్కడే బైఠాయించారు. దీంతో ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అక్కడికి చేరుకుని మృతుని కుటుంబీకులు, బంధువులతో పాటు బ్యాంకు ఉద్యోగులతో చర్చించారు. మృతుడు తీసుకున్న రుణాన్ని పూర్తిగా మాఫీ చేయడంతో పాటు ఆయన కుమారుడికి ఆరు నెలల శిక్షణ అనంతరం బ్యాంకులో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని, అలాగే 50 శాతం మాఫీతో కూడిన రుణం అందజేస్తామని అధికారుల సమక్షంలో బ్యాంకు ఉద్యోగులు హామీ ఇచ్చారు. దీంతో మృతుని కుటుంబీకులు, బంధువులు ఆందోళన విరమించారు.

కోస్టా యాప్ పేరుతో రూ.15 కోట్ల మోసం

- ఇద్దరిపై కేసు నమోదు, అరెస్ట్



జనగామ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన కోస్టా యాప్ బాధితులు

జనగామ: ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కోస్టా యాప్ చేసిన మోసాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. యాప్‌లో పెట్టుబడుల పేరిట కోట్ల రూపాయలు దండుకుని బిచాణా ఎత్తివేయడంతో నష్టపోయిన బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. శనివారం పలువురు జనగామ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆదేశాల మేరకు ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ ఆధ్వర్యంలో సీఐ దామోదర్‌రెడ్డి ఇద్దరు ఏజెంట్లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. జనగామ జిల్లాలో సుమారు 2వేల మంది బాధితులు రూ.15 కోట్ల మేర పెట్టుబడులు పెట్టగా, డబ్బులు విత్ డ్రా చేసుకునే యాప్ సైట్ క్లోజ్ చేయడంతో మోసం బయటపడింది. రూ.10 వేలకు రెట్టింపు అంటూ నమ్మబలికి.. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టించారని తెలుస్తోంది. మోసపోయిన బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణంలో యాప్‌ను ప్రమోట్ చేసిన స్థానిక ఏజెంట్లు శ్రీధర్ యాదవ్, ఇక్రముద్దీన్‌లపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్పీ విలేకరులకు తెలిపారు. కోస్టా యాప్ ద్వారా జరిగిన మోసంపై పూర్తి స్థాయి విచారణ జరిగితే బాధితులు ఎంత మంది, ఎంత మొత్తంలో డబ్బులు నష్టపోయారన్న వివరాలు తెలిసే అవకాశం ఉంటుందన్నారు.

కరెంటు షాక్‌తో అన్నను చంపిన తమ్ముడు

- మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో ఘటన



శంకర్

శివ్వంపేట (నర్సాపూర్): మద్యం మత్తులో సొంత అన్నకే కరెంటు షాక్ పెట్టి హత్య చేశాడు ఓ తమ్ముడు. ఈ ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధి బిక్యా పంచాయతీ నాను తండాకు చెందిన తేజావత్ చందర్‌కు పెద్ద కుమారుడు శంకర్ (28), చిన్నకుమారుడు గోపాల్ ఉన్నారు. ఇద్దరూ జులాయిగా తిరుగుతుండేవారు. అన్నదమ్ముల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. గోపాల్ చోరీలకు అలవాటుపడి ఓ దొంగతనం కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. శుక్రవారం అన్న శంకర్‌తో మరోసారి గొడవపడ్డాడు. రాత్రి సోదరులు ఓ గదిలో, తండ్రి మరో గదిలో నిద్రపోయారు. మద్యం మత్తులో ఉన్న గోపాల్ అర్ధరాత్రి నిద్రపోతున్న శంకర్ కాలు, చేతికి కరెంటు వైర్లు చుట్టి విద్యుత్ షాక్ ఇచ్చాడు. ఒక్కసారిగా శంకర్ అరవడంతో వేరే గదిలో ఉన్న తండ్రి వచ్చి తలుపు కొట్టాడు. గోపాల్ తలుపు తెరిచి తండ్రిని నెట్టేసి పారిపోయాడు. శంకర్ అప్పటికే మృతి చెందాడు. నిందితుడు గోపాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం: సీఐ

కాగా, నిందితుడిని విచారించిన క్రమంలో పలు విషయాలు వెల్లడించినట్లు సీఐ రంగకృష్ణ తెలిపారు. శంకర్ కొన్నేళ్ల కిందట హైదరాబాద్‌లో పనిచేస్తూ లలిత అనే అమ్మాయిని ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. కొద్దిరోజులుగా ఇద్దరూ తండాకు వచ్చి నివసిస్తున్నారు. శంకర్ తమ్ముడు గోపాల్ లలితతో చనువుగా ఉంటూ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఇది తెలిసిన శంకర్ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా గోపాల్ ప్రవర్తనలో మార్పు రాలేదు. గొడవలు పెరిగిన క్రమంలో లలిత ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కోపం పెంచుకున్న గోపాల్ అన్నను కరెంట్ షాక్ పెట్టి హత్య చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

మంచంలోనే వృద్ధుడి సజీవదహనం

- చుట్టతో మంటలు అంటుకోవడంతో ప్రమాదం



వెంకులు

నేలకొండపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు ఇంట్లో ఉండగా, భార్య కూలి పనులకు వెళ్లింది.. ఇంటి తలుపులు వేసుకుని పడుకున్న ఆయన చుట్ట అంటించి ఆర్పినట్లు భావించి మంచంపై పెట్టి నిద్రించాడు.. ఆపై మంటలు అంటుకున్నా శరీరం కదలలేని స్థితిలో ఉండటంతో అరవలేక మంచంలోనే సజీవ దహనమయ్యాడు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన బత్తిని వెంకులు (75) తన భార్యతో కలిసి జీవిస్తున్నాడు. కొన్నాళ్లుగా వెంకులు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం ఉదయం ఆయన భార్య కూలి పనికి వెళ్లింది. ఆయనకు చుట్ట తాగే అలవాటు ఉండటంతో తాగాక ఆర్పానని భావించి మంచంపైనే పెట్టుకుని నిద్రించినట్లు సమాచారం. ఆపై మంచం నవారుకు మంటలు అంటుకుని వ్యాపించడంతో మంచంపైనుంచి లేవలేని స్థితిలో సజీవ దహనమైనట్లు భావిస్తున్నారు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్సకు వచ్చి 'చిక్కుకుంది'



నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్‌కు చెందిన ఏడు నెలల గర్భిణి జ్యోతి.. శనివారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రికి వచ్చింది. ఆసుపత్రి ఔట్‌గేట్ వద్ద పశువులు రాకుండా ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్ గ్రిల్స్‌ను దాటుతుండగా ఆమె కాలు మధ్యలో ఇరుక్కుపోయింది. దీంతో సుమారు అరగంటపాటు ఇబ్బందిపడింది. స్థానికులు ఎంత ప్రయత్నించినా ఆమె కాలును తీయలేకపోయారు. చివరకు ఒక యువకుడు ఇనుప రాడ్డుతో గ్రిల్స్ తొలగించడంతో.. జ్యోతి క్షేమంగా బయటపడింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

రైతు ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేయకపోవడం వల్లే ఆదిలాబాద్ జిల్లాకు చెందిన జాదవ్ దేవ్‌రావ్ అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులోనే రైతు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడటం.. రుణభారంతో ఆయన పడిన మానసిక వేదనకు అద్దం పడుతోందన్నారు. అన్నదాత నిండు జీవితం బలికావడానికి.. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పేరిట చేసిన మహా మోసం, రైతు వ్యతిరేక విధానాలే ప్రధాన కారణాలని ఆరోపించారు. పదేళ్లపాటు రాజుగా బతికిన రైతన్న అవస్థ పడుతున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇది ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యగానే తెలంగాణ రైతాంగం భావిస్తోందన్నారు. బాధిత రైతు కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం చెల్లించి, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకోవద్దని, నమ్మించి మోసగించిన నయవంచక కాంగ్రెస్ సర్కారును నిలదీయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో 50.55 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో దేశవ్యాప్తంగా 5.91 కోట్ల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం సేకరించినట్లు కేంద్ర ఆహార, పౌర సరఫరాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మొత్తంగా 71 లక్షలకు పైగా రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించగా, వారికి రూ.1.21 లక్షల కోట్లు చెల్లించినట్లు శనివారం ఒక నివేదికలో తెలిపింది. తెలంగాణలో 8 లక్షల మంది రైతుల నుంచి 50.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, వారికి రూ.11,616 కోట్లు చెల్లించినట్టు వివరించింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 4.60 లక్షల మంది రైతుల నుంచి 29.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, వారికి రూ.6,595 కోట్లను చెల్లించినట్లు పేర్కొంది.

మల్టీపర్పస్ వర్కర్ల జీతాలకు రూ.139.78 కోట్లు

సాక్షి, హైదరాబాద్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న 52,942 మంది మల్టీపర్పస్ వర్కర్ల (ఎంపీడబ్ల్యూ) వేతనాల కోసం రూ.139.78 కోట్లు విడుదల చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. గత జూలై నుంచి డిసెంబర్ నెల దాకా వీరికి చెల్లించాల్సిన జీతాలకు సంబంధించి ఆయా నెలల వారీగా జిల్లా పంచాయతీ అధికారులు (డీపీవో) సమర్పించిన సమాచారానికి అనుగుణంగా గ్రీన్‌చానల్‌లో ఈ మొత్తాన్ని విడుదల చేశారు. ఈ మొత్తాన్ని సంబంధిత గ్రామపంచాయతీల టీఎస్ బీ-పాస్ అకౌంట్‌లో అడ్జస్ట్ చేశాక ఈ-పంచాయత్ వెబ్ పోర్టల్‌లో ఎన్‌రోల్ చేసుకున్న వారికి చెక్కులు విడుదల చేయాల్సిందిగా గ్రామ కార్యదర్శులను ఆదేశించారు.

నా ఇల్లు ఖాళీ చేయించండి

- రంగారెడ్డి జిల్లా మేజిస్ట్రేట్‌కు మోహన్‌బాబు ఫిర్యాదు
- మంచు మనోజ్‌కు రంగారెడ్డిజిల్లా కలెక్టర్ నోటీసులు జారీ
- తన లాయర్‌తో కలిసి అదనపు కలెక్టర్ ముందు హాజరు..



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'నా ఇంటిని అక్రమంగా ఆక్రమించుకున్నారు. వాళ్లను ఖాళీ చేయించండి. నాకు రక్షణ కల్పించండి'అంటూ సినీనటుడు మంచు మోహన్‌బాబు (78) రంగారెడ్డి జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వయో వృద్ధుల చట్టం నిబంధన 21/3/ఎ కింద చేసిన ఈ ఫిర్యాదును స్వీకరించిన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఈ అంశంపై విచారణ చేపట్టారు. ఆయన కుమారుడు మంచు మనోజ్‌కు నోటీసులు జారీ చేశారు. శనివారం మధ్యాహ్నం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సమక్షంలో నిర్వహించిన విచారణకు మనోజ్ తన న్యాయవాదితో కలిసి హాజరయ్యారు. తండ్రి మోహన్ బాబు చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదని వివరించారు. పూర్తి వివరాలను 15 రోజుల్లో లిఖిత పూర్వకంగా వివరణ ఇస్తానని చెప్పగా.. అదనపు కలెక్టర్ అంగీకరించారు. విచారణకు మోహన్ బాబు గైర్హాజరవగా.. తదుపరి విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ చెప్పారు. అయితే ఏ రోజు హాజరుకావాల్సి ఉంటుందనే అంశంపై స్పష్టత ఇవ్వలేదు.

నాకు రక్షణ కల్పించండి: మోహన్‌బాబు

'సరూర్‌నగర్ మండలం జల్‌పల్లిలో సర్వే నంబర్ 194లో ఎకరం స్థలాన్ని 2007 అక్టోబర్ 3న కొనుగోలు చేశాను. వృద్ధాప్యంలో ప్రశాంతంగా జీవించేందుకు ఇక్కడే నివాసం ఏర్పాటు చేసుకున్నా. ఇది పూర్తిగా నా స్వార్జితం. కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడ నివసిస్తున్నా. గత డిసెంబర్ 8న నా కుమారుడు మంచు మనోజ్ తన అనుచరులతో దౌర్జన్యంగా ఇంట్లోకి ప్రవేశించాడు. అడ్డుకోబోయిన నన్ను దూషించి, నా వ్యక్తిగత సెక్యూరిటీపై దాడి చేశాడు. నా పరువు తీశాడు. బలవంతంగా ఇంట్లోకి దూరి ఆక్రమించుకున్నాడు. ఆయన వల్ల నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. చివరకు ఆస్పత్రి పాలయ్యాను. ఆ ఇంట్లో ఉండలేక బయటికి వచ్చేశాను. మనోజ్, అతని అనుచరుల నుంచి నాకు ప్రాణహాని ఉంది'అని మోహన్‌బాబు పిటిషన్‌లో పేర్కొన్నారు.

మా మధ్య ఆస్తి తగాదాల్లేవు: మంచు మనోజ్

కలెక్టరేట్ బయట మనోజ్ మీడియాతో మాట్లాడుతూ.. 'మా మధ్య ఆస్తి గొడవలేం లేవు. ఫస్ట్ ఎఫ్ఐఆర్‌లో నాలుగు నెలల ముందు దౌర్జన్యంగా ఇంట్లోకి ప్రవేశించినట్లు కేసు పెట్టారు. కానీ అది నిజం కాదు. మా నాన్నను అడ్డుపెట్టుకుని మా అన్న నాటకాలు ఆడుతున్నాడు. చాలాచోట్ల కేసులు పెట్టారు. విద్యాసంస్థలో చదువుతున్న పిల్లల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను ఇదే అంశంపై ప్రశ్నించగా, దీన్ని జీర్ణించుకోలేక నాపై నిందలు వేస్తున్నారు. ఆస్తి కోసం గొడవ పడుతున్నట్లు చెబుతున్నారు. కూర్చొని మాట్లాడదామని అనేకసార్లు చెప్పినా వాళ్లు వినడం లేదు. రూ.200 కోట్లు ఖర్చు చేసి సినిమా తీస్తున్నారు. ఆ డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయో చెప్పడం లేదు. నేను ఇంట్లోకి రానివ్వడం లేదనేది పచ్చి అబద్ధం. విద్యార్థుల తరపున నిలబడినందుకే నాపై లేనిపోని నిందలు వేస్తున్నారు. పిల్లలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపను'అని చెప్పారు.

సంజయ్ రాయ్ దోషే

ఆర్‌జీ కర్ హత్యాచార ఘటనపై కోర్టు తీర్పు
- సోమవారం శిక్ష ఖరారు
- బాధితురాలి తల్లిదండ్రులు కన్నీటిపర్యంతం



హత్యాచార ఘటన జరిగిన ఆర్‌జీ కర్ ఆస్పత్రి (ఇన్‌సెట్లో) దోషి సంజయ్ రాయ్

కోల్‌కతా: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కోల్‌కతాలోని ప్రభుత్వ ఆర్‌జీ కర్ వైద్య కళాశాల, ఆస్పత్రిలో ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారం కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా కోర్టు తేలింది. 2024 ఆగస్ట్ 9న జరిగిన ఈ దారుణంపై నెలలపాటు దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగడం తెలిసిందే. బాధితురాలికి న్యాయం జరగాలంటూ వైద్యులతో పాటు యువత పెద్ద సంఖ్యలో రోడ్డెక్కారు. రాయ్‌పై భారతీయ న్యాయ సహిత సెక్షన్లు 64, 66తో పాటు మరణ శిక్ష, లేదా జీవిత ఖైదుకు వీలు కల్పించే 103(1) కింద కేసులు నమోదయ్యాయి. వాటిపై 2024 నవంబర్ 12 నుంచి సీల్దా అదనపు జిల్లా సెషన్స్ జడ్జి అనిర్బణ్ దాస్ రెండు నెలలపాటు రహస్య విచారణ జరిపారు. రాయ్‌పై మోపిన అన్ని ఆరోపణలనూ సీబీఐ రుజువు చేసిందని పేర్కొన్నారు. వైద్యురాలిపై అతను లైంగిక దాడి చేయడమే గాక ఊపిరాడకుండా చేసి చంపినట్లు తేలిందన్నారు. ''తెల్లవారుజాము 4 గంటల సమయంలో ఆస్పత్రిలోకి చొరబడ్డావు. సెమినార్ హాల్‌లో నిద్రిస్తున్న ఆన్‌డ్యూటీ వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డావు. ఆమెకు ఊపిరాడకుండా చేసి ప్రాణాలు తీశావు. సంబంధిత సాక్ష్యాధారాలు పరిశీలించి, వాదనలు విన్న మీదట నువ్వే దోషివని నిర్ధారించా. నిన్ను శిక్షించాల్సిందే'' అని నిందితున్ని ఉద్దేశించి జడ్జి పేర్కొన్నారు.

కేసులో ఇరికించారు

తనను ఈ కేసులో ఇరికించారని రాయ్ అన్నాడు. ''నేనే గనుక ఈ నేరం చేసుంటే నా మెడలోని రుద్రాక్షమాల అక్కడే తెగిపోయి ఉండేది'' అన్నాడు. 'నన్నీ కేసులో ఇరికించిన వారిని ఎందుకు వదిలేశారు?' అని ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, స్థానిక పోలీస్ స్టేషన్ మాజీ ఎస్‌హెచ్‌వోలను ఉద్దేశించి ప్రశ్నించాడు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు దోషి వాంగ్మూలం తీసుకుంటామని, అనంతరం అతనికి శిక్ష ఖరారు చేస్తూ తుది తీర్పు వెలువరిస్తానని జడ్జి తెలిపారు. బాధితురాలి తండ్రి లేవనెత్తిన పలు అంశాలకు కూడా అందులో బదులిస్తానని చెప్పారు. తర్వాత రాయ్‌ను పోలీసులు ప్రెసిడెన్సీ కరెక్షనల్ హోంకు తీసుకెళ్లారు. అతడిని మీడియాతో మాట్లాడనివ్వలేదు. తీర్పును పాలక తృణమూల్ కాంగ్రెస్ స్వాగతించగా ఇక పార్టీల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమైంది.

తుదిశ్వాస వరకు పోరాడుతాం

తీర్పు విన్నాక బాధితురాలి తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. తండ్రి మీడియాతో మాట్లాడారు. 'మీపై పెట్టుకున్న నమ్మకాన్ని పూర్తిగా నిలబెట్టుకున్నారు' అని జడ్జినుద్దేశించి పేర్కొన్నారు. తల్లి మాత్రం పూర్తి న్యాయం జరగలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ''కుమార్తెను చిత్రహింసలు పెట్టి పొట్టన పెట్టుకున్న రాయ్ విచారణ సమయంలో మౌనంగా ఉండిపోయాడు. ఈ దారుణానికి అతడొక్కడే కారణం కాదు. ఇతర దోషులనూ చట్టం ముందు నిలబెట్టాలి. అందుకు తుదిశ్వాస దాకా పోరాడతాం'' అని చెప్పారు.

కుట్ర తేలేదాకా పోరు: వైద్యులు


పాక్షిక న్యాయమే జరిగిందంటూ తీర్పు అనంతరం జూనియర్ వైద్యులు పెదవి విరిచారు. ''ఎన్నో ప్రశ్నలకు సమాధానం లభించాల్సి ఉంది. ఈ నేరంతో పెద్ద వ్యక్తులకు కచ్చితంగా సంబంధముంది. అందుకే క్రైం సీన్‌ను మార్చేశారు. ఆధారాలను చెరిపేశారు. ఆ దిశగా మరింత విచారణ జరపాలి'' అని డిమాండ్ చేశారు. అప్పటిదాకా తమ పోరు ఆగదని స్పష్టం చేశారు. రాయ్ ఒక్కడే దారుణానికి పాల్పడ్డాడని పోలీసులు చెబుతుండగా ఇందులో మరికొందరి హస్తముందని బాధితురాలి తల్లిదండ్రులు, వైద్యులు వాదిస్తుండటం తెలిసిందే.

50 మంది సాక్షులు

కోల్‌కతా పోలీసు విభాగంలో పౌర వలంటీర్ అయిన రాయ్‌ను ఈ కేసులో ప్రధాన నిందితుడిగా సీబీఐ పేర్కొంది. నవంబర్ 12న మొదలైన రహస్య విచారణ జనవరి 9న ముగిసింది. 50 మంది సాక్షులను విచారించారు. ఘటన జరిగిన మర్నాడు రాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో దర్యాప్తును సీబీఐకి అప్పగించారు. కోర్టు తీర్పును సవాలు చేయబోమని సంజయ్ రాయ్ సోదరి తెలిపారు. ''అతను నేరం చేసినట్లయితే శిక్ష అనుభవించాల్సిందే. విచారణకు మా కుటుంబం హాజరవడం లేదు'' అని చెప్పారు.

మనపై ప్రభావమెంత?

అమెరికాలో ప్రబల శక్తిగా భారతీయులు
- ఉద్యోగాల నుంచి రాజకీయాల దాకా ముద్ర
- వలసలు, వీసా విధానాల్లో మార్పులపై ఉత్కంఠ



రెండోసారి అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. శ్వేతసౌధంలోకి ఆయన పునరాగమనం అక్కడి భారతీయులకు పలు అవకాశాలతో పాటు సవాళ్లను కూడా మోసుకొస్తున్నట్టే కనిపిస్తోంది. అమెరికాలో భారత సంతతికి చెందినవారు 45 లక్షలకు పైగా ఉన్నారు. సంఖ్యాపరంగా తక్కువగా అనిపిస్తున్నా కొన్నేళ్లుగా వాళ్లు ప్రబల శక్తిగా ఆవిర్భవించారు. ఐటీ, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదక శక్తులుగా మారారంటే అతిశయోక్తి కాదు. ఇటీవల రాజకీయ రంగంలో కూడా సత్తా చాటుతున్నారు. అధ్యక్షునిగా ట్రంప్ తొలి హయాం భారత అమెరికన్లకు కాస్త తీపి, కాస్త చేదుగానే గడిచింది. ప్రధాని నరేంద్ర మోదీతో ట్రంప్ సాన్నిహిత్యం అందరినీ ఆకర్షించింది. 'హౌడీ మోడీ' పేరిట 2019లో హ్యూస్టన్‌లో ట్రంప్ అట్టహాసం చేస్తే, అంతకుమించి అన్నట్టుగా మరుసటేడే మోదీ అహ్మదాబాద్‌లో నమస్తే ట్రంప్ పేరుతో భారీ సభ నిర్వహించారు. దానికి తరలివచ్చిన లక్ష పైచిలుకు జన సందోహాన్ని చూసి ఆశ్చర్యానందాల్లో మునిగిపోవడం అధ్యక్షుని వతయింది. ఆసియాలో చైనా ప్రాబల్యానికి చెక్ పెట్టడం వంటి ఉమ్మడి వ్యూహాత్మక లక్ష్యాలు ఇరు దేశాలను మరింత సన్నిహితం చేశాయి. వరక్త వ్యాపారాలూ ఇతోధికంగా పుంజుకున్నాయి. భారత్–అమెరికా సంబంధాలు మొత్తమ్మీద మరింత బలోపేతమే అయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ 2.0 భారత్‌కు, అమెరికాలోని మనవారికి ఎలా ఉండనుందన్నది ఆసక్తికరంగా మారింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

వలసలపై ఉత్కంఠే

అమెరికాలో భారతీయుల విజయగాథకు హెచ్–1బీ వీసా విధానమే దశాబ్దాలుగా మూలస్తంభంగా నిలుస్తూ వచ్చింది. ముఖ్యంగా ఐటీ, వైద్య తదితర రంగాల్లో మన నిపుణులు అగ్ర రాజ్యంలో తిరుగులేని రీతిలో జెండా పాతారు. అంత కీలకమైన హెచ్–1బీ వీసా విధానం ట్రంప్ తొలి హయాంలో ఒడిదుడుకులకు లోనైంది. మితిమీరిన వడపోతలు, కఠినమైన అర్హత ప్రమాణాల వంటివి అమెరికా కలలుకనే భారతీయ ఔత్సాహికుల్లో, వారి కుటుంబాల్లో తీవ్ర అనిశ్చితికి దారితీశాయి.

- ఈ సవాళ్లు ట్రంప్ 2.0లో మరింత పెరిగే సూచనలే కన్పిస్తుండటం ఆందోళనకరం.
- గ్రీన్‌కార్డు కోసం దశాబ్దాలుగా ఎదురుతెన్నుల్లోనే గడుపుతున్న భారత అమెరికన్లు మరిన్ని సమస్యలు ఎదుర్కోక తప్పేలా లేదు.
- జీవిత భాగస్వామి ప్రధానంగా హెచ్–4 వర్క్ వీసా పర్మిట్లపై ఆధారపడే కుటుంబాల పరిస్థితి మరింత డోలాయమానంగా తయారైంది. ఆ వీసాలకు వర్క్ పర్మిట్లు రద్దు చేస్తామని ట్రంప్ గతంలో చేసిన ప్రకటన ఇప్పుడు మళ్లీ భయపెడుతోంది. అదే జరిగితే భారత మహిళలకు కోలుకోలేని దెబ్బే అవుతుంది. కుటుంబానికి ఆర్థిక భద్రత, వృత్తిగత ఎదుగుదలకు కీలకమైన అవకాశం వారి చేజారుతుంది.
- వీసా పర్మిట్ల గందరగోళంతో నిపుణులైన భారతీయులపై ఎక్కువగా ఆధారపడే అమెరికా వ్యాపార సంస్థలు కూడా బాగా ప్రభావితమవుతాయి.
- వర్క్ వీసాలపై పరిమితులు కీలక రంగాల్లో మానవ వనరుల కొరతకు దారితీస్తాయి.

రూటు మారిన రాజకీయం

భారత అమెరికన్లు మొదటినుంచీ డెమొక్రటిక్ పార్టీ మద్దతుదారులుగా ఉంటూ వచ్చారు. వలసలు, వైవిధ్యం, సామాజిక న్యాయం తదితర విధానాల్లో ఆ పార్టీ ప్రగతిశీల వైఖరే అందుకు ప్రధాన కారణం. కానీ వలస సంస్కరణలపై బైడెన్ సర్కారు నిర్లిప్తత, అంతూపొంతూ లేని గ్రీన్‌కార్డుల వెయిటింగ్ లిస్టు వంటివి ఆ పార్టీపై వారిలో అసంతృప్తికి దారితీశాయి. ఈ నేపథ్యంలో కుటుంబ విలువలు, విద్య తదితరాల్లో అచ్చం తమను పోలి ఉండే రిపబ్లికన్ పార్టీ వైఖరి, దాని సరళీకృత ఆర్థిక విధానాలు సంప్రదాయ భారతీయులను కొంతకాలంగా అమితంగా ఆకర్షిస్తున్నాయి. నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి వంటి భారత సంతతికి చెందిన రిపబ్లికన్ నేతలు మరింతగా వారి ఆదరణను చూరగొంటున్నారు. ముఖ్యంగా దూకుడుకు మారుపేరైన ట్రంప్ రిపబ్లికన్ పగ్గాలు చేపట్టిన నాటినుంచీ ఈ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. భారత అమెరికన్ సమాజం నానాటికీ ఆ పార్టీవైపు మొగ్గుతోంది. ట్రంప్ 2.0 విధానాలను బట్టి ఇది మరింత ఊపందుకున్నా ఆశ్చర్యం లేదు.

సామాజిక ఆందోళనలు

ట్రంప్ తొలి హయాంలో జాతి విద్వేష, విద్వేష నేర ఘటనలు పెరిగాయి. వాటిలో తరచూ దక్షిణాసియా మూలాలున్న వారినే లక్ష్యంగా చేసుకునే ఆందోళనకర ట్రెండుకు తెర లేచింది. దీని ప్రభావం భారతీయ అమెరికన్లపైనా బాగానే పడింది. దానికి తోడు 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినాదానికి ఈసారి మరింత ప్రాధాన్యమిస్తానని ట్రంప్ కుండబద్దలు కొట్టారు. తమపట్ల వివక్షకు తావులేని వాతావరణాన్ని కోరుకుంటున్న భారతీయ అమెరికన్లలో ఈ ప్రకటన మరింత గుబులు రేపుతోంది. ఈ ఆందోళనలను తొలగించేందుకు రిపబ్లికన్ పార్టీలోని భారత మూలాలున్న నేతలు ఏ మేరకు కృషి చేస్తారన్నది కీలకం కానుంది.

వర్తకం.. ఆచితూచి

ట్రంప్ తొలి హయాంలో వర్తకానికి పెద్ద పీటే వేసినా కొన్నిసార్లు వివాదాలూ తప్పలేదు. ఉక్కు, అల్యూమినియం, వ్యవసాయోత్పత్తుల వంటివాటిపై టారిఫ్‌లు గొడవకు దారితీశాయి. రిటైల్ నుంచి టెక్ స్టార్టప్‌ల దాకా రెండు ఆర్థిక వ్యవస్థల్లోనూ కీలకంగా మారిన భారత అమెరికన్ వ్యాపారవేత్తలకు ట్రంప్ తొలి హయాంలో మిశ్రమ ఫలితాలే ఎదురయ్యాయి. పన్ను తగ్గింపులు, నిబంధనల సడలింపు వంటి ట్రంప్ సర్కారు నిర్ణయాలు వ్యాపార విస్తృతికి దోహదపడినా మొత్తమ్మీద టారిఫ్‌ల విషయంలో కొనసాగిన అనిశ్చితి ఎప్పటికప్పుడు వారికి సవాలుగానే నిలుస్తూ వచ్చింది. వాటిపై సంప్రదింపులు కూడా పెద్దగా ఫలితమివ్వలేదు. ఈసారి వాటిని చక్కదిద్దుకోవడానికి ట్రంప్ ప్రాధాన్యమిచ్చే అవకాశముంది.

- విధానాలు ఇరు దేశాలకూ లాభసాటిగా ఉండేలా మెరుగుపరిచేందుకు ద్వైపాక్షిక వర్తకంతో ప్రత్యక్ష భాగస్వామ్యమున్న భారతీయ అమెరికన్ వ్యాపార దిగ్గజాలు ప్రయత్నించవచ్చు.
- ఫార్మా, జౌళి, టెక్నాలజీ వంటి రంగాల్లో టారిఫ్‌లు తగ్గడమో, లేదంటే సరళంగా మారడమో ఖాయంగా కనిపిస్తోంది.
- పన్ను ప్రోత్సాహకాలపై నియంత్రణల ఎత్తివేతతో పాటు చిన్న వ్యాపారాలకు ఇతోధికంగా వృద్ధి అవకాశాల కల్పన దిశగా అడుగులు పడవచ్చు.
- ట్రంప్ అత్యంత ప్రాధాన్యమిస్తున్న 'అమెరికా ఫస్ట్' విధానం భారతీయ అమెరికన్ వ్యాపారవేత్తలకు సవాలుగా పరిణమించే ఆస్కారమూ లేకపోలేదు.

చట్టబద్ధ స్వామిత్రతో ఆర్థికాభివృద్ధి

పేదరిక నిర్మూలనకు దోహదపడుతుంది
- స్వామిత్ర ఆస్తి కార్డుల అందజేత కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని
- 65 లక్షల మందికి ప్రాపర్టీ కార్డుల అందజేత



న్యూఢిల్లీ: చట్టబద్ధంగా జారీచేస్తున్న స్వామిత్ర ఆస్తి కార్డులతో దేశంలో ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుని ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు. శనివారం 65 లక్షల మందికి నూతనంగా స్వామిత్ర ప్రాపర్టీ కార్డ్‌లను జారీచేసిన సందర్భంగా ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. పెరిగిన ఆర్థిక కార్యకలాపాలతో పేదరికాన్ని తరిమికొట్టొచ్చని ఆయన చెప్పారు. ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, మిజోరం, ఒడిశా, పంజాబ్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్ మొత్తంగా 10 రాష్ట్రాలతోపాటు జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాల్లోని 50,000 గ్రామాలకు చెందిన 65 లక్షల మందికి శనివారం ఈ కార్డులను అందజేశారు. కార్డులు అందుకున్న వారిలో కొందరు లబ్ధిదారులతో ప్రధాని మోదీ మాట్లాడారు. ''గ్రామీణ ప్రాంతాల్లో భూముల డిజిటలైజేషన్‌తో మరింత సమర్థవంతమైన సాంకేతికత, సుపరిపాలన సాధ్యమవుతుంది. ఇది గ్రామాల సాధికారతకు బాటలు వేస్తుంది. కార్డులున్న లబ్ధిదారులు రుణాలు పొందేందుకు, ఇతర ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హులవుతారు. కొత్తగా తీసుకున్న వారితో కలుపుకుని ఇప్పుడు దేశవ్యాప్తంగా దాదాపు 2.24 కోట్ల మంది స్వామిత్ర ప్రాపర్టీ కార్డుదారులున్నారు. ఆస్తి హక్కు అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రధాన సవాల్‌గా తయారైంది. చాలా దేశాల్లో ప్రజలకు తమ సొంత ఆస్తులకు సంబంధించిన చట్టబద్ధమైన పత్రాలు లేవని స్వయంగా ఐక్యరాజ్యసమితి చేపట్టిన ఒక అధ్యయనంలో తేలింది. పేదరిక నిర్మూలనలో ఆస్తి హక్కు కీలకమైనది ఐరాస ఆనాడే పేర్కొంది''అని మోదీ గుర్తుచేశారు.

మృత మూలధనం కాదు

''గతంలో ఒక ప్రముఖ ఆర్థికవేత్త చెప్పినట్లు భారతీయ గ్రామాల్లోని భూమి పెట్టుబడికి పనికిరాని మృత మూలధనం కాదు. సరైన పత్రాలు లేకపోవడంతో చాలా మంది వాటిని విక్రయించలేకపోతున్నారు. కొనేందుకు ఎవరూ ముందుకు రావట్లేదు. ఆక్రమణలు, భూవివాదాలతో గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు. సరైన భూమి డాక్యుమెంట్లు లేని కారణంగా వీళ్లకు బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వవు. మనసున్న ఏ ప్రభుత్వమూ గ్రామీణులను ఇలా కష్టాల కడలిలో వదిలేయదు. గత ప్రభుత్వాలు ఈ సమస్యకు ఎలాంటి పరిష్కారం చూపే ప్రయత్నంకూడా చేయలేదు. దీంతో దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజనులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్య పోగొట్టేందుకే గ్రామాల్లో వ్యక్తులకు నివాస, భూములకు సంబంధించిన ప్రాపర్టీ కార్డులను జారీచేస్తున్నాం. స్వామిత్ర (సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) యోజన పథకం ద్వారా డ్రోన్ సాంకేతికత సాయంతో మ్యాపింగ్ చేసి వారి వారి ఇళ్లు, భూములను ఖచ్చితమైన సరిహద్దులతో చట్టబద్ధమైన ఆస్తికార్డులను అందజేస్తున్నాం. వీటితో వ్యక్తులకు తమ భూములపై సర్వాధికారాలు ధారాదత్తమవుతాయి. ఈ పథకం ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. భారత్‌లో 6,00,000 గ్రామాలుంటే వాటిల్లో సగం గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయింది''అని ప్రధాని మోదీ అన్నారు. శనివారం దాదాపు 230 జిల్లాల్లో రైతులకు అధికారులు స్వయంగా ప్రాపర్టీ కార్డులను అందజేశారు. స్వామిత్ర యోజన పథకాన్ని మోదీ సర్కార్ 2020లో ప్రారంభించింది. ఆస్తులను నగదుగా మార్చుకునే వెసులుబాటు, ఆయా భూములకు బ్యాంక్ రుణాలు వచ్చేలా చేయడం, ఆస్తి తగాదాలను సాధ్యమైనంత మేరకు తగ్గించడం, ఆస్తులు, ఆస్తిపన్నుల మదింపు, గ్రామస్థాయిలో సమగ్ర విధాన నిర్ణయాలకు దోహదపడటమే స్వామిత్ర యోజన ముఖ్యోద్దేశం.

కేజ్రీవాల్ కారుపై బీజేపీ దాడి: ఆప్

ఆ వాహనం ఇద్దర్ని ఢీకొట్టిందన్న బీజేపీ

న్యూఢిల్లీ: న్యూఢిల్లీ నియోజకవర్గంలో శనివారం ఎన్నికల ప్రచారం చేస్తున్న తమ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కారుపై బీజేపీ మద్దతుదారులు దాడికి పాల్పడ్డారని ఆప్ ఆరోపించింది. బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ మనుషులే ఘటనకు కారణమని పేర్కొంది. ఈ ఆరోపణలను బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ ఖండించారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రయాణిస్తున్న కారు ఇద్దరు యువకులను ఢీకొట్టి వెళ్లిపోయిందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. గాయపడిన ఆ ఇద్దరినీ లేడీ హార్డింజ్ ఆస్పత్రిలో చేర్పించామని చెప్పారు. ఓటమి తప్పదని తెలిసిన కేజ్రీవాల్ మనుషుల ప్రాణాలకు విలువ ఇవ్వడం కూడా మరిచారని వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ కారుపై ఎవరూ రాళ్లు విసరలేదని పోలీసులు చెప్పారు. నల్లజెండాలను ప్రదర్శిస్తూ ఆయన కారును అడ్డుకోబోయిన వారిని తొలగించామన్నారు. అయితే, పోలీసులతో కలిసి వాహనంలో వెళ్తున్న కేజ్రీవాల్..నల్ల జెండా పట్టుకుని ఉన్న ఓ వ్యక్తి రాయి విసురుతున్నట్లుగా ఉన్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైంది.

కూలదోయబోయి కూలబడ్డారు

మోదీపై రాహుల్ ధ్వజం



పట్నా: వరుసగా రెండుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచామన్న విజయగర్వంతో రాజ్యాంగాన్నే కూలదోసే సాహసంచేసి, మూడోసారి మెజార్టీ తగ్గడంతో మళ్లీ రాజ్యాంగం వద్ద ప్రధాని మోదీ ప్రణమిల్లారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. శనివారం పట్నాలోని చరిత్రాత్మక సదాఖత్ ఆశ్రమం వద్ద గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పించాక పార్టీ కార్యకర్తలతో 'కార్యకర్తా సమ్మేళన్'తర్వాత 'సంవిధాన్ సురక్షా సమ్మేళన్'సభల్లో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. రాజ్యాంగ ప్రతిని చేతబట్టుకుని ప్రసంగించారు. ''మూడో సారి కూడా మెజారిటీతో గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టి ఉంటే ఈ రాజ్యాంగాన్ని కూలదోసేవారు. కానీ విపక్షాలు ఐక్యంగా పోరాడటంతో ఆయన కల లు కలగానే మిగిలిపోయాయి. 400పార్ నినాదాన్ని ఓటర్లు దారుణంగా తిరస్కరించడంతో మెజారిటీ తగ్గిపోయి మోదీ మళ్లీ రాజ్యాంగం వద్ద సాగిలపడ్డారు''అని రాహుల్ అన్నారు. దీంతో అక్కడున్నవాళ్లంతా గొల్లున నవ్వారు. 543 సీట్లున్న లోక్‌సభలో 400కుపైగా సీట్లొస్తే రాజ్యాంగాన్నే మార్చేస్తామని పలువురు బీజేపీ నేతలు చేసిన ప్రకటనలు ఎన్‌డీఏ కూటమి భారీ విజయశాతాన్ని తగ్గించేసిన సంగతి తెల్సిందే. ''బుద్ధుడు, అంబేడ్కర్, నారాయణ గురు, మహాత్మా ఫూలేవంటి ఎందరో ప్రముఖుల ప్రగతిశీల భావనల నుంచే రాజ్యాంగం ఆవిర్భవించింది''అని రాహుల్ అన్నారు.

కాల్పుల విరమణ నేటి నుంచే!

కైరో: ఇజ్రాయెల్ దాడులతో శిథిలమైన గాజాపై నేటి నుంచి శాంతిరేఖలు ప్రసరించనున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి హమాస్, ఇజ్రాయెల్ మధ్య ఆరు వారాలపాటు కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రానుంది. ఇజ్రాయెల్ కారాగారాల్లో మగ్గిపోతున్న పాలస్తీనియన్లు, పాలస్తీనా రాజకీయ పార్టీల నేతలను ఈ 42 రోజుల్లోపు ఇజ్రాయెల్ అధికారులు విడిచిపెట్టనున్నారు. 2023 అక్టోబర్ ఏడున ఇజ్రాయెల్ శివారు గ్రామాలపై దాడిచేసి కిడ్నాప్ చేసి బందీలుగా ఎత్తుకెళ్లిన వారిలో కొందరిని హమాస్ విడిచిపెట్టనున్నారు. సాయంత్రం 4 గంటలతర్వాతే బందీల పరస్పర బదిలీ మొదలవతుందని ఇజ్రాయెల్ చెబుతోంది. ఇరువైపులా బందీల కుటుంబసభ్యులు, బంధువుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. తమ వారిని చూడబోతున్నామన్న ఆత్రుత వారిలో కన్పిస్తోంది. స్వేచ్ఛావాయువులు పీల్చబోతున్న వీళ్లందరికీ తక్షణ ఆహారంతో పాటు ఇతరత్రా సాయం అందించేందుకు మానవీయ సంస్థలు సిద్ధమయ్యాయి. అయితే ఇరువైపులా ఈ ప్రక్రియ ఎంత సజావుగా సాగుతుందనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దీనికి తోడు, బందీల జాబితా అందజేసేదాకా కాల్పుల విరమణ ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు శనివారం అర్ధరాత్రి మెలిక పెట్టారు!

వికాస్ ఇంజిన్ రీస్టార్ట్ విజయవంతం: ఇస్రో

సాక్షి, బెంగళూరు: మహేంద్రగిరిలోని ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో శుక్రవారం వికాస్ లిక్విడ్ ఇంజిన్‌ను విజయవంతంగా రీస్టార్ట్ చేసినట్లు ఇస్రో తెలిపింది. రాకెట్ లాంచర్లకు ద్రవీకృత ఇంధన దశల్లో వికాస్ ఇంజిన్ ఎంతో కీలకమైందని పేర్కొంది. భవిష్యత్తులో ప్రయోగించే రాకెట్ లాంచర్ల పునర్వినియోగానికి సంబంధించిన సాంకేతికతలో జనవరి 17వ తేదీని ఓ మైలురాయిగా ఓ ప్రకటనలో ఇస్రో అభివర్ణించింది. వివిధ పరిస్థితుల్లో విక్రమ్ ఇంజిన్‌ను రీస్టార్ట్ చేసి, పనితీరును అంచనా వేసేందుకు వరుసగా పరీక్షలు చేపట్టనున్నట్లు వివరించింది. 'ఈ పరీక్షలో 60 సెకన్ల పాటు ఇంజిన్‌ను పనిచేయించి, 120 సెకన్ల పాటు ఆపేశాం. తిరిగి స్టార్ట్ చేసి ఏడు సెకన్లపాటు పనిచేయించాం. ఈ పరీక్షలో ఇంజిన్ మామూలుగానే పనిచేసింది. అన్ని పరామితులను ఆశించిన రీతిలో అందుకుంది' అని ఇస్రో వివరించింది. డిసెంబర్ 2024లోనూ ఇలాంటి పరీక్షనే విజయవంతంగా నిర్వహించామని తెలిపింది. అప్పుడు కేవలం ఏడు సెకన్లపాటే ఇంజిన్‌ను మండించి, 42 సెకన్ల వరకు ఆపేసి ఉంచామని వివరించింది.

సైఫ్‌పై దాడి ఘటన.. అనుమానితుడి అరెస్ట్

దుర్గ్: నటుడు సైఫ్ అలీ ఖాన్ ఇంట్లోకి ప్రవేశించి అయనపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన దర్యాప్తులో కీలక పరిణామం సంభవించింది. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వే స్టేషన్‌లోని ఓ రైలులో ఉన్న అనుమానితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముంబైలోని లోకమాన్య తిలక్ టెర్మినస్(ఎల్టీటీ)నుంచి కోల్‌కతా వెళ్లే జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న అతడిని ఆకాశ్ కైలాశ్ కనోజియా(31)గా గుర్తించారు. సైఫ్ అలీ ఖాన్‌పై దాడి కేసులో అనుమానితుడొకరు జ్ఞానేశ్వరి ట్రెయిన్‌లో ఉన్నట్లు ముంబై పోలీసులు శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో దుర్గ్ రైల్వే పోలీసులను అలెర్ట్ చేశారు. అనుమానితుడి సెల్ ఫోన్ లొకేషన్‌తోపాటు అతడి ఫొటోను షేర్ చేశారు. వెంటనే స్పందించిన దుర్గ్ పోలీసులు ముందుగానే అతడిని పట్టుకునేందుకు రాజ్‌నంద్‌గావ్ స్టేషన్ పోలీసులను అప్రమత్తం చేశారు. అయితే, రాజ్‌నంద్‌గావ్‌లో ఆగిన సమయంలో అక్కడి పోలీసులు అనుమానితుడిని గుర్తించలేకపోయారు. దీంతో, ఆ రైలు చేరుకునే సమయానికి దుర్గ్ రైల్వే స్టేషన్‌లో రెండు బృందాలను సిద్ధం చేశారు. మొదటి జనరల్ బోగీలో ఉన్న ఆకాశ్‌ను వెంటనే గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. అతడి ఫొటోను ముంబై పోలీసులకు పంపి నిర్ధారణ చేసుకున్నారు. గురువారం తెల్లవారు జామున సైఫ్‌పై కత్తితో దాడి చేసిన అనంతరం భవనం మెట్ల మార్గం గుండా దిగుతున్న నిందితుడి ముఖం సీసీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డవడం తెలిసిందే. ముంబై పోలీసులు విమానంలో రాయ్‌పూర్ వెళ్లి ఆకాశ్ కైలాశ్‌ను కస్టడీకి తీసుకుంటారని అధికారులు తెలిపారు.


అనుమానితుడు కనోజియా

7 కోట్ల రుద్రాక్షలతో... ద్వాదశ జ్యోతిర్లింగాలు

కుంభమేళాలో విశేషాలెన్నో
- రాజ్‌నాథ్‌సింగ్ పుణ్యస్నానం
- 22న ప్రయాగ్‌రాజ్‌లో కేబినెట్ భేటీ


శనివారం మహా కుంభమేళాలో హారతి ఇస్తున్న రాజ్‌నాథ్ సింగ్

మహాకుంభ్‌నగర్/లఖ్‌నవూ: ఇసుకేస్తే రాలని భక్తజన సందోహం నడుమ ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా కన్నులపండువగా కొనసాగుతోంది. వేడుకకు వేదికైన త్రివేణి సంగమానికి ప్రపంచం నలుమూలల నుంచీ భక్తులు వెల్లువెత్తుతూనే ఉన్నారు. శనివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మేళాలో పాల్గొన్నారు. వీఐపీ ఘాట్‌లో పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం అక్షయ వటవృక్షం, పాతాళ్‌పురీ మందిర్, సరస్వతీ కూప్‌ను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. బడే హనుమాన్ మందిర్‌లో ప్రత్యేక పూజలు చేశారు. ఇంతటి వేడుకలో పాల్గొనడం తన అదృష్టమన్నారు. ''మహా కుంభమేళా ఏ మతానికో, ప్రాంతానికో చెందినది కాదు. భారతీయతను ప్రతిబింబించే అతి పెద్ద సాంస్కృతిక పండుగ. భారత్‌ను, భారతీయతను అర్థం చేసుకునేందుకు చక్కని మార్గం''అని అభిప్రాయపడ్డారు. మహా కుంభమేళాలో పలు విశేషాలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి. మహాకుంభ్‌నగర్ సెక్టర్ 6లో ఏకంగా 7.51 కోట్ల రుద్రాక్షలతో రూపొందించిన ద్వాదశ జ్యోతిర్లింగాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఒక్కో లింగాన్ని 11 అడుగుల ఎత్తు, 9 అడుగుల వెడల్పు, 7 అడుగుల మందంతో రూపొందించారు. వాటి తయారీలో వాడిన రుద్రాక్షలను 10 వేల పైచిలుకు గ్రామాల్లో పాదయాత్ర చేస్తూ సేకరించినట్టు నిర్వాహకుడు మౌనీ బాబా తెలిపారు. వాటిలో ఏకముఖి నుంచి 26 ముఖాల రుద్రాక్షల దాకా ఉన్నట్టు చెప్పారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం 22న ప్రయాగ్‌రాజ్‌లో సమావేశం కానున్నట్టు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ప్రయాగ్‌రాజ్ అభివృద్ధికి సంబంధించి భేటీలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. అంతకుముందు యోగి కుంభమేళాలో పాల్గొని పుణ్యస్నానం ఆచరించనున్నారు.

సాక్షి
హైదరాబాద్

ఆదివారం । 19 । జనవరి । 2025



..ఫిజియోథెరపిస్టుల పాత్ర కీలకం
వైద్య రంగంలో ఫిజియోథెరపిస్టుల పాత్ర ఎంతో కీలకమని పాట్నా హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి పేర్కొన్నారు.
- 8లో



అందమైన ఊహకు.. పొందికైన రూపం..
ఇటీవల స్టార్ హోటళ్లు సహా సాధారణ ఇళ్ల వరకూ అలంకరణకు ప్రాధాన్యమిస్తున్నాయి. దీంతో నగరంలోనూ అలంకరణ పట్ల ఆదరణ పెరుగుతోంది.
- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
28.0/18.0

వాతావరణం
నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు ఎక్కువగా ఉంటుంది. గరిష్టంగా 28, కనిష్టంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

చెత్త తరలింపులో హైటెక్ పద్ధతులు

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



జటాయు పని విధానాన్ని పరిశీలిస్తున్న మేయర్

గోల్కొండ: నగరాన్ని క్లీన్ సిటీగా మార్చడమే లక్ష్యంగా పారిశుద్ధ్య పనుల కోసం అత్యాధునిక పరికరాలను వినియోగిస్తున్నామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె బల్దియా అధికారులతో కలిసి షేక్‌పేట్ డివిజన్ రాహుల్ కాలనీ, ఆదిత్యనగర్, పారామౌంట్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బుల్కాపూర్ నాలాను పరిశీలించారు. ఈ నాలా కంటే తక్కువ, ఎక్కువ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాలాలోకి వర్షపు నీరు వెళ్లే విధంగా అవసరమైన ప్రతిపాదనలను వెంటనే తన వద్దకు పంపాలన్నారు. రాహుల్ కాలనీలో చెత్తను తరలిస్తున్న జటాయు వాహనాన్ని పరిశీలించారు. మేయర్ వెంట షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ తదితరులున్నారు.



'బంపర్' బిన్!

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌ల కోసం చెత్త డబ్బా రహిత నగరంగా చూపేందుకు గతంలో పెద్ద చెత్త డబ్బా (డంపర్ బిన్)లను ఎత్తివేసిన జీహెచ్‌ఎంసీకి తత్వం బోధపడి.. పరిస్థితి అర్థమైనట్లుంది. తిరిగి డంపర్ బిన్లను ఏర్పాటు చేసే చర్యలు చేపట్టింది. గార్బేజ్ వల్నరబుల్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తోంది. అలాంటి బిన్‌ను శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో మేయర్ విజయలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. బిన్ నిండుతుండగా.. జీహెచ్‌ఎంసీ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందుతుంది. వెంటనే వాహనం అక్కడికి వెళ్లి మానవ రహితంగానే చెత్తను లోడ్ చేసుకొని వెళ్తుందని అధికారులు పేర్కొన్నారు. - సిటీబ్యూరో

నార్త్ సిటీ మెట్రో డీపీఆర్‌కు కసరత్తు

క్షేత్ర స్థాయిలో హెచ్‌ఏఎంఆర్‌ఎల్ అధ్యయనం

- సాంకేతిక అంశాలపై అధికారుల దృష్టి
- రెండు రూట్లలో డబుల్ డెక్కర్ మెట్రోలకే మొగ్గు
- హెచ్‌ఎండీఏతో హెచ్‌ఏఎంఆర్‌ఎల్ సమన్వయం
- మార్చి నాటికి డీపీఆర్‌కు కార్యాచరణ



సాక్షి, సిటీబ్యూరో: నార్త్‌సిటీ మెట్రో కారిడార్‌లపై హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్‌ఏఎంఆర్‌ఎల్) దృష్టి సారించింది. మార్చి నాటికి డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్)ను రూపొందించే దిశగా అధికారులు కార్యాచరణ చేపట్టారు. ఈమేరకు రెండు కారిడార్‌లలో క్షేత్ర స్థాయిలో అధ్యయనం మొదలైంది. కారిడార్‌ల నిర్మాణానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఎదురు కానున్న సమస్యలు తదితర అంశాల ఆధారంగా అధికారులు సర్వే చేపట్టారు. ఈ రెండు రూట్లలో ఇప్పటికే హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి సన్నాహాలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ మార్గాల్లోనే మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో డబుల్ డెక్కర్ కారిడార్‌ల కోసం పియర్స్ ఎత్తును ఏమేరకు పెంచాల్సి ఉంటుంది, ఈ క్రమంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందనే అంశాలను సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రెండు కారిడార్‌లు సైతం డబుల్ డెక్కర్ పద్ధతిలో చేపట్టనున్న దృష్ట్యా ఇతర ఎలివేటెడ్ మెట్రోల కంటే నార్త్‌సిటీ మెట్రో భిన్నంగా ఉండనుంది. ఇందుకనుగుణంగా డీపీఆర్ సిద్ధం చేయనున్నారు. 3 నెలల్లో డీపీఆర్ రెడీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో అధికారులు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర ప్రాజెక్టు నివేదిక కోసం కసరత్తు చేపట్టారు.

హెచ్‌ఎండీఏతో సమన్వయం..

రెండు రూట్లలో ఎలివేటెడ్ కారిడార్‌ల కోసం నిర్మించే పియర్స్‌పైనే మెట్రో కారిడార్ రానుంది. దీంతో నార్త్‌సిటీ మెట్రోకు పియర్స్ ఎత్తు, మెట్రో స్టేషన్‌ల నిర్మాణం కీలకం కానున్నాయి.

- ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫామ్‌కు, శామీర్‌పేట్ ఓఆర్‌ఆర్ వరకు ఎలివేటెడ్ కారిడార్‌లకు హెచ్‌ఎండీఏ కార్యాచరణ చేపట్టింది. దీంతో మెట్రో నిర్మాణంపై హెచ్‌ఏఎంఆర్‌ఎల్ సంస్థ హెచ్‌ఎండీఏతో కలిసి పని చేయనుంది. పియర్స్, కారిడార్‌ల నిర్మాణం తదితర అంశాల్లో రెండు సంస్థల భాగస్వామ్యం తప్పనిసరి. డబుల్ డెక్కర్ వల్ల నిర్మాణ వ్యయం తగ్గడంతో పాటు నగర వాసులకు ఒకే రూట్‌లో రోడ్డు, మెట్రో సదుపాయం అందుబాటులోకి రానుంది. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ 23 కి.మీ మెట్రో కారిడార్‌లో డెయిరీఫామ్ వరకు అంటే 5.32 కి.మీ డబుల్‌డెక్కర్ ఉంటుంది. మిగతా 17.68 కి.మీ ఎలివేటెడ్ పద్ధతిలోనే నిర్మించనున్నారు.
- మరోవైపు జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ మార్గంలో ఇంచుమించు పూర్తిగా డబుల్‌డెక్కర్ నిర్మాణమే. ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్‌కు దాదాపు 23 కి.మీ, జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి విక్రంపురి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, అల్వాల్, బొల్లారం, హకీంపేట్, తూంకుంట, ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్‌పేట్ వరకు 22 కి.మీ పొడవుతో మెట్రో అందుబాటులోకి రానున్న సంగతి తెలిసిందే. ఈ రెండు కారిడార్‌లను మెట్రో రెండో దశ 'బి' విభాగం కింద చేర్చనున్నారు. డబుల్‌డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌ల వల్ల సికింద్రాబాద్ నుంచి ఉత్తరం వైపు వివిధ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ రంగాల్లో పని చేసే అసంఘటిత కార్మిక వర్గాలు సిటీ బస్సులు, సెవెన్ సీటర్ ఆటోలు, సొంత వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో వాహనాల రద్దీ, గంటల తరబడి ట్రాఫిక్ ఇబ్బందులకు గురవుతున్నారు.

కేంద్రం ఆమోదం కోసం ఎదురుచూపులు..

మెట్రో రెండో దశపై కేంద్రం ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభించే అవకాశం ఉంది. త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కేంద్రం నిధులు కేటాయించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. మెట్రో నిర్మాణానికి నిధుల కొరత ఏ మాత్రం సమస్య కాదని, కేంద్రం నుంచి సావరిన్ గ్యారంటీ లభిస్తే అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాలు పొందవచ్చని ధీమా వ్యక్తం చేస్తున్నారు. చెన్నై, బెంగళూర్‌లలో మెట్రో విస్తరణకు గత బడ్జెట్‌లలో నిధులు కేటాయించినట్లుగానే హైదరాబాద్ మెట్రోకు కూడా ఈసారి కేంద్రం నిధులు ఇచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

సిటీలోనే షెల్టర్?

బిహార్ నుంచి వచ్చి ఇక్కడే మకాం

- వాహన చోరీ సైతం నగరంలోనే..
- స్థానిక పరిస్థితులు, రూట్లపై అవగాహన
- దోశ కింగ్ హోటల్‌లో 'తుపాకీ మార్పిడి'
- కాల్పుల కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

సాక్షి, సిటీబ్యూరో: కర్ణాటకలోని బీదర్‌తో పాటు మన నగరంలోని అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో తుపాకీతో విరుచుకుపడిన దుండగులు ఇక్కడే షెల్టర్ తీసుకున్నారా? అంటే.. ఔననే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు పోలీసులు. నగరంలో వీరి వ్యవహారశైలి, నేరం జరిగిన తీరు, వినియోగించిన వాహనంతో పాటు ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకున్న దర్యాప్తు అధికారులు ఈ అంచనాకు వచ్చారు. దీంతో దుండగులు బస చేసే అవకాశం ఉన్న ప్రాంతాల కోసం ఆరా తీస్తున్నారు. మరోపక్క దుండగులు గురువారం సాయంత్రం ట్రాలీ బ్యాగ్స్ కంటే ముందే కొత్త బ్యాక్ ప్యాక్ సైతం ఖరీదు చేశారు. రోషన్ ట్రావెల్స్ పక్కన ఉన్న దోశ కింగ్ హోటల్‌లోనే తమ బ్యాగ్‌లో నుంచి తుపాకీ తదితరాలను తీసి కొత్త బ్యాక్ ప్యాక్‌లో పెట్టుకున్నట్లు తేలింది.

బిహార్ టు బీదర్ వయా సిటీ..

నేరం జరిగిన తీరు, ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న దుండగులు హైదరాబాద్ మీదుగానే బీదర్ వెళ్లినట్లు పోలీసులు భావిస్తున్నారు. నిందితులు బిహార్‌కు చెందిన వారుగా ప్రాథమిక ఆధారాలు లభించాయి. బీదర్‌లోని శివాజీ జంక్షన్ వద్ద ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రాల్లో డబ్బు నింపే సీఎంఎస్ ఏజెన్సీ వాహనాన్ని కొల్లగొట్టడానికి దుండగులు బైక్‌పై వచ్చారు. ఈ వాహనానికి 'ఏపీ' రిజిస్ట్రేషన్‌తో కూడిన నంబర్ ప్లేట్ ఉంది. ఇది అసలుదైనా, నకిలీదైనా వాహనం మాత్రం హైదరాబాద్, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో చోరీ చేసిందని భావిస్తున్నారు.

చోరీ చేసిన వాహనంతోనే రెక్కీ?

నగరంలోని ఒక లాడ్జిలో రెండు మూడు రోజులు బస చేసిన దుండగులు చోరీ చేసిన వాహనం పైనే బీదర్ వెళ్లి వస్తూ రెక్కీ చేసి ఉంటారని, అందుకే నేరం చేసిన తర్వాత కూడా రాయ్‌పూర్ వెళ్లడానికి అఫ్జల్‌గంజ్‌కు వచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు. శనివారం బీదర్ పోలీసులతో కలిసి చేసిన తనిఖీల నేపథ్యంలో రెండు అనుమానాస్పద వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో దుండగులు వాడింది ఏదనేదానిపై ఆరా తీస్తున్నారు.

తిరుమలగిరి నుంచి మళ్లీ వెనక్కి...

ఈ నేరగాళ్లకు హైదరాబాద్‌లోని ప్రాంతాలు, రహదారులకు సంబంధించి పూర్తి అవగాహన ఉన్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. గురువారం రాత్రి అఫ్జల్‌గంజ్‌లో ఫైరింగ్ తర్వాత అక్కడ నుంచి ఆటోలో ఎస్కేప్ అయ్యారు. సికింద్రాబాద్ అల్పా హోటల్ వద్ద ఆటో దిగిన దుండగులు డ్రైవర్‌కు డబ్బు ఇచ్చి పంపేశారు. ఆపై అక్కడ నుంచి మరో ఆటో మాట్లాడుకుని తిరుమలగిరి చౌరస్తాకు చేరుకున్నారు. ఆ ఆటో కూడా దిగిపోయిన ఇరువురూ రోడ్డు దాటి నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లారు. అక్కడే దుస్తులు మార్చుకున్నారు. పాత బ్యాగ్స్, బ్యాక్ ప్యాక్‌తో పాటు వస్త్రాలను పడేశారు. ఆపై రోడ్డు మీదికి వచ్చి మరో ఆటో ఎక్కారు. ఆ ఆటో తిరిగి సికింద్రాబాద్ వైపే వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. దీంతో ఈ ఆటో ఎటు వెళ్లిందో తెలుసుకోవడంతో పాటు డ్రైవర్‌ను గుర్తించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.



దోశ కింగ్ హోటల్‌లో దుండగుడు

ఆ నాలుగు ప్రాంతాల్లో లోతుగా ఆరా...

శనివారం ఉదయం నుంచి ఈ నేరానికి ముందు ఏం జరిగిందనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దుండగులు బస చేసి ఉంటారనే అనుమానంతో నాంపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ, అఫ్జల్‌గంజ్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని లాడ్జిల్లో ఆరా తీస్తున్నారు. దర్యాప్తు అధికారులకు కీలక ఆధారం దొరికినట్లు సమాచారం.

మనీష్ గ్యాంగ్ పనేనా?

బీదర్‌తో పాటు నగరంలోని కొన్ని సీసీ కెమెరాల్లో లభించిన దుండగుల ఫొటోలను పోలీసులు దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీసులకు పంపారు. వీటిలో ఉన్న ఓ దుండగుడు తమ రాష్ట్రానికి చెందిన మోస్ట్ వాంటెడ్ మనీష్ కుష్వాహా అంటూ సమాచారం ఇచ్చారు. అతని కోసం ముమ్మరంగా గాలించడం మొదలెట్టారు. బిహార్ పోలీసులు ఆ ఫొటోలను అక్కడి నిరంజన గ్రామంలో ఉండే మనీష్ తల్లిదండ్రులకు చూపించారు. వాళ్లు అది తమ కుమారుడి ఫొటో కాదని చెప్పడంతో దర్యాప్తు మళ్లీ మొదటికి వచ్చింది. వారిచెప్పింది వాస్తవమా? కాదా? నేరం చేసింది మనీష్ నేతృత్వంలోని గ్యాంగ్ కాదా? అనే కోణాలను పరిశీలిస్తున్నారు.




తిరుమలగిరి వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న బ్యాగులు

పోలీసుల వద్ద తుపాకీ ఉండాల్సిందే

'సాక్షి' కథనానికి స్పందించిన సిటీ సీపీ

అఫ్జల్‌గంజ్ కాల్పుల ఉదంతం నేపథ్యంలో నగర పోలీసు విభాగంలో ఉన్న లోపాలను ఎత్తి చూపిస్తూ 'సరి చేయకుంటే సమస్యలెన్నో!' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనంపై కొత్వాల్ సీవీ ఆనంద్ స్పందించారు. దీనిపై ఆయన శనివారం ఉన్నతాధికారులతో విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి విధుల్లో ఉండే పోలీసులు, టాస్క్‌ఫోర్స్ వంటి ప్రత్యేక విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది తమ వెంట తుపాకులు ఉంచుకోకపోవడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షించడం కోసం పని చేసే అధికారులు తమ వెంట కచ్చితంగా పోలీసు విభాగం ఇచ్చిన తుపాకీ ఉంచుకోవాలని స్పష్టం చేశారు. వీరితో పాటు ప్రత్యేక విభాగాల్లో పని చేస్తున్న వారిలో ఎవరికైనా తుపాకీ జారీ అనివార్యమైతే ఆ కోణంలో తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు తమ వద్ద ఉండే తుపాకులను కేవలం అత్యవసర సందర్భాలు, అవసరమైనప్పుడు మాత్రమే వాడాలని ఆనంద్ స్పష్టం చేశారు. కేవలం తుపాకీ కలిగి ఉండటమే కాదని... క్రమం తప్పకుండా ఫైరింగ్ ప్రాక్టీస్ చేయించాలని కొత్వాల్ నిర్ణయించారు. లా అండ్ ఆర్డర్‌తో పాటు అన్ని విభాగాల్లో పని చేస్తున్న వారితో దశల వారీగా దీన్ని చేయించాలని స్పష్టం చేశారు. నగరంలో పని చేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించడంతో పాటు కొత్తవాటి ఏర్పాటు, అనుసంధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీవీ ఆనంద్ నిర్ణయించారు.

అక్రమాలకు చెక్.. అవినీతికి బ్రేక్!



ఇంజినీరింగ్ శాఖలో అవకతవకలు

గణేశ్ నిమజ్జనం ముగిసిన అనంతరం.. నిమజ్జనానికి సంబంధించి రోడ్ల మరమ్మతులు తదితర పనులకు టెండర్లు పిలుస్తారు. నిమజ్జనంతో పాటు నగరంలో నిర్వహించే బోనాలు, రంజాన్ ఇతర పండగల సందర్భాల్లోనూ అదే తంతు. పండగలు, ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే తాత్కాలిక లైటింగ్ ఏర్పాట్లదీ ఇదే తీరు. వీటితోనే కథ ముగియలేదు. ఏవైనా ఎన్నికల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లదీ అదే తీరు. చెట్ల పొదలు, ముళ్లకంపలు, మట్టిదిబ్బల తొలగింపు తదితర పనుల పేరిట సైతం భారీగా ఖర్చు చేయడం పరిపాటిగా మారింది. - సాక్షి, సిటీబ్యూరో



- చేయని పనులకు బిల్లుల చెల్లింపులు
- చర్యలకు సిద్ధమవుతున్న కమిషనర్
- బల్దియాలో త్వరలో బదిలీలు సైతం

జీహెచ్‌ఎంసీలో ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై సంస్థ ఖజానాకు చిల్లులు పెడుతున్నారనే ఆరోపణలు ఎంతోకాలంగా ఉన్నా కట్టడి చర్యలు లేకుండాపోయాయి. సదరు పనులు సంబంధిత ఇంజినీర్లు, కాంట్రాక్టర్లకు తప్ప ఎవరికీ అంతు పట్టవు. జరిగే పనులకు, చెల్లించే బిల్లులకు సైతం పొంతన ఉండదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సిద్ధమయ్యారు. బిల్లుల చెల్లింపులకు ముందు సంబంధిత ఇంజినీర్లతో పాటు డిప్యూటీ, జోనల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సర్క్యులర్ జారీ చేశారు. ఈ విధానాన్ని పాటించాల్సి ఉన్నప్పటికీ ఎంతో కాలంగా అటకెక్కించారు. చేయని పనులకు సైతం బిల్లులు చెల్లిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మెజర్‌మెంట్స్ బుక్స్(ఎంబీ)లో సైతం కాంట్రాక్టర్లే రాసినా పట్టించుకోని ఘటనలున్నాయి. ఇందుకుగాను దిగువ స్థాయిలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ న్యాక్ ఇంజినీర్ల నుంచి పై స్థాయి అధికారుల వరకు ముడుపులు ముడుతున్నాయనే ఆరోపణలున్నాయి. వీటిని అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించాకే చెల్లింపులు చేయాలని కమిషనర్ ఆదేశించారు. అంతేకాదు.. పెండింగ్ బిల్లులకు సంబంధించిన పనుల్ని సైతం తనిఖీలు చేశాకే చెల్లింపులు చేయాలని సూచించారు. మరోవైపు, దీర్ఘకాలంగా ఒకే చోట పని చేస్తున్న ఇంజినీర్లను బదిలీ చేసేందుకు సైతం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

ఏమైందో 'టీమ్'

ఇంజినీరింగ్ పనుల్లో అవినీతికి తావులేకుండా ఉంటుందని గతంలో 'టీమ్' (టాస్క్ ఎలక్ట్రానిక్ అసెస్‌మెంట్ అండ్ మానిటరింగ్)' అనే యాప్‌ను రూపొందించారు. దాని ద్వారా ప్రతి పనికీ కచ్చితమైన లెక్కతో పాటు పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు, నిధులు దుబారా కాకుండా ఉండేందుకు వీలుంటుందని ప్రకటించారు. ఎంబీలో వివరాలను కాంట్రాక్టర్లే నమోదు చేయడం.. వారితో కుమ్మక్కై ఇంజినీర్లు సంతకాలు పెట్టడం వంటి చర్యల వల్ల జీహెచ్‌ఎంసీ ఖజానాకు భారీగా గండి పడుతోందని, టీమ్ యాప్‌తో అది సాధ్యం కాదని పేర్కొన్నారు.



తనిఖీల తర్వాతే..

ప్రతిరోజు జరిగిన పని పురోగతి ఫొటోలతో సహా అప్‌లోడ్ చేయడంతోపాటు బిల్లుల చెల్లింపులు సైతం యాప్ లెక్కల మేరకే జరుగుతాయని ప్రకటించారు. ఒకే పనిని రెండు పర్యాయాలు నమోదు చేయడం వంటి అక్రమాలు కూడా జరగవని పేర్కొన్నారు. కానీ దాని ద్వారా పనులు నమోదు చేసిన పాపాన పోలేదు. ఎంబీల్లోనే పనుల నమోదు, బిల్లుల చెల్లింపులు చేస్తున్నారు. ప్రస్తుతం అవినీతిని అడ్డుకట్టవేసే చర్యల్లో భాగంగా క్షేత్రస్థాయి తనిఖీలు, ఉన్నతాధికారుల పరిశీలన అనంతరమే బిల్లుల చెల్లింపుల చర్యలకు కమిషనర్ ఉపక్రమించారు. పనులు చేయకుండానే బిల్లులు పొందుతున్న కాంట్రాక్టర్లు తమ అవినీతికి అడ్డుకట్ట పడుతుందని భావిస్తూ, జీహెచ్‌ఎంసీలో పనులు నిలిపివేస్తామని పరోక్షంగా బ్లాక్‌మెయిల్‌కు దిగే చర్యలకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది.

కరెంట్ కేబుల్ @ అండర్ గ్రౌండ్

గ్రేటర్‌లో ఓవర్‌హెడ్ లైన్ల తొలగింపు

- యూజీ కేబుళ్ల ఏర్పాటుకు సన్నాహాలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా బహిరంగ విద్యుత్ తీగలను (ఓవర్‌హెడ్)ను తొలగించి.. వాటి స్థానంలో అండర్ గ్రౌండ్ (యూజీ) కేబుళ్లను వేయాలని డిస్కం నిర్ణయించింది. ఈమేరకు ఆసక్తి గల ఏజెన్సీలు/కాంట్రాక్టర్లను ఆహ్వానిస్తోంది. అంతర్జాతీయంగా వారికి ఉన్న అనుభవం, ప్రతిపాదిత ఖర్చులపై ఆయా ఏజెన్సీలు అందజేసే నివేదిక ఆధారంగా ముందుకు వెళ్లనుంది. కాగా.. నగరంలో ఇప్పటికే కొన్ని సబ్‌స్టేషన్ల మధ్య యూజీ కేబుళ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ మెజార్టీ ప్రాంతాల్లో ఇప్పటికీ ఓవర్‌హెడ్ లైన్లే దర్శనమిస్తున్నాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి వైర్లు తెగిపడటం, సంక్రాంతి పర్వదినాల్లో చిన్న పిల్లలు ఎగరేసే పతంగులు వైర్ల మధ్య చిక్కి షార్ట్‌సర్క్యూట్ ఘటనలు తలెత్తుతున్నాయి. తరచూ అంతరాయాలకు కారణమవుతున్న విషయం తెలిసిందే. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నగరంలోని ఓవర్‌హెడ్ లైన్లను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క కూడా ఇటీవల ఇదే అంశాన్ని వెల్లడించిన విషయం తెలిసిందే.

ఓవర్‌హెడ్ లైన్ రహిత నగరంగా..

గ్రేటర్‌లో ప్రస్తుతం 60 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 52 లక్షలకుపైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. పాతబస్తీ సహా ప్రధాన బస్తీల్లో ఇప్పటికీ నిజాం కాలం నాటి ఓవర్‌హెడ్ లైన్లు, ఇనుప స్తంభాలే దర్శనమిస్తున్నాయి. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ తీగలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. చిన్నపాటి ఈదురుగాలితో కూడిన వర్షానికే తెగిపడుతున్నాయి. విద్యుత్ అంతరాయాలకే కాకుండా అనేక మంది మృత్యువాతకు కారణమవుతున్నాయి. లైన్ల కింద అనేక చోట్ల భారీ భవంతులు వెలిశాయి. ఇంటిపై దుస్తులను ఆరవేసేందుకు వెళ్లిన మహిళలు, పతంగ్‌లను ఎగరేసేందుకు వెళ్లిన పిల్లలు ఓవర్‌హెడ్‌లైన్‌కు ఆనుకుని విద్యుత్ షాక్‌తో మృతి చెందుతున్న విషయం తెలిసిందే. ఓవర్‌హెడ్ లైన్ల స్థానంలో యూజీ కేబుళ్ల ఏర్పాటుతో ప్రమాదాల నివారించి, విద్యుత్ సరఫరాను మెరుగుపర్చవచ్చని డిస్కం భావిస్తోంది.



జీహెచ్‌ఎంసీ పరిధిలో విద్యుత్ నెట్‌వర్క్ ఇలా..

33/11కేవీ సబ్‌స్టేషన్లు	498
33కేవీ యూజీ కేబుల్	1,280 కి.మీ
33కేవీ ఓవర్‌హెడ్ లైన్లు	3,725 కి.మీ
11 కేవీ ఓవర్‌హెడ్ లైన్లు	21,643 కి.మీ
పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	1,022
11 కేవీ యూజీ కేబుల్	957
డీటీఆర్‌లు	1,50,992
ఇంటర్మీడియట్ స్తంభాలు	58,271

పెండింగ్ ఫైళ్లపై ప్రత్యేక డ్రైవ్

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: కలెక్టరేట్‌లో వివిధ సెక్షన్లలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను మిషన్ మోడ్‌లో పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సెక్షన్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కో సెక్షన్‌ను సమీక్షిస్తూ ఎన్ని ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి? అని అడిగి తెలుసుకున్నారు. ఫైళ్లను సమయానికి సమర్థంగా పరిష్కరించాలని సూచించారు. ప్రతి వారం సంబంధిత సెక్షన్ సిబ్బందితో సూపరింటెండెంట్లు సమీక్షించి ఫైళ్లు క్లోజ్ అయ్యే వరకు ఫాలో అప్ చేయాలన్నారు. 3 నెలలకు పైబడిన ఫైళ్లను స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, సెక్షన్ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గెజిటెడ్ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ..

శనివారం హైదరాబాద్ జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం- 2025 డైరీని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస రావు, హైదరాబాద్ జిల్లా ప్రెసిడెంట్ ఎంబీ కృష్ణ యాదవ్, సెంట్రల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, హైదరాబాద్ కార్యదర్శి ఖాదర్, బి. శ్యాం, జగన్మోహన్ రావు, పరమేశ్వర్ రెడ్డి, సుజాత, ఆశన్న, డాక్టర్ ఎస్.సురేందర్, కోటాజి, వెంకటరమణారెడ్డి, శ్రవణ్ కుమార్, శ్రీరాములు, డాక్టర్ రమేష్, డాక్టర్ సందీప్ పసుపులేటి శ్రీనివాస్, ప్రభాకర్, డాక్టర్ సునీత జోషి పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న అనుదీప్ దురిశెట్టి తదితరులు

వైద్యరంగంలో ఫిజియోథెరపిస్టుల పాత్ర కీలకం

- విశ్రాంత చీఫ్ జస్టిస్ నరసింహా రెడ్డి
- ఘనంగా డీడీసీవోపీ స్నాతకోత్సవం



జస్టిస్ నరసింహారెడ్డి, ఇతర అతిథుల చేతుల మీదుగా పట్టాలు అందుకున్న డీడీసీవోపీ విద్యార్థినీ విద్యార్థులు

నల్లకుంట: దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ(డీడీసీవోపీ) స్నాతకోత్సవం ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు పట్టాలు పుచ్చుకొని ఫ్యాకల్టీ, తల్లిదండ్రులతో ఫొటోలు దిగి ఆనందంలో మునిగితేలారు. నల్లకుంట డీడీఎంఎస్ ఆవరణలోని డీడీహెచ్‌ఆర్సీ ఆడిటోరియంలో శనివారం గ్రాడ్యుయేషన్(స్నాతకోత్సవం) డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన పాట్నా హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి, డీడీఎంఎస్ అధ్యక్షురాలు ఉషా కందా, చైర్మన్ ఉమ్మడి ఏపీ ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావులతో కలిసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో ఫిజియోథెరపిస్టుల పాత్ర కీలకమన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదిగి కన్నవారి కలలను నిజం చేయాలని సూచించారు. ఉషా కందా మాట్లాడుతూ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆశయ సాధనలో భాగంగా పేదలకు నాణ్యమైన సేవలు అందించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపి(బీపీటీ), మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపి(ఎంపీటీ) పూర్తి చేసిన సుమారు 56 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఇతర అతిథులతో కలిసి జస్టిస్ నరసింహారెడ్డి మెడల్స్, ప్రశంసా పత్రాలు, పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో డీడీఎంఎస్ ఉపాధ్యక్షురాలు కె.లక్ష్మీ సుందరి, డీడీఈవోపీ అకాడమిక్స్ డైరెక్టర్ వైఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చాయానందిని, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫైన్ అంటే హత్య..

- జంట హత్యల కేసులో నిందితుల కోడ్ లాంగ్వేజ్
- హతుడికి వార్నింగ్ ఇచ్చేందుకు ఫ్రెండ్స్ సహాయం కోరిన ప్రధాన నిందితుడు
- సిమ్ కార్డులను ఘటనాస్థలంలోనే పారేసిన నిందితులు
- ప్రైవేట్ వీడియో డిలీట్ చేశాడనే హతుడిపై కక్ష
- ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించిన నార్సింగి పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో/మణికొండ: పుప్పాలగూడలో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులోని ముగ్గురు నిందితులను నార్సింగి పోలీసులు శనివారం ఉదయం రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచారు. అనంతరం 14రోజుల రిమాండ్‌కు తరలించారు. హతుడు అంకిత్ సాకేత్, నిందితులు రాహుల్ కుమార్, రాజ్‌కుమార్, సుఖేంద్ర కుమార్‌లు మధ్యప్రదేశ్‌కు చెందినవారు కాగా, మరో హతురాలు బిందు బింజారె ఛత్తీస్‌గఢ్‌వాసి. వారు బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలసవచ్చి వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. అయితే ఈ హత్య కేసు విచారణలో ఓ కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. సెక్స్ వర్కర్‌గా మారిన బిందు బింజారె(25)తో గడిపిన 'ప్రైవేట్'వీడియోను డిలీట్ చేశాడనే కారణంతో అంకిత్ సాకేత్(27)పై రాహుల్ కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా అంకిత్‌కు 'ఫైన్'(హత్య) వేయాలని నిర్ణయించుకున్నాడు. అంకిత్‌కు వార్నింగ్ ఇవ్వాలని, ఇందుకోసం సహాయం కావాలని తన స్నేహితులైన రాజ్ కుమార్, సుఖేంద్ర కుమార్‌ల సహాయం కోరగా వారు అంగీకరించారు. అయితే అప్పటికే 'ప్రైవేట్'వీడియోపై వాగ్వాదం జరగడంతో అంకిత్‌ను ఒంటరిగా పిలిస్తే రాడని గ్రహించిన రాహుల్ పక్కా పథకం వేశాడు. బిందుతో గడపాలని ఉందని సుఖేంద్ర కుమార్‌తో అంకిత్‌కు ఫోన్ చేయించాడు. రూ.4 వేలకు డీల్ కుదుర్చుకుని ఈ నెల 11న బిందును తీసుకొని అంకిత్ పద్మనాభ స్వామి దేవాలయం గుట్టలకు వచ్చాడు. రాహుల్, రాజ్, సుఖేంద్రలు ఆటోలో సంఘటనాస్థలానికి వచ్చారు. సుఖేంద్ర, బిందు ఏకాంతంలో ఉండగా కొంతదూరంలో రాహుల్, రాజ్, అంకిత్ మద్యం సేవిస్తున్నారు. ఈ సమయంలో మరోసారి వీడియో డిలీట్ అంశంపై అంకిత్‌తో రాహుల్ వాగ్వాదానికి దిగాడు. కత్తితో ఒక్కసారిగా దాడి చేశాడు. అంకిత్ తీవ్రంగా ప్రతిఘటించడంతో రాహుల్, రాజ్‌ల శరీరాలపై కూడా గాయాలయ్యాయి. పలుమార్లు కత్తితో దాడి చేయగా అంకిత్ మృతి చెందాడు. ఇతరులెవరూ మృతదేహాన్ని గుర్తుపట్టకుండా ముఖంపై బండరాళ్లతో మోదారు. అంకిత్ అరుపులు విని బిక్కుబిక్కుమంటున్న బిందు వద్దకు వచ్చిన రాహుల్, రాజ్ ఆమెపై కూడా దాడి చేసి హత్య చేశారు.

సిమ్‌కార్డ్ తీసేస్తే లొకేషన్ రాదని..

అంకిత్, బిందులను హత్య చేసిన తర్వాత వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను నిందితులు తీసుకున్నారు. ఫోన్లలోంచి సిమ్‌కార్డులను తీసేస్తే పోలీసులు లొకేషన్ గుర్తించలేరని భావించిన నిందితులు వాటిని తొలగించి ఘటనాస్థలంలోనే పారేసి వెళ్లిపోయారు. 12న తెల్లవారుజామున సెల్‌ఫోన్లను తీసుకొని మధ్యప్రదేశ్‌కు పారిపోయారు. అయితే ఐఎంఈఐ నంబర్లు, ఇతరత్రా సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు హంతకుల లొకేషన్‌ను గుర్తించారు. వెంటనే నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు మధ్యప్రదేశ్‌కు వెళ్లి ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. ట్రాన్సిట్ వారెంట్‌పై శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు.

డీసీఎం వాహనం ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి



యశ్వంత్ సాయి శంకర్(ఫైల్)

గచ్చిబౌలి: వేగంగా వచ్చిన ఓ డీసీఎం వాహనం బైక్‌ను ఢీ కొట్టిన ఘటనలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి చెందాడు. గచ్చిబౌలి పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు పట్టణానికి చెందిన పైడి యశ్వంత్ సాయిశంకర్(24) ఉన్నత చదువుల అనంతరం హైదరాబాద్‌కు వచ్చి హఫీజ్‌పేట్‌లో నివాసం ఉంటున్నాడు. నానక్‌రాంగూడలోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి అర్ధరాత్రి విధులు ముగించుకొని స్కూటీపై ఇంటికి వెళుతుండగా గచ్చిబౌలిలోని ప్లాటినా సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఉస్మానియా ఆస్పత్రిలో శనివారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. యశ్వంత్ తల్లి లక్ష్మీ కొంతకాలంగా అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. సాయిశంకర్ తల్లి గర్భంలో ఉన్నప్పుడే తండ్రి సతీష్‌కుమార్ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నకిలీ నోట్ల దందా.. విదేశీయుడి అరెస్ట్



నిందితుడు జాక్సాస్

హయత్‌నగర్: అసలు నోట్లకు రెండింతల నకిలీ కరెన్సీని ఇస్తానని అమాయకులకు ఆశ చూపి మోసగిస్తున్న ఓ విదేశీయుడిని హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... కామెరూన్ దేశానికి చెందిన జాక్సాస్ దేవలైజ్ కిట్ 2017 జూలైలో టూరిస్ట్ వీసా మీద ఇండియాకు వచ్చాడు. తిరిగి వెళ్లిపోకుండా తన ఫ్రెండ్ లాండ్రీ పాస్‌పోర్టుతో కర్ణాటకలోని బెంగుళూరు కళ్యాణ్‌నగర్ శాంతినగర్‌లో ఉంటున్నాడు. అనంతరం నకిలీ కరెన్సీ చెలామణి దందాలోకి దిగాడు. అసలు నోట్లు ఇస్తే రెండింతల నకిలీ నోట్లు ఇస్తానని అమాయకులకు ఆశచూపేవాడు. వారు అసలు కరెన్సీ ఇవ్వగానే ఉడాయించేవాడు. 2020లో ఇదే తరహా కేసులో బెంగుళూరు పోలీసులు జాక్సాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జైలు నుంచి బయటికి వచ్చిన అనంతరం కూడా అతను తన బుద్ధిని మార్చుకోలేదు. ఈ క్రమంలో ఐదు లక్షల రూపాయల అసలు కరెన్సీ ఇస్తే పది లక్షల విలువ చేసే నకిలీ కరెన్సీని ఇస్తానని రసూల్ అనే వ్యక్తికి ఆశ చూపాడు. జాక్సాస్ అతని స్నేహితుడు లాండ్రీలు హయత్‌నగర్‌లోని చైత్ర ఓయో లాడ్జిలో ఉన్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. శుక్రవారం సాయంత్రం అక్కడికి వెళ్లి జాక్సాస్‌ను పట్టుకోగా, లాండ్రీ పరారయ్యాడు. పోలీసులు ఓ పాస్‌పోర్టు, సెల్‌ఫోన్, నాలుగు 500 రూపాయల కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

రెండు నిండు ప్రాణాలను మింగేసిన హోర్డింగ్

హబ్సిగూడ సైంటిస్ట్ కాలనీలో ఘటన



జాతోత్ బాలు (ఫైల్)



గుగులోత్ మల్లేష్ (ఫైల్)

మల్లాపూర్: హబ్సిగూడ సైంటిస్ట్ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతానికి గురై ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్ కుమార్ కథనం ప్రకారం... కేసముద్రం ఇనుగుర్తి గ్రామానికి చెందిన జాతోత్ బాలు(36) సైంటిస్ట్ కాలనీలోని మోతీ ఆర్కేడ్ అపార్ట్‌మెంట్స్‌లో వాచ్‌మేన్. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం దేవునిగుట్ట తండాకు చెందిన గుగులోత్ మల్లేష్(25) కూడా రామంతాపూర్‌లోని ఓ కళాశాలలో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. సైంటిస్ట్ కాలనీలోని ఓ బిల్డింగ్ మూడో అంతస్తులో ఉండే తాటి రవి సూచనల మేరకు రెండో అంతస్తుపై నున్న చిట్‌ఫండ్ కంపెనీ ఆఫీస్ బోర్డు తొలగించే పనికి బాలు, మల్లేశ్ వచ్చారు. శుక్రవారంరాత్రి హోర్డింగ్‌ను కిందికి దించుతుండగా అది అదుపు తప్పి అక్కడే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు తగిలింది. షార్ట్‌సర్క్యూట్ కావడంతో బాలు, మల్లేశ్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతదేహాలను పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇద్దరు యువతుల అరెస్ట్

– 17 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్

సికింద్రాబాద్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువతులను రైల్వేపోలీసులు అరెస్ట్ చేశారు. 17 కిలోలకుపైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం జీఆర్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఇష్రత్ బానో(20), ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కంచన్(21) స్నేహితురాళ్లు. ఇరువురూ ఇంటర్మీడియట్ వరకు బిలాస్‌పూర్‌లో కలిసి చదువుకున్నారు. వీరు మద్యానికి బానిసలయ్యారు. రెండేళ్ల క్రితం ఇష్రత్ బానోకు మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన రాజా అనే వ్యక్తితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఇష్రత్ తన కష్టాలు, అలవాట్ల గురించి అతనితో చెప్పుకుంది. దీంతో గంజాయి తరలిస్తే ప్యాకెట్‌కు రూ. వెయ్యి చొప్పున ఇస్తానని ఇష్రత్‌కు ఆశ చూపాడు. ఈ మేరకు ఆమె మూడుసార్లు గంజాయి తరలించింది. ఈ క్రమంలో మహారాష్ట్రలోని సోలాపూర్‌కు గంజాయి తరలించేందుకు కంచన్‌తో కలిసి ఈ నెల 16న రాయిపూర్ నుంచి విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ ఓ వ్యక్తి వద్ద నుంచి 8 ప్యాకెట్ల గంజాయిని తీసుకుని కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో రాత్రి 10 గంటల సమయంలో రైలెక్కారు. శనివారం మధ్యాహ్నం 1.15 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకుంది. అదే సమయంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన ఇష్రత్, కంచన్‌ల వద్ద ఉన్న ఓ బ్యాగును తనిఖీ చేయగా అందులో రూ. 4.44 లక్షల విలువగల 17.76 కిలోల గంజాయి లభించింది. పోలీసులు వెంటనే వారిని అరెస్ట్ చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో జీఆర్పీ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శంకర్ సరస్వత్, ఎస్ఐ వెంకట్‌రెడ్డి, ఏఎస్ఐ మక్బూల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


మూడు కిలోల గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఎక్సైజ్ పోలీసులు 3.625 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన దేవేందుల రాజు, మధ్యప్రదేశ్ చెందిన సంజనా మాంజా అనే ఇద్దరు వ్యక్తులు ఓయో రూముల్లో మకాం వేస్తూ కొంతకాలంగా గంజాయి వ్యాపారం చేస్తున్నారు. కొండాపూర్‌లోని ఓ ఓయో రూమ్‌లో ఉన్న వీరు గంజాయి విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న ఎస్టీఎఫ్ పోలీసులు దాడులు చేసి 1.2 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ధూల్‌పేట్ జాలి హనుమాన్ టెంపుల్ సమీపంలో రాఖీబాయి అనే మహిళ గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నారు. 1.225 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్టు చేశారు. ఈ కేసులో రమేష్ సింగ్ అనే మరో వ్యక్తిపైన కూడా కేసు నమోదు చేశారు. మరో కేసులో ఆసిఫ్‌నగర్ గోల్కొండ ప్రాంతంలో గంజాయి అమ్ముతుండగా సయ్యద్ గౌస్, మహ్మద్ షాబుద్దీన్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

బస్సు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి

ఉప్పల్: ఉప్పల్ నల్లచెరువు కట్ట వద్ద రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని యువకుడి(25)ని ఉప్పల్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఢీకొనడంతో మృతి చెందాడు. ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యువకుడు ఉప్పల్ నల్లచెరువు కట్ట వద్ద శనివారం రోడ్డు దాటుతుండగా వెనక నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనాస్థలానికి పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. యువకుడి చేతిపై మధు అనే పుట్టుమచ్చ ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి వివరాల కోసం ప్రయత్నిస్తున్నారు.

పని కోసం వెళ్లి తిరిగి వస్తుండగా...



శాంతి (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు దాటుతూ మహిళ మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సత్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బాబుల్‌రెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన శ్రీను, శాంతి(35) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. శుక్రవారం ఉదయం రోజు మాదిరిగానే కాటేదాన్‌కు కూలీ పని కోసం వెళ్లింది. పని లేకపోవడంతో ఇంటికి తిరిగి నడుచుకుంటూ వస్తోంది. బాబుల్‌రెడ్డి నగర్ ప్రధాన రహదారిపై రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

వాహనదారులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఏఎస్ఐ బాగేందర్

బంజారాహిల్స్: హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారనే కారణంగా ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగానే బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని అగ్రసేన్ చౌరస్తాలో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఏఎస్ఐ బాగేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో హెల్మెట్ పెట్టుకోకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిని పట్టుకుని జరిమానాలు . విధించడమే కాకుండా మరోసారి హెల్మెట్ లేకుండా తిరగవద్దని కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

లబ్ధిదారుల వివరాలు పరిశీలన



వివరాల పరిశీలనలో కార్పొరేటర్ వనం సంగీత, అధికారులు

శ్రీనగర్‌కాలనీ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల లబ్ధిదారుల వివరాల పరిశీలనా కార్యక్రమం శనివారం సోమాజీగూడ, ఎల్లారెడ్డిగూడలో జీహెచ్ఎంసీ అధికారులు నిర్వహించారు. ఈ కార్పొరేటర్ వనం సంగీత, వనం శ్రీనివాసయాదవ్ పరిశీలనలో పాల్గొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



సర్వేలో సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయించడం జరుగుతుందని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడ్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. డివిజన్‌లోని పలు బస్తీల్లో శనివారం నిర్వహించిన సర్వేలో అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే కోసం నివాసాలకు వచ్చే సిబ్బంది తమ వివరాలు అందించాలని స్థానికులను కోరారు. స్థానికులందరి నివాసాలకు వద్దకు సిబ్బంది వస్తారని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సర్కిల్-19 సిబ్బందితోపాటు నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న మహిళా నాయకురాళ్లు

రహమత్‌నగర్: పార్టీకి సేవలందించిన వారికి బీజేపీలో తప్పకగుర్తింపు లభిస్తుందని బోరబండ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ ముదిరాజ్ గుర్తుచేశారు. బోరబండలో శనివారం బీజేపీ మహిళా నాయకురాలు షర్మిల జాదవ్, విజయలక్ష్మి, దుర్గ, భవానీ, నాయకులు హర్షద్, ఏడుకొండలు, సలామ్‌లు వెంకటేశ్‌ను శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తన సేవలను గుర్తించి రెండవసారి డివిజన్ అధ్యక్షుడిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు.

భార్యపై హత్యాయత్నం.. వ్యక్తి రిమాండ్

రహమత్‌నగర్: భార్యనే డీజిల్ పోసి చంపబోయిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... బోరబండ సైట్-1లో అబ్దుల్ అజీజ్ పెట్రోల్, డీజిల్ అమ్ముకుంటు జీవించేవాడు. ఈ క్రమంలోనే ఈ నెల 16వ తేదీన అతడి భార్య సమీరా సుల్తానా (32)తో భోజనం వండే విషయంలో గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన అజీజ్ భార్యపై డీజిల్ పోసి అంటించే ప్రయత్నం చేయగా అక్కడి నుంచి తప్పించుకున్న సమీరా సుల్తానా బోరబండ పోలీసులను ఆశ్రయించింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం అజీజ్‌ను రిమాండ్‌కు తరలించారు.

మౌలిక సదుపాయాలకే మొదటి ప్రాధాన్యం

రూ.30 కోట్ల వ్యయంతో బాక్స్ డ్రైన్ నిర్మాణం

- తెలంగాణ భవన్ నుంచి బంజారా లేక్ వరకు నిర్మాణం
- పనులను పరిశీలించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్
- సమస్యలపై అక్కడికక్కడే అధికారులను ఆదేశించిన మేయర్



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10 సింగాడికుంటలో పర్యటిస్తున్న మేయర్

బంజారాహిల్స్: నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు విశేష కృషి చేస్తున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. శనివారం మేయర్ వెంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్లు కవితారెడ్డి, మహ్మద్ రషీద్‌లతో కలిసి మేయర్ పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ సింగాడికుంట ప్రాంతంలో బీఆర్ఎస్ భవన్ నుంచి బంజారా లేక్ వరకు ఉన్న 2.5 కిలోమీటర్ల నాలాపై సుమారు రూ.30 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బాక్స్ డ్రైన్ పనులు పరిశీలించారు. డ్రైన్ నాలా పనులతో పాటు మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మేయర్ వాటర్ వర్క్స్ విభాగం అధికారులను ఆదేశించారు. అలాగే డ్రైన్ పూర్తయిన తర్వాత మంచినీటి పైప్‌లైన్ కోసం తిరిగి తవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పనులు చేపట్టి సందర్భంలో ప్రజలు సహకరించాలని ఆమె ప్రజలను కోరారు. ప్రతాప్‌నగర్‌కాలనీలో ఖాళీ స్థలంలో చెత్తతోపాటు ఇతర వస్తువులు పడవేసి ఉండడంతో వెంటనే చెత్త తొలగించి ఫొటో పెట్టాలని ఏఎంహెచ్‌ఓను ఆదేశించారు. తిరిగి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, ఖాళీ స్థలంలో వేసిన వారిపై జరిమానా విధించాలని మేయర్ ఆదేశించారు. అక్కడ నుంచి షేక్‌పేట డివిజన్‌లో కార్పొరేటర్ మహ్మద్ రషీద్‌తో కలిసి పలు కాలనీల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. పారామౌంట్ కాలనీలో బల్కాపూర్ నాలా కంటే ఎత్తు తక్కువగా ఉన్న ప్రాంతంలో వర్షపునీరు నిలిచిపోతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. బల్కాపూర్ నాలా ఎత్తు కంటే తక్కువగా ఉన్న నేపథ్యంలో వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్ నిర్మించి నిలిచిన నీటిని నాలాలోకి పంపించేందుకు అవసరమైన అంచనా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సీసీ రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మేయర్‌కు వివరించగా, వెంటనే రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడ నుంచి ఆదిత్యనగర రోడ్డు, రాహుల్‌కాలనీల్లో పర్యటించారు. వరదనీటి డ్రైన్ నుంచి మురుగునీరు రావడం మూలంగా లోతట్టు ప్రాంతాల్లో మురుగు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు మేయర్‌కు విన్నవించగా ఈ సమస్యకు గల కారణాలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. చెత్తకుండీ నిండుతుండగా ఆటోమేటిక్‌గా కుండీ నుంచి శబ్దం రావడంతో ఆ సమాచారం కంట్రోల్ రూమ్‌కు చేరవేసే మిషన్ పని తీరును ఆమె పరిశీలించారు.

కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- ఎమ్మెల్యే దానం నాగేందర్



సింగాడికుంట ప్రాంతంలో చేపట్టిన బాక్స్‌డ్రైన్ నిర్మాణ సమయంలో కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఎవరి ఇళ్లను కూడా ముట్టుకోరని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే నాగేందర్ కాలనీవాసులను చెప్పారు. అదే వార్డులో గల ప్రతాప్‌నగర్‌లో ప్రతిపాదించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. మేయర్, తాను, అధికారులు కలిసి మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అదే కాలనీలో అంతర్గత రోడ్లు, మంచినీటి పైప్‌లైన్ వేసే సందర్భంలో తవ్వి మరమ్మతులు చేయకుండా వదిలిపెట్టడం జరిగిందని, అందుకు సీసీ రోడ్లు వేయాలని కాలనీవాసులు విన్నవించారు. కార్పొరేటర్ కవితారెడ్డి మాట్లాడుతూ నిధులు మంజూరైన నేపథ్యంలో ఎమ్మెల్యేచే వచ్చే సోమవారం శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, ఎస్ఎన్‌డీపీ సీఈ కోటేశ్వరరావు, జోనల్ ఎస్ఈ రత్నాకర్, డీసీ రజనీకాంత్‌రెడ్డి, ఈఈ విజయ్‌కుమార్, జోనల్ యూబీడీ, యూసీడీ తదితరులు పాల్గొన్నారు.

కురుమ పేరు మార్చాలని బీసీ కమిషన్‌కు వినతి



నిరంజన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సంఘం ప్రతినిధులు

బంజారాహిల్స్: తెలంగాణ సమాజంలో కురుమలు అత్యంత జనాభా కలిగి 60 సంవత్సరాలుగా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎలాంటి గుర్తింపు లేకుండా ఉన్నారని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు కె. శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నాడి రమేష్‌లు అన్నారు.

శనివారం ఖైరతాబాద్‌లో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యుడు రాపోలు జయప్రకాష్‌లను కలిసి కురుమ పేరును మార్చి కురుబ లేదా కురువగా గుర్తించాలని వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర కురుమ ప్రజల శ్రేయస్సు కోసం ఈ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒక్కొక్క జిల్లాలో ఒక్కో రకంగా కురుమ సామాజిక వర్గాన్ని పిలవడం వల్ల చాలా నష్టపోతున్నామన్నారు. కురుమ సామాజిక వర్గానికి సరైన విద్యా విధానం లేదని, తమది ఫలానా కులం అని చెప్పినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కురుమలను కురుమలు కాకుండా కురుబ, కురువలుగా మార్పు చేసి గుర్తించాలని పేర్కొన్నారు. దీనికి స్పందించిన బీసీ కమిషన్ చైర్మన్ తగిన న్యాయం చేస్తామని హామీనిచ్చారని వారు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కురుమ సంఘం నాయకులు దయ్యాల శ్రీనివాస్, నరసింహ, ముత్త సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నేనొస్తున్నానని ఊడుస్తున్నారా...?



- శానిటేషన్ సిబ్బందిపై మేయర్ ఆగ్రహం

చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

వెంకటేశ్వరకాలనీ: స్థానికులు ఎన్నిమార్లు మొత్తుకున్నా చెత్తా చెదారాన్ని తొలగించని శానిటేషన్ సిబ్బంది నేను వస్తున్నానని ఇవాళ ఇదంతా శుభ్రం చేస్తున్నారా అంటూ శానిటేషన్ సిబ్బందిపై నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని పంజగుట్ట ప్రతాప్‌నగర్ బస్తీలో ఎమ్మెల్యే దానంతో, కార్పొరేటర్ కవితారెడ్డితో కలిసి ఆమె ఇక్కడ నిర్మించనున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ టిప్పర్ లారీ సహాయంతో వ్యర్థాలను తరలిస్తున్న సిబ్బందిని ఆమె ప్రశ్నించారు. నిన్నా మొన్నా ఎందుకు ఈ వ్యర్థాలను తొలగించలేదని, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వస్తున్నారని తెలియగానే వీటిని తరలిస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి పాటుపడాలి



ప్రజా చైతన్య యాత్రను ప్రారంభిస్తున్న దుండ్ర కుమారస్వామి

లిబర్టీ: కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌ల సంక్షేమానికి పాటుపడాలని బీసీ దల్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. రాజ్యాంగబద్ధమైన హక్కులు, సామాజిక న్యాయం అందించాలని కోరుతూ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను దుండ్ర కుమారస్వామి గన్‌పార్క్ వద్ద శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ గ్రూప్‌లో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ లోతుగా అధ్యయనం చేసి బీసీ-ఏ జాబితాలో చేర్చి ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని విన్నవించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా నిష్పత్తి ప్రకారం సీట్లు కేటాయించి రాజకీయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంప్రదాయ కుల వృత్తి నమ్ముకొని ముదిరాజ్‌లు అనేకేళ్లుగా బతుకుబండి లాగుతున్నారని అన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, సంస్కృతిక రంగాల్లో వెనుకబడిన ఆ వర్గాలకు ప్రభుత్వం చేయూతనివ్వాలని కోరారు.

ఉత్సాహంగా ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్

సాక్షి, సిటీబ్యూరో: 20వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. చంద్రశేఖర్ రెడ్డి, నంద్యాల నరసింహారెడ్డి సత్తా చాటుతున్నారు.

పురుషుల 50 ప్లస్ సింగిల్స్‌లో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ప్రీ క్వార్టర్స్‌లో మహ్మద్ అసిఫ్‌పై అలవోక విజయం సాధించి సెమీ ఫైనల్స్‌లో అడుగు పెట్టారు. నరసింహారెడ్డి 8-7 తో సాయి గణేశ్‌పై ఉత్కంఠ మ్యాచ్‌లో పైచేయి సాధించారు. సాంబశివా రెడ్డి 8-3తో శివ ప్రసాద్ రెడ్డిపై గెలుపొంది క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపారు. లగడపాటి శ్రీధర్ 8-1తో రాజా రామ్ మోహన్‌పై నెగ్గారు. పురుషుల 60 ప్లస్ సింగిల్స్‌లో రామ్ రెడ్డి 8-0తో జవహర్‌పై విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకున్నాడు. సికింద్రాబాద్ క్లబ్ వేదికగా దేశవ్యాప్తంగా 220 మంది వెటరన్ క్రీడాకారులు పోటీపడుతున్న ఈ టోర్నమెంట్‌లో ఆదివారం అన్ని విభాగాల్లో ఫైనల్స్ జరుగనున్నాయి.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...) టమాటా. 11, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 45, పందిరి బీర 38, క్యాబేజీ 13, క్యారెట్ 32, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 18, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 28, చామగడ్డ 41, మొరంగడ్డ 28, కందగడ్డ 63, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 10-12, ముల్లంగి 4-5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

'పర్దేకీ పీచే' పుస్తకావిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ రాజస్థానీ జానపద గాయని, నటి, ఖల్‌నాయక్ సినిమాలోని ఛోళీకే పీచే పాట ద్వారా దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఇలా అరుణ్ సహరచయిత అంజులా బేడీతో కలిసి రచించిన ఆటోబయోగ్రఫీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించారు. 'పర్దేకీ పీచే' పేరుతో రూపొందిన ఈ పుస్తకాన్ని బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో శనివారం మాజీ మంత్రి జె.గీతారెడ్డి ఆవిష్కరించారు. కరోనా సందర్భంగా లాక్ డౌన్ విధించిన సమయంలో ఈ పుస్తకాన్ని తాను రచించినట్టు ఇలా అరుణ్ ఈ సందర్భంగా తెలిపారు.

టి.అంజయ్యనగర్‌లో పోస్టల్ బీమా శిబిరం



శిబిరంలో పోస్టల్ సిబ్బంది

రహమత్‌నగర్ : ఎస్పీఆర్‌హిల్స్‌లోని టి.అంజయ్యనగర్‌లో వడ్డెర ఐక్య వేదిక నాయకుడు ఓర్సు మల్లయ్య ఆధ్వర్యంలో కార్మికుల పోస్టల్ ఇన్సూరెన్స్ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ ఇన్సూరెన్స్ చేయించుకున్న కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబీకులకు రూ. 15 లక్షలు, గాయపడ్డ వారికి రూ. 2 లక్షలు చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రతి కార్మికుడు పోస్టల్ బీమాను చేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోస్టుమెన్ శేఖర్‌రెడ్డి, బస్తీవాసులు రమేశ్, రజిత, రోజా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వీల్ క్లాంప్ వేయాలని చూస్తే... బయటపడ్డ నకిలీ నెంబర్ ప్లేట్ బాగోతం

బంజారాహిల్స్: అక్రమ పార్కింగ్ విషయంలో ఓ కారుకు వీల్ క్లాంప్ చేయాలని చూడగా సదరు కారుకు నకిలీ నంబర్ ప్లేట్ బిగించి వాడుతున్నట్లు తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే...

బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ వి. ప్రభాకర్‌రెడ్డి సిబ్బంది ఆంజనేయులుతో కలిసి ఈ నెల 17న బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7లో అక్రమ పార్కింగ్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ క్రమంలో అక్రమ పార్కింగ్‌ను క్లియర్ చేసే సమయంలో ఏపీ02 బీఆర్ 0378 నెంబర్ ప్లేట్ కలిగిన తెలుపు రంగు క్రెటా కారును గుర్తించారు. దీనికి వీల్ క్లాంప్ వేయాల్సిందిగా ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి ఆంజనేయులుకు సూచించారు. వీల్ క్లాంప్ వేసిన ఆ కారుకు ఉన్న నెంబర్ ప్లేట్ ఆధారంగా యజమాని వివరాలు తెలుసుకునే ప్రయత్నంలో సదరు నెంబర్‌పై ఉన్న కారు తెలుపు రంగు కాకుండా సిల్వర్ కలర్‌గా గుర్తించారు. ఆ వాహన ఇంజిన్ నెంబర్ డీ4ఎఫ్‌బీకేఎం726512ను బట్టి కారు ఒరిజినల్ నెంబర్ టీఎస్09ఎఫ్ఈ7766గా, యజమాని శ్వేతరెడ్డి దేవిరెడ్డిగా గుర్తించారు. అలాగే నకిలీ నెంబర్ ప్లేట్ ఏపీ02 బీఆర్ 0378 నెంబర్ కలిగిన వాహన యజమాని అనంతపురానికి చెందిన మురళి మోహన్‌నాయుడుగా తేల్చారు. తెలంగాణ రిజిస్ట్రేషన్‌తో ఉన్న కారుకు ఏపీ రిజిస్ట్రేషన్ కలిగిన నెంబర్ ప్లేట్‌ను క్రెటా కారు కలిగి ఉన్నట్లు గుర్తించారు. కారుకు వీల్ క్లాంప్ వేయడంతో కారును వాడుతున్న నానక్‌రామ్‌గూడకు చెందిన సలీం సయ్యద్ మూసా పోలీస్‌స్టేషన్‌కు రాగా తాను తన స్నేహితుడు హర్ష నుంచి కారును తీసుకుని మూడు నెలలుగా ఉపయోగిస్తున్నట్లు తెలియజేశాడు. నకిలీ నెంబర్ ప్లేట్‌తో కారు ఉపయోగిస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చరయలు తీసుకోవాలని ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలో సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, ట్రీ కట్టింగ్‌లో భాగంగా ఆదివారం నిజాం కాలేజ్, హైదర్‌గూడ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిజాం కాలేజ్ సబ్‌స్టేషన్ పరిధిలో నిజాం కాలేజ్, లా కాలేజ్, యునైటెడ్ ఇన్సూరెన్స్ బిల్డింగ్, దోషి చాంబర్స్, కింగ్‌కోఠి షేర్‌గేట్ ఏరియా, హైలైన్ చౌరస్తా, భారతి విద్యా భవన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే హైదర్‌గూడ సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు హైదర్‌గూడ మెయిన్‌రోడ్, బహార్ కేఫ్, కింగ్‌కోఠి షేర్‌గేట్ ఏరియా, భారతి విద్యాభవన్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పబ్‌లో ఘర్షణ

వ్యక్తికి గాయాలు.. కేసు నమోదు

బంజారాహిల్స్: పబ్‌లో డ్యాన్స్ చేసే సమయంలో పక్కనే వ్యక్తికి తగలడంతో కోపోద్రిక్తుడై అతనిపై దాడి చేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కుత్బుల్లాపూర్ వాణీనగర్ సిల్వర్ స్ప్రింగ్ అపార్ట్‌మెంట్‌కు చెందిన బాలకృష్ణ (31) టీడీసీకే ఉద్యోగి. తన తోటి సహోద్యోగులతో కలిసి ఈనెల 11న రాత్రి జూబ్లీహిల్స్‌లోని క్లబ్ రోగ్ పబ్‌కు వెళ్లారు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో సంగీతంలో మునిగిపోయి డ్యాన్స్ చేస్తుండగా పక్కనే ఉన్న వ్యక్తికి తగిలాడు. దీంతో ఆ వ్యక్తి బాలకృష్ణతో గొడవకు దిగాడు. క్షమాపణ చెప్పినప్పటికీ బాలకృష్ణపై నలుగురైదుగురు కలిసి చితకబాదారు. ఈ క్రమంలో పబ్ సిబ్బంది వారిని వారించి గొడవను సద్దుమణిగేలా చేశారు. అనంతరం బాలకృష్ణ పబ్ నుంచి బయటకు రాగా మళ్లీ మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. దీంతో బాధితుడు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం పేరుతో మోసం

వెంగళరావునగర్: ఉద్యోగం పేరుతో మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కాచిగూడకు చెందిన కె.వేణుగోపాల్‌రెడ్డి వ్యాపారం చేస్తుంటాడు. అతడి సోదరుడైన నరేందర్‌రెడ్డి ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు. ఈ క్రమంలో రియల్ ఎస్టేట్‌లో పనిచేసే నరేందర్‌రెడ్డి స్నేహితుడు ప్రవీణ్ వరంగల్‌కు చెందిన వేల్పుల నగేష్‌ను పరిచయం చేశాడు. నగేష్ తనకు రూ.2లక్షలు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తానని నరేందర్‌రెడ్డికి తెలిపాడు. దీంతో నరేందర్‌రెడ్డి మూడు విడతలుగా రూ.2 లక్షలు ఇచ్చాడు. నగదు తీసుకున్న నగేష్ బ్లూఫోనిక్స్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీస్ అనే సంస్థలో జిల్లా కోఆర్డినేటర్‌గా నరేందర్‌రెడ్డికి ఉద్యోగం ఇప్పించాడు. అయితే గత ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు ఉద్యోగం చేసినప్పటికీ ఒక్క రూపాయి కూడా జీతం ఇవ్వలేదు. ఇదేమని ప్రశ్నించగా ఇటీవల నగేష్ తన సంస్థను మూసివేసి పారిపోయాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన నరేందర్‌రెడ్డి అతడి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహంగా మెలిగితే.. పెళ్లి చేసుకోవాలని వేధింపులు

యువకుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్: స్నేహంగా మెలిగినందుకు యువతిని ఓ యువకుడు పెళ్లి చేసుకోవాలంటూ వేధించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం... జగిత్యాల ప్రాంతానికి చెందిన యువతి స్థానిక మధురానగర్ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తుంది. ఈ క్రమంలో బోరబండలో ఉండే రఘువంశీతో పరిచయం ఏర్పడింది. ఒకే జిల్లాకు చెందిన వారు కావడంతో చనువుగా ఉండటంతోపాటు పలు దేవాలయాలకు కలిసి వెళ్లారు. ఆ సమయంలో కొన్ని ఫొటోలను సైతం కలిసి దిగారు. అయితే కొన్ని రోజుల తరువాత రఘువంశీ సదరు యువతిని పెళ్లిచేసుకోవాలని కోరాడు. అందుకు యువతి నేను స్నేహితురాలిని మాత్రమేనని పెళ్లిచేసుకోవడం కుదరదని తేల్చిచెప్పింది. దీంతో ఇరువురూ కలిసి దిగిన ఫొటోలను బంధువులకు పంపడంతోపాటు యువతి గురించి చెడు ప్రచారం చేస్తానని బెదిరించసాగాడు. వేధింపులు తట్టుకోలేక యువతి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్‌కార్డుల సర్వేలో దళారుల జోక్యాన్ని నివారించండి

సనత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రేషన్ కార్డుల సర్వేతో పాటు వివిధ పథకాల సర్వేల్లో అక్కడక్కడా దళారుల జోక్యం చేసుకుంటున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని, దీనిని అరికట్టాల్సిందిగా బీజేపీ రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవరెడ్డి జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యకు విజ్ఞప్తి చేశారు. శనివారం బేగంపేట సర్కిల్ కార్యాలయంలో డీసీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం జరుగుతున్న రేషన్‌కార్డుల సర్వేను నిష్పక్షపాతంగా జరిపించాల్సిందిగా కోరారు. సర్వేలో నిజమైన లబ్ధిదారులకు ఎక్కడా అన్యాయం జరగకుండా చూడాలని, అందుకు అవసరమైతే ఆయా ప్రాంతాల్లో అఖిలపక్ష నాయకుల సహకారం తీసుకోవాలని సూచించారు. బీజేపీ సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, కృష్ణ, అంబాలా ఈశ్వర్‌బాబు తదితరులు ఉన్నారు.

నేలకూలిన వెదర్ బెలూన్

● బీదర్ జిల్లాలో కలకలం ● హైదరాబాద్ నుంచి ప్రయోగం!



కూలిపోయిన బెలూన్ వద్ద జనం



సాక్షి, బెంగళూరు: అంతరిక్షం నుంచి భారీ స్థాయి వస్తువు నేలకూలడంతో జనం ఏమైందోనంటూ కలవరానికి గురయ్యారు. కర్ణాటకలో బీదర్ జిల్లాలోని హుమనాబాద్ తాలూకా జలసంగి గ్రామంలో శనివారం ఈ సంఘటన జరిగింది. గ్రామంలోని ఒక ఇంటి పక్కనే ఉన్న వేప చెట్టు మీద పెద్ద బెలూన్ పడింది. ఈ బెలూన్‌కు పలు యంత్రోపకరణాలు అమర్చి ఉన్నాయి. ఈ మెషీన్ నుంచి రెడ్ లైట్ వెలుగుతుండడంతో గ్రామస్తులు భయపడ్డారు. విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు తెలియజేశారు. అదృష్టవశాత్తు ఎవరికీ హాని కలగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

టాటా రీసెర్చ్ సంస్థది

- హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సంస్థకు చెందిన బెలూన్‌గా గుర్తించారు. శుక్రవారం 10 గంటలకు వాతావరణ అధ్యయనం కోసం దీనిని ప్రయోగించినట్లు తెలిసింది. ఇది కొన్నిరోజుల పాటు ఆకాశంలో ఎగురుతూ వాతావరణ సమాచారాన్ని అందిస్తుంది. దీనిని వెదర్ బెలూన్ లేదా సౌండింగ్ బెలూన్ అంటారు. చివరకు ఎక్కడో ఒకచోట పడిపోతుంది. ఆ సంస్థ నుంచి నిపుణులు వచ్చేదాకా అక్కడ పోలీసులు కాపలా ఉన్నారు.

బెలూన్‌లో లేఖ

- బెలూన్‌లో కన్నడ భాషలో రాసిన ఒక లేఖ లభించింది. అందులో 'ఇదొక శాస్త్రీయ పరికరం. టీఐఎఫ్ఆర్ బెలూన్ సౌలభ్యం ఇందులో ఉంది. దయచేసి కింద సూచించిన సూచనలు పాటించినవారికి బహుమతి అందిస్తాము' అని ఉంది. అందులోని సూచనలు..
- మెషీన్‌లో ఏముందో తెరిచి చూడకూడదు.
- ఇందులోని అన్ని వస్తువులను కాపాడాలి.
- ఈ పరికరం కింద పడిన స్థానం నుంచి కదిలించకూడదు.
- సమీపంలోని పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలి.
- కింద ఇచ్చిన దూరవాణి నంబర్‌కు కాల్ చేయాలి.
- ఈ పరికరాన్ని చెడగొడితే పోలీసు కేసు ఎదుర్కొంటారు.

కబ్జాలకు పాల్పడితే.. నాన్ బెయిలబుల్ కేసులు

● హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక
● జగద్గిరిగుట్ట ఆలయ భూముల కబ్జాలపై పూజారి కన్నీరు
● సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో
● ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన కమిషనర్



జగద్గిరిగుట్ట కొండపై శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. గోవిందరాజులస్వామి ఆలయ కోనేరు కబ్జా అవుతున్నట్లు పూజారి నరహరి వీడియోను సోషల్ మీడియాలో చూసి హైడ్రా కమిషనర్ స్పందించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కమిషనర్ ఆలయ భూముల కబ్జాతో పాటు భూదేవిహిల్స్ ఆనుకొని ఉన్న పరికి చెరువు కబ్జాలకు పరిశీలించారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆలయ భూములను ఆయన పరిశీలించారు.

- కొండపై శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం సుమారు 14 ఎకరాల 10 గుంటలు ఉండేదని, ఆలయాల పేరుతో, కుల సంఘాల పేరిట ఆలయాల భూములు కబ్జాలు చేసి 8 ఎకరాల వరకు అన్యాక్రాంతం అయ్యిందని, స్థానికులు కమిషనర్‌కు విన్నవించారు. పరికి చెరువు సుమారు 66 ఎకరాలు ఉండేదని, ఇప్పటికి 80 శాతం వరకు కబ్జాకు గురైందని తెలిపారు.
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ 2024 జూలైలో హైడ్రా ఏర్పాటయ్యిందని, అంతకు ముందు నిర్మించిన నివాసాల జోలికి హైడ్రా వెళ్లదని, 2024 జూలై తర్వాత కబ్జాలపై మాత్రం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉన్న గూగుల్ మ్యాప్స్ పరిశీలించి 2024 జూలై తర్వాత కబ్జాలను గుర్తించి కబ్జాదారులకు నోటీసులు ఇస్తామని, కబ్జాదారులపై నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని హెచ్చరించారు. స్థానిక అధికారుల నిర్లక్ష్యంపై ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.
- వచ్చే బుధవారం జగద్గిరిగుట్ట ఆలయ భూములతో పాటు భూదేవిహిల్స్ ఆనుకొని ఉన్న పరికి చెరువు కబ్జాలపై స్థానికులతో హైడ్రా కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అన్ని ఆధారాలతో హైడ్రా కార్యాలయానికి వచ్చి పత్రాలు అందజేయాలని, పరికి చెరువు పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి.. చెరువు కబ్జా కాకుండా కాపాడాలని, దీనికి అధికారులకు సహకరించాలని కోరారు. అలాగే స్థానికులు ఒక కమిటీగా ఏర్పడి దేవాలయ భూముల పరిరక్షణకు నడుం బిగించాలని కోరారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సమయాన్ని వెచ్చించి కబ్జాలను పరిశీలించడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ భూములు కబ్జా కాకుండా కబ్జాల నియంత్రణకు హైడ్రాతో కలిసి పనిచేస్తామని స్థానికులు కమిషనర్‌కు తెలిపారు.

కమిషనర్‌కు ధన్యవాదాలు



శ్రీగోవిందరాజస్వామి దేవాలయ స్థలం, కోనేరు కబ్జాకు గురైన విషయం తెలుసుకొని వచ్చిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ధన్యవాదాలు. గోవిందరాజస్వామి దేవాలయ కోనేరు స్థలాన్ని కాపాడతామని భరోసా ఇవ్వడం సంతోషాన్ని కలిగించింది.

– నరహరి, గోవిందరాజస్వామి దేవాలయ పూజారి

నగరంలో నేడు

- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఇన్నోవేటివ్ హ్యాండ్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణాలో రివాజ్ వెడ్డింగ్ ఎడిషన్ పేరిట ప్రీమియం ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- సంస్కృత భారతీ ఆధ్వర్యంలో పంచమం ప్రాంత సంస్కృత సమ్మేళనం మూసారాంబాగ్‌లోని అరోరా పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీలో సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఎన్టీ రామారావు ఎందరికో స్ఫూర్తి

నందమూరి లక్ష్మీపార్వతి

చిక్కడపల్లి: ఎన్టీ రామారావు ఎందరికో స్ఫూర్తిదాయకమని నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. వంశీ ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు వర్ధంతి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గాయకుడు వైఎస్ రామకృష్ణకు ఎన్టీఆర్ వంశీ గ్లోబల్ అవార్డును ఆమె ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖులు వంశీ రామరాజు, శంకర్, సుధాదేవి, శైలజ, సుధామయి, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య నిర్వహణకు వీలుగా..

సాక్షి, సిటీబ్యూరో: వ్యక్తుల స్వీయ ఆరోగ్య నిర్వహణకు ఉపకరించేలా ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల బ్రాండ్ సామ్‌సంగ్ తమ హెల్త్ యాప్‌లో హెల్త్ రికార్డ్స్ ఫీచర్‌ను జోడించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌ను నేరుగా సామ్‌సంగ్ హెల్త్ మొబైల్ యాప్ ద్వారా యాక్సెస్ చేయడానికి ఈ హెల్త్ రికార్డ్స్ ఫీచర్ వీలు కల్పిస్తోందని, దీని ద్వారా తమ ఆరోగ్య డేటాను వినియోగదారులు ఇప్పుడు సులభంగా భద్రపరచుకోవడం, మార్పులు చేర్పులకు వీలు కలుగుతుందన్నారు.

వ్యవసాయ రంగంలో ఏఐ పాత్రపై సదస్సు



ఎన్ఐఆర్‌డీపీఆర్‌లోని వర్క్‌షాప్ వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్) విభాగంలో గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్, వ్యవసాయంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యంగా వ్యవసాయం, పశుపోషణ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, స్వయం సహాయక సంఘాల్లోని కీలక సవాళ్లను పరిష్కరించడం, గ్రామ పంచాయతీల అభివృద్ధిలో నూతన విజన్ తదితర అంశాలపై చర్చించారు. భారత ప్రభుత్వ గ్రామీణ జీవనోపాధి, పాలనను పెంపొందించడంలో ఏఐ పాత్రను క్లుప్తంగా వివరించారు. ఇందులో వివిధ రాష్ట్రాల నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీలు, డైరెక్టర్ల క్యాడర్‌కు చెందిన వారు 12 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్రకుమార్, జేఆర్‌కే.రావు, భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మాజీ కార్యదర్శి ఎస్.ఎస్.సిన్హా, శివేందు, డాక్టర్ ఎం.వి.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇండో-అమెరికన్ ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం

● అమెరికాలో తెలంగాణ విద్యార్థులు చదువుకోవడం గర్వకారణం
● అమెరికన్ కాన్సులేట్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్



ఇండో యూఎస్ సైంటిఫిక్ కన్వెన్షన్‌ను ప్రారంభిస్తున్న అమెరికన్ కాన్సులేట్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్

సుల్తాన్‌బజార్: అమెరికాలో వైద్య విద్యాలయాల్లో వేలాది మంది తెలంగాణ విద్యార్థులు వెళ్లి చదువుకోవడం తనకు చాలా గర్వంగా ఉందని అమెరికన్ కాన్సులేట్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ అన్నారు. ఏఐజీ హాస్పిటల్‌లో తొలిసారిగా అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా ఆరిజన్ (ఏఏపీఐ) ఏహెచ్(అమెరికన్ హార్ట్ అసోసియేషన్) ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఏఐజీల ఆధ్వర్యంలో ఇండో యుఎస్ సైంటిఫిక్ కన్వెన్షన్ శనివారం జరిగింది. ఈ కన్వెన్షన్‌కు ముఖ్య అతిథిగా కాన్సులేట్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ హాజరై మాట్లాడారు. ఇండో–అమెరికన్ శాస్త్ర సాంకేతిక భాగస్వామ్యం, ప్రజల ఆరోగ్యం, వాతావరణ మార్పులు, స్థిరమైన అభివృద్ధి వంటి గ్లోబల్ సమస్యలను పరిష్కరించడానికి కీలకమవుతుందన్నారు. ఇది రెండు దేశాల్లో ఆర్థికాభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పురోగతిని ప్రోత్సహించడంలో కూడా సహాయ పడుతుందన్నారు. ముందుగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకానాథరెడ్డి, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ వేమూరి మూర్తి, అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ అధ్యక్షుడు డాక్టర్ సతీష్ కత్తుల, ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అశోక్, ఏఐజీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జీవీ రావు, కార్డియాలజీ డైరెక్టర్ డాక్టర్ నరసింహన్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రతి 10 నుంచి 20 నిమిషాల ప్రయాణ దూరంలో సీపీఆర్ సెంటర్లు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దీనివల్ల దేశంలో హార్ట్ ఎటాక్స్ నుంచి ప్రజలను రక్షించుకోవడానికి వీలవుతుందన్నారు. అలాగే విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు, పరిశ్రమల్లో ఉద్యోగాల్లో చేరే సమయంలో ప్రతి ఉద్యోగికి సీపీఆర్‌పై శిక్షణ, న్యూట్రిషన్ విలువల గురించి అవగాహన కల్పించాలన్నారు. దేశంలోనే తొలిసారిగా ఇండో యూఎస్ ఆరోగ్య సదస్సుకు ఏఐజీ హాస్పిటల్ వేదికగా నిలిచిందన్నారు. సైంటిఫిక్ సెషన్స్ ప్రారంభానికి విచ్చేసిన ఏఐజీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి సదస్సులో పాల్గొనడానికి విచ్చేసిన వివిధ రంగాల నిపుణులకు అభినందనలు తెలియజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు టిక్కెట్లు ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



పంజగుట్ట: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు టిక్కెట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మార్చిలో జరిగే రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు టిక్కెట్లు కేటాయించాలని, లేనిపక్షంలో ఆయా పార్టీలకు పతనం తప్పదని ఆయన హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ ఇప్పటికే ఒక బీసీయేతర వ్యక్తికి సీటు ప్రకటించిందని, కాంగ్రెస్ కూడా అదేబాటలో పయనించేలా ఉందన్నారు. అలా జరిగితే బీసీ అభ్యర్థులను ఇండిపెండెంట్లుగా రంగంలోకి దించుతామని ఆయన హెచ్చరించారు. రెండు రోజుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీల పాత్ర, భవిష్యత్ కార్యాచరణ అనే అంశంపై హైదరాబాద్‌లో బీసీ మేధావులు, కుల సంఘాలతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, రాష్ట్ర కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తొటికొండ విక్రమ్‌గౌడ్, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మని మంజరి, సదానందం, వెంకటేష్‌గౌడ్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

నిజాం కళాశాల హాస్టల్ విద్యార్థుల ఆందోళన

సాక్షి, సిటీబ్యూరో: రెండు నెలల నుంచి నాణ్యమైన భోజనం అందించడం లేదని తార్నాకలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నిజాం కళాశాల హాస్టల్ విద్యార్థులు శనివారం రాత్రి ఆందోళన చేపట్టారు. విద్యార్థులంతా బయటకు వచ్చి హాస్టల్ ఎదుట బైటాయించారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వార్డెన్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఓయూలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్

వచ్చేనెల 17న కేసీఆర్ జన్మదినం సందర్భంగా పోటీలు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్‌కుమార్ తదితరులు


ఉస్మానియా యూనివర్సిటీ: మాజీ సీఎం కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఓయూలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గ్యాదరి కిశోర్‌కుమార్ టోర్నమెంట్ వాల్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. వచ్చేనెల 17న కేసీఆర్ జన్మదినం సందర్భంగా 1 నుంచి 15 వరకు నిర్వహించే క్రికెట్ పోటీల్లో పాల్గొనే జట్లు ఈ నెల 19 నుంచి 29 వరకు పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.50,071, ద్వితీయ బహుమతి రూ.25 వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్: 98481 78925/93467 14365. కార్యక్రమంలో పడాల సతీష్, జిల్లా నాగయ్య, పవన్, మిథున్ ప్రసాద్, వేల్పుకొండ వెంకట్ రామకృష్ణ, శ్రీకాంత్, వడ్డేపల్లి సందీప్, సాయి, అనిల్ నవీన్, శివ, ప్రేమ్‌కుమార్, ఉదయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మహవీర్ కళాశాలకు ఐఐసీ గుర్తింపు

మైలార్‌దేవ్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ మానవ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాశాలల పరిశోధన విభాగం ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ గుర్తింపు మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు దక్కింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ శనివారం సర్టిఫికెట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పరిశోధనలు చేపట్టి స్వతహా స్టార్టప్స్ ప్రారంభించి ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు తమ సృజన శక్తిని మేధస్సును పరిశోధనలపై వెచ్చించాలని, తద్వార కొత్త ఆవిష్కరణలకు దోహదపడి సమాజ శ్రేయస్సుకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉషశ్రీ, కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రతిభాభారతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్హా.. ఆదర్శంగా..

గ్రేటర్ నగరంలో ఏటా కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నా దోమల నివారణలో విఫలమవుతున్న జీహెచ్ఎంసీ ఆరోగ్య విభాగం అధికారులు శనివారం చేగూరులోని కన్హా శాంతివనాన్ని సందర్శించారు. అక్కడి వనంలో ఐదువేల మంది ఉంటున్నా, ఇప్పటి వరకు ఒక్క డెంగీ కేసు కూడా నమోదు కాకపోవడంతో వారు అనుసరిస్తున్న దోమల నివారణ పద్ధతుల్ని పరిశీలించారు. దోమ లార్వాలు పెరగకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన కుండీలు, వాటిల్లోని ద్రావణం వివరాలతో పాటు వారు చేస్తున్న ఇతరత్రా పనుల గురించి తెలుసుకున్నారు. అక్కడ ఫాగింగ్ చేయకపోవడాన్ని గుర్తించారు. అక్కడి విధానాల్ని జీహెచ్ఎంసీలోనూ పాటిస్తామని పేర్కొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో



అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే ఉన్న కార్డులన్నీ కొనసాగుతాయని వివరించారు. కులాల సర్వే (కులగణన) ఆధారంగా రూపొందించిన జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలనకు పంపించామని, అనంతరం కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలవుతుందన్నారు. దీనికి తోడు మీ సేవలో చేర్పులు, మార్పుల కోసం దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలిస్తామన్నారు.

సహకార సంఘాల పటిష్టతకు కృషి చేయాలి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో రవీందర్‌రావు, జగన్మోహన్‌రావు, భీమ్‌రాజ్

నాంపల్లి: తెలంగాణ సహకార శాఖ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం డైరీని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర సహకార అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జగన్మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి డి.భీమ్‌రాజ్‌తో కలిసి సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకార శాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. 2025వ సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందని పేర్కొన్నారు. సహకార శాఖ అధికారులు తమ విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ముఖ్యంగా సంఘాల ఆడిట్, ఎన్నికలు తదితర చట్టబద్ధమైన విధులను నిబంధల ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా సహకార సంఘాల పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. అర్హత కలిగిన అధికారులు పదోన్నతి పొందే ప్రతిపాదనలను వేగవంతం చేయాలని సహకార శాఖ డైరెక్టర్ ఉదయ్ కుమార్‌ను ఆదేశించారు. గడిచిన 23 ఏళ్లుగా ఒకే హోదాలో పనిచేస్తున్న అధికారులకు పదోన్నతులు కల్పించడంలో జరిగిన ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార బ్యాంకు చైర్మన్ రవీందర్‌రావు, సహకార శాఖ అధికారుల సంఘం సహాధ్యక్షుడు కె.నాగార్జున, ఉపాధ్యక్షులు పి.పరమేష్, కోదండరాం, కోశాధికారి గంధ శ్రీనివాస్‌రావు, నల్గొండ జిల్లా సంయుక్త కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రామచంద్ర, ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి ఎస్.శివకుమార్, సంయుక్త కార్యదర్శులు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, శ్రావ్య, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు విజయ, రమేష్ పాల్గొన్నారు.

'మరపురాని జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ



మరపురాని జ్ఞాపకాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

కాచిగూడ: తెలంగాణ యాస, భాష, సంస్కృతి, సంప్రదాయాల పట్ల సంపూర్ణమైన అవగాహన ఉన్న వ్యక్తుల్లో ప్రొఫెసర్ కుంభం మధుసూదన్‌రెడ్డి ఒకరని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. నారాయణగూడలోని భారత్ విద్యాంస్థల ఆడిటోరియంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కుంభం మధుసూదన్‌రెడ్డి రచనలో వెలువడిన 'మరపురాని జ్ఞాపకాలు' పుస్తకాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకుడిగా ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డికి మంచిపేరు ఉందని, ప్రతి ఒక్కరూ గురువుల పట్ల గౌరవం కలిగి ఉండాలని సూచించారు. పిల్లలను పెంచే తీరు తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగమేనని, మధుసూదన్‌రెడ్డి పిల్లలను అణిముత్యాల్లా పెంచారని అన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో కొన్ని అరుదైన జ్ఞాపకాలు, అనుభవాలు ఉంటాయని, అవి ప్రతి జీవితానికి ఒక ప్రత్యేకత అన్నారు. ప్రతి జీవితంలోని అనుభవాలు, జ్ఞాపకాల సమాహారాన్ని జీవితంగా భావించవచ్చని తెలిపారు. 'మరపురాని జ్ఞాపకాలు'లో నాటి పరిస్థితులను ఉన్నది ఉన్నట్లు వివరించే ప్రయత్నం చేసినట్లు పుస్తక రచయిత తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవి, గాయకుడు గోరెటి వెంకన్న, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, భారత్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, నళిని, అరుంధతి, గాయత్రి, జూలూరి గౌరిశంకర్, రెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అచ్యుతదేవి, వసుందరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇటీవలి కాలంలో స్టార్ హోటళ్లు మొదలుకుని సాధారణ ఇళ్ల వరకూ అలంకరణకు ప్రాధాన్యతను ఇస్తున్నాయి. దీంతో నగరంలోనూ అలంకరణ పట్ల ఆదరణ పెరుగుతోంది. ఈ క్రమంలో జపనీస్ కళ అయిన ఇకెబనా ఆర్ట్ పట్ల ఆకర్షితులవుతున్నారు. గతంలో స్టార్ హోటళ్లకే పరిమితమైన ఈ కళ.. నేడు మధ్యతరగతి ఇళ్లలోనూ కనిపిస్తుంది.. అదేదో యాడ్‌లో చెప్పినట్లు.. అందమైన ఊహకు.. పొందికైన రూపం అన్నట్లు.. ఈ జపనీస్ ఆర్ట్‌లో అందమైన పూలు, ఇతర ప్రకృతి సిద్ధమైన వస్తువులకు ఊహాజనిత రూపాన్ని ఇవ్వడమే ఈ కళలోని ప్రధాన ఆకర్షణ.. గృహాలంకరణలోనూ ప్రాధాన్యత సంతరించుకున్న ఈ ఆర్ట్ గురించిన మరిన్ని విశేషాలు.. - సాక్షి, సిటీ బ్యూరో

- విస్తరిస్తున్న జపనీస్ ఆర్టిస్టిక్ కల్చర్
- అందుబాటులో ఉన్న వస్తువులతో ఆర్టిస్టిక్‌గా
- ఆలోచనలకు పదును పెడుతున్న నగరవాసులు
- నామమాత్రపు ఖర్చుతో అద్భుతమైన అలంకరణ
- మధ్యతరగతిలోనూ అలంకరణ పట్ల ఆసక్తి

అందమైన ఊహకు.. పొందికైన రూపం..

| ఇకెబనా ఆర్ట్‌కు నగరంలో క్రేజ్ |





ఇకెబనా ఆర్ట్ అనేది ఉన్నత శ్రేణి కుటుంబాలకు మాత్రమే చెందిన అలంకరణ అనేది సాధారణ ప్రజల్లో గట్టిగా ముద్రపడిపోయింది. అయితే సాధారణ ప్రజలు సైతం తమ గార్డెన్‌లో లభించే చిన్నపాటి పూలు, కొమ్మలు, ఆకులు, తదితర వస్తువులను వినియోగించి అందమైన ఇకెబనా అలంకరణ తయారు చేయవచ్చు. అలంకరణపై స్మార్ట్ ఆలోచనలు, కొద్దిగా క్రియేటివిటీ ఉంటే సరిపోతుంది. దీని కోసం రూ.500 నుంచి రూ.లక్ష వరకూ వెచ్చిస్తున్నారు. జపనీస్ ఆర్ట్‌కు గత కొన్నేళ్లుగా హైదరాబాద్ నగరంలో మంచి ఆదరణ ఏర్పడింది. గృహాలంకరణ, శుభకార్యాలు, ఈవెంట్స్, స్టార్ హోటళ్లు, ప్రముఖ కార్యాలయాలు తదితర ప్రదేశాల్లో ఎక్కువగా ఇకెబనా కల్చర్ కనిపిస్తుంది.

రిచ్ లుక్ కోసం..

రిచ్ లుక్ కోసం అధిక ధర పలికే పూలు, ఆకులు, వివిధ రకాల ప్రకృతి అలంకరణ వస్తువులను దేశ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో తయారీ వ్యయం భారీగా పెరుగుతోంది. అలాంటివి ఏవీ లేకుండా కూడా ఈ ఆర్ట్‌ను అందంగా తీర్చిదిద్దవచ్చని పలువురు ఆర్టిస్టులు నిరూపిస్తున్నారు. ఇకెబనా ఆర్ట్‌ను సృజనాత్మకత, ఇంటి ఆవరణ, తోటల్లో లభించే చిన్నపాటి పూలు, మొక్కలు, ఆకులతో అద్భుతమైన ఆకృతులను తీర్చిదిద్దుతున్నారు. అందమైన పూలు, చెట్లు కొమ్మలు, ఆకులు, ప్రకృతిలో లభించే సాధారణ వస్తువులతోనూ ప్రత్యేకమైన అలంకరణలు సిద్ధం చేసుకోవడంలోనే సంతృప్తి ఉందని స్పష్టం చేస్తున్నారు.



ఇంటి ఆవరణలోనే..

హోం డిజైన్ కార్యాలయంలో స్టోర్ మేనేజర్‌గా పనిచేశాను. అక్కడ అన్నీ ప్రకృతి సిద్ధమైన వస్తువులే ఉండేవి. అందుకేనేమో ఇకెబనాపై ఆసక్తి కలిగింది. ఎండిన ఆకులు, పచ్చని కొమ్మలు, పూలు, పత్రాలు ఒక్కొటీ ఒక్కో రంగులో ఉంటాయి. వీటితోపాటు కొన్ని ముడి సరుకులు అలంకరణకు అవసరం ఉంటాయి. వాటిని వివిధ పాత్రలు, ప్రత్యేకించి డిజైన్ చేసిన మెటీరియల్స్‌ను వినియోగించవచ్చు. తయారీ ఖర్చు మనం వినియోగించే పూలు, వస్తువులపై ఆధారపడుతుంది. ఎక్కువ మంది ఒకే దగ్గర చేరి తమ ఆలోచనలను పంచుకుంటే భిన్నమైన ఆకృతులను తయారు చేయవచ్చు.

- పవిత్ర, హైటెక్ సిటీ



పైసా ఖర్చు లేకుండా..

నేను 11 ఏళ్ల వయసులోనే ఇకెబనా ఆర్ట్ వర్క్ షాప్‌లో పాల్గొన్నా. మా అమ్మ ఈ ఆర్ట్ నేర్చుకుంది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఇంట్లో అలంకరిస్తే ఒక రకమైన పాజిటివ్ వైబ్స్ కనిపిస్తున్నాయి. మా ఇల్లు, ఫ్రెండ్స్, చుట్టాల పెరట్లో లభించే వస్తువులు, బయటకు వెళ్లినప్పుడు నచ్చిన కొమ్మలు, ఆకులు తెచ్చుకుంటాను. దీనికి పైసా ఖర్చు ఉండదు. మన అందమైన ఆలోచన, ఎంచుకున్న రంగులు ఆర్ట్‌కు ప్రాణం పోస్తాయి. పుట్టి పెరిగింది కోల్‌కతాలో అయినా హైదరాబాద్‌తోనూ మంచి సంబంధాలు ఉన్నాయి.

- అనుశ్రీ, బంజారాహిల్స్





నగరంలో 20 ఏళ్ల క్రితం..

సాధారణ ప్రజలు దీన్ని చూసి ఇకెబనా అంటే అంత ఖర్చు చేయాలా అని వెనుకడుగు వేస్తున్నారు. దాదాపు 20 ఏళ్ల క్రితం నగరంలోని పలువురు ఇకెబనా కళాకారులు తమ ఇంటి పెరట్లో లభించే కనకాంబరాలు, చామంతి, మొరం, గులాబీలు, బంతి, లిల్లీ, పొద్దుతిరుగుడు పువ్వులు, కొబ్బరి, అరటి పువ్వు (మొవ్వ), పొడవాటి కాడలతో ఉన్న పూలు, గ్రామీణ ప్రాంతాల్లో లభించే వివిధ రకాల గడ్డిజాతి మొక్కలు, పచ్చని కొమ్మలు, చెట్ల వేర్లు, ఆకులతో ఆర్ట్ తయారు చేసేవారు. వీటిని నిలబెట్టేందుకు గాజు పాత్రలు, సిరామిక్, పింగాణీ, చెక్క, కంచు, రాతితో తయారు చేసిన కుండీల వంటి ఆకారాలను వినియోగిస్తున్నారు. ఎంపిక చేసుకున్న థీమ్‌కు అనుగుణంగా అలంకరణ వస్తువులను సిద్ధం చేస్తున్నారు. ఇకెబనా చాప్టర్స్ సభ్యులు నగరంలో వర్క్‌షాప్‌లు నిర్వహించినపుడు, తమ ఇళ్లల్లో అలంకరణ సమయంలోనూ వస్తువులను ఇచ్చిపుచ్చుకుంటామని చెబుతున్నారు.





ఆయన వయసు 77 సంవత్సరాలు.. ఢిల్లీ ఐఐటీలో ప్రొఫెసర్.. భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు, కళలను నేటి తరం అక్కున చేర్చుకునే విధంగా విద్యార్థులకు అవగాహన కలిగించడానికి కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ.. గోవా నుంచి అస్సాం వరకూ ప్రచారం చేసేందుకు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్రలో భాగంగా హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆయనే ప్రొఫెసర్ కిరణ్ సేథ్. ఈ నేపథ్యంలో ఆ వివరాలు..

- బంజారాహిల్స్



సంప్రదాయ పరిరక్షణ.. సేతువు

- భారతీయ సంస్కృతి ప్రచారానికి సైకిల్ యాత్ర
- ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ కిరణ్ సేథ్ సాహసం

నగరంలో మే 26 నుంచి జూన్ 1వ తేదీ వరకూ ప్రతిష్టాత్మక ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో నిర్వహించనున్న పదో వార్షిక అంతర్జాతీయ భారతీయ సాంస్కృతిక ఉత్సవాన్ని మరింత విజయవంతం చేయడానికి దేశ నలుమూలలా సైకిల్ పైనే తిరుగుతూ ప్రచారం కల్పిస్తున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక కానుంది. కాగా ఇందులో ప్రఖ్యాత కళాకారులు, పద్మభూషన్, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు ఇందులో పాలుపంచుకోనున్నారు. ఈ సదస్సును విజయవంతం చేయడమే కాకుండా ప్రదర్శన ఇవ్వనున్న కళాకారుల ప్రతిభాపాటవాలను విద్యార్థులకు తెలియజేసే నిమిత్తం పలు కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొంటున్నారు. వయసుతో సంబంధం లేకుండా ఆయన చేపట్టిన ఈ సైకిల్‌యాత్ర కళాభిమానులను ఆలోచింపజేస్తుంది.

దేశ విదేశాల నుంచి..

దేశ విదేశాలకు చెందిన ప్రముఖ కళాకారులు హాజరవుతున్న ఈ సదస్సులో నేటి తరం నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయంటూ సైకిల్ యాత్రలో ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో పలు కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. ఈ సదస్సులో విభిన్న రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, శాస్త్రీయ సంగీతం, నృత్య ప్రదర్శనలు, జానపద ప్రదర్శనలు, సినిమా ప్రదర్శనలు, వారసత్వ యాత్రలు, శ్రమదాన్, యోగ, సంపూర్ణ ఆరోగ్యం సేవించడం, వర్క్‌షాప్‌లు వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఉండనున్నాయని కిరణ్‌సేత్ వెల్లడించారు.

యువతే లక్ష్యంగా..

సదస్సు నిర్వహణ వెనుక ఆశ్రమ వాతావరణాన్ని రూపొందించడం ద్వారా కొత్తతరం మనసుల్లో దీర్ఘకాలిక ప్రభావాన్ని మిగల్చడమే ఉద్దేశమన్నారు. ఇది యువతకు భారతీయ సంస్కృతి, విలువలను చేరువచేస్తూ గాఢ అనుభవాన్ని అందించడమే లక్ష్యమన్నారు. 2030 నాటికి ప్రతి పిల్ల వాడికీ ఈ లక్ష్యం చేరుకోవడం పైనే దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. ఇందులో ప్రముఖ కళాకారులతో పాటు హస్తకళా కారుల వర్క్‌షాప్‌లు కూడా ఉంటాయన్నారు.



ఆభరణం.. కళాత్మకం..

సాక్షి, సిటీబ్యూరో: కళాత్మకంగా తీర్చిదిద్దిన వైవిధ్యభరిత ఆభరణాలు కనువిందు చేశాయి. ఆభరణ ప్రియుల కలలు సాకారం చేసేలా కొత్తగా రూపుదిద్దుకున్న వజ్రాలు, ముత్యాలు, రత్నాలు.. కళకళలాడాయి. నగరానికి చెందిన ఆభరణాల తయారీ సంస్థ శ్రీకృష్ణ జ్యువెలర్స్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో జ్యువెలరీ ఎక్స్‌పో ఏర్పాటైంది. దీనిని పలువురు సోషలైట్స్, పేజ్ త్రీ ప్రముఖుల సమక్షంలో శనివారం ప్రారంభించారు. సంస్థ నిర్వాహకులు అఖిలేష్ అగర్వాల్ మాట్లాడుతూ ఆభరణాల తయారీలో కళాత్మకతను తెలియజెప్పేలా ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. ఆభరణ ప్రియుల కోసం ఈ ప్రదర్శన 3 రోజుల పాటు కొనసాగుతుందన్నారు.






కరాటే జాతీయ చాంపియన్ షిప్ ప్రారంభం

గచ్చిబౌలి: దేశంలో అత్యంత ప్రాచుర్యం పొందిన మార్షల్ ఆర్ట్స్‌లో భాగమైన కరాటే జాతీయ పోటీల్లో నిష్ణాతులైన క్రీడాకారులు పోటీపడుతున్నారు. ఒకరిని మించి మరొకరు కళ్లు చెదిరే కిక్‌లతో ఔరా అనిపిస్తున్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులకు జపాన్ కరాటేలో ఆరితేరిన ఇన్‌స్ట్రక్టర్స్ మరిన్ని మెళకువలు నేర్పిస్తున్నారు. దీంతో కరాటే క్రీడాకారులతో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం సందడిగా మారింది. జపాన్ కరాటే అసొసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరగనున్న జాతీయ కరాటే చాంపియన్ షిప్–2025ను జేకేఏ హెడ్ క్వార్టర్స్ ఇన్‌స్ట్రక్టర్ 8వ డాన్ ఇమురా షిహాన్ శనివారం ప్రారంభించారు. కఠోర సాధన, ఆత్మ విశ్వాసంతోనే రాణించగలరని పేర్కొన్నారు. జేకేఏ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ 7వ డాన్ ఆనంద రత్న షిహాన్ పోటీల్లో గెలుపొందిన వారు రెండు రోజులు నిర్వహించే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 8 సంవత్సరాల నుంచి 72 సంవత్సరాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అమెరికా, న్యూజిలాండ్, శ్రీలంక, కజికిస్తాన్, రష్యా తదితర దేశాలతో పాటు 20 రాష్ట్రాలకు చెందిన 1200 మంది పోటీల్లో పాల్గొంటున్నారు. జపాన్ కరాటే అసోసియేషన్ హెడ్‌క్వార్టర్స్ 7వ డాన్ టి.తహియామ షిహాన్, మరో 7వ డాన్ హిరాయాన్ షియాన్, 4వ డాన్ హిరోసే షిహాన్‌లు హాజరయ్యారు.



భళా.. పటోలా..

సాక్షి, సిటీబ్యూరో : చేనేత కళాకారులు రూపొందించిన పటోలా వస్త్రాల విశిష్టతను తెలిపేలా డీ సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన బంజారాహిల్స్‌లోని లేబుల్స్ పాప్ అప్ స్పేస్‌లో ఏర్పాటైంది. ఈ ప్రదర్శనను శనివారం నగర సోషలైట్ అలేఖ్యారెడ్డి ప్రారంభించారు. నిర్వాహకులు భవిన్ మాట్లాడుతూ నేత కార్మికులను ప్రోత్సహించడం, చేనేతకు మార్కెట్ పెంపొందించడమే లక్ష్యంగా దీనిని నిర్వహిస్తున్నామని, పటాన్ పటోలా, బనారసి, జరీకోట, చందేరి, కాశ్మీర్, మహేశ్వరి, వెంకటగిరి, కంచి తదితర వేలాది రకాల వస్త్రోత్పత్తులు ఎక్స్‌పోలో కొలువుదీరాయన్నారు. ఈ నెల 27 వరకూ ప్రదర్శన కొనసాగుతుందన్నారు.



సందడిగా హైదరాబాద్ ఇన్‌స్టా మీట్-2025

గచ్చిబౌలి: ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు, థాట్ లీడర్స్ హైదరాబాద్ ఇన్‌స్టా మీట్–2025 ఏడవ ఎడిషన్‌లో సందడి చేశారు. కొండాపూర్‌లోని క్వాక్ అరేనాలో హైదరాబాద్ ఇన్‌స్టా మీట్‌ను ప్రముఖ ఫుడ్ బ్లాగర్, ఇన్‌ఫ్లుయెన్సర్ మహ్మద్ జుబేర్ అలీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేశారు. ఫుడ్ స్టాల్స్‌ను(ఏహెచ్‌డీడీఎఫ్) యానిమల్ హస్బెండరీ డైరీ డెవలప్‌మెంట్ అండ్ ఫిషరీస్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సవ్యసాచి ఘోష్ సందర్శించారు. నగరంలో ఇటీవల రెస్టారెంట్లు, పబ్‌లు, లాంజ్‌లు ప్రారంభిస్తున్నారని జుబేర్ అలీ పేర్కొన్నారు. వాటన్నింటికీ ప్రమోషన్, మార్కెటింగ్ అవసరం ఉంటుందన్నారు. అది ఒకరిద్దరితో సాధ్యం కాదని, అందరూ కలిసి ప్రమోట్ చేస్తే బాగుంటుందన్నారు. కనీసం సంవత్సరానికి ఒకసారైనా అందరూ కలిసి ఆలోచనలను పంచుకోవాలని సూచించారు. ఫుడ్, లైఫ్‌స్టైల్, ఫ్యాషన్, ట్రావెల్, టెక్నాలజీ తదితర రంగాలకు చెందిన టాప్ ఇన్‌ఫ్లుయెన్సర్లు సందడి చేశారు.



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబు

అమిత్ షాతో చంద్రబాబు విందు సమావేశం

- పాల్గొన్న పవన్ కళ్యాణ్, బండి సంజయ్ తదితరులు

సాక్షి, అమరావతి/విమానాశ్రయం (గన్నవరం): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, సీఎం చంద్రబాబు శనివారం రాత్రి విందు సమావేశంలో పాల్గొన్నారు. వారు కొద్దిసేపు రాజకీయ అంశాలపై చర్చించినట్లు కూటమి నేతలు తెలిపారు. గన్నవరం మండలం కొండపావులూరులో ఏర్పాటు చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐడీఎం), ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ క్యాంపస్‌లను అమిత్‌షా ఆదివారం ప్రారంభించనున్నారు. ఇందుకోసం విజయవాడ వచ్చిన ఆయనకు సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో విందు ఏర్పాటు చేశారు. అమిత్‌షా శనివారం రాత్రి 8.20 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా చంద్రబాబు నివాసానికి వెళ్లారు. అక్కడ ఆయనకు చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వాగతం పలికారు. విందు అనంతరం అమిత్ షాతో వారిద్దరూ సమావేశమయ్యారు. ఈ విందు సమావేశంలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, నారా లోకేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమిత్ షా విజయవాడలోని ఓ హోటల్‌లో బస చేశారు.

యుద్ధభూమిని చూద్దాం రండి!

రణక్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దనున్న కేంద్రం

సరిహద్దు గ్రామాల్లో మౌలిక వసతులు, ఆర్థిక వనరుల కల్పనే లక్ష్యం



- రక్షణ, పర్యాటక మంత్రిత్వ శాఖ సంయుక్తంగా కార్యాచరణ
- రక్షణ శాఖ ఆధ్వర్యంలో 'రణభూమి దర్శన్' యాప్ ద్వారా సమగ్ర వివరాలు
- 12వేల అడుగుల ఎత్తయిన సియాచిన్, గాల్వాన్ లోయల సందర్శనపైనా ప్రచారం
- మొత్తం 77 యుద్ధభూమి ప్రాంతాలు టూరిజం సర్క్యూట్‌కు అనుసంధానం

సాక్షి, అమరావతి: లాంగేవాలా.. 1971 భారత్–పాకిస్తాన్ యుద్ధం కారణంగా మన దేశ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయిన ప్రాంతం. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు జేపీ దత్తా రూపొందించిన క్లాసిక్ ఫిల్మ్ 'బోర్డర్' ద్వారా కళ్లముందు సాక్షాత్కరించిన యుద్ధభూమి. రాజస్థాన్‌లోని జైసల్మేర్ ఎడారిని సందర్శించే పర్యాటకులకు కేంద్ర బిందువు. భారత్–పాక్ యుద్ధాన్ని ఆవిష్కరించిన వార్ మెమోరియల్ కూడా. 120 మంది భారతీయ సైనికులతో కూడిన చిన్న దళం రెండువేల నుంచి మూడువేల మంది సైనికులతో కూడిన పాకిస్తానీ బలగాలను చిన్నచిన్న యుద్ధ ట్యాంకులు, ఫిరంగులతో ఎదురొడ్డి నిలిచి గెలిచింది. ఇక్కడ ఈ యుద్ధానికి సంబంధించిన డాక్యుమెంటరీలను వీక్షించడం, భారతీయ సైనికుల త్యాగాలను గౌరవించడం, ఆర్మీ నిర్వహించే దుకాణం నుంచి స్మృతి చిహ్నాలను కొనుగోలు చేయడం ద్వారా సందర్శకులు అద్భుతమైన అనుభూతిని పొందుతున్నారు. ఈ స్ఫూర్తితోనే భారత సైనిక వారసత్వ ప్రదర్శనకు కేంద్ర ప్రభుత్వం తలుపులు తెరిచింది. దేశ యుద్ధకాలపు చరిత్ర అన్వేషణకు బాటలు వేస్తోంది. పర్యాటక మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా అత్యంత ప్రసిద్ధిచెందిన యుద్ధభూముల్లోకి మునుపెన్నడూ లేని విధంగా పౌరులను తీసుకెళ్లనుంది. 'యుద్ధభూమి పర్యాటకాన్ని' ప్రోత్సహించేలా భారత్ రణభూమి దర్శన్ యాప్‌ను సైతం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా.. దేశవ్యాప్తంగా యుద్ధభూములను, సరిహద్దు ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా మారుస్తోంది.

'యుద్ధభూమి' పర్యాటక ప్రాజెక్టు ద్వారా సరిహద్దు ప్రాంతాల్లో ఆర్థిక వనరులను సృష్టించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మారుమూల ప్రాంతాలకు సందర్శకులను ఆకర్షించడం ద్వారా అక్కడ మౌలిక సదుపాయాలను, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను మెరుగుపరచడం, ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడం, వలసలను అరికట్టడంలో సహాయపడుతుందని ఆర్మీ భావిస్తోంది. దీంతో.. దేశ సైనిక చరిత్రను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది.

సరిహద్దు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం..

ఈ ప్రాంతాలపై చారిత్రక అవగాహన, దేశభక్తి, ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు బహుముఖ లక్ష్యంతో అడుగులు వేస్తోంది. 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' కింద రక్షణ వారసత్వాన్ని ప్రచారం చేయనుంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని కిబిథూ, లద్దాఖ్‌లోని రెజాంగ్ లా (1962 చైనా–భారత్ యుద్ధంతో ముడిపడి ఉన్న ప్రాంతాలు) వంటి ప్రదేశాలకు పౌరులను తీసుకెళ్లడం ద్వారా భారతదేశ యుద్ధకాల చరిత్రను చాటిచెప్పనుంది. వీటితో పాటు యుద్ధ స్మారక చిహ్నాలైన ద్రాస్ వార్ మెమోరియల్ (కార్గిల్ వార్, 1999), వాలాంగ్ వార్ మెమోరియల్ (వాలాంగ్ యుద్ధం–1962) తవాంగ్ వార్ మెమోరియల్, లోంగేవాలా వార్ మెమోరియల్, ఆపరేషన్ మేఘదూత్ వార్ మెమోరియల్‌లను యుద్ధభూమి టూరిజం సర్క్యూట్‌కు అనుసంధానిస్తోంది.

12వేల అడుగుల ఎత్తులోని సియాచిన్ సందర్శన..

ఇక ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధభూమి సియాచిన్. ఇక్కడ 1984 నుంచి చాలా ఏళ్లపాటు భారత్–పాక్ దళాల మధ్య ఘర్షణ వాతావరణం నడిచేది. 2023లో పర్యాటకులకు అనుమతిస్తూ.. ఈ మంచు పర్వతాల్లో సైనికులు ఎదుర్కొన్న కఠిన పరిస్థితులను సామాన్యులకు పరిచయం చేసింది. సందర్శకులు 12వేల అడుగుల ఎత్తులో ఉన్న సియాచిన్ బేస్ క్యాంప్ నుంచి ఈ ప్రాంతాన్ని అన్వేషిస్తున్నారు. ఇక 2020లో ఇండియా–చైనా ఘర్షణ జరిగిన ప్రదేశం గాల్వాన్.. 1971 ఇండియా–పాకిస్తాన్ యుద్ధంలో భారత సైన్యం విజయం సాధించిన ప్రాంతం లాంగేవాలా.. భారతదేశ సైనిక చరిత్రలో కీలక స్థానాలైన రెజాంగ్ లా, బమ్ లా పాస్, పాంగోంగ్ త్సో, డోక్లామ్‌లకు సంబంధించిన పూర్తి వివరాలను రణభూమి దర్శన్ యాప్ ద్వారా అందిస్తోంది. ఇందులో 77 యుద్ధభూములకు చెందిన సమగ్ర చారిత్రక కథనాలను అందిస్తోంది. వీటిని సందర్శించాలనుకునే వారి కోసం ఈ వెబ్‌సైట్ సమగ్ర ప్రయాణ వివరాలను అందిస్తుంది. నిషేధిత ప్రాంతాలను సందర్శించడానికి అవసరమైన అనుమతులు, దరఖాస్తుల వివరాలు యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.



శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా

కేటీఆర్‌వన్నీ దొంగ దీక్షలే!

- మా పథకాల లెక్కలు చూపిస్తే.. రాజీనామాకు సిద్ధమా?
- మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి సవాల్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేత కేటీఆర్ తన ఉనికి కాపాడుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలుచేయటం లేదంటూ ఆరోపణలు చేస్తున్నారని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి విమర్శించారు. ఆయన చేసేవన్నీ దొంగదీక్షలేనని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేసిన పథకాల లెక్కలన్నీ కేటీఆర్‌కు ఇస్తామని, ఆయన రాజీనామాకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, డీసీసీ అధ్యక్షుడు నరసింహారెడ్డిలతో కలిసి ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ వ్యవహారం దొంగే దొంగా దొంగా అన్నట్లుగా ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించడమే కేటీఆర్ ఉద్దేశమని, ఆయన జైలుకు పోవడం ఖాయమని అన్నారు. అర్హులందరికీ ఈ నెల 26 నుంచి కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని మహేందర్‌రెడ్డి తెలిపారు. 26న రైతులందరి ఖాతాలో మొదటి విడత రైతు భరోసా కింద ఎకరాకు రూ.6,000 వేస్తామని ప్రకటించారు.

టీటీడీలో వరుస ఘటనలపై కేంద్రం సీరియస్

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్ర హోం శాఖ అడిషనల్ సెక్రటరీ సంజీవ్ కుమార్ జిందాల్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో సంజీవ్ కుమార్ జిందాల్ ఆదివారం తిరుమలకు వస్తారని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని కోరుతూ టీటీడీ చైర్మన్‌కు లేఖ కూడా పంపింది. అయితే ఆయన పర్యటన వాయిదా పడినట్లు శనివారం రాత్రి తిరిగి సమాచారం అందించింది. కాగా, తిరుమల తిరుపతి దేవస్థానం చరిత్రలో కేంద్రం జోక్యం చేసుకోవడం ఇదే మొదటిసారి.

భక్తుల మనోభావాలకు విఘాతం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీటీడీని రాజకీయంగా వాడుకోవడంపై దృష్టి సారించింది. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బ తింటాయన్న విచక్షణ మరచి, సీఎం స్థానంలో ఉన్న చంద్రబాబు శ్రీవారి ప్రసాదాల్లో జంతువుల కొవ్వు కలిసిందంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా పటిష్ట వ్యవస్థ ఉన్న టీటీడీని అభాసుపాలు చేశారు. ప్రసాదాలు ఎలాంటి కల్తీకి గురి కాలేదని, లడ్డూల తయారీలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యిని ఉపయోగించనే లేదని సాక్షాత్తు ఈవో స్పష్టం చేసినప్పటికీ.. చంద్రబాబు అండ్ కో పదే పదే ఆరోపణలు గుప్పిస్తూ రాజకీయంగా లబ్ధి పొందాలని చూడటం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమైంది. ఈ విషయమై సుప్రీం కోర్టు సీబీఐ విచారణకు ఆదేశించడంతో ఎల్లో గ్యాంగ్ నోళ్లు మూత పడ్డాయి.

చరిత్రలో తొలిసారిగా తొక్కిసలాట

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ధార్మిక క్షేత్రం తిరుమలకు నిత్యం లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. అయినా ఒక చిన్న అవాంఛనీయ సంఘటన కూడా జరిగిన దాఖలాలు లేవు. క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి ఉన్నంత పటిష్టమైన ప్రణాళికలు దేశంలో ఎక్కడా లేవు. అందుకే తొమ్మిది నెలల క్రితం అయోధ్య రామాలయం ట్రస్ట్ నిర్వాహకులు తిరుమలలోని క్యూలైన్ వ్యవస్థను పరిశీలించి, టీటీడీ అధికారులతో చర్చించి వెళ్లారు. అనంతరం టీటీడీ ఇంజినీరింగ్ నిపుణులు అయోధ్యకు వెళ్లి అక్కడి



టీటీడీకి కేంద్ర హోం శాఖ రాసిన లేఖ

వారికి శిక్షణ ఇచ్చి వచ్చారు కూడా. అంతటి సమర్థవంతమైన వ్యవస్థ ఉన్న తిరుమలలో కూటమి ప్రభుత్వం స్వార్థ పూరిత చర్యలకు దిగింది. ఫలితంగా ఈ నెల 8వ తేదీన తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం క్యూలైన్‌లో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో భక్తులు గాయపడ్డారు. దేశ వ్యాప్తంగా తరలి వచ్చిన వారికి కనీస ఏర్పాట్లు చేయకుండా, క్యూ లైన్ల వద్ద రద్దీని పరిశీలించకుండా.. ఒక్క సారిగా గేట్లు తీయడంతో ఈ ఘటన చోటుచేసుకోవడం తెలిసిందే.

క్షమార్హం కాని నిర్లక్ష్యం

తొక్కిసలాట ఘటన మరువక ముందే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కౌంటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పదుల సంఖ్యలో కౌంటర్లు, క్యూలలో వేలాది భక్తులు ఉన్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఓ కౌంటర్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించటంతో భక్తులు భయంతో పరుగులు తీశారు. సిబ్బంది వెంటనే స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ తర్వాత తిరుమల రెండో ఘాట్ రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో తిరుమలకు వెళ్లే భక్తుల్లో 15 మందికి పైగా గాయపడ్డారు. పరకామణిలో 100 గ్రాముల బంగారు బిస్కెట్‌ను చోరీ చేస్తూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. అంతకు ముందు ఇదే వ్యక్తి పరకామణిలో మరిన్ని దొంగతనాలకు పాల్పడినట్టు విచారణలో తేలినట్లు తేలింది. ప్రత్యేక ప్రవేశ దర్శన నకిలీ టికెట్లతో భక్తులను మోసం చేస్తున్న వారిని పట్టుకున్నారు. తాజాగా శనివారం తమిళనాడుకు చెందిన 18 మంది భక్తులు కోడిగుడ్లు, బిర్యానీతో తిరుమల కొండ పైకి వచ్చేశారు. తిరుపతిలోనే పూర్తిగా తనిఖీ చేసి పంపే పెద్ద వ్యవస్థ ఉన్నా కూడా ఈ బృందం తిరుమల శ్రీవారి ఆలయానికి అతి సమీపంలో కోడిగుడ్లు ఆరగించడం భక్తులు నివ్వెరపోయేలా చేస్తోంది.

తప్పిదాలకు బాధ్యులైన వారిపై చర్యలేవీ?

టీటీడీ బోర్డు చైర్మన్, ఈఓ, అడిషనల్ ఈఓ సహా, కలెక్టర్, ఎస్పీల నిర్లక్ష్యమే తొక్కిసలాటకు కారణంగా తేలింది. ఈ నేపథ్యంలో.. పూర్తి స్థాయిలో విచారణ చేసి, బాధ్యులను జైల్లో పెట్టాల్సిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం జరిగిన ఘోరమైన ఘటనను సీరియస్‌గా తీసుకోలేదు. తూతూ మంత్రంగా తీసుకున్న చర్యలు తన వారిని కాపాడటానికేనని స్పష్టమైంది. సంబంధంలేని వారిపై సస్పెన్షన్ వేటు వేయడం, అరెస్టు చేసి జైల్లో పెట్టాల్సిన అధికారిని కేవలం బదిలీతో సరిపెట్టడం, మరికొందరిపై అసలు చర్యలే లేకపోవడం, ప్రభావంలేని సెక్షన్లతో కేసులు పెట్టడం ఇందుకు నిదర్శనం. కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్న ఈ ఘటనలో క్షమాపణ చెబితే చాలన్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యవహరించడం రాజకీయ డ్రామా అని సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. వీటన్నింటికీ తోడు లోకేశ్ మనిషి లక్ష్మణ్‌కుమార్ 'సూడో' అదనపు ఈఓగా చెలరేగిపోతున్నారు. అదనపు ఈఓ వెంకయ్య చౌదరి పక్కనే ఈయనకు కుర్చీవేసి మరీ ప్రొటోకాల్ మర్యాదలు చేస్తున్నారు. ఏ అధికారిక ఉత్తర్వు లేకపోయినా ఈయన టీటీడీలో తిష్టవేసి అందరినీ శాసిస్తున్నారు. శ్రీవారి కానుకలు మొదలు సిఫారసు లేఖలు.. టెండర్ల వరకు అన్ని విషయాల్లో ఈయన చెప్పిందే ఫైనల్. అదనపు ఈఓ కార్యాలయంలో ఏ పని జరగాలన్న లక్ష్మణ్‌కుమార్ కనుసన్నల్లోనే జరిగేలా ప్రభుత్వ పెద్దలు ఆదేశాలు జారీ చేశారంటే తిరుమలను ఎంతగా భ్రష్టు పట్టించారో ఇట్టే స్పష్టమవుతోంది.



తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ సింగపూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే పోచారం తదితరులు

తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కండి

- ప్రవాస తెలంగాణీయులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

సాక్షి, హైదరాబాద్: సింగపూర్‌లో నివసిస్తోన్న తెలంగాణ సంతతివారు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం సింగపూర్ పర్యటనలో రెండో రోజైన శనివారం తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ సింగపూర్ నేతృత్వంలో పలువురు ప్రవాస తెలంగాణీయులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా రేవంత్ వారితో కాసేపు మాట్లాడారు. యోగక్షేమాల గురించి తెలుసుకోవడంతోపాటు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కె.రఘువీర్‌రెడ్డి, హైదరాబాద్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు సి.రోహిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో గ్లోబల్ డేటా సెంటర్ ఏర్పాటు ఒప్పంద కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్, ఎస్టీ టెలీమీడియా కంపెనీ ప్రతినిధులు

డేటా సెంటర్లకు రాజధాని

▶ మొదటి పేజీ తరువాయి

ఎస్టీ టెలీమీడియా కొత్త క్యాంపస్ ఏర్పాటుతో తమ కార్యకలాపాలను విస్తరించనుంది. వంద మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటయ్యే కొత్త క్యాంపస్ సామర్థ్యాన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పెంచనుంది. వచ్చే పదేళ్లలో భారత్‌లో తమ డేటా సెంటర్లను ఒక గిగావాట్ సామర్థ్యానికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తంగా వచ్చే పదేళ్లలో ఎస్టీ టెలీమీడియా సుమారు 3.2 బిలియన్ డాలర్లను (సుమారు రూ.27 వేల కోట్లు) పెట్టుబడిగా పెడుతుందని అంచనా వేస్తున్నారు.

తెలంగాణలో పెట్టుబడులకు అపార అవకాశాలు: సీఎం రేవంత్

సింగపూర్ వాణిజ్య, పర్యావరణ మంత్రి గ్రేస్ ఫు హెయిన్‌తో సీఎం నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం భేటీ అయింది. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సింగపూర్ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. నగరాలు, పట్టణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, నీటి వనరుల నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి, క్రీడలు, సెమీ కండక్టర్ల తయారీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో.. తెలంగాణ, సింగపూర్ ప్రభుత్వాలు కలసి పనిచేసేందుకు ఉన్న అనుకూలతలను సీఎం రేవంత్ వివరించారు. తెలంగాణలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీనిపై సింగపూర్ మంత్రి గ్రేస్ ఫు హెయిన్ స్పందిస్తూ.. వివిధ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యంపై అందిన ఆహ్వానాన్ని పరిశీలిస్తామని, తెలంగాణకు తగిన సహకారం అందిస్తామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, నీటి వనరుల నిర్వహణ, సుస్థిరాభివృద్ధి ప్రణాళికలపై ఆసక్తి చూపడంతోపాటు పలు ప్రాజెక్టుల్లో పరస్పరం కలసి పనిచేసేందుకు అంగీకరించారు. ఈ సందర్భంగా ఉమ్మడిగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, వాటిపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటు, వివిధ రంగాల్లో సింగపూర్ అనుభవాలను పంచుకోవడంపై చర్చించారు.

సెమీకండక్టర్ల రంగంలో పెట్టుబడికి సింగపూర్ ఆసక్తి

సింగపూర్ పర్యటనలో భాగంగా శనివారం సింగపూర్ సెమీకండక్టర్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (ఎస్ఎస్ఐఏ)తో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. తెలంగాణలో సెమీకండక్టర్ల రంగంలో పెట్టుబడికి అనుకూల వాతావరణం ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక వాతావరణం, ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే పెట్టుబడిదారులకు అందించే సహకారం, ప్రోత్సాహకాలు, ఇతర అనుకూలతలను వివరించారు. ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ కీలక కేంద్రంగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన ఎస్ఎస్ఐఏ ప్రతినిధులు... సెమీకండక్టర్ల రంగంలో పెట్టుబడులపై ఆసక్తి చూపారు. ఈ ఏడాది చివరిలో తమ ప్రతినిధుల బృందం హైదరాబాద్‌ను సందర్శిస్తుందని ప్రకటించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్ఎస్ఐఏ చైర్మన్ బ్రియాన్ టాన్, వైస్ చైర్మన్ టాన్ యూ కాంగ్, సెక్రటరీ సీఎస్ చుహ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో పెట్టుబడికి ఉన్న అవకాశాలు, ఆధునిక మౌలిక వసతులు, విధానాలు సింగపూర్ పారిశ్రామికవేత్తలను ఆకర్షించాయని ఈ భేటీ అనంతరం ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

పవన్ పార్ట్‌నర్‌కు 1,200 ఎకరాలు

టీజీ విశ్వప్రసాద్ కంపెనీకి రూ.వేల కోట్ల భూములు | కారు చౌకగా కట్టబెట్టేందుకు కూటమి పెద్దల గ్రీన్ సిగ్నల్

సాక్షి, అమరావతి: టీజీ విశ్వ ప్రసాద్.. ఈ పేరు చాలా మందికి కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పేరుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పలు సినిమాలు తీయడమే కాకుండా, ఆయనతో భాగస్వామ్య వ్యాపారాన్ని కూడా మొదలు పెట్టింది ఈయనే. టీజీ విశ్వప్రసాద్‌కు ఇప్పుడు కర్నూలు జిల్లా ఓర్వకల్లులో వేల కోట్ల రూపాయల విలువైన భూములు కేటాయించడంతో మరోసారి వార్తల్లో నిలిచారు. పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్‌తో కలిపి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఎల్ఎల్‌పీ (లిమిటెడ్ లయబులిటీ పార్ట్‌నర్‌షిప్) తొలి దశలో 15 చిత్రాలు నిర్మించేలా ఒప్పందం చేసుకున్నారు. ఎన్నికల ముందు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌తో 'బ్రో' అనే సినిమా కూడా తీశారు. 2024 ఎన్నికల్లో కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గం నుంచి జనసేన తరఫున అభ్యర్థిగా పోటీ చేయడానికి విశ్వప్రసాద్ విశ్వ ప్రయత్నాలు చేశారు. కూటమి ఒప్పందంలో భాగంగా ఆ సీటు భారతీయ జనతా పార్టీకి కేటాయించడంతో పోటీ చేయలేకపోయారు. అయితే ఎన్నికల ప్రచారానికి భారీగా నిధులు సమకూర్చినట్లు రాజకీయంగా పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఫలితాల అనంతరం ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చి.. పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం కావడంతో హైదరాబాద్‌లో విశ్వప్రసాద్ గ్రాండ్ పార్టీ ఇవ్వడంపై భారీగా చర్చ జరిగింది. టీజీ విశ్వప్రసాద్ బీజేపీ మాజీ రాజ్యసభ



సభ్యుడు టీజీ వెంకటేష్‌కు సోదరుడి వరుస, ప్రస్తుత పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌కు చిన్నాన్న వరస అవుతాడు. ఇన్ని అర్హతలున్నందునే రూ.కోట్ల విలువైన భూములను కారు చౌకగా కట్టబెట్టేయడానికి ఫైళ్లు చకచకా కదిలాయి. ఆ వెంటనే ఒప్పందం కుదిరింది.

అనుభవం లేని కంపెనీతో ఒప్పందం

పీపుల్ టెక్ టెక్నాలజీ, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, పీపుల్ స్క్రీన్స్, పీఎంఎఫ్ టూర్స్ అండ్ ట్రావెల్స్, పీటీజీ వెంచర్స్, వీ జోన్ హాస్పిటల్స్ వంటి విభిన్న రంగాల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న టీజీ విశ్వప్రసాద్ ఇప్పుడు ఎటువంటి అనుభవం లేకుండానే ఈ మొబిలిటీ పార్కుతో పాటు ఈ స్కూటర్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తానంటూ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. ఈ మొబిలిటీ వాహన తయారీ కోసం ఇంకా భాగస్వామ్య కంపెనీని కూడా ఎంచుకోలేదు. తైవాన్, కొరియా, చైనా దేశాలకు చెందిన కంపెనీలతో భాగస్వామ్య ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నట్లు ప్రభుత్వం విడుదల చేసిన పత్రికా ప్రకటనలోనే స్పష్టంగా పేర్కొన్నారు. రూ.2,100 కోట్ల పెట్టుబడులు పెట్టే ఆర్థిక స్థితి పీపుల్ గ్రూపుకు లేనే లేదు. అయినా ఈ విషయాలు ఏమీ పరిగణనలోకి తీసుకోకుండా ఏపీ ఈడీబీ పీపుల్స్ గ్రూపుతో ఒప్పందం చేసుకుంది. ఓర్వకల్లులో 1,200 ఎకరాలను రూ.1,800 కోట్లతో ఈ మొబిలిటీ పార్కుగా అభివృద్ధి చేయడంతో పాటు, యాంకర్ (ప్రధాన) కంపెనీగా పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ రూ.300 కోట్లతో ఈ మొబిలిటీ యూనిట్‌ను ఏర్పాటు చేసే విధంగా ఒప్పందం కుదుర్చుకుంది.

కారు చౌకగా కొట్టేసే యత్నం

ఓర్వకల్లు వద్ద సుమారు 9,000 ఎకరాల్లో పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయనున్నారు. ఇందులో తొలి దశలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నిక్‌డిక్ట్ నిధులతో 2,621 ఎకరాల్లో పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గం పారిశ్రామిక పార్కు కోసం 2,621 ఎకరాల భూమి బదలాయింపునకు ఆమోదం తెలిపింది. ఒక్కసారి పారిశ్రామిక పార్కు అభివృద్ధి పనులు మొదలైతే అక్కడ భూముల రేట్లు గణనీయంగా పెరుగుతాయి. ప్రస్తుతం ఇక్కడ ఎకరా భూమి 80 లక్షల నుంచి కోటి రూపాయల పైనే పలుకుతోంది. ఒకసారి పారిశ్రామిక పార్కు అభివృద్ధి అయితే ఈ రేట్లు నాలుగైదు రెట్లు పెరుగుతాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న డిప్యూటీ సీఎం వ్యాపార భాగస్వామి కారు చౌకగా ఈ భూములను కొట్టేసే విధంగా పథకం రూపొందించారు. పీపుల్ టెక్ పేరుతో ఈ మొబిలిటీ పార్కును ఏర్పాటు చేస్తున్నామంటూ ఎకరా రూ.15 లక్షల నుంచి రూ.16 లక్షలకు అప్పగించే విధంగా ప్రభుత్వ పెద్దలు చక్రం తిప్పుతున్నారని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పుడక్కడ ఏపీఐఐసీనే ఎకరం రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షలకు విక్రయిస్తుంటే అత్యంత కారు చౌకగా భూములను అప్పగించడానికి రంగం సిద్ధం కావడం వెనుక ఏం జరిగి ఉంటుందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు.

రూ.6 వేల కోట్లు పైమాటే

హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా ఓర్వకల్లు పారిశ్రామిక పార్కు అభివృద్ధికి 2,621 ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఆ వెంటనే ఆ భూమి పక్కనే 1200 ఎకరాల్లో ఈ మొబిలిటీ పార్కు ఏర్పాటు చేస్తామంటూ పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకోవడం.. అనంతరం ఆ కాగితాలతో విశ్వప్రసాద్.. డిప్యూటీ సీఎంను కలిసి ఆశీర్వాదం తీసుకోవడం అంతా చకచకా జరిగిపోయాయి. ప్రస్తుతం ఎకరం రూ.కోటి వరకు ఉన్న ఈ భూమి ధర.. ఓర్వకల్లు పారిశ్రామిక పార్కు అభివృద్ధి చెందితే రూ.ఐదారు కోట్ల వరకు వెళుతుంది. ఈ లెక్కన 1200 ఎకరాల భూమి విలువ రూ.ఐదారు వేల కోట్లకు పైగానే ఉంటుందని పరిశ్రమల శాఖ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ అంశం తెలుగుదేశం పార్టీతో పాటు పరిశ్రమల శాఖలో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది.

స్ఫూర్తి

'మన దేశంలో పేదలు కలలు కనగలరు. వాటిని నిజం చేసుకోగలరు' అనే మాట ఎన్నో సందర్భాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటి నుంచి వినిపించింది. పేదరాలైన జయమ్మ కల కన్నది. 'నా కష్టాన్ని చూసి నలుగురు మెచ్చుకుంటే చాలు' నలుగురు ఏం ఖర్మ... సాక్షాత్తూ రాష్ట్రపతిభవన్ ఆమె కష్టాన్ని గుర్తించింది.



విధి నిర్వహణలో జయమ్మ



జయమ్మ విజయం

'నీ భర్త ఏం పనిచేస్తాడు?' అనే ప్రశ్నకు... జయమ్మ చెప్పిన జవాబుకు అవతలి వ్యక్తి ముఖం అదోలా మారిపోయేది. మాటల్లో చిన్న చూపు కనిపించేది.

నెల్లూరుకు చెందిన జయమ్మ ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికురాలు. దీంతోపాటు భర్తతో కలిసి సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ పనులు చేస్తుంది.

'చేయడానికి మీకు ఈ పనే దొరికిందా తల్లీ' అని వెక్కిరించిన వాళ్లు ఎందరో!

అయితే ఏ రోజూ చేస్తున్న పనిపట్ల నిర్లక్ష్యం, విముఖత జయమ్మలో కనిపించలేదు.

ఆమె రెక్కల కష్టం వృథా పోలేదు.

వృత్తి పట్ల జయమ్మ అంకితభావానికి గుర్తింపుగా ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి ఆహ్వానం అందింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇస్తున్న విందులో పాల్గొనబోతోంది జయమ్మ.

'పెద్దోళ్లకు అందరూ చుట్టాలే. పేదోళ్లకు కష్టాలే చుట్టాలు' అంటుండేది జయమ్మ తల్లి రాజమ్మ.

ఆ ఇంటికి కష్టాలు కొత్త కాదు. కష్టపడడం కొత్త కాదు. నెల్లూరు నగరంలోని ఉమ్మారెడ్డిగుంట ప్రాంతానికి చెందిన జయమ్మ తన తల్లిదండ్రులకు సాయంగా రోజువారీ కూలిపనులకు వెళ్తుండేది. 'ఏ పనీ లేకుండా ఇంట్లో కూర్చోవడం కంటే పనికి పోవడమే నాకు ఇష్టం' అంటున్న జయమ్మకు 'శ్రమ' అనేది చిన్నప్పటి నేస్తం.

జయమ్మకు రమేష్‌తో వివాహం జరిగింది. రమేష్ మొదట్లో సెప్టిక్‌ట్యాంక్ వాహనానికి డ్రైవర్‌గా వెళ్తుండేవాడు. పదేళ్లపాటు డ్రైవర్‌గా పనిచేసిన అనుభవంతో తానే సొంతంగా ఓ సెప్టిక్ ట్యాంకర్ సెకండ్ హ్యాండ్ వాహనాన్ని కొనుగోలు చేసి క్లీనింగ్ పనులు చేసుకుంటూ కుటుంబ పోషణ చేసేవాడు. ఇద్దరు పిల్లలు స్కూల్‌కి వెళ్లే వయస్సు వచ్చేవరకు గృహిణిగా ఉన్న జయమ్మ ఆ తరువాత భర్త చేసే సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ పనులకు తాను కూడా తోడుగా వెళ్తుండేది.

చిన్నచూపు చూసినా..

భూగర్భ డ్రైనేజీ పారిశుధ్య పనులకు వెళ్లే జయమ్మను తోటివారే చిన్నచూపు చూసేవారు. అవేమీ పట్టించుకోకుండా భర్తకు చేదోడువాదోడుగా ఉండేది. క్లీనింగ్ సమయాల్లో చర్మవ్యాధుల బారిన పడేది. ఈ దంపతుల కష్టాన్ని చూసిన 'నవజీవన్' అనే స్వచ్ఛంద సంస్థ నాలుగేళ్ల క్రితం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ షూరిటీతోపాటు ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీ శాఖ ఆధ్వర్యంలో బ్యాంకు రుణం మంజూరు చేయించింది. రూ.10 లక్షల సబ్సిడీతో రూ.32 లక్షలు విలువైన కొత్త సెప్టిక్ ట్యాంకర్ క్లీనింగ్ వాహనాన్ని మంజూరు చేయించడంతో వారికి సొంతవాహనం సమకూరింది. దీంతో దంపతులిద్దరూ సొంత వాహనంతో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కార్పొరేషన్ అధికారుల సహకారంతో నగరంలోని ఎన్నో నివాసాల్లో సెప్టిక్‌ట్యాంక్ క్లీనింగ్ పనులు చేస్తున్నారు.



భర్త రమేష్‌తో జయమ్మ

జీవితంలో మర్చిపోలేని రోజు

మేము చేసే వృత్తి తప్పుడు పనేం కాదు. మా రెక్కల కష్టాన్నే నమ్ముకుని పనిచేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. అందులోనే మాకు సంతృప్తి ఉంది. ఎవరేమి అనుకున్నా మేము ఎప్పుడూ బాధపడలేదు. నా భర్తకు తోడుగా సాయంగా వెళ్లి క్లీనింగ్ పనులు చేస్తున్నా. గణతంత్ర వేడుకల్లో పాల్గొనాలని రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఆహ్వాన పత్రిక రావడం జీవితంలో మర్చిపోలేని సంఘటన. ఎంతో సంతోషంగా ఉంది.

– జయమ్మ

అన్ని అంశాల్లో మంచి మార్కులు

కేంద్ర ప్రభుత్వ ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ (నేషనల్ సఫాయి కర్మచారీస్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) పథకం లబ్ధిదారు అయిన జయమ్మ సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనానికి యజమాని అయింది. పథకాన్ని ఏ మేరకు సద్వినియోగం చేసుకున్నారు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా, సకాలంలో ఈఎంఐ కడుతున్నారా, లోడ్‌ను ఎక్కడంటే అక్కడ డంప్ చేస్తున్నారా లేక ప్రభుత్వం చూపిన పాయింట్‌లోనే డంప్ చేస్తున్నారా... ఇలాంటి అంశాలతో పాటు తగినవిధంగా జీవనోపాధి పొందుతున్నారా.. పోలీస్ స్టేషన్‌లో ఏమైనా కేసులు నమోదయ్యాయా... ఇలా ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ అధికారులు. అన్నింట్లో మంచి మార్కులు రావడంతో జయమ్మ కృషికి గుర్తింపు లభించింది. రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనడానికి రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం వచ్చింది.

ఆ నమ్మకంతోనే...

'నమ్మిన పని ఎప్పుడూ మోసం చేయదు అనే మాట ఎన్నోసార్లు విన్నాను. ఆ నమ్మకంతోనే ఎంతమంది వెక్కిరించినా పట్టించుకోలేదు. మా ఆర్థిక స్థాయికి సెప్టిక్ ట్యాంకర్ క్లీనింగ్ బండికి సొంతదారులమవుతామని అనుకోలేదు. కష్టపడితే ఆ కష్టమే మనల్ని ముందుకు తీసుకు వెళుతుంది' అంటూ ఆత్మవిశ్వాసం నిండిన గొంతుతో అంటుంది జయమ్మ.

– చిలక మస్తాన్‌రెడ్డి
సాక్షి ప్రతినిధి, నెల్లూరు

భిన్న మార్గం

చదువుకున్న సముద్రపు చేప

బావుల్లో ఉండిపోతారు కొందరు.
తెలిసిన కుంటల్లోనే మునకలేస్తారు కొందరు.
మహా అయితే చెరువు గురించి ఆలోచిస్తారు కొందరు.
కాని అతి కొందరు మాత్రమే సముద్రాన్ని జయించాలనుకుంటారు.
వృత్తిరీత్యా బెస్త కుటుంబంలో పుట్టిన సుభిక్ష ఇంగ్లిష్ లిటరేచర్ చదివి నగరంలో ఉద్యోగం చేసినా ఎందుకు తన వృత్తిలోనే రాణించకూడదు అని ఆలోచించింది.
అంతే... తానే చేపల వేటలో దిగి 'సీఫుడ్ అంట్రప్రెన్యూర్'గా దేశాన్ని ఆకర్షిస్తోంది.



సుభిక్ష

సముద్రానికి కెరటాలతో అదిలించడం తెలుసు. వలల కొద్దీ చేపల్ని నింపి సిరులను అందించడం కూడా తెలుసు. 'సముద్రం తల్లిలాంటిదే. మమకారం, కోపం రెండూ ఉంటాయి. భయభక్తులతో ఉంటే ఏది అడిగినా కాదనకుండా ఇస్తుంది' అంటుంది సుభిక్ష. ఈ 23 ఏళ్ల అమ్మాయి తమిళనాడులోని తూత్తుకూడి సమీపంలో ఉన్న పెరియతలై అనే బెస్తపల్లె నుంచి ఇవాళ దేశాన్ని ఆకర్షిస్తోంది. మగవాళ్లకే పరిమితమైన చేపలు పట్టే విద్యలో ఆ అమ్మాయి రాణించడమే కాదు తన చదువును ఆ విద్యకు జత చేసి ఆదాయ మార్గాలను నిర్మిస్తోంది.



సముద్రంలో పడవపై సుభిక్ష

ఒడ్డు నుంచి సముద్రానికి...

మగవాళ్లు చేపలు పడతారు. వాటిని స్త్రీలు గట్టున కూచుని అమ్ముతారు. ఇదే ఆనవాయితీ. తరాలుగా ఇదే సాగుతోంది. సుభిక్ష తండ్రి కుమార్, అన్న లియాండర్ కూడా వాళ్లింట్లో సముద్రం మీద వేటకు వెళ్లి చేపలు తెస్తారు. తల్లి వాటి అమ్మకంలో సాయం చేస్తుంది. 'నేనెందుకు చేపలు పట్టడానికి మీతో రాకూడదు?' అని అడిగింది సుభిక్ష ఒకరోజు తండ్రిని. తండ్రి ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే సుభిక్ష ఇంగ్లిష్ లిటరేచర్ చదివింది. ప్రయివేట్ బ్యాంకులో ఉద్యోగం కూడా చేస్తోంది. ఆడపిల్ల సౌకర్యంగా బతకాలంటే ఆమెలాంటి మార్గమే అందరూ సూచిస్తారు. 'సముద్రంలో ఎంతో ఉంది. టెన్ టు ఫైవ్ జాబ్‌లో ఏముంది? నన్నొక ప్రయత్నం చేయనివ్వు నాన్నా' అంది సుభిక్ష. అప్పటికే ఆ అమ్మాయికి సోషల్ మీడియాలో ఫాలోయింగ్ ఉంది. మత్స్యకారుల జీవనాన్ని సరదాగా వీడియోల్లో చూపేది సుభిక్ష. ఇప్పుడు ఆ అమ్మాయి సిసలైన బెస్త జీవనంలోకి దిగింది.

సముద్రంతో చెలగాటం...

'కోరమాండల్ తీరంలో సముద్రంతో దిగడం అంటే ప్రాణాలతో చెలగాటమే' అన్నాడు సుభిక్ష తండ్రి చివరకు ఒప్పుకుంటూ. మొదటిసారి తండ్రి, అన్నతో కలిసి ఫైబర్ బోట్‌లో చేపల వేటకు సుభిక్ష వెళ్లిన అనుభవం గగుర్పాటుకు గురిచేసేదే. 'ఆకాశంలో చుక్కలు తప్ప వేరే ఏమీ కనిపించని చీకటి. పడవను కుదురుగా ఉంచకుండా ఎత్తెత్తి వేసే సముద్రం. మేము దాదాపు 20 కిలోమీటర్ల లోపలికి వెళ్లాం. అక్కడ ఏమైనా జరగొచ్చు. కాని ఆ సమయంలో చేపల వేటకు వెళ్లి వల విసరడం గొప్ప అనుభవం' అంది సుభిక్ష. ఆ రోజు నుంచి నేటి వరకు అనేకసార్లు రాత్రి 1 గంటకు వేటకు వెళ్లి ఉదయం 10 గంటలకు తిరిగి రావడం సుభిక్షకు అలవాటుగా మారింది. 'చేపలు పట్టడానికి ఏయే వలలు వాడాలి... ఏ వల వేస్తే ఏ రకం చేపలు పడతాయనేది తెలుసుకున్నాను. ఇంకా పల్లెపల్లెకు తిరిగి చేపల వేటలో మా పూర్వికుల అనుభవం తెలుసుకుంటున్నాను' అంటుంది సుభిక్ష. ఆమె తన వేటను మొదలెట్టాక అదంతా వీడియోలు చేసేసరికి ప్రపంచానికి తెలిసిపోయింది.

పెరిగిన వ్యాపారం

చేపలు పడితే టోకున ఎక్స్‌పోర్టర్లకు అమ్మడం లేదా లోకల్‌గా అమ్మడం లేదా ఎండబెట్టి అమ్మడం తెలిసిన సంప్రదాయ పద్ధతికి భిన్నంగా సుభిక్ష తమ చేపలను ఊరగాయలుగా, పచ్చళ్లు, ఎండు చేపలుగా మార్చి వాటిని తన లేబుల్ కింద అమ్మకానికి పెట్టింది. సోషల్ మీడియా వల్ల వాటిని దేశ విదేశాల్లో కొంటున్నారు. అలా మెల్లగా సుభిక్ష 'సీఫుడ్ అంట్రప్రెన్యూర్'గా మారింది. తండ్రి, అన్న ఈ పరిణామాలను స్వాగతిస్తున్నారు. ఊళ్లో అందరూ సుభిక్షను మెచ్చుకోలుతో చూస్తున్నారు. 'చేపలంటే ప్రొటీన్‌తో నిండిన రిచ్‌ఫుడ్. ప్రజలకు ఆ ఫుడ్‌ను అందించడానికి బెస్తలు ఎంత కష్టం చేస్తారో... ప్రమాదంలోకి వెళతారో లోకానికి చూపడమే నా లక్ష్యం. అలాగే మత్స్యకార స్త్రీలను మరింత ముందుకు తీసుకు వెళ్లడం కూడా' అంటోంది సుభిక్ష. ఒకవైపు ఈ పని చేస్తూనే మరోవైపు మోడల్‌గా కూడా పని చేస్తోంది. సంప్రదాయ విద్యలని గౌరవిస్తూ ఆధునిక ధోరణులను పుణికి పుచ్చుకుంటూ ముందుకు సాగితే విజయం తథ్యం అని నిరూపించింది సుభిక్ష.

హెల్త్

కాన్సర్ ఫెటీగ్

క్యాన్సర్ బాధితుల ఎదుట రెండు సవాళ్లు ఉంటాయి. మనోబలంతో క్యాన్సర్‌ను ఎదుర్కోవడం మొదటిదైతే... ఇక రెండోది... క్యాన్సర్ చికిత్స కారణంగా తమలో ఉండే విపరీతమైన నీరసం, తీవ్రమైన నిస్సత్తువలను అధిగమించడం. ముఖ్యంగా కీమోథెరపీ తీసుకునేవాళ్లలో ఈ నీరసం, నిస్సత్తువ చాలా ఎక్కువ. తమకు క్యాన్సర్ వచ్చిందని తెలియగానే బాధితులు కుంగిపోతారు. ఆపైన ఏ పనీ చేయనివ్వని తమ నీరసం మరింత కుంగుబాటుకు గురిచేస్తుంది. వాళ్లలో కలిగే ఈ నీరసాన్ని 'క్యాన్సర్ ఫెటీగ్'గా చెబుతారు. క్యాన్సర్‌పై తమ పోరాటానికి తోడు ఈ నీరసం, నిస్సత్తువలపై పోరాటమే మరింత పెద్ద సవాలుగా మారుతుంది. ఈ 'క్యాన్సర్ ఫెటీగ్' ఎందుకు వస్తుంది, దాన్ని అధిగమించడమెలా అనే అనేక అంశాలపై అవగాహన కోసమే ఈ కథనం.



కాన్సర్ కాటు..? వద్దు కుంగుబాటు

నీరసంపై సమరం!

క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటున్న చాలామంది తమలోని నీరసం, బలహీనతల కారణంగా రోజువారీ పనులను సమర్థంగా చేసుకోలేరు. దాంతో జీవితం చాలా నిస్సారంగా అనిపించడం, జీవితాన్ని ఆస్వాదించలేకపోవడంతో కుంగుబాటు (డిప్రెషన్)కు గురవుతారు. ఈ నీరసాలూ, నిస్సత్తువలకు అనేక అంశాలు కారణమవుతాయి. కొంత కృషి చేస్తే దీన్ని అధిగమించడం అంత కష్టం కాదు. కానీ తమ జబ్బు, కుంగుబాటు కారణంగా తామీ 'ఫెటీగ్'ను అధిగమించగలమనే ఆత్మవిశ్వాసాన్ని చాలామంది కోల్పోతారు. కాస్తంత కృషితోనే నీరసాలను జయించడం అంత కష్టమేమీ కాదు. తొలుత ఈ 'ఫెటీగ్'కు కారణమయ్యే అంశాలేమిటో చూద్దాం...

కారణాలు...

రక్తహీనత (అనీమియా) : క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల్లో నీరసం, నిస్సత్తువలకు 'అనీమియా' ఓ ముఖ్యమైన కారణం. సాధారణంగా క్యాన్సర్ బాధితుల్లో, అందునా మరీ ముఖ్యంగా బ్లడ్‌క్యాన్సర్ బాధితుల్లో ఎముక మూలుగ దెబ్బతినడం వల్ల ఎర్రరక్తకణాల ఉత్పత్తి, వాటి సంఖ్యా తగ్గుతాయి. ఈ ఎర్ర రక్తకణాలే శరీరంలోని ప్రతి కణానికీ ఆక్సిజన్ అందజేస్తాయన్న సంగతి తెలిసిందే. ఇవి తగ్గడంతో దేహంలోని కణాలకు అవసరమైన పోషకాలూ, ఆక్సిజన్ కూడా తగ్గి బాధితుల్లో నీరసం కనిపిస్తుంది.



డాక్టర్ శ్రీనివాస్ జూలూరి
సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్

విషాలు (టాక్సిన్స్) బయటకు వెళ్లకపోవడం: ఎర్ర రక్తకణాలు దేహంలోని కణాలకు ఆక్సిజన్‌ను అందించడంతో పాటు జీవక్రియల కారణంగా అక్కడ ఏర్పడ్డ కార్బన్ డై ఆక్సైడ్, ఇతర విషపదార్థాల (టాక్సిన్స్)ను బయటకు పంపడానికి సహాయపడతాయి. అయితే ఎర్ర రక్తకణాలు తగ్గడంతో బయటకు విసర్జితం కావాల్సిన విష పదార్థాలూ పోవాల్సినంతగా బయటకు వెళ్లవు. దేహంలో ఉండిపోయిన ఈ టాక్సిన్స్... ఇతర జీవక్రియలకూ అంతరాయం కలిగిస్తుంటాయి. ఫలితంగా బాధితుల్లో నీరసం, నిస్సత్తువ ఏర్పడి వాళ్లు తీవ్రమైన అలసటతో ఉన్నట్లుగా కనిపిస్తుంటారు.

చికిత్సల కారణంగా: చాలా సందర్భాల్లో బాధితులు తీసుకునే కీమో, రేడియోథెరపీ వంటి చికిత్సల వల్ల, అలాగే బోన్ మ్యారో క్యాన్సర్ బాధితులకు అందించే మందుల కారణంగా తీవ్రమైన నీరసం, నిస్సత్తువ కనిపిస్తాయి. ఈ మందులు నిజానికి క్యాన్సర్ కణాలను నశింపజేయల్సి ఉంటుంది. కానీ ఈ క్రమంలో అవి ఆరోగ్యవంతమైన కణాలనూ ఎంతోకొంత దెబ్బతీస్తుంటాయి. ఇలా ఆరోగ్యకరమైన కణాలూ దెబ్బతిని నశించిపోవడంతో క్యాన్సర్ బాధితుల్లో నీరసం, నిస్సత్తువ ఏర్పడతాయి. ఇక కీమో తీసుకుంటున్నవారిలో దేహం చాలా వేడిగా ఉన్నట్లు అనిపించడం, ఒంట్లోంచి వేడి బయటకు వస్తున్న ఫీలింగ్‌తో నిద్రాభంగం అవుతుండటం, నిద్రలో అంతరాయాలు, ఆకలి తగ్గినట్లుగా ఉండటంతో సరిగా భోజనం తీసుకోకపోవడం వంటి అంశాలు కూడా నీరసం, నిస్సత్తువ (ఫెటీగ్)కు కారణమవుతాయి.

ఫెటీగ్‌ను అధిగమించడమిలా...

తినాలని మనస్కరించకపోయినా వేళకు పుష్టికరమైన ఆహారం తీసుకోవడం, మెల్లమెల్లగా వ్యాయామాలకు ఉపక్రమించి, క్రమబద్ధంగా ఎక్సర్‌సైజ్ చేస్తూ ఉండటం... మనసు ఇచ్చగించకపోయినప్పటికీ ఇలాంటివి క్రమం తప్పకుండా చేస్తూ చురుగ్గా ఉండటానికి ప్రయత్నిస్తే 'క్యాన్సర్ ఫెటీగ్' సమస్యను సులువుగానే అధిగమించవచ్చు. ఇలాంటి వ్యాయామాలతో ఎండార్ఫిన్స్ అనే రసాయనాల స్రావాల వల్ల సంతోషం పెరగడం, దాంతో క్రమంగా చురుగ్గా ఉండటం సాధ్యమవుతాయి.

న్యూట్రిషన్ కౌన్సెలింగ్ : క్యాన్సర్ బాధితులు ఆహారం సరిగా తీసుకోకపోవడంతో బరువు కోల్పోయి... సన్నబడతారు. ఆకలి లేకపోవడం, కుంగుబాటు (డిప్రెషన్), మందుల వల్ల కలిగే వికారం వంటివి వారిని సరిగా తిననివ్వవు. దాంతో దేహానికి అవసరమైన పోషకాలు అందకపోవడంతో సన్నబడి నీరసించిపోతారు. బాధితుల నోటికి రుచిగా ఉండేలాంటి ఆహారాల తయారీ, అవసరమైన పోషకాలు అందడానికి తీసుకోవాల్సిన పదార్థాల వంటివి తెలుసుకోడానికి 'న్యూట్రిషనిస్ట్ / డైటీషియన్'ను సంప్రదించాలి.

విశ్రాంతి : రోజులో తగినంత చురుగ్గా ఉండటంతో పాటు తగినంత విశ్రాంతి తీసుకోవడమూ అవసరమే. ఈ విశ్రాంతి తమ శక్తిసామర్థ్యాలను మరింత శక్తి పుంజుకుని మళ్లీ క్రియాశీలం కావడానికి ఉపయోగపడుతుందని బాధితులు గ్రహించాలి.

ఇతర విషయాలపైకి దృష్టి మళ్లించడం (డిస్ట్రాక్షన్) : ఎప్పుడూ వ్యాధి గురించే ఆలోచించకుండా... తమ దృష్టిని ఇతర అంశాలపైకి మళ్లించాలి. మంచి పుస్తకాలు చదవడం, హాస్యభరితమైన, వినోదాత్మకమైన సినిమాలు చూడటం, ఫ్రెండ్స్‌తో మాట్లాడుతుండటం, సమయాన్ని సరదాగా గడపడం వంటి వాటితో జబ్బునుంచి దృష్టిమళ్లించగలిగితే ఇది కూడా ఫెటీగ్‌ను అధిగమించడానికి తోడ్పడుతుంది.

మానసిక స్థైర్యం కోసం :

క్యాన్సర్ వచ్చినట్టు తెలియగానే చాలామంది తీవ్రమైన కుంగుబాటుకు లోనవుతారు. నిజానికి ఈ రోజుల్లో దాదాపు అత్యధిక శాతం క్యాన్సర్లు పూర్తిగా తగ్గుతాయి. ఇది తెలిస్తే బాధితులు తమ ఆత్మబలాన్ని పెంపొందించుకోవడం తేలికే. ఇందుకు అవసరమైన రిలాక్సేషన్ టెక్నిక్స్, కాగ్నిటివ్, సోషల్ థెరపీల కోసం మానసిక నిపుణుల సహాయం తీసుకోవచ్చు.

కంటి నిండా నిద్ర : క్యాన్సర్ బాధితుల్లో చాలామందికి నిద్రపట్టడం కష్టమై తరచూ నిద్రాభంగమవుతుంటుంది. దాంతో మరింత నిస్సత్తువగా అనిపిస్తుంటుంది. రిలాక్సేషన్ టెక్నిక్స్ వంటి ప్రక్రియల ద్వారా బాధితులు ఈ సమస్యను అధిగమించవచ్చు. అలాగే కాఫీ లేదా కెఫిన్ ఉండే ద్రవాహారాలను తగ్గించడం కూడా మంచిదే. చిన్నపాటి కునుకు తీయడం, మధ్యాహ్నం కాసేపు ఓ పవర్‌న్యాప్ వంటి వాటితో పాటు వేళకు పెందలాడే నిద్రించి పెందలాడే లేవడం లాంటి మంచి నిద్ర అలవాట్లతో నిద్ర సమస్యను తేలిగ్గానే అధిగమించవచ్చు. అలాగే మంచి నిద్ర కోసం చీకటిగా ఉండే గది (డార్క్ రూమ్)లో నిద్రపోవడంతో గాఢంగా నిద్రపట్టి నిద్ర సమస్యలు దూరమయ్యే అవకాశముంది. అప్పటికీ నిద్రపట్టనివాళ్లలో డాక్టర్లు 'మెలటోనిన్' సప్లిమెంట్లు ఇవ్వడం వంటి (ముఖ్యంగా కీమోథెరపీ తీసుకునే బాధితులకు) జాగ్రత్తలు తీసుకుంటారు.

అవసరాన్ని బట్టి మందులు : బాధితుల్లో నీరసం, నిస్సత్తువ ఎక్కువగా ఉన్నప్పుడు కారణాలను బట్టి డాక్టర్లు వారికి కొన్ని మందుల్ని సూచిస్తారు. ఉదాహరణకు రక్తహీనత ఉన్నవారికి ఐరన్ సప్లిమెంట్లూ, పోషకాహార లోపాలను బట్టి ఇతర సప్లిమెంట్లు, మానసిక సమస్యలను బట్టి యాంటీ డిప్రెసెంట్లు, సైకో స్టిమ్యులెంట్ల వంటి మందులు ఇస్తారు.

క్యాన్సర్ ఫెటీగ్‌తో బాధపడుతున్నవారు పై సూచనలు పాటిస్తే తమంతట తామే సమస్యలను అధిగమించవచ్చు. కుదరకపోతే వైద్యనిపుణుల సహాయం తీసుకోవచ్చు. క్యాన్సర్ ఫెటీగ్ అధిమించలేని సమస్యేమీ కాదని గ్రహించడం అన్నిటికంటే ముఖ్యం.

చిన్నారుల నోట్లో పుండ్లు?




కొంతమంది పిల్లల్లో నోట్లో, నాలుక మీద, గొంతు లోపల తరచూ పుండ్లలా వస్తుంటాయి. చిన్నారుల్లో ఈ సమస్య కనిపించినప్పుడు నొప్పితో బాధపడటం; నోరూ, గొంతు ఇన్ఫెక్షన్ వచ్చినప్పటిలా ఎర్రబారడమూ జరుగుతుంది. ఏమీ తినలేక సన్నబడతారు. ఇలా వచ్చే పుండ్లను వైద్యపరిభాషలో ఆఫ్తస్ అల్సర్స్ అంటారు.

కారణాలు: ఈ సమస్యకు చాలా కారణాలు ఉన్నాయి. ఉదా... ● నోట్లో గాయాలు కావడం (బ్రషింగ్ వల్ల, బాగా ఘాటైన పేస్టులు, కొన్ని అబ్రేసివ్ ఆహారపదార్థాల వల్ల గాయాలవుతుంటాయి) ● విటమిన్‌లు, పోషకాల లోపం... (ముఖ్యంగా విటమిన్ బి12, ఐరన్, ఫోలిక్ యాసిడ్, జింక్ ల వంటి పోషకాలు లోపించడం) ● అనేక కారణాలతో నీరసించిపోవడం (ఫెటీగ్) ● వైరల్ ఇన్ఫెక్షన్‌లు (ముఖ్యంగా హెర్పిస్ వంటివి) ● పేగుకు సంబంధించిన సమస్యలు, రక్తంలో మార్పులు, గ్లూటిన్ అనే పదార్థం సరి పడకపోవడం, తరచూ జ్వరాలు... వంటి అనేక శారీరక సమస్యలతో పాటు మానసికంగా ఉద్వేగ పరమైన ఒత్తిడి (ఎమోషనల్ స్ట్రెస్) వల్ల కూడా పిల్లల్లో ఈ తరహా పుండ్లు (మౌత్ అల్సర్స్) కనిపించవచ్చు.

చికిత్స/మేనేజ్‌మెంట్: నోట్లో పుండ్లు పడ్డ పిల్లలకు బాధ తెలియకుండా ఉండేందుకు పైపూతగా వాడే మందులు, యాంటిసెప్టిక్ మౌత్ వాష్‌లు; పోషకాహార లోపం వల్ల సమస్య వస్తే వాళ్లలో విటమిన్ సప్లిమెంట్స్ వాడాల్సి ఉంటుంది. ఇలాంటి పిల్లల్లో చాలా అరుదుగా స్టెరాయిడ్ క్రీమ్స్ వాడటం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఇలా మౌత్ అల్సర్స్ కనిపించినప్పుడు పీడియాట్రీషియన్ లేదా డెంటల్ నిపుణులను సంప్రదించాలి.



డా. శివనారాయణ రెడ్డి వెన్నపూస,
సీనియర్ నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్



ప్రసవం ముందు కాళ్ల వాపులా..?

గర్భవతుల్లో కాళ్ల వాపులు కనిపించే ఈ కండిషన్‌ను వైద్య పరిభాషలో జెస్టేషనల్ ఎడిమా అంటారు. మామూలుగానైతే దీని గురించి ఆందోళన పడాల్సిందేమీ లేదు. అయితే ఇలా వాపు కనిపిస్తున్నప్పుడు గర్భవతుల్లో హైపర్‌టెన్షన్ (హైబీపీ) ఉందేమో చూడాలి. కాళ్ల వాపునకు అదో కారణం కావచ్చు. ఇక మన భారతీయ మహిళల్లో రక్తహీనత చాలా ఎక్కువ. కాళ్ల వాపులకు ఈ అంశం కూడా ఒక కారణమే. మహిళల్లో హిమోగ్లోబిన్ మోతాదులు కనీసం 11 ఉండటాన్ని ఒక మోస్తరు సాధారణంగా పరిగణిస్తుంటారు. కొందరిలో ఇది 7 కంటే తక్కువగా ఉన్నప్పుడు కాళ్ల వాపు రావడం మామూలే. ఇక కొందరు మహిళల్లో గుండెజబ్బులు, కాలేయ వ్యాధులు, కిడ్నీ సమస్యలు ఉండి, వాళ్లు గర్భం దాల్చినప్పుడు కూడా కాళ్లవాపులు కనిపించవచ్చు. వాళ్లు డాక్టర్ సలహా మేరకు మందులు వాడాల్సి ఉంటుంది.



“బుమ్రాకు కనీసం ఐదు వారాల విశ్రాంతి అవసరం. అందుకే తొలి రెండు వన్డేలకు అతడిని ఎంపిక చేయలేదు. ఆ తర్వాత అతని ఫిట్‌నెస్‌పై స్పష్టత వస్తుంది. కరుణ్ నాయర్ ప్రదర్శన అసాధారణం. అతని గురించి మేం చర్చించాం కూడా. అయితే కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు. ఈ సమయంలో అతనికి జట్టులో చోటు దొరకడం కష్టం. ఎంపిక చేసినవారి అందరి సగటు 40కి పైగానే ఉంది. కాకపోతే ఇలాంటి ప్రదర్శనపై మా దృష్టి ఉంటుంది. బీసీసీఐ తెచ్చిన కొత్త నిబంధనలు జట్టుకు అవసరం. ఇదేమీ స్కూల్ కాదు. శిక్ష కూడా కాదు కానీ... ఒక టీమ్‌గా దేశం తరఫున ఆడుతున్నప్పుడు కొన్ని నిబంధనలు పాటించాలి.

–అజిత్ అగార్కర్, సెలక్షన్ కమిటీ చైర్మన్

‘చాంపియన్స్’ పోరుకు సిద్ధం

15 మంది సభ్యుల భారత జట్టు ప్రకటన



రోహిత్ శర్మ నాయకత్వంలో భారత జట్టు మరో ఐసీసీ వన్డే సమరానికి సన్నద్ధమైంది. వరల్డ్ కప్‌లో ఫైనల్ చేరిన టీమిండియాలోని ప్రధాన ఆటగాళ్లంతా ఇప్పుడు ఈ పోరులోనూ జట్టులో భాగం కానున్నారు. స్వల్ప మార్పులు మినహా ఎలాంటి అనూహ్య, సంచలనాలు లేకుండా చాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టు ఎంపిక జరిగింది. ప్రధాన పేసర్ బుమ్రా ఫిట్‌నెస్‌పై కాస్త సందేహాలు ఉన్నా...అతడిని టీమ్‌లోకి తీసుకోగా, వరల్డ్ కప్‌లో అత్యధిక వికెట్లతో చెలరేగిన షమీ కూడా మరో ఐసీసీ పోరుకు రెడీ అంటున్నాడు. నలుగురు ఆల్‌రౌండర్లను జట్టులోకి తీసుకోవడంతో హైదరాబాదీ పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ తన స్థానాన్ని కోల్పోవాల్సి రాగా... ఇప్పటికే తనను తాను నిరూపించుకున్న జైస్వాల్ తొలిసారి వన్డే టీమ్‌లోకి వచ్చాడు. ఓవరాల్‌గా ఈ 15 మంది సభ్యుల బృందానికి టైటిల్ సాధించే సత్తా ఉందని సెలక్షన్ కమిటీ నమ్ముతోంది.

కుల్దీప్ యాదవ్ పునరాగమనం ● జైస్వాల్‌కు తొలిసారి వన్డేల్లో అవకాశం ● సిరాజ్‌పై వేటు... అందుబాటులో బుమ్రా

ముంబై: ఐసీసీ వన్డే టోర్నీ చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే భారత జట్టును అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శనివారం ప్రకటించింది. దానికి ముందు స్వదేశంలో ఇంగ్లండ్‌తో మూడు వన్డేల్లో కూడా ఇదే జట్టు తలపడుతుంది. ఇటీవల ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ ముగిసిన తర్వాత రోహిత్ కెప్టెన్సీపై చర్చ జరిగినా...2023 వన్డే వరల్డ్‌కప్‌లో జట్టును ఫైనల్ చేర్చిన అతని నాయకత్వంపై సెలక్టర్లు పూర్తి విశ్వాసం ఉంచారు. భారత జట్టు ‘సంధి దశ’లో ఉందని వినిపించినా...వన్డేల్లో దానికి ఇంకా సమయం ఉందని తాజా ఎంపికతో అర్థమైంది. వరల్డ్‌కప్‌లో రాణించిన ప్రధాన ఆటగాళ్లందరినీ ఎలాంటి సందేహాలు లేకుండా టీమ్‌లోకి తీసుకున్నారు. బహుశా ఈ టోర్నీ తర్వాత 2027 వరల్డ్ కప్ కోసం మార్పులు జరగవచ్చు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుంటూ శుబ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. గత ఏడాది ఆగస్టులో శ్రీలంకతో సిరీస్ తర్వాత భారత్ మళ్లీ ఇప్పుడే వన్డేల్లో బరిలోకి దిగుతోంది. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా గ్రూప్ ‘ఎ’లో ఫిబ్రవరి 20, 23, మార్చి 2న వరుసగా బంగ్లాదేశ్, పాకిస్తాన్, న్యూజిలాండ్‌లతో భారత్ తలపడుతుంది. పాకిస్తాన్ వెళ్లేందుకు నిరాకరించిన టీమిండియా తమ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లోనే ఆడుతుంది.

రెండు వన్డేలకు హర్షిత్...

ఫిట్‌నెస్‌పై సందేహాలు ఉన్నా...ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఈ మెగా టోర్నీ కోసం ఎంపిక చేశారు. అయితే ఇంగ్లండ్‌తో తొలి రెండు వన్డేల సమయానికి అతను పూర్తిగా కోలుకునే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా ఢిల్లీ పేసర్ హర్షిత్ రాణాకు చోటు కల్పించారు. ఆసీస్ పర్యటనలో హర్షిత్ 2 టెస్టులు ఆడాడు. స్పోర్ట్స్ హెర్నియా గాయంతో కివీస్‌తో తొలి టెస్టు తర్వాత ఆటకు దూరమైన స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు కూడా టీమ్‌లో స్థానం లభించింది. గాయంనుంచి కోలుకున్న తర్వాత అతను ఏ స్థాయిలోనూ మ్యాచ్ ఆడకపోయినా...జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో పెద్ద సంఖ్యలో ఓవర్లు బౌలింగ్ చేస్తుండటంతో ఫిట్‌నెస్‌పై స్పష్టత వచ్చింది. ఫిట్‌గా మారి ఇంగ్లండ్‌తో టి20 సిరీస్‌కు ఎంపికైన సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీకి ఊహించిన విధంగానే వన్డే టీమ్‌లోనూ స్థానం దక్కింది. టీమిండియా తరఫున ఇప్పటికే టెస్టుల్లో చెలరేగి...టి20 ఫార్మాట్‌లోనూ పదునైన ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్న ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు తొలిసారి వన్డే టీమ్‌లో అవకాశం దక్కింది. వరల్డ్ కప్ తరహాలోనే వరుసగా రోహిత్, గిల్, కోహ్లి, శ్రేయస్, రాహుల్ టాప్–5లో ఉంటారు.

నలుగురు ఆల్‌రౌండర్లు...

సెలక్టర్లు ఒక ప్రధాన బౌలర్‌ను తగ్గించి మరీ ఆల్‌రౌండర్లపై దృష్టి పెట్టారు. హార్దిక్ పాండ్యా ఒక్కడే పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ కాగా... ముగ్గురు స్పిన్ ఆల్‌రౌండర్లు జడేజా, అక్షర్, సుందర్‌లకు స్థానం లభించింది. ఈ ముగ్గురూ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లే కాగా, పాండ్యాతో కలిపి భారత టాప్–6 రైట్ హ్యాండర్లే ఉన్నారు. జట్టులో ముగ్గురే ప్రధాన పేసర్లు ఉన్నారు. వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్‌కే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చినట్లుగా భావించవచ్చు. వన్డేల్లో ఎప్పుడూ రెగ్యులర్‌గా చోటు దక్కించుకోకపోయినా, పెద్దగా ప్రభావం చూపని రిషభ్ పంత్‌ను రెండో కీపర్‌గా ఎంపిక చేశారు. తాను ఆడిన చివరి వన్డేలో సెంచరీ సాధించినా సరే... సంజు సామ్సన్‌పై సెలక్టర్లు నమ్మకం ఉంచలేదు. కేరళ అసోసియేషన్‌తో వివాదం కారణంగా విజయ్‌హజారే ట్రోఫీకి సామ్సన్ దూరం కావడం కూడా సెలక్షన్‌పై ప్రభావం చూపించి ఉండవచ్చు.

సిరాజ్‌లో పదును తగ్గిందా!



2023 నుంచి చూస్తే 28 మ్యాచ్‌లలో 22.7 సగటుతో 47 వికెట్లు పడగొట్టాడు. అతని ఎకానమీ కూడా చాలా మెరుగ్గా (5.41) ఉంది. ఎలా చూసినా ఇది చెప్పుకోదగ్గ ప్రదర్శనే. సిరాజ్ చాలా వరకు నిలకడగా రాణించాడు. అతను మరీ ఘోరంగా విఫలమైన మ్యాచ్‌లు కూడా అరుదు. అయినా సరే...నలుగురు స్పిన్నర్లతో ఆడాలనే టీమిండియా ప్రణాళికల కారణంగా అతనికి చోటు దక్కలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ మాటల్లో చెప్పాలంటే ఆరంభ ఓవర్లలో కొత్త బంతితో చెలరేగినంతగా సిరాజ్ చివర్లో ఆకట్టుకోలేకపోతున్నాడు. బంతి పాతబడిన కొద్దీ అతని ప్రభావం తగ్గుతోంది. ఇప్పటికే టి20ల్లో తనను తాను నిరూపించుకోవడంతో పాటు దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో కూడా ఆకట్టుకున్న అర్‌్షదీప్ సింగ్‌పై సెలక్టర్లు నమ్మకముంచారు. ఎడమచేతి వాటం బౌలర్ కావడం అతనికి మరో అదనపు అర్హతగా మారింది. ‘ఆరంభంలో, చివర్లో కూడా బాగా బౌలింగ్ చేయగలిగే ఆటగాడు మాకు కావాలి. కొత్త బంతితో షమీ ఏం చేయగలడో అందరికీ తెలుసు. చివర్లో ఆ బాధ్యత అర్‌్షదీప్ తీసుకోగలడు. సరిగ్గా ఇక్కడే సిరాజ్ ప్రభావం తగ్గుతూ వస్తోంది. అతను కొత్త బంతితో తప్ప చివర్లో ఆశించిన ప్రదర్శన ఇవ్వడం లేదు. దీనిపై మేం చాలా సుదీర్ఘంగా చర్చించాం. ఆల్‌రౌండర్లు కావాలి కాబట్టి ముగ్గురు పేసర్లనే తీసుకున్నాం. సిరాజ్ లేకపోవడం దురదృష్టకరమే కానీ కొన్ని రకాల బాధ్యతల కోసం కొందరిని తీసుకొని మరికొందరిని పక్కన పెట్టక తప్పదు’ అని రోహిత్ వివరించాడు.

చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు

రోహిత్ శర్మ (కెప్టెన్), శుబ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్‌్షదీప్ సింగ్, మొహమ్మద్ షమీ.

‘బోర్డు కార్యదర్శితో మాట్లాడాలి’

క్రికెటర్ల కోసం బీసీసీఐ కొత్తగా రూపొందించిన మార్గదర్శకాల విషయంలో ఆటగాళ్ల అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా కుటుంబ సభ్యులను అనుమతించే విషయంపై మరికొంత సడలింపును వారు కోరుతున్నారు. ఇదే మాట మీడియా సమావేశంలో రోహిత్ నోటినుంచి వచ్చింది. ఇది నేరుగా రోహిత్ మీడియాతో చెప్పకపోయినా... అగార్కర్‌కు చెబుతుండటం అందరికీ వినిపించింది. ‘కొత్త నిబంధనలపై మరింత స్పష్టత కావాలి.ఈ సమావేశం తర్వాత నేను బోర్డు కార్యదర్శితో కూర్చొని మాట్లాడాల్సి ఉంటుంది. ఎందుకంటే అందరూ నన్నే అడుగుతున్నారు’ అని అగార్కర్‌తో రోహిత్ అన్నాడు. మరో వైపు తనకు, హెడ్ కోచ్ గంభీర్‌కు మధ్య పరస్పర నమ్మకం ఉన్నాయని రోహిత్ స్పష్టం చేశాడు. మైదానంలోకి దిగడానికి ముందే తమ మధ్య వ్యూహాలకు సంబంధించిన చర్చ జరుగుతుందని... ఒక్కసారి మైదానంలోకి దిగిన తర్వాత అన్నీ తానే చూసుకుంటానని కెప్టెన్ వెల్లడించాడు. ఈ విషయంలో తమకు స్పష్టమైన విభజన రేఖ ఉందని రోహిత్ వ్యాఖ్యానించాడు.

రంజీ మ్యాచ్ ఆడనున్న రోహిత్.. కోహ్లి, రాహుల్ దూరం

ముంబై రంజీ జట్టు తరఫున తాను తర్వాతి మ్యాచ్ బరిలోకి దిగనున్నట్లు భారత కెప్టెన్ రోహిత్ శర్మ స్వయంగా వెల్లడించాడు. ఈ నెల 23నుంచి ముంబైలోనే జమ్ము కశ్మీర్‌తో జరిగే పోరులో అతను ఆడతాడు. గత 6–7 ఏళ్లలో తాము అంతర్జాతీయ క్రికెట్‌లో బిజీగా ఉండటం వల్ల దేశవాళీ మ్యాచ్‌లు ఆడలేకపోయామని, రంజీ ట్రోఫీ స్థాయిని తక్కువ చేయలేమని అతను అభిప్రాయపడ్డాడు. మరో వైపు మెడ నొప్పితో బాధపడుతున్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి... తాను ఢిల్లీ తరఫున రంజీ మ్యాచ్ ఆడలేనని స్పష్టం చేయగా... మోచేతి గాయంతో కేఎల్ రాహుల్ (కర్ణాటక) కూడా రంజీ పోరుకు దూరమయ్యాడు.

ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫలితాలు
విజయ్ హజారే వన్డే టోర్నీ విజేత కర్ణాటక
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

థ్రిల్లింగ్ ఐడెంటిటీ

టొవినో థామస్, త్రిష, వినయ్ రాయ్, మందిరా బేడి ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ యాక్షన్ థ్రిల్లర్ మూవీ ‘ఐడెంటిటీ’. దర్శక ద్వయం అఖిల్ బాయ్, అనాస్ ఖాన్ ఈ మూవీని తెరకెక్కించారు. రాజు మల్లియాత్, రాయ్ సిజె నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 2న మలయాళంలో రిలీజైంది. ఈ సినిమాకు మలయాళ ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ లభిస్తోందని చిత్రయూనిట్ పేర్కొంది. కాగా ఈ సినిమా అదే టైటిల్‌తో తెలుగులో ఈ నెల 24న విడుదల కానుంది. మూవీ మాక్స్ శ్రీనివాస్ మామిడాల సమర్పణలో శ్రీ వేదాక్షర మూవీస్ చింతపల్లి రామారావు ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ‘‘ఉత్కంఠగా సాగే ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీ ప్రేక్షకులను ఆకట్టు కునేలా ఉంటుంది’’ అని యూనిట్ పేర్కొంది.



● బాబీ, ప్రగ్యా జైస్వాల్, బాలకృష్ణ, శ్రద్ధా శ్రీనాథ్, తమన్, వేద అగర్వాల్, సూర్యదేవర నాగవంశీ


తెలుగు సినిమా స్థాయి పెరిగింది

- బాలకృష్ణ

‘‘ఇతర దేశస్తులు కూడా మన సినిమాలను చూసి, ప్రశంసించే స్థాయికి తెలుగు చలన చిత్రసీమ ఎదిగింది. తెలుగు సినిమా స్థాయి పెరిగింది. తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ కొత్తదనాన్ని ఆదరిస్తారు. ‘డాకు మహారాజ్’ విజయంతో ఇది మరోసారి రుజువైంది’’ అని బాలకృష్ణ అన్నారు. ఆయన టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం ‘డాకు మహారాజ్’. ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 12న రిలీజ్ అయింది. రిలీజైన ఐదు రోజుల్లోనే రూ. 114 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్‌తో ‘డాకు మహారాజ్’ సూపర్ హిట్‌గా ప్రదర్శితమవుతోందని చిత్రబృందం పేర్కొంది. హైదరాబాద్‌లో జరిగిన సక్సెస్‌మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ‘‘ప్రతి సినిమాని ఓ చాలెంజ్‌గా తీసుకుని చేస్తాను. వరుసగా ఇది నాకు నాలుగో (‘అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి, డాకు మహారాజ్’) విజయం. ప్రతి నటుడి నుంచి అందమైన హావభావాలను రాబట్టుకోగలిగాడు బాబీ. తమన్ ఇంటి పేరును అభిమానులు మార్చేశారు. నేనైతే ఎన్‌బీకే తమన్ అని నామకరణం చేస్తున్నాను. అన్ని క్రాఫ్ట్స్‌పై అవగాహన ఉన్న నాగవంశీ నా అభిమాని కావడం నాకు గర్వంగా ఉంది’’ అని మాట్లాడారు. ‘‘బాలకృష్ణగారి ఫిల్మోగ్రఫీలో గుర్తుండిపోయే సినిమాలా ‘డాకు మహారాజ్’ ఉండాలని మొదలుపెట్టాం. డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ మూడు రోజుల్లోనే డబ్బులు రావడం చాలా ఆనందంగా ఉంది. ఓ దర్శకుడికి ఇంతకన్నా ఆనందం మరొకటి ఉండదు’’ అన్నారు దర్శకుడు బాబీ. ‘‘జనవరి 12న ‘డాకు మహారాజ్’ విడుదలైతే, సంక్రాంతి పండగ రోజుకే మా డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్‌కి వెళ్లిపోయారు. డిస్ట్రిబ్యూటర్లకు డబ్బులు వచ్చినప్పుడే నిర్మాతలకు నిజమైన ఆనందం’’ అని పేర్కొన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ.



● శ్రీలీల, నితిన్



● త్రిష

రాబిన్‌హుడ్ డేట్ ఫిక్స్

‘భీష్మ’ వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ‘రాబిన్‌హుడ్’. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ సినిమాను మార్చి 28న రిలీజ్ చేయనున్నట్లుగా శనివారం చిత్ర యూనిట్ ప్రకటించింది. ‘‘ఈ మూవీలో నితిన్ క్యారెక్టరైజేషన్ కొత్తగా ఉంటుంది. ఈ సినిమా కోసం కేతికా శర్మ చేసిన స్పెషల్ సాంగ్ లిరికల్ వీడియోను అతి త్వరలోనే రిలీజ్ చేస్తాం’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్.

ఆలోచింపజేసేలా మాట్లాడావ్ తమన్

- చిరంజీవి



‘‘మనం పాజిటివ్‌గా ఉంటే ఆ ఎనర్జీ మన జీవితాలని కూడా అంతే పాజిటివ్‌గా ముందుకు నడిపిస్తుంది’’ అంటూ ‘ఎక్స్’లో ఓ పోస్టును షేర్ చేసి, మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాటలు తన హృదయాన్ని తాకేలా ఉన్నాయని పేర్కొన్నారు చిరంజీవి. సోషల్ మీడియాలో పెరిగిపోతున్న నెగటివిటీ గురించి ‘డాకు మహారాజ్’ సక్సెస్‌మీట్‌లో మాట్లాడారు తమన్. నెగటివ్ ట్రోల్స్, నెగటివ్ ట్రెండ్స్ సినిమాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, నిర్మాతలు కుమిలిపోతున్నారని, మన సినిమాలను మనమే చంపేసుకోవడం కరెక్ట్ కాదన్నట్లు తమన్ చెప్పుకొచ్చారు. ఈ విషయంపై ‘ఎక్స్’ వేదికగా స్పందించారు చిరంజీవి. ‘‘డియర్ తమన్... ఎప్పుడూ సరదాగా మాట్లాడుతూ ఉండే నీలో ఇంత ఆవేదన ఉండటం నాకు ఆశ్చర్యంగా అనిపించింది. కానీ మనసు ఎంత కలత చెందితే నువ్వింతగా స్పందించావో అనిపించింది. సినిమా అయినా, క్రికెట్ అయినా, మరొక సామాజిక సమస్య అయినా... సోషల్ మీడియా వాడుతున్న ప్రతి ఒక్కరూ తమ మాటల తాలూకు ప్రభావం ఆ వ్యక్తుల మీద ఎలా ఉంటుందని ఆలోచించుకోవాలి. ఎవరో అన్నట్టు మాటలు ఫ్రీనే, ఆ మాటలు స్ఫూర్తిని నింపవచ్చు... ఆ మాటలు నాశనం కూడా చేయవచ్చు. నీకు ఏది కావాలో అది తీసుకో. ఆలోజింపజేసే మాటలు మాట్లాడావు మై డియర్ (తమన్‌ను ఉద్దేశిస్తూ..)’’ అంటూ ‘ఎక్స్’లో షేర్ చేశారు చిరంజీవి.

మీ మాటలు జీవితాంతం గుర్తుంటాయి: ‘‘డియర్ అన్నయ్యా (చిరంజీవిని ఉద్దేశించి)... మీ మాటలు నాకు కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన...’. అన్న భగవద్గీత శ్లోకాన్ని గుర్తు చేశాయి. మనుషులం కదా... ఒక్కోసారి ఆవేదన గుండె తలుపులు దాటి వచ్చేస్తుంటుంది. పేగు తెంచుకుని పుట్టిన బిడ్డని కళ్లు తెరిచే లోపలే చిదిమేస్తుంటే వచ్చిన బాధ అది. మీ మాటలు నాకు జీవితాంతం గుర్తుంటాయి’’ అని ‘ఎక్స్’ వేదికగా తమన్ స్పందించారు.

కోపంగా చూడకే కొట్టినట్టు...



● రుక్సర్ థిల్లాన్, కిరణ్ అబ్బవరం

‘అగ్గిపుల్లే అలా గీసినట్టు... కోపంగా చూడకే కొట్టినట్టు, గాలి దుమారమే రేగినట్టు...’ అంటూ మొదలవుతుంది ‘దిల్ రూబా’ సినిమాలోని ‘అగ్గిపుల్లే...’ పాట లిరికల్ వీడియో. కిరణ్ అబ్బవరం, రుక్సర్ థిల్లాన్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ఇది. విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారె గమ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. ఈ సినిమాలోని ‘అగ్గి పుల్లే అలా..’ పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. భాస్కరభట్ల లిరిక్స్ అందించిన ఈ మెలోడీ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్.

న్యాయం కోసం...

ప్రియదర్శి హీరోగా, శివాజీ, సాయి కుమార్, రోహిణి, హర్షవర్ధన్, హర్ష్ రోషన్, శ్రీ దేవి ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘కోర్ట్ – స్టేట్ వర్సెస్ ఎ నోబడీ’. రామ్ జగదీష్ దర్శకత్వంలో నాని సమర్పణలో వాల్ పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి త్రిపిర్నేని ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో లాయర్‌గా ప్రియదర్శి నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. శనివారం ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేయడంతో పాటు ఈ చిత్రాన్ని మార్చి 14న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ‘‘ఆరోపణల్లో చిక్కుకున్న ఓ అబ్బాయి చుట్టూ ఈ సినిమా కథనం ఉంటుంది. బలమైన కథాంశంతో, న్యాయ వ్యవస్థలో న్యాయం, న్యాయం కోసం అన్వేషణ వంటి అంశాలను గురించి కీలకమైన ప్రశ్నలను లేవనెత్తేలా ఈ సినిమా ఉంటుంది’’ అని చిత్రబృందం పేర్కొంది.



● ప్రియదర్శి

రెట్టింపు వినోదం



● ‘మ్యాడ్ స్క్వేర్’లో...

సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ‘మ్యాడ్ స్క్వేర్’. ఈ కాంబినేషన్‌లోనే రూపొందిన హిట్ ఫిల్మ్ ‘మ్యాడ్ (2023)’కు సీక్వెల్‌గా ‘మ్యాడ్ స్క్వేర్’ రూపొందుతోంది. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. తొలి భాగానికి కూడా వీరే నిర్మాతలనే సంగతి తెలిసిందే. ఇక ఈ సినిమాను మార్చి 29న రిలీజ్ చేయనున్నట్లుగా ప్రకటించారు. ‘‘ప్రేక్షకులు ఊహించినదానికంటే రెట్టింపు వినోదం ఈ సినిమాలో ఉంటుంది’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

షూటర్ వస్తున్నాడు



● రవిబాబు

రవిబాబు, ఎస్తేర్, ఆమని, రాశి, సుమన్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘షూటర్’. శ్రీ వెంకట సాయి బ్యానర్‌పై శెట్టిపల్లి శ్రీనివాసులు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 22న విడుదల కానుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. శెట్టిపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ– ‘‘విభిన్న కథతో ‘షూటర్’ని తెరకెక్కించాం. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలతో మా సినిమా ఉంటుంది. శ్రీలక్ష్మీ పిక్చర్స్ బాపిరాజుగారు మా మూవీని రిలీజ్ చేస్తున్నారు’’ అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: డ్రమ్స్ రాంబాబు, కెమేరా: డి. యాదగిరి.

కథలో లీనమైపోతారు

- దర్శకుడు ముత్యాల సుబ్బయ్య

‘‘**త**ల్లికి ఎన్ని నిర్వచనాలు ఇచ్చినా సరిపోవు. ఆ గొప్పదనాన్ని మాటల్లో చెప్పలేం. అలాంటి తల్లి పాత్ర చుట్టూ తిరిగే కథతో రూపొందించిన చిత్రం ‘తల్లి మనసు’. ఈ కథలో, పాత్రల్లో ప్రేక్షకులు లీనమయ్యే విధంగా సినిమా ఉంటుంది’’ అని ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య అన్నారు. ముత్యాల సుబయ్య సమర్పణలో ఆయన పెద్ద కుమారుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మించిన చిత్రం ‘తల్లి మనసు’. రచితా మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్ వర్మ, సాహిత్య ముఖ్య పాత్రల్లో వి. శ్రీనివాస్ (సిప్పీ) దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 24న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రచితా మహాలక్ష్మి మాట్లాడుతూ– ‘‘ఈ చిత్రంలో తల్లి పాత్ర చేసే చాన్స్ నాకు రావడం నా అదృష్టం. ఈ పాత్రకు ప్రముఖ హీరోయిన్లను అడగ్గా, కొడుకు పాత్ర ఉన్నందువల్ల వారు అంగీకరించలేదు. కెరీర్‌లో గుర్తుండిపోయే ఈ పాత్రలో మంచి నటన కనబరిచే అవకాశం నాకు దక్కింది’’ అన్నారు. ‘‘ఓ తల్లి ఎలాంటి సంఘర్షణలకు గురైందనే అంశానికి భావోద్వేగం, వినోదం వంటి వాటిని మేళవించి ఈ సినిమా తీశాం’’ అన్నారు వి. శ్రీనివాస్ (సిప్పీ).



● వి. శ్రీనివాస్, ముత్యాల సుబ్బయ్య, రచిత, అనంత కిశోర్

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

కాంకేర్ ఎన్‌కౌంటర్‌లో బడే దామోదర్ మృతి

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్– మారేడుపాక అడవుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ తెలంగాణ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మృతి చెందారు.

ఆయనతోపాటు మరో 17 మంది మావోయిస్టులు కూడా చనిపోయారు. దీనితో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య 18కి చేరింది. ఇందులో దామోదర్ మృతి చెందిన విషయాన్ని మావోయిస్టు పార్టీ నిర్ధారించింది. ఈ మేరకు సీపీఐ (మావోయిస్టు) పార్టీ సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీ కార్యదర్శి గంగానది పేరిట శనివారం సాయంత్రం లేఖ విడుదలైంది. సుమారు మూడు దశాబ్దాలుగా ఉద్యమంలో ఉన్న బడే దామోదర్ తోపాటు 17 మంది ఒకేసారి మృతి చెందడం మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే బడే దామోదర్ మృతి చెందినట్లు మావోయిస్టుల లేఖ విడుదలైనా.. అటు ఛత్తీస్‌గఢ్, ఇటు తెలంగాణ పోలీసులు అధికారికంగా దామోదర్ పేరును వెల్లడించలేదు. ఆయన మృతిపై కచ్చితమైన సమాచారమేదీ లేదని, నిర్ధారించుకోవాల్సి ఉందని ఆయన కుటుంబ సభ్యులు, సమీప బంధువులు, కాల్వపల్లి గ్రామస్తులు చెబుతున్నారు.



బడే దామోదర్ అలియాస్ చొక్కారావు (ఫైల్)



ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లిలోని బడే దామోదర్ ఇల్లు

ప్రకటించిన మావోయిస్టు పార్టీ సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీ..

- హరిభూషణ్ తర్వాత మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు
- ములుగు జిల్లా కాల్వపల్లికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌గా గుర్తింపు
- ముగిసిన మూడు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానం.. మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ

పెద్ద నేతలంతా దూరమై..

మావోయిస్టు పార్టీలో కీలకంగా వ్యవహరించిన పెద్ద నేతల్లో చాలా మంది దూరమైపోయారు. అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ, హరిభూషణ్ అనారోగ్యంతో మరణించారు. ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ ప్రహ్లాద్, నల్లా ఆదిరెడ్డి అలియాస్ శ్యాం, బుర్ర చిన్నన్న, పులి అంజయ్య, కటకం సుదర్శన్.. ఇలా ఎందరో ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. జంపన్న జనజీవన స్రవంతిలో కలిశారు.

అంచెలంచెలుగా ఎదిగి..

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన బడే దామోదర్.. తనకు సోదరుడయ్యే బడే నాగేశ్వర్‌రావు స్ఫూర్తితో మావోయిస్టు పార్టీలో చేరారు. మూడు దశాబ్దాలుగా ఉద్యమంలో కొనసాగారు. తొలుత ఏటూరునాగారం–ములుగు ఏరియాలలో చాలాకాలం వివిధ హోదాల్లో పనిచేశారు. యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అయ్యాక.. జయశంకర్ భూపాలపల్లి– మహబూబాబాద్– వరంగల్– పెద్దపల్లి (జేఎండబ్ల్యూపీ) డివిజన్ కమిటీ కార్యదర్శిగా బడే దామోదర్ నియమితులయ్యారు. బడే దామోదర్ అలియాస్ బడే చొక్కారావుగా గుర్తింపు పొందారు. 2021లో కరోనాతో హరిభూషణ్ మృతి చెందారు. ఆ సమయంలో తీవ్ర నిర్బంధాన్ని గుర్తించిన మావోయిస్టు పార్టీ... కరీంనగర్, ఖమ్మం, వరంగల్ (కేకేడబ్ల్యూ) కమిటీ, జేఎండబ్ల్యూపీ కమిటీలను ఎత్తివేసింది. హరిభూషణ్ స్థానంలో దామోదర్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. ఎన్నో కీలక ఆపరేషన్లలో పనిచేసిన బడే దామోదర్‌పై పోలీసులు రూ.50 లక్షల రివార్డు కూడా ప్రకటించారు. తాజాగా ఆయన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.

వనరుల దోపిడీ, గిరిజనుల నిర్మూలనే లక్ష్యం: మావోయిస్టుల లేఖ

కాంకేర్ ఎన్‌కౌంటర్ మృతులపై మావోయిస్టు పార్టీ స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు సీపీఐ (మావోయిస్టు) పార్టీ సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీ కార్యదర్శి గంగానది పేరిట శనివారం లేఖ విడుదలైంది. లేఖలోని వివరాలు.. ''కామ్రేడ్ దామోదర్ (ఎస్‌సీఎం), హంగో (పీసీఎం), దేవే (పీపీసీఎం) జోగా(పీపీసీఎం), నరసింహారావు (పీపీసీఎం)లు, ఇతర కామ్రేడ్లకు లాంగ్ లివ్. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల పూజారి కాంకేర్ ప్రాంతంలో క్రూరమైన, అమానవీయ అణచివేత ప్రారంభించాయి. బస్తర్ సహజ వనరులను దోచుకోవడం, అడవుల నుంచి గిరిజనులను నిర్మూలించడమే వారి లక్ష్యం. ఈ ఆపరేషన్‌లో మా సంస్థ 18 మంది వీర సహచరులను కోల్పోయింది. వారు తమ చివరి శ్వాస వరకు పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. ముఖ్యంగా కామ్రేడ్ బడే చొక్కారావు (దామోదర్) ధైర్యసాహసాలను ప్రదర్శించి, పోరాడుతూ అమరుడయ్యాడు. ఆయన మరణం సంస్థకు కోలుకోలేని నష్టాన్ని కలిగించింది. అయితే ఆయన విప్లవాత్మక వారసత్వం వేలాది మంది కొత్త సహచరులకు స్ఫూర్తినిస్తుంది. మా ప్రతి చర్యలో పోలీసులు భారీ నష్టాలను చవిచూశారు. పోలీసులు తమ వైఫల్యాన్ని దాచిపెట్టడానికి అమాయక గ్రామస్తులను హింసించారు. అత్యాధునిక ఆయుధాలతో మాకు వ్యతిరేకంగా వచ్చారు. కానీ మా విప్లవ శక్తులు వారికి గట్టి సమాధానమిచ్చాయి. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ఈ అమానవీయ దురాగతాలను బహిర్గతం చేయాలని అభ్యుదయ మేధావులు, పాత్రికేయులు, మానవ హక్కుల కార్యకర్తలు, ప్రజా సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నాం'' అని లేఖలో పేర్కొన్నారు.

ఎన్‌కౌంటర్ పేరిట హత్యలను ఆపాలి

– పౌరహక్కుల సంఘం

సాక్షి, హైదరాబాద్: ఎన్‌కౌంటర్ల పేరుతో ప్రభుత్వాలు చేస్తున్న హత్యలను వెంటనే ఆపాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం లక్ష్మణ్, ఎస్.నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి జరుగుతున్న ఎన్‌కౌంటర్‌లో పోలీసు బలగాలతో పాటు డ్రోన్ బాంబులు కూడా వాడినట్లు స్పష్టమైందన్నారు. 2021 నుంచి డ్రోన్ బాంబులు, యుద్ధ హెలీకాప్టర్లు, మెషిన్‌గన్‌లను వినియోగించి ఫైరింగ్ చేసిన ఘటనలను ఇప్పటికే నిజనిర్ధారణ చేసి విషయాలు బయటికి చెప్పినప్పటికీ ప్రభుత్వాలు వాటిని ఆపకుండా కొనసాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ మావోయిస్టు పార్టీ కార్యదర్శి బడే చొక్కారావు చనిపోయాడని ఆ పార్టీ ఇచ్చిన ప్రకటనలో తెలిసిందన్నారు. ఇప్పటికైనా ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, ఉద్యమకారులు, ఆదివాసులను ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు చేయొద్దని కోరారు. చొక్కారావును ముమ్మాటికీ హత్య చేసినట్లుగానే భావిస్తున్నామని, ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు.

ముగిసిన బీసీ కులాల పేర్ల మార్పు అభ్యంతరాల స్వీకరణ

8 కులాలు.. 500లకు పైగా అభ్యంతరాలు ● గడువు పూర్తి.. బీసీ కమిషన్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన సామాజిక తరగతుల్లోని ఎనిమిది కులాల పేర్ల మార్పునకు సంబంధించి అభ్యంతరాల స్వీకరణ శనివారంతో ముగిసింది. ఆయా కులాల పేర్లను తిట్టు రూపంలో వాడటం ఇబ్బందికరంగా ఉందంటూ తెలంగాణ బీసీ కమిషన్‌కు క్షేత్రస్థాయి నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు, వినతులు అందాయి. ఈ అంశంపై స్పందించిన బీసీ కమిషన్ ఆయా కులాల పేర్ల మార్పు కోసం నోటిఫికేషన్ ఇచ్చింది. ఆయా కులాల నుంచి అభ్యంతరాలు సమర్పించేందుకు 15 రోజుల పాటు సమయం ఇచ్చింది. ఇందులో భాగంగా ఈనెల 18వ తేదీతో అభ్యంతరాల స్వీకరణ గడువు ముగియగా.. 500లకు పైబడి అభ్యంతరాలు అఫిడవిట్ రూపంలో వచ్చినట్లు తెలంగాణ బీసీ కమిషన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వీటిని క్షుణ్ణంగా పరిశీలిస్తామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. కులాల సంస్కృతికి భంగం కలగకుండా తిట్టు పదాలతో కూడుకుని ఉన్న వాటి పేర్లు మార్పు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లో ఆయా కులాలకు చెందిన విద్యార్థులు, యువత, ఉద్యోగులు ఎలాంటి న్యూనతాభావానికి గురికాకుండా కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. బూంజువ కులం విషయంలో జిల్లాల పరిమితులను ఎత్తివేయాలని, గొర్రెలు, మేకలు పెంపకం కుల వృత్తిగా గల ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని ధన్వర్ అనే కులం వారిని బీసీ జాబితాలో చేర్చాలని ఆయా కులాల చెందిన ప్రతినిధులు బీసీ కమిషన్‌కు వేర్వేరుగా వినతులు సమర్పించారు. సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, సతీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సహకార శాఖలో పదోన్నతులు: తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సహకార శాఖలో పదోన్నతుల ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తామని వ్యవసాయ, సహకార శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. వాస్తవానికి సంక్రాంతి పండుగలోపే పదోన్నతులు చేపట్టాలని గతంలో ఆదేశించానని గుర్తుచేశారు. సమస్యలను అధిగమించి వేగంగా పదోన్నతులు ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర సహకార శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం డైరీ, కేలండర్‌ను తుమ్మల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరాన్ని సహకార సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి గుర్తించిందన్నారు. సంఘాల ఆడిట్, ఎలక్షన్స్ తదితర చట్టబద్ధమైన విధులను నిబంధనల ప్రకారం సకాలంలో పూర్తి చేసే బాధ్యత సహకార శాఖపైనే ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలంగాణ సహకార శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహన్‌రావు, భీంరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

పదేళ్లపాటు రైతులు గుర్తుకు రాలేదా?: బీఆర్‌ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని రైతులు.. ఇప్పుడా పార్టీ నాయకులకు గుర్తుకొస్తున్నారని మంత్రి తుమ్మల ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలోనే రైతుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా రూ.29,897 కోట్లు ఖర్చు చేసిందని, మద్దతు ధరతో పంటల సేకరణకు, ఉచిత విద్యుత్‌కు మరో రూ.32 వేల కోట్లు వెచ్చించిందని స్పష్టం చేశారు.

ప్రజోపయోగ ప్రాజెక్టులకు సత్వరమే అనుమతులు

డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ జితేంద్ర కుమార్

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు సత్వరమే ఉపయోగపడే ప్రాజెక్టులకు అనుమతులను వెంటనే మంజూరు చేస్తామని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ జితేంద్ర కుమార్ తెలిపారు. ఈ ప్రాధాన్యతలకు సంబంధించిన ప్రాజెక్టుల వివరాలు పూర్తిస్థాయిలో కేంద్రానికి అందజేస్తే అనుమతులు ఇవ్వడంలో జాప్యం ఉండదన్నారు. శనివారం అరణ్య భవన్‌లో రాష్ట్రంలో వివిధ ప్రాజెక్ట్‌లకు అటవీ అనుమతుల పెండింగ్ అంశంపై పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చర్చించారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర అటవీ పర్యావరణశాఖమంత్రి భూపేంద్ర యాదవ్ ను సీఎం రేవంత్ రెడ్డి కలిసి రాష్ట్రంలో వివిధ ప్రాజెక్ట్‌ల కోసం అటవీ అనుమతులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. దీంతో ఆయా అంశాలపై చర్చకు హైదరాబాద్ వెళ్లాల్సిందిగా ఫారెస్ట్స్ డీజీ జితేంద్ర కుమార్‌ను కేంద్ర అటవీ శాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో... హైదరాబాద్‌కు వచ్చిన జితేంద్రకుమార్ ఎక్కడెక్కడ ప్రాజెక్టులు పెండింగులో ఉన్నాయి, అందుకు కారణాలేమిటి అనే విషయాలపై అటవీ, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల విభాగం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డోబ్రియాల్ కేంద్రం వద్ద పెండింగ్లో ఉన్న ప్రాజెక్టుల గురించి వివరించారు. మొత్తం 161 ప్రాజెక్టులు అనుమతుల కోసం పెండింగులో ఉండగా...వాటిలో జాతీయ రహదారులవి 12 ప్రాజెక్టులు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా ఉన్నాయని తెలియజేశారు.

..ఒంటరిగానే పోటీ

▶ మొదటి పేజీ తరువాయి

కిషన్‌రెడ్డి బదులిస్తూ.. 'బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా అయ్యే వారికి ఆరెస్సెస్ బ్యాక్ గ్రౌండ్ ఉండాలని నిబంధన లేదు. బీజేపీ అధ్యక్ష పదవికి రెండు సార్లు క్రియాశీల సభ్యుడు అయి ఉండాలి. అయితే ఈటల రాజేందర్ ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచారు. ఆ నిబంధన ఆయనకు వర్తించదు. బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్‌ను నేతల ఏకాభిప్రాయంతో ఎంపిక చేస్తారు. నామినేషన్ పద్ధతిలో వారం తర్వాత కొత్త అధ్యక్షుడిని ప్రకటిస్తారు'అని తెలిపారు. మూడు ఎమ్మెల్సీ సీట్లకు జరగనున్న ఎన్నికల్లో అన్నింటిలోనూ గెలుస్తామనే నమ్మకం తమకుందన్నారు. 'రాష్ట్రంలో పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయంటున్నారు కదా'అన్న ప్రశ్నకు.. ఎన్నికలు ఉంటాయంటున్న కేటీఆర్, సుప్రీంకోర్టు జడ్జి కూడా అయినట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు. సినీహీరో చిరంజీవి బీజేపీలో చేరతారా? అన్న ప్రశ్నకు.. 'నా ఆహ్వానం మేరకు ఇటీవల ఆయన ఢిల్లీకి వచ్చారు, అనేక మంది సినీ ప్రముఖులకు బీజేపీతో స్నేహ సంబంధాలు ఉన్నాయి. కొందరు పార్టీలో చేరారు. మంత్రులు అయ్యారు. కొందరు పార్టీకి ప్రచారం చేశారు. ఇకపై ఏవైనా ఫంక్షన్లకు నేను పిలిస్తే వస్తారంటే నాగార్జున, వెంకటేశ్, ఇతర హీరోలను కూడా పిలుస్తాను'అని కిషన్‌రెడ్డి బదులిచ్చారు.

ఉచితాలు వద్దని ఎక్కడా చెప్పలేదు..

'బీజేపీ ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు, ఉచితాల (ఫ్రీ బీస్)కు వ్యతిరేకం కాదు. ఉచితాలు వద్దు అని బీజేపీ ఎక్కడా చెప్పలేదు. రాష్ట్ర ఆదాయ వనరులు చూసుకొని హామీలివ్వాలి'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 'రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఏపీకి నిధులు కేటాయించాం. తెలంగాణలో టెక్స్‌టైల్ పార్క్, జహీరాబాద్ ఇండస్ట్రియల్ పార్క్, రీజినల్ రింగ్ రోడ్ నేనే తెచ్చా. ప్రధానిని ఒప్పించి మహబూబ్‌నగర్ సభలో పసుపు బోర్డు ప్రకటన నేనే చేయించా. మూసీ సుందరీకరణకు కేంద్రం నిధులను నిబంధనల మేరకు కచ్చితంగా ఇస్తాం. హైదరాబాద్ మెట్రోకి రూ.1,250 కోట్లు కేంద్రం ఇచ్చింది. హైదరాబాద్‌లో మెట్రో విస్తరణకు కచ్చితంగా సహకరిస్తాం. రీజినల్ రింగ్ రైల్ సర్వేకు కేంద్రం డబ్బులు ఇచ్చింది. అలైన్‌మెంట్ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే'అని కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. 'తెలంగాణలో బీజేపీని ఓడించడానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఎంఐఎం సహకరిస్తోంది. బీజేపీపై విషం చిమ్మడమే ఎంఐఎం నేతలు పనిగా పెట్టుకున్నారు. దేశంలో ముస్లింనేతగా ఎదగాలన్న ఆశతో ఆ పార్టీనేత అసదుద్దీన్ ఒవైసీ పిట్టల దొరగా మారారు'అని విమర్శించారు.

సింగరేణి ఎకో వనాల విరిబోణి

లోతైన క్వారీలు, ఎత్తైన మట్టి దిబ్బలు, రాకాసి బొగ్గు, దుమ్ము, ధూళి.. సింగరేణి గనులు అనగానే ముందుగా గుర్తొచ్చేది ఇవే.. కానీ ఇప్పుడు అందమైన వనాలు, ఔషధ మొక్కలు, సీతాకోక చిలుకల పార్కులకు సింగరేణి పాత గనులు చిరునామాలుగా మారుతున్నాయి. మైనింగ్‌లో జరిగే నష్టాలను ఆయా సంస్థలే పూరించాలని కేంద్ర పర్యావరణ శాఖ తెచ్చిన నిబంధన మేరకు మూసివేసిన గనుల వద్ద సింగరేణి సంస్థ కొన్నాళ్లుగా భారీగా మొక్కలు నాటి అడవులు పెంచుతోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి అందమైన ఎకో పార్కులను అభివృద్ధి చేయటం మొదలు పెట్టింది. కొత్తగూడెంలో ఎనిమిది హెక్టార్ల విస్తీర్ణంలో ఎకో పార్క్‌ను ఇప్పటికే సిద్ధం చేసింది.

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



బటర్‌ఫ్లై పార్క్ ముఖద్వారం

మూసేసిన గనుల్లో అడ్వెంచర్ పార్కులు

- కొత్తగూడెంలో ఇప్పటికే సిద్ధమైన ఎకో పార్క్
- మిగిలిన ఏరియాల్లోనూ నిర్మాణానికి సన్నాహాలు
- ఎకో టూరిజం అభివృద్ధికి సింగరేణి ప్రోత్సాహం

సింగరేణి ఆధ్వర్యంలో కొత్తగూడెంలో రూ.3 కోట్లతో ఏర్పాటుచేసిన ఎకో పార్క్‌లో బటర్‌ఫ్లై గార్డెన్‌ను ఏర్పాటుచేశారు. ఎడారి, ఔషధ మొక్కలు, తాళ్లవనం (వివిధ దేశాలకు చెందిన తాటి చెట్లు), బోన్సాయ్ వంటి వివిధ దేశాల అరుదైన మొక్కలతో వేర్వేరు థీమ్‌లతో ఈ పార్క్‌ను అభివృద్ధి చేశారు. పార్క్ ప్రాంగణంలోనే సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో రెండు కొలనులు ఉన్నాయి.

అందమైన వనాలు

సందర్శకులు ధ్యానం చేసుకునేందుకు బుద్ధవనం సిద్ధంగా ఉంది. వీటితోపాటు బర్డ్ వాచ్ సెంటర్, వ్యూ పాయింట్, టాయిలెట్లు, కెఫటేరియాలు సిద్ధమయ్యాయి. పట్టణానికి దూరంగా నలువైపులా ఎత్తయిన కొండలు, దట్టంగా పరుచుకున్న చెట్ల నడుమ ఆధునిక సౌకర్యాలతో ఈ ఎకో పార్క్‌ను ఏర్పాటుచేశారు. ఇక్కడికి స్టడీ టూర్ల కోసం విద్యార్థులు వస్తున్నారు.

టూరిజం శాఖకు అప్పగించే యోచన

శ్రీరాంపూర్ ఏరియాలో మరో ఎకో పార్క్ నిర్మాణం జరుగుతోంది. ఈ రెండింటి తరహాలోనే సింగరేణి విస్తరించిన ఆరు జిల్లాల పరిధిలోని 11 ఏరియాల్లో ఎకో పార్క్‌లను రెండుమూడేళ్లలో ఏర్పాటుచేస్తారు. ఆ తర్వాత భవిష్యత్‌లో మూతపడే ప్రతీ గని వద్ద ఇలాంటి పార్కులు నెలకొల్పుతారు. వీటిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చాక టూరిజం శాఖకు అప్పగించే యోచనలో సింగరేణి ఉంది. ఇప్పుడిప్పుడే ఎకో టూరిజం పుంజుకుంటుండటం, ప్రభుత్వం కూడా ఆసక్తిగా ఉండడంతో సింగరేణి సహకారం పర్యాటకరంగానికి మరిన్ని వన్నెలు అద్దనుంది.

మైనింగ్‌పై అవగాహన కల్పించేలా..

ఎకో పార్క్ పక్కనే ఉన్న గౌతం ఖని ఓపెన్‌కాస్ట్ ఓవర్ బర్డెన్ మట్టి దిబ్బలపై పెంచిన వనంలో సైక్లింగ్ ట్రాక్, నాలుగు కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ పాత్‌లను అభివృద్ధి చేస్తున్నారు. దీన్ని ఎకో అడ్వెంచర్ పార్క్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నారు. పార్క్ సమీపంలో వెంకటేశ్ ఖని మెగా ఓపెన్‌కాస్ట్ త్వరలో మొదలుకానుంది. దీంతో ఓపెన్‌కాస్ట్ ఉపరితలంపై మరో వ్యూ పాయింట్ సిద్ధం చేసి.. ప్రతీరోజు నిర్ణీత సమయంలో గనుల్లో జరిగే బ్లాస్టింగ్‌ను సందర్శకులు ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా మైనింగ్ ప్రక్రియలో అడవులు, భూమి, జల వనరులకు జరిగే నష్టాలు ఎలా ఉంటాయి? వాటిని భర్తీ చేయడంలో సింగరేణి ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వివరించాలని నిర్ణయించారు.



ఎకో పార్క్‌లో బుద్ధవనం

ప్రపంచం ఎదుర్కొనే అతి పెద్ద ముప్పులివీ..



ఈ ప్రపంచం వచ్చే రెండేళ్లలో అలాగే వచ్చే పదేళ్లలో ఎదుర్కొనే అతి పెద్ద ముప్పు ఏమిటి?

వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఇదే ప్రశ్న రాజకీయ, వ్యాపార, విద్యా రంగాలకు చెందిన 900 మంది నిపుణులకు వేసింది. వారి సమాధానాల ఆధారంగా తన వార్షిక గ్లోబల్ రిస్క్స్ రిపోర్ట్‌ను విడుదల చేసింది. దాని ప్రకారం వచ్చే రెండేళ్లలో.. ఉద్దేశపూర్వకంగా లేదా తెలియకుండా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం అన్నది అతి పెద్ద ముప్పుగా నిలిచింది. ఇలాంటి అసత్య సమాచార వ్యాప్తి పెద్ద పెద్ద సమస్యలకు దారి తీస్తుందని, సమాజంలో అశాంతి తలెత్తేలా చేస్తుందని హెచ్చరించింది. వచ్చే పదేళ్ల లెక్క తీసుకుంటే.. వాతావరణ మార్పులు, దాని వల్ల కలిగే దుష్ఫలితాలు అతి పెద్ద ముప్పుగా పేర్కొంది. వాతావరణ పరిస్థితుల్లో వచ్చే విపరీత మార్పులు.. స్వల్పకాలంలోనూ అలాగే దీర్ఘకాలంలోనూ ఈ ప్రపంచానికి అతి పెద్ద సమస్యగా మారనుందని తెలిపింది. జీవన వ్యయం, ద్రవ్యోల్బణం పెరగడం లాంటి వాటిని ఆయా రంగాల నిపుణులు ఇప్పుడు పెద్ద సమస్యలుగా చూడటం లేదని ఈ నివేదిక పేర్కొంది. గతేడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో ఈ సమాచారాన్ని సేకరించారు. ఈ నివేదిక ప్రకారం టాప్–10 ముప్పులివీ..

- పర్యావరణపరమైనవి..
- భౌగోళిక, రాజకీయపరమైనవి..
- సామాజికపరమైనవి
- సాంకేతికపరమైనవి..

రెండేళ్లలో..	పదేళ్లలో..
ఉద్దేశపూర్వకంగా/తెలియకుండా తప్పుడు సమాచార వ్యాప్తి	వాతావరణంలో విపరీతమైన మార్పులు
వాతావరణంలో విపరీతమైన మార్పులు	జీవ వైవిధ్యానికి, పర్యావరణవ్యవస్థకు నష్టం
సైనిక ఘర్షణ	భూమి స్వాభావిక వ్యవస్థలో పెను మార్పులు
సమాజంలో విభజన	సహజ వనరుల కొరత
సైబర్ దాడులు, సైబర్ యుద్ధం	ఉద్దేశపూర్వకంగా/తెలియకుండా తప్పుడు సమాచార వ్యాప్తి
కాలుష్యం	ఏఐ టెక్నాలజీ వల్ల విపరీత పరిణామాలు
సమానత్వం లేకపోవడం	సమానత్వం లేకపోవడం
నిర్బంధ వలస/నిరాశ్రయులు కావడం	సమాజంలో విభజన
విదేశాలతో ఆర్థికపరమైన ఘర్షణ	సైబర్ దాడులు, సైబర్ యుద్ధం
మానవ హక్కులు/స్వేచ్ఛను హరించడం	కాలుష్యం

- సాక్షి, సెంట్రల్ డెస్క్

క్లుప్తంగా...

కేపీహెచ్‌బీ తరహాలో హౌసింగ్ కాలనీలు

మంత్రి పొంగులేటి వెల్లడి



హిమాచల్ మంత్రి రాజేశ్ ధర్మానితో పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు–ఔటర్ రింగురోడ్డు మధ్య మధ్యతరగతి ప్రజల కోసం కేపీహెచ్‌బీ తరహాలో హౌసింగ్ కాలనీలను నిర్మించనున్నట్టు గృహనిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం సచివాలయంలో హిమాచల్‌ప్రదేశ్ గృహనిర్మాణ శాఖమంత్రి రాజేశ్ ధర్మానితో పొంగులేటి భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపడుతున్న గృహనిర్మాణ పథకాలు, 15 వేల ఎకరాల్లో నిర్మించతలపెట్టిన ఫ్యూచర్ సిటీ తదితర అంశాలను ఆయనకు వివరించారు. నగరం వేగంగా విస్తరిస్తున్నందున మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసే ధరల్లో ఇళ్లను నిర్మించనున్నామని, ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ కోరారు. ఈ మేరకు శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించి ఆర్థిక, ఆర్థికేతర సమస్యలన్నింటినీ ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలన్నారు. మంత్రిమండలి సమావేశం ఫిబ్రవరి మొదటివారంలో ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

21 మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 21 మంది వివిధ గ్రేడ్ల పంచాయతీ కార్యదర్శుల (18 స్పౌజ్, 3 మెడికల్ కేటగిరీల్లో) బదిలీలు చేస్తూ ప్రభుత్వం మెమో జారీచేసినట్టు తెలంగాణ పంచాయతీ కార్యదర్శి అసోసియేషన్ (టీపీఎస్ఏ) తెలిపింది. పంచాయతీ కార్యదర్శులకు సంబంధించి మొత్తం 21 మందికి బదిలీ అవకాశం రాగా, మరో 17 మంది కేటగిరీలో ఖాళీలు లేక పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. ఇక 317 జీవోతో స్థానికత కోల్పోయిన 450 మంది కార్యదర్శుల సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఒక ప్రకటనలో వెల్లడించింది.

రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నికలు: జాజుల

కొత్తకోట రూరల్: బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచిన తర్వాతే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం వనపర్తి జిల్లా కొత్తకోటలో విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రేషన్‌కార్డుల కోసం సుమారు 20 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే.. కులగణనలో కేవలం 6 లక్షల మందికి రేషన్‌కార్డులు లేవని తేలిందన్నారు. 14 లక్షల మంది రేషన్‌కార్డుల రద్దుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని జాజుల ఆరోపించారు.

ఒప్పందం నుంచి ఎందుకు తప్పుకున్నారు?

- ఈ– కార్ రేసు స్పాన్సర్‌గా ఎంత ఖర్చు చేశారు?.. తొలి సీజన్ తరువాత కేటీఆర్‌ను ఎన్నిసార్లు కలిశారు
- ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థ ఎండీకి ఏసీబీ ప్రశ్నలు
- విచారణకు హాజరైన అనిల్‌కుమార్ చలమలశెట్టి



అనిల్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా ఈ–కార్ రేసులో మొదటి రేసుకు స్పాన్సర్‌గా వ్యవహరించిన గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఏస్ నెక్స్ట్‌జెన్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ చలమలశెట్టిని ఏసీబీ అధికారులు శనివారం విచారించారు. తొలిరేసు తరువాత స్పాన్సర్‌షిప్ నుంచి ఎందుకు తప్పుకోవాల్సి వచ్చింది? మొదటి రేసు కోసం ఎంత ఖర్చు చేశారు? రెండో రేసుకు ముందు ఎందుకు తప్పుకున్నారు? ఫిబ్రవరిలోనే మొదటి రేసు ముగిసింది కదా.. నష్టం వస్తే వెంటనే ఎందుకు తప్పుకోలేదు? చివరి వరకు ఎందుకు ఆగారు? తప్పుకోవడానికి ముందు ప్రభుత్వానికి ఏమైనా లేఖ రాశారా? అని అనిల్‌కుమార్‌పై ఏసీబీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. దాదాపు మూడు గంటల పాటు ఆయనను ప్రశ్నించారు.

కేటీఆర్ ఒత్తిడి తెచ్చారా?

ఏసీబీ అధికారులు ప్రధానంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో అనిల్‌కుమార్‌కు ఉన్న సంబంధాలపై ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. మీ అంతట మీరే స్పాన్సర్‌షిప్ చేయడానికి ముందుకు వచ్చారా? లేక అప్పటి మంత్రి కేటీఆర్ ఏమైనా మిమ్మల్ని అడిగారా? లేక ఒత్తిడి చేశారా? ఈ ఒప్పందం కుదుర్చుకోవడానికి ముందే బీఆర్ఎస్ పార్టీకి బాండ్ల రూపంలో అంత మొత్తంలో నిధులు ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది? అని ప్రశ్నించినట్లు తెలిసింది. ఫార్ములా ఈ–ఆపరేషన్స్, పురపాలక శాఖ, ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంపై ఆరా తీసినట్లు సమాచారం. ఈ ఒప్పందం మొత్తం ఎఫ్ఈవోకు అనుకూలంగా ఉందన్న అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. మొత్తం నాలుగు సీజన్లకు స్పాన్సర్‌గా ఉండేందుకు అంగీకరించి.. రెండో సీజన్‌కు ముందే తప్పుకుంటే నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం కానీ, ఎఫ్ఈవో కానీ మిమ్మల్ని కోరలేదా? అని ప్రశ్నించారు. అగ్రిమెంట్ ప్రకారం ఎఫ్ఈవోకు చెల్లించాల్సిన వాయిదాలు, ఈవెంట్ ప్రమోషన్స్‌కు సంబంధించిన సమాచారంతో స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. సీజన్ 9 కోసం హెచ్ఎండీఏ నుంచి రూ.12 కోట్లు ఖర్చు చేయగా.. ఈవెంట్ స్పాన్సర్‌గా ఏస్ నెక్స్ట్‌జెన్ ఎంత ఖర్చు చేసిందనే వివరాలను సేకరించారు. రేసర్స్, కంపెనీల ప్రతినిధులకు ఏర్పాటు చేసిన బస గురించి ప్రశ్నించింది.

అధికారులను ఎన్నిసార్లు కలిశారు?

అగ్రిమెంట్‌కు ముందు.. ఆ తరువాత ఫార్ములా ఈ ఆపరేషన్స్ కోసం అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌తో ఎన్ని సమావేశాలు నిర్వహించారని అనిల్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఈవెంట్ నిర్వహణ కోసం ఎన్ని కోట్లు ప్రతిపాదించారు? అందులో ఏస్ నెక్స్ట్‌జెన్ వాటా ఎంత? అనే వివరాలను రాబట్టినట్లు సమాచారం. అవసరమైతే మళ్లీ విచారణకు రావాల్సి ఉంటుందని అనిల్‌కుమార్‌కు ఏసీబీ అధికారులు తెలిపారు. కాగా, శనివారం ఉదయం 10.30 గంటలకు విచారణకు హాజరుకావాలని అధికారులు ముందుగానే నోటీసులు ఇచ్చినా.. ఆయన నగరానికి రావాల్సిన ఫ్లైట్ ఆలస్యమైందని అధికారులకు మెయిల్ ద్వారా సమాచారం పంపించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆయన ఏసీబీ విచారణాధికారి మాజిద్ అలీ బృందం ముందు విచారణకు హాజరయ్యారు.

ఉగాది నుంచి గద్దర్ సినీ అవార్డులు

- హైదరాబాద్‌ను ప్రపంచ సినీ గమ్యస్థానంగా మారుస్తాం
- గద్దర్ సినిమా అవార్డుల కమిటీ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రానున్న ఉగాది పండుగ నుంచి గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డులను అందజేయాలని నిర్ణయించినట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇందుకోసం కమిటీ సభ్యులు, అధికారులు వేగంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శనివారం సచివాలయంలో గద్దర్ అవార్డుల కమిటీతో భట్టి సమావేశం నిర్వహించారు. అవార్డుల లోగో, విధివిధానాలు, నియమ నిబంధనలపై చర్చించారు. ఫీచర్ ఫిల్మ్‌లు, బాలల చిత్రాలు, తెలుగు సినిమాపై పుస్తకాలు వంటి వివిధ విభాగాల కింద అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. అవార్డులలో నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం కూడా అందచేయనున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. తెలుగు భాషలో నిర్మించిన ఉత్తమ చిత్రాలను గుర్తించి అవార్డులు అందజేయనున్నట్టు ఆయన తెలిపారు. జాతీయ సమైక్యత, సాంస్కృతిక, విద్య, సామాజిక ఔచిత్యం, అత్యుత్తమ సాంకేతిక నైపుణ్యం, మానవతా విలువలతో కూడిన చిత్రాల నిర్మాణాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ అవార్డులు అందజేస్తున్నట్టు వివరించారు. గద్దర్ అవార్డుల వేడుకను జాతీయస్థాయి కార్యక్రమాల తరహాలో నిర్వహించాలని సూచించారు. సినిమా నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేసిందని, అవార్డుల పంపిణీ జరగలేదని విమర్శించారు. ఈ సమావేశంలో టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, ఎండీ డాక్టర్ హరీశ్, ఈడీ కిషోర్‌బాబు, కమిటీ చైర్మన్ బీ నర్సింగ్‌రావు, కమిటీ సభ్యులు జయసుధ, తమ్మారెడ్డి భరద్వాజ్, హరీశ్ శంకర్, వందేమాతరం శ్రీనివాస్, గుమ్మడి వెన్నెల, అల్లాణి శ్రీధర్, వేణు తదితరులు పాల్గొన్నారు.



చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

రిటర్న్ రద్దీ

చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్: సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు తిరుగుపయనం అవుతుండటంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ శనివారం కూడా కొనసాగింది. వేకువ జామునుంచి ఉదయం 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు వాహనాలు బారులుతీరాయి. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా 16 గేట్లకు గాను హైదరాబాద్ వైపు 11 గేట్లు ఓపెన్ చేసి వాహనాలను పంపుతున్నారు. బ్లాక్ స్పాట్లు, జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌జామ్ కాకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజల్లో పోలీసు ప్రతిష్టను పెంచుతాం: డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్: ప్రజల్లో పోలీసు ప్రతిష్టను పెంచే విధంగా, ప్రజలకు నాణ్యమైన సేవలు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని డీజీపీ జితేందర్ అన్నారు. శనివారం డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని జిల్లాల నుంచి 41 మంది పోలీసు అధికారులు శిక్షణకు హాజరయ్యారు. పోలీస్ విభాగాన్ని మరింత ప్రజా మైత్రిగా మార్చడం, సుస్థిర శాంతి, భద్రతను కాపాడేలా చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, ఏఐజీ రమణ కుమార్, అడిషనల్ డీసీపీలు అశోక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
ఆదివారం । 19-1-2025

బ్యాంకు ఖాతా ఇచ్చారో.. కరుసైపోతారు



అమాయకులకు కమీషన్ల వలవేసి వారి వివరాలతో సైబర్ నేరస్తుల 'మ్యూల్' బ్యాంకు అకౌంట్లు

సైబర్ నేరగాళ్ల చేతిలో దేశవ్యాప్తంగా 5 లక్షల వరకు ఇలాంటి ఖాతాలే

తమ వివరాలు బయటపడకుండా డబ్బు విదేశాలకు మళ్లిస్తున్న సైబర్ ముఠాలు

ప్రతి సైబర్ మోసంలో కనీసం ఐదు మ్యూల్ బ్యాంక్ ఖాతాలు వాడుతున్నట్టు చెబుతున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: కంటికి కనిపించకుండా ఎక్కడో కూర్చుని మన బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లు.. కొట్టేసిన సొమ్మును తమ వద్దకు చేర్చుకునేందుకు అమాయకుల బ్యాంకు ఖాతాలను వాడుతున్నారు. తమ చేతికి నేరం అంటుకోకుండా కమీషన్ల ఆశజూపి అమాయకులనే చివరకు బలి చేస్తున్నారు. 'మ్యూల్'బ్యాంకు ఖాతాలతో మొత్తంగా ముంచేస్తున్నారు. ఒకటి కాదు...రెండు కాదు..దేశవ్యాప్తంగా ఐదు లక్షల మ్యూల్ బ్యాంక్ ఖాతాలు సైబర్ నేరగాళ్ల చేతిలో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) 2024లో మొత్తం 1.14 లక్షల సైబర్ నేరాలు నమోదు చేయగా..ఈ కేసులలో ప్రతి కేసులో కనీసం ఐదు మ్యూల్ బ్యాంకు ఖాతాలు వినియోగించినట్టు తెలిపారు.

ఎంత ఎక్కువ మొత్తం కొట్టేస్తే.. అన్ని ఎక్కువ మ్యూల్ ఖాతాల్లోకి బదిలీ...

అమాయకుల నుంచి వివిధ మోసపూరిత విధానాల్లో కొల్లగొట్టిన సొమ్మును పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు సైబర్ నేరగాళ్లు వీటిని వెంటవెంటనే పలు బ్యాంకు ఖాతాల్లోకి (మ్యూల్ ఖాతాల్లోకి) బదిలీ చేస్తున్నారు. కొన్నిసార్లు కొట్టేసిన సొమ్ము ఎక్కువ మొత్తంలో ఉంటే ఎక్కువ బ్యాంకు ఖాతాల్లోకి చిన్నచిన్న మొత్తాలుగా చేసి బదిలీ చేస్తున్నారు. కొన్నిసార్లు వందల బ్యాంకు ఖాతాల్లోకి మళ్లిస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల దర్యాప్తు అధికారులు ఆ సొమ్మును గుర్తించడం..తిరిగి ఫ్రీజ్ చేయడం సవాల్‌గా మారుతోంది. ఇలా బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించిన సొమ్మును చివరగా క్రిప్టోకరెన్సీగా మార్చి విదేశాల్లోని ఖాతాలకు మళ్లిస్తున్నారు. ఈ మధ్యకాలంలో కొంత రూటు మార్చిన సైబర్ కేటుగాళ్లు కొన్ని బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు మళ్లించిన తర్వాత వెంటనే వాటిని నగదు రూపంలో విత్‌డ్రా చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని మధ్యవర్తుల ద్వారా క్రిప్టోకరెన్సీగా మార్చి విదేశాలకు పంపుతున్నారు. ఇటీవలే తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఈ తరహా ముఠాలోని 21 మందిని 2024 డిసెంబర్ 24న అరెస్టు చేశారు.

బ్యాంకుల సమన్వయంతోనే కట్టడి సాధ్యం..

మ్యూల్ బ్యాంకు ఖాతాల బెడద తగ్గించడంలో బ్యాంకు అధికారులది కీలకపాత్ర అని పోలీసులు చెబుతున్నారు. ఏదైనా బ్యాంకు ఖాతాలో అనుమానాస్పద లావాదేవీలు జరుగుతున్నట్టుగా గుర్తిస్తే అలాంటి బ్యాంకు ఖాతాలకు రెడ్‌ఫ్లాగ్ పెట్టుకుని, వెనువెంటనే దర్యాప్తు సంస్థలకు తెలియజేస్తే ఫలితం ఉంటుందని పోలీసులు సూచిస్తున్నారు. ఉదాహరణకు ఒక బ్యాంకు ఖాతాదారుడి అకౌంట్‌లో అకస్మాత్తుగా లక్షల రూపాయలు జమ అవుతుండటం..అదేరీతిలో లక్షల్లో డబ్బులు ఇతర ఖాతాల్లోకి మళ్లిస్తున్నట్టు గుర్తిస్తే అలాంటివి మ్యూల్ బ్యాంకు ఖాతాలుగా గుర్తించాలని వారు పేర్కొంటున్నారు. కానీ వాస్తవానికి ఈ సమన్వయం లోపిస్తోంది. బ్యాంకుల సాధారణ ప్రక్రియలో భాగంగా ఇలాంటి రెడ్‌ఫ్లాగ్ ఖాతాల (అనుమానాస్పద లావాదేవీలు గుర్తించిన ఖాతాలు) వివరాలు ఆర్థికశాఖలోని ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ)కు చేరవేస్తాయి. కొన్ని నెలల తర్వాత సంబంధిత పోలీసులకు ఆ సమాచారం చేరుతుంది. ఈలోగా సైబర్ నేరగాళ్లు నిధులను విదేశాలకు మళ్లించడం పూర్తి చేస్తుండటంతో ఆ సమాచారం పోలీసులకు నిరుపయోగంగా మారుతోంది.

మ్యూల్ బ్యాంకు ఖాతా అంటే..?

ఒకరి వివరాలతో ఉన్న బ్యాంకు ఖాతాను నేరపూరిత లావాదేవీలకు ఇతరులు వినియోగిస్తే (నిజమైన ఖాతాదారుడికి తెలిసి ఇది జరగవచ్చు.. తెలియకుండా కూడా జరగొచ్చు) ఇలాంటి బ్యాంకు ఖాతాను మ్యూల్ బ్యాంక్ అకౌంట్‌గా చెబుతారు. కొందరు నెలవారీ కమీషన్లకు ఆశపడి తమ అధికారిక ధ్రువపత్రాలు ఉపయోగించి తెరచిన బ్యాంకు ఖాతాలను ఇతరులకు అప్పగిస్తున్నారు. ఇలాంటి బ్యాంకు ఖాతాల్లో ఎవరి నుంచి డబ్బులు జమ అవుతున్నాయి. అవి మళ్లీ ఎక్కడికి బదిలీ అవుతున్నాయన్న వివరాలు ఖాతాదారుడికి తెలిసే అవకాశం కూడా ఉండదు.

మ్యూల్ బ్యాంకు ఖాతాలు ఇలా తెరిపిస్తారు..

- సులువుగా డబ్బులు సంపాదించవచ్చని ఆశజూపి అమాయకులకు వల వేస్తారు.
- వారి వివరాలతో బ్యాంకు ఖాతాలు తెరిచేలా ఒప్పిస్తారు.
- ఆ తర్వాత నిజమైన బ్యాంకు ఖాతాదారుడి నుంచి బ్యాంకు పాస్‌బుక్, డెబిట్ కార్డులు, పాస్‌వర్డ్‌లు మోసగాళ్లు తమ ఏజెంట్ల ద్వారా ఆ బ్యాంకు ఖాతాలు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంటారు.
- సైబర్ మోసాల్లో కొల్లగొట్టే సొమ్మును ఈ బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం..తర్వాత ఇతర ఖాతాల్లోకి మళ్లించడం వంటి లావాదేవీలు చేస్తుంటారు.

ఖాతాదారులకు సూచనలు..

- ఇతరులు నెలవారీ కమీషన్ ఇస్తామంటే ఆశపడి మీ బ్యాంకు ఖాతాను ఇతరులకు ఇవ్వొద్దు.
- మీ బ్యాంకు ఖాతా నిలిపివేయబడుతుంది.
- మీరు మళ్లీ కొత్తగా బ్యాంకు ఖాతా తెరవాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.
- మీ పేరిట ఉన్న మ్యూల్ బ్యాంక్ ఖాతా నేరస్తులు అక్రమ నిధుల బదిలీకి, లేదా మనీ లాండరింగ్ చేయడానికి ఉపయోగించే అవకాశం ఉన్నందున చట్టపరంగా అసలు ఖాతాదారులకు శిక్ష తప్పదు.

ప్రధానంగా మ్యూల్ బ్యాంకు ఖాతాల బాధితులు వీరే..

- సోషల్ మీడియాలో ప్రకటనల ద్వారా ఎక్కువ మంది ప్రైవేటు ఉద్యోగులు ఈ ఉచ్చులో చిక్కుతున్నారు.
- వివరాలు ఇస్తే నెలకు కొంత కమీషన్ వస్తుందని ఆశపడి నిరుద్యోగ యువత వారి వివరాలతో బ్యాంకు ఖాతాలు తెరిచి మ్యూల్ ఖాతాలుగా వాడేందుకు ఇస్తున్నారు.
- ఆర్థిక అవసరాలు ఆసరాగా చేసుకుని, నేరస్తులు కమీషన్లు ఆశజూపి రైతులను ఈ ఉచ్చులో దింపుతున్నారు.
- పోలీసుల దర్యాప్తులో వెల్లడైన ప్రకారం..జిమ్ ట్రైనర్లు, టైలర్లు, ప్రైవేటు కాంట్రాక్టర్లు, హోటల్స్ నిర్వాహకులు ఇలా పలువురు మ్యూల్ ఖాతాల బాధితులే.

పరమ పవిత్రం.. పర్ణశాల

సీతారాములు నడయాడిన పుణ్యస్థలి

వనవాస సమయాన ఇక్కడి పంచవటి కుటీరంలో బస





దుమ్ముగూడెం: పవిత్రమైన గోదావరి నదీ తీరాన సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీ రాముడు నడయాడిన పుణ్యక్షేత్రం పర్ణశాల. రుషులు, యోగులకు నిలయమై నిత్య జపతపో హోమాది పుణ్యకర్మలతో పావనమైన నేలగా పర్ణశాల పేరొందింది. శ్రీరామచంద్రుడు తన తండ్రి దశరథ మహారాజు ఆజ్ఞ ప్రకారం.. సీతాలక్ష్మణ సమేతుడై ఇక్కడే వనవాసం చేశాడని ప్రతీతి. ఆ కాలంలో ఈ ప్రాంతమంతా దండకారణ్యం కావడం, అగస్త్య మహర్షి సూచనతో సీతారామ లక్ష్మణులు.. ఇక్కడే గోదావరి తీరంలోని ఐదు మట్టి చెట్లు కలిసి ఉన్న పంచవటి ప్రాంతంలో కుటీరం నిర్మించుకున్నారని చెబుతారు. అందుకే ఈ క్షేత్రానికి పర్ణశాలగా పేరొచ్చిందని భక్తులు విశ్వసిస్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల ప్రాంత విశేషాలివి.

పర్ణశాల కుటీరం

సీతమ్మ వారు బంగారు లేడిని కోరడం, లక్ష్మణుడు రేఖ గీయడం, ఆపై జంగమదేవర వేషధారణలో రావణుడు సీతమ్మ వారిని సమీపించడం, మాయావి అయిన రావణుడు సీతమ్మ వారిని అపహరించుకెళ్లడం వంటి కళాకృతులు కుటీరంలో ఆకట్టుకుంటాయి. పెద్దసంఖ్యలో భక్తులు వీటిని దర్శించుకుని ఫొటోలతో జ్ఞాపకాలుగా భద్రపరచుకుంటారు.



సీతమ్మ విగ్రహం

పవిత్రమైన నార చీరల ప్రాంతం

ఈ క్షేత్రంలో సీతమ్మ వారికి ప్రాధాన్యం ఉండడం వల్ల 'శ్రీ క్షేత్రం'అని పేరు. ఇక్కడ రాముడు కూర్చున్న రాతి సింహాసనం, నార చీరల గుర్తులు, సీతమ్మ పసుపు, కుంకుమ తయారీకి ఉపయోగించిన రాళ్లు, మాయ లేడి అడుగులు, శ్రీరామ పాద చిహ్నాలు ఉండడంతో భక్తులు దర్శించుకుంటారు. ఈ ప్రాంతంలోనే వనవాసం సమయాన శ్రీరాముడు పూజలు చేసిన ప్రాచీన శివాలయం కూడా ఉంటుంది.



సీతమ్మ వారి నార చీరలు

పంచవటి కుటీరంలో దృశ్యాలు



సీతాపహరణం ఇక్కడే..

రావణాసురుడు మాయలేడిగా రావడం, సీతాపహరణం, సీతను విడిపించాలని రావణుడితో పోరాడిన జటాయువు కన్నుమూసిందీ ఈ ప్రాంతంలోనే. పర్ణశాలలోనే కరబంధుడనే మహర్షి శ్రీ రామ దర్శనానికి తపస్సు చేయగా.. జటావల్కల ధారియైన శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై ప్రత్యక్షమయ్యాడని నమ్ముతారు. సీతమ్మ వారికి కుడివైపున ధనుర్బాణ ధారియై శ్రీ రాముడు, ఎడమవైపున లక్ష్మణుడిని దర్శించుకున్న మహర్షి.. ''అ'కార, 'ఉ'కార, 'మ'కార స్వరూపులైన సీతారామ లక్ష్మణుల్లారా.. నన్ను అనుగ్రహించి, ఇక్కడి దక్షిణాభిముఖంగా అర్చా రూపాన (విగ్రహ) నేను అర్చించేందుకు ఆవిర్భవించండి'.. అని కోరాడట. ఆ మహర్షి కోరికను మన్నిస్తూ.. ఓంకార స్వరూపుడై స్వయంభువుగా వెలిశాడని ప్రతీతి. కలియుగారంభంలో నందుడు అనే శ్రీ వైష్ణవాగ్రేసరుడు స్వామికి ఆలయం నిర్మించి.. స్వామిని ఉపాసించి సకలాభీష్టాలు పొందాడన్నది పురాణ గాథ. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న ఇక్కడి ఆలయంలో శ్రీ వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి నిత్యపూజలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

రథపు గుట్ట.. లక్ష్మణ గుట్ట

సీతాపహరణం కోసం వచ్చిన రావణుడు తన రథాన్ని నిలిపిన చోటు, రథపు చక్రాల చారలున్న రథం గుట్ట.. పర్ణశాల నుండి గోదావరికి ఎదురుగా సుమారు ఐదు కిలోమీటర్ల దూరాన ఉంటుంది. పర్ణశాల నుండి 10 కిలోమీటర్ల దూరాన సీతమ్మ వారు స్నానమాచరించేందుకు లక్ష్మణుడు బాణంతో ఛేదించిన గుట్టను లక్ష్మణ గుట్టగా పిలుస్తారు. ఆ నీటితో ఏర్పడిన వాగునే ప్రస్తుతం సీతమ్మ వాగుగా పిలుస్తున్నారు. ఇక సీతమ్మ వారిని రావణుడు అపహరించుకెళ్తున్న సమయాన జటాయుపక్షి అడ్డగించిన చోటును.. జటాయువు పాకగా పిలవగా.. ఆ తర్వాత ఎటపాకగా స్థిరపడింది. జటాయువు రెక్కలు పడిన చోటైన ఈ ప్రాంతం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎటపాక ప్రధాన రహదారి పక్కనే ఉంటుంది.



నార చీరల ప్రాంతంలోని శ్రీరాముడి సింహాసనం

శివయ్యకు వానరార్చన



శివలింగానికి పూజలు చేస్తున్న వానరం

కల్హేర్(నారాయణఖేడ్): శివాలయంలో ఒక వానరం పూజలు చేసింది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం నాగధర్ శివారులో శనివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామ శివారులోని రామేశ్వరం గుట్టపైకి ఒక వానరం వచ్చి.. అక్కడి శివలింగానికి పూజలు చేసింది. ఈ దృశ్యాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు.

ఎన్‌ఎల్‌సీ సీఎండీకి 'ఐపీఎంఏ' గుర్తింపు



సర్టిఫికెట్ అందుకుంటున్న సీఎండీ మోటుపల్లి ప్రసన్నకుమార్

సాక్షి, హైదరాబాద్: నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎల్‌సీ) సీఎండీ మోటుపల్లి ప్రసన్నకుమార్.. ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఐపీఎంఏ) నుంచి ప్రాజెక్టు డైరెక్టర్(లెవల్ ఏ) సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఎన్ఎల్‌సీ చేపట్టిన సంక్లిష్ట ప్రాజెక్టులను విజయవంతం చేసినందుకు.. ఆయనకు ఐపీఎంఏ ఈ గుర్తింపును కల్పించింది. ఐపీఎంఏ ఇండియా అధ్యక్షుడు, బ్రహ్మోస్ ఎయిరో స్పేస్ మాజీ ఎండీ, సీఈవో శివతను పిళ్లై నుంచి ఈ సర్టిఫికెట్‌ను శనివారం చెన్నైలోని ఎన్ఎల్‌సీ ఆడిటోరియంలో అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎల్‌సీకి అధినేతగా వ్యవహరిస్తున్న మోటుపల్లి ప్రసన్నకుమార్ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన వారు.

పార్టీ పట్టించుకోలేదని..

చేతులను తాళ్లతో కట్టుకుని బీజేపీ నేత నిరసన



తాళ్లతో చేతులను కట్టేసుకుని నిరసన తెలుపుతున్న పాపయ్య

నడిగూడెం: తనకు బీజేపీ మండల కమిటీలో ప్రాధాన్యం ఇవ్వడం లేదని సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల పరిధిలోని వల్లాపురం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నేత వట్టికూటి పాపయ్య వినూత్నంగా నిరసన తెలిపారు. గ్రామ శివాలయంలో శనివారం తన చేతులను తాళ్లతో కట్టేసుకున్నారు. ఆరేళ్లుగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నానని, ఎంతో మందిని వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేర్పించానని ఆయన తెలిపారు. మండల అధ్యక్ష పదవిని తన భార్య నాగమణికి ఇస్తామని చెప్పి.. ఇవ్వకుండా జిల్లా నాయకులు మోసం చేశారని ఆరోపించారు. తనకు ఎలాంటి సమాచారం లేకుండానే మండల కమిటీ ఏర్పాటు చేశారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో కష్టపడి పనిచేసేవారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



శనివారం హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని సంత్‌నిరంకారీ సత్సంగ్ భవన్ వద్ద ట్రాఫిక్‌లో ఎడారి ఓడల వరుస



హైదరాబాద్‌లోని ముస్లిం జంగ్ వంతెన వద్ద శనివారం భారీ సంఖ్యలో ఉన్న పావురాలకు ఆహారం వేస్తూ ఆడుకుంటున్న చిన్నారులు



'ప్రకాశం'లో శిలాఫలకం ధ్వంసం



చీమకుర్తి రూరల్: ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం మంచికలపాడు గ్రామంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో నిర్మించిన సీసీ రోడ్డు, సైడ్ కాలువలకు సంబంధించిన ప్రారంభోత్సవ శిలాఫలకం దిమ్మెను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి మంచికలపాడు సర్పంచ్ పెరికల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పొన్నపల్లి సుబ్బారావు శనివారం చీమకుర్తి పోలీస్ స్టేషన్లో సీఐ ఎం సుబ్బారావుకి ఫిర్యాదు చేశారు.

గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలో ఉంచాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమలోని కడపలో ఏర్పాటు చేసిన ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయంగా కొనసాగిస్తున్నారని, దాన్ని వేరొక ప్రాంతానికి తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేయడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూచించారు. ఈ విషయమై శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను రామకృష్ణ మీడియాకు విడుదల చేశారు. రాయలసీమ గ్రామీణ బ్యాంక్, అనంత గ్రామీణ బ్యాంక్, పినాకినీ గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి 2006ల ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఏర్పడిందన్నారు. అది అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం ఉమ్మడి జిల్లాల్లో 552 శాఖల ద్వారా సేవలు అందిస్తోందన్నారు. ఆ ప్రాంతాల్లో వ్యవసాయ అభివృద్ధి, గ్రామీణ అభివృద్ధికి దోహదం చేస్తోందన్నారు. రాష్ట్రంలో 4 గ్రామీణ బ్యాంకుల్లో అగ్రగామిగా నిలిచిన ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయంగా కడపలోనే కొనసాగుతోందన్నారు. దాన్ని వేరొక ప్రాంతానికి మళ్లించడం అంటే రాయలసీమకు అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు.

'బీసీల సమస్యల పరిష్కారానికి కులగణనే కీలకం'

మార్కాపురం: బీసీల సమస్యల పరిష్కారానికి కులగణనే కీలకం కానుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే శంకరరావు అన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు రాష్ట్ర స్థాయిలో బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నా, జాతీయ స్థాయిలో రోహిణీ కమిషన్ సిఫార్సుల మేరకు ఓబీసీల వర్గీకరణ జరపాలన్నా కులగణన చేయాల్సిందేనన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ.35 వేల కోట్ల పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆప్టా ప్రతినిధులు సీఎంను కలిసి ఆయన చేతుల మీదుగా 2025 సంవత్సరం డైరీ, కేలండర్లను ఆవిష్కరించారు.

స్వచ్ఛత, శుభ్రత ప్రజల జీవన విధానం కావాలి

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్



పెదకాకాని: స్వచ్ఛత, శుభ్రత అనేది ప్రజల జీవన విధానంలో భాగం కావాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆకాంక్షించారు. శుభ్రత అనేది ప్రజల ఆలోచనకు ప్రతిరూపం కావాలని, కేవలం పారిశుధ్య కార్మికులకో, క్లాప్ మిత్రలకో మాత్రమే బాధ్యత ఉందనుకోవద్దని ఆయన హితవు పలికారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, స్వచ్ఛతను కాపాడటం అనేది మనందరి బాధ్యత అన్నారు. 2047 వికసిత్ భారత్‌లో స్వచ్ఛత అనేది ప్రధానమని.. కరోనా సమయంలో పారిశుధ్య నిర్వహణకు, స్వచ్ఛతకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. భవిష్యత్తులో చెత్త కనిపించని దేశంగా భారత్ కల సాకారం కావాలన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో శనివారం చేపట్టిన స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

చెత్త నుంచి సంపద..

'చెత్తను వేరుచేసి, దాన్ని మళ్లీ పునర్వినియోగించడం ద్వారా సంపదను సృష్టించవచ్చు. చెత్త ద్వారా విద్యుత్ ప్లాంటు నిర్వహణ, వర్మీ కంపోస్టు తయారీకి స్థానిక సంస్థలు ప్రణాళిక రూపొందించుకోవాలి. ఇంట్లోనే చెత్తను వేరుచేయడం, నిర్మూలించే కార్యక్రమం జరిగినప్పుడే చెత్త ఉత్పత్తి తగ్గుతుంది.ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రతినెలా మూడో శనివారం చేపట్టాలని సీఎం సూచించిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి'అని అన్నారు.

- అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన లీలావతి కాన్పు కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి వెళ్లింది. అక్కడ ఒకే మంచంపై ఇద్దరు ముగ్గురు పడుకుని ఉండటంతో ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంకు వెళ్లింది. నార్మల్ డెలివరీ అయింది కానీ.. రూ.30 వేలు బిల్లు వేయడంతో ఆ కుటుంబం విస్తుపోయింది.
- అనంతపురం హౌసింగ్‌బోర్డుకు చెందిన రంగనాయకులు అనే 45 ఏళ్ల వ్యక్తి ఛాతిలో నొప్పి రావడంతో ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లారు. గుండె కవాటాలు మూసుకుపోయాయని, స్టంటు వేసి రూ.2.70 లక్షల బిల్లు వేయడంతో రంగనాయకులు హతాశులయ్యారు.
- ఈ రెండు సమస్యలే కాదు క్యాన్సర్, ప్రమాద బాధితుల వైద్య ఖర్చులు కూడా భారీగా ఉండడంతో జనం హడలెత్తిపోతున్నారు.



వైద్యం.. భారం

- నాలుగింటితోనే భయం
- గుండె, క్యాన్సర్ వైద్యానికి భారీగా వ్యయం
- ప్రసవాలు, ప్రమాద చికిత్స ఖర్చులూ భారమే
- ప్రైవేట్‌లో ఆరోగ్యశ్రీ సేవలకు విముఖత

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఆ నాలుగు రకాల జబ్బులకు భయపడిపోతున్నారు. వైద్యం ఖరీదుతో కూడుకుని ఉండటమే ఇందుకు కారణం. గుండె, క్యాన్సర్, కాన్పులు, ప్రమాద బాధితులకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. సంపన్నులు ఎలాగోలా వైద్యం చేయించుకుంటున్నారు. పేదల పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. రూ.5 లక్షల్లోపు వార్షిక ఆదాయం కలిగిన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యసేవలు అందేవి. గడిచిన ఐదేళ్లు ఉచిత వైద్యసేవలు సజావుగా అందాయి. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ వైద్య సేవల్లో ఒడుదుడుకులు మొదలయ్యాయి. పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద వైద్యమందించేందుకు నిరాకరిస్తున్నారు. ఇందుకు కారణం ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో రాకపోవడమేనని తెలుస్తోంది. విధిలేని పరిస్థితుల్లో అప్పోసప్పో చేసి ప్రైవేట్‌గా చికిత్స చేయించుకోవాల్సి వస్తోంది.

గుండెజబ్బులతో దడ

గుండె జబ్బులు సామాన్యులను భయపెడుతున్నాయి. ఏటా 20 వేల వరకు గుండెపోటు కేసులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో నమోదవుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు లేవంటున్నారంటే ఇక దారుణ పరిస్థితులే. ఒక స్టంట్ వేస్తే రూ.2 లక్షల వరకు అవుతోంది. దీంతో జనం బెంబేలెత్తుతున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2019-23 వరకు ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు.. వ్యయం



కేటగిరీ	లబ్ధిదారులు	వ్యయం
గుండె జబ్బులు	24,022	రూ.101,63,90,918
క్యాన్సర్	35,319	రూ.72,31,89,174
ప్రమాద గాయాలు	34,224	రూ.87,65,83,851
నార్మల్ డెలివరీలు	18,318	రూ.13,85,55,520
సిజేరియన్ డెలివరీలు	17,992	రూ.24,03,41,671

క్యాన్సర్ కేసులతో ఆందోళన

ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ కేసులు ఏటికేటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లు ఎక్కువ. చాలామంది హైదరాబాద్‌కు వెళ్లి చికిత్స తీసుకుంటున్నారు. సర్జరీలు, కీమో థెరపీలకు ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తోంది.

ప్రమాద బాధితులకు భరోసా లేదు

అనంతపురం జిల్లాలో ఎక్కువగా రోడ్డు ప్రమాద కేసులు నమోదవుతున్నాయి. పాలీ ట్రామా కేసుల చికిత్సకు భారీ వ్యయం అవుతుంది. సర్వజన ఆస్పత్రిలో లోడు పెరగడంతో చెయ్యలేకపోతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు ఒక్కోసారి సర్కారు నుంచి నిధులు రావడం లేదని చేతులెత్తేస్తున్నాయి. దీంతో రోజురోజుకూ సామాన్యుల్లో ఆందోళన పెరుగుతోంది.

ఖరీదైన జబ్బులకు చిక్కే



క్యాన్సర్, రోడ్డు ప్రమాదాలు, గుండె ఆపరేషన్లు లాంటి ఖరీదైన వైద్యం చేయించుకోవాలంటే పేదలకు చిక్కులు తప్పడం లేదు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదు. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద సేవలందించడం లేదు. ఇటీవల మా బంధువుల అబ్బాయి రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించాం. ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేసినప్పటికీ.. అదనపు ఖర్చుల కింద రూ.వేలల్లో డబ్బు వసూలు చేశారు.

– లీలావతి, బీటీపీ, గుమ్మఘట్ట మండలం

కాన్పు జరిగితే గండం గడిచినట్టే



ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా 55వేల వరకూ కాన్పులు (డెలివరీలు) జరుగుతున్నాయి. గడిచిన ఐదేళ్లు ఆరోగ్యశ్రీలో ఇబ్బంది లేకుండా నార్మల్, సిజేరియన్ డెలివరీలు జరిగాయి. ప్రస్తుతం పరిస్థితులు బాగోలేవు. ప్రైవేటు ఆస్పత్రులు నిధుల సమస్యతో కేసులు తీసుకోవడం లేదు. దీంతో నార్మల్ డెలివరీకి రూ.30 వేలు, సిజేరియన్‌కు రూ.50 వేలు చెల్లించుకోవాల్సి వస్తోంది.

దళారులను నమ్మొద్దు

సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు బోధించేందుకు (ఒకేషనల్ శిక్షణ) ట్రైనర్ల పోస్టులు ఇప్పిస్తామని దళారులు మభ్యపెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిని నమ్మి మోసపోవద్దని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అన్నారు. అభ్యర్థులను ప్రలోభపెడుతున్న దళారులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీడీ హెచ్చరించారు. థర్డ్ పార్టీ ఏజెన్సీలైన ఒకేషనల్ ట్రైనింగ్ పార్టనర్స్ ద్వారా పరిమిత కాలానికి ఈ పోస్టుల్లో నియమిస్తున్నట్లు శ్రీనివాసరావు శనివారం స్పష్టం చేశారు. ఈ నియామకాలకు సంబంధించి పూర్తిగా ఒకేషనల్ ట్రైనింగ్ పార్టనర్స్ ఏజెన్సీలకు, ఒకేషనల్ ట్రైనర్లకు మధ్య మాత్రమే ఒప్పందం ఉంటుందన్నారు. వృత్తి విద్యా కోర్సు బోధకులకు సమగ్ర శిక్షతో ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. ఈ నియామకాల్లో ప్రతిభావంతులకే అవకాశం కల్పించాలని పార్టనర్ ఏజెన్సీలు ఎంపిక చేసిన అభ్యర్థులకు కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ నిర్వహించామన్నారు. అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను ఒకేషనల్ ట్రైనింగ్ పార్ట్‌నర్లకు పంపించామని వివరించారు.

టీచర్ల వివరాల నమోదు గడువు పెంచండి

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల వివరాలు పే రోల్‌లో అప్‌లోడ్ చేసే గడువు పెంచాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ)రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతినెలా ఉద్యోగి ఉన్నత అర్హత అలవెన్సు, ఫ్యామిలీ ప్లానింగ్ అలవెన్సు, సంపాదిత (ఆర్జిత) సెలవులు నిల్వ, సర్వీస్ రిజిస్టర్ కాపీని పే రోల్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తేనేగానీ శాలరీ బిల్ చేసేందుకు వీలవడం లేదన్నారు. చిన్న హైస్కూళ్లల్లో ఈ సమస్య లేకున్నా మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో 200 మందికి పైగా ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లు అప్‌డేట్ చేసి, అప్‌లోడ్ చేయడం తక్కువ వ్యవధిలో సాధ్యం కావడం లేదన్నారు. అంతేగాక, ఎంఈవో కార్యాలయ సిబ్బంది స్కూల్ కాంప్లెక్స్ రీ ఆర్గనైజేషన్ పనిలో నిమగ్నమండంతో ఈనెల శాలరీ బిల్లుకు వెసులుబాటు ఇచ్చి, బిల్లు చేసేందుకు అనుమతివ్వాల్సిందిగా ఫైనాన్స్, ట్రెజరీ అండ్ అక్కౌంట్స్ విభాగాలను ఆదేశించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కడపలో భూచోళ్లు!

కడప నగరంలో భూచోళ్లు పడ్డారు. భూ దాహంతో 'సైకిల్ చక్రాలు' కట్టుకుని మరీ ఊరంతా తిరుగుతున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు నోరు తెరుస్తున్నారు. పట్టపగలే ప్రభుత్వ స్థలాలను చదును చేస్తూ కబ్జా చర్యలకు పదును పెడుతున్నారు. అధికారులకు మామూళ్ల మకిలీ అంటగట్టి.. ఆపై ఏంచక్కా నకిలీ డాక్యుమెంట్లతో స్థలాలను హాంఫట్ చేస్తున్నారు.



ద్వారకానగర్‌లో టీడీపీ నేతలు చదును చేసిన ప్రభుత్వ స్థలం ఇదే

- నకిలీ డాక్యుమెంట్లతో కోట్ల భూములు కాజేసే యత్నం..
- కడప ద్వారకనగర్‌లో 40 సెంట్లు కొట్టేసేందుకు ఎత్తుగడ
- యంత్రాలతో చదును చేసిన 'తమ్ముళ్లు'
- జిల్లా నేత కనుసన్నల్లో స్వాహాకు యత్నాలు
- ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డు ఖాతరు చేయని వైనం ఆక్రమణకు పక్కా ప్రణాళిక

సాక్షి ప్రతినిధి కడప: కూటమి ప్రభుత్వంలోని టీడీపీ **నేతలు భూ ఆక్రమణలతో** చెలరేగిపోతున్నారు. **ఖాళీ స్థలాలు కన్పిస్తే** కబ్జాకు యత్నిస్తున్నారు. **ముఖ్యంగా కడప నగరంలో** ఖాళీ స్థలాలకు నకిలీ డాక్యు**మెంట్లు సృష్టించడం, ఆ**పై రెవెన్యూ డిపార్టుమెంటును **మేనేజ్ చేయడంలో తల** మునకలయ్యారు. ఇలా పక్కా స్కెచ్ **తో కోట్లాది రూ**పాయల విలువజేసే స్థలాలను **కొట్టేస్తున్నారు. తాజా**గా కడప నగరంలోని ద్వారకాన**గర్‌లో రూ.12 కోట్ల** విలువజేసే ప్రభుత్వ భూమిని **చదును చేశారు.** ఈ ప్రాంతంలో ఇది ప్రభుత్వ **భూమి అని హె**చ్చరిక బోర్డును సైతం కబ్జాదా**రులు లెక్కచేయకుం**డా చదును చేసి ఆక్రమించే **ప్రయత్నాలు సా**గిస్తున్నారు.

- కడప నగరం ద్వారకానగర్‌లో రైతు బజార్ సమీపంలో నాగరాజుపల్లె పొలం సర్వే నెంబరు 71/1లో 2.52 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో రైతు బజార్ ఏర్పాటు చేయగా మరో 40 సెంట్లు ప్రభుత్వ భూమి ఖాళీగా ఉండిపోయింది. ఈ స్థలం బుగ్గవంక ప్రొటెక్షన్ వాల్‌కు ఆనుకునే ఉంది. ఆన్‌లైన్‌లో రికార్డులల్లో అనుభవదారు పేరు 'వాగు'అని ఇప్పటికీ వస్తోంది. కాగా ఆ స్థలంపై టీడీపీ నేతల కన్ను పడింది. జిల్లా టీడీపీ ముఖ్య నేత సన్నిహితులు స్వాహాకు ప్రణాళిక రచించారు. ప్రతిరోజు ముఖ్యనేత చుట్టు ఉండే తెలుగుతమ్ముళ్లు ఈకబ్జా వ్యవహారంలో క్రియాశీలక ప్రాత పోషించినట్లు ఆరోపణలున్నాయి.

హెచ్చరిక బోర్డును లెక్కచేయని అక్రమార్కులు

రెవెన్యూ అధికారులు ఈ స్థలం ప్రభుత్వ భూమి...దీనిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోబడును అని హెచ్చరిక బోర్డు సైతం ఏర్పాటు చేశారు. ఇవేవి తెలుగుతమ్ముళ్లు లెక్కచేయలేదు. కాగా ఈ స్థలం కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఇంటికి కూతవేటు దూరంలో ఉంది. ఈవ్యవహారం వెలుగులోకి రావడంతో సదరు నేతలు తేలుకుట్టిన దొంగలా ఉండిపోయారు. రూ.12కోట్ల విలువజేసే స్థలాన్ని కొట్టేసేందుకు నకిలీ పత్రాలు సృష్టించి ఇది తమదేనని చదును చేసేశారు. విషయం తెలుసుకున్న ద్వారకానగర్ కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ వారు రెవిన్యూ, కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. దాంతో వ్యవహారం బహిర్గతం కావడంతో అధికారులు సైతం కాస్తా అప్రమత్తమయ్యారు. కోట్లు విలువైన భూమి కాజేసేందుకు ఇప్పటికే టీడీపీ నేతలు నకిలీ డాక్యుమెంట్లు సైతం సృష్టించినట్లు సమాచారం. ఆమేరకు ఓ రెవెన్యూ అధికారితో సైతం సంప్రదించి సహకారం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇవన్నీ కూడా ఓ నేతకు పీఏగా ఉన్న వ్యక్తి తల దూర్చడంతోనే సాధ్యమైందనే ఆరోపణలు లేకపోలేదు. ఇలాంటి చర్యలను ఎక్కడికక్కడ కట్టడి చేయాల్సిన రెవెన్యూ యంత్రాంగం భూ కబ్జాలను అరికట్టడంలో చేతులెత్తేస్తోందనే విమర్శలు ఉన్నాయి. జిల్లా కేంద్రమైన కడప నగరంలో వార్డు సెక్రటరీ నుంచి కలెక్టర్ వరకు నిత్యం ఇక్కడే ఉంటారు. అలాంటి నగరంలోనే ప్రభుత్వ భూమిని పక్కాగా స్వాహా చేసేందుకు స్కెచ్ వేయడం గమనార్హం. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం మామూళ్ల మత్తు వీడి ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని నగర ప్రజలు కోరుతున్నారు.

20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

సాక్షి, అమరావతి: పశువుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల వద్ద పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పశుసంవర్థక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లు, కరపత్రాలను శనివారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ పశువులు ఆరోగ్య పరిరక్షణకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. శిబిరాలలో ముఖ్యంగా పశువైద్య చికిత్సలు, గర్భకోశవ్యాధులకు చికిత్స, నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ పశు యాజమాన్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వివరించారు.

హేతుబద్ధీకరణ నిర్ణయాన్ని పునరాలోచించాలి

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో హేతుబద్ధీకరణ చేపట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పునరాలోచించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శనివారం కోరింది. హేతుబద్ధీకరణ వల్ల వ్యవస్థలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులకు ఉపయోగం లేకపోగా, తీవ్రమైన పనిభారం పెరిగే అవకాశం ఉందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ పేర్కొన్నారు. మల్టీపర్పస్ ఉద్యోగులు అనే పేరుతో వివిధ పనులకు సచివాలయ ఉద్యోగులను వినియోగించుకోవాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపడుతున్నామని స్పష్టం చేశారు.

ప్రజలందరికీ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏటా దాదాపు 40 వేల మందికి పైగా ప్రాణాలను బలి తీసుకుంటున్న కేన్సర్ మహమ్మారిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. గతేడాది నవంబర్ 14 నుంచి ప్రారంభమైన స్క్రీనింగ్ పరీక్షల ప్రక్రియ పది నెలలుగా కొనసాగుతోంది. ఆరోగ్యశ్రీ ద్వారా కేన్సర్ చికిత్సలకు 2019–20లో రూ.217 కోట్లు ఖర్చుచేయగా, 2023–24 నాటికి అది రూ.624 కోట్లకు పెరిగిందని వైద్య ఆరోగ్యశాఖ శనివారం వెల్లడించింది. ఈ వ్యాధిని కట్టడి చేసేందుకు వీలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరికీ కేన్సర్ స్క్రీనింగ్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నాడు అర్హులు.. నేడు అనర్హులట!

పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులపై కూటమి సర్కారు నిర్దయ

- ప్రిలిమ్స్‌లోనూ అర్హత సాధించిన అభ్యర్థులు
- కోర్టు కేసు, ఎన్నికలతో అప్పట్లో ఆగిన దేహదారుఢ్య పరీక్షలు
- రెండునెలల క్రితం వాటి ప్రకటన జారీ
- ఇప్పుడు వయసు మీరిందంటూ పలువురిని అనుమతించని అధికారులు
- ఇదేం న్యాయమంటూ అభ్యర్థుల గగ్గోలు



దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొన్న కానిస్టేబుల్ అభ్యర్థులు

ఇదీ వయసు నిబంధన..

జనరల్, ఓబీసీ అభ్యర్థులకు : 18 నుంచి 27 ఏళ్లు

ఎస్సీ, ఎస్టీ కేటగిరీ వారికి : 18 నుంచి 32 ఏళ్లు



దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకావాలంటూ పంపిన హాల్‌టికెట్



వయస్సు మీరిందంటూ జారీచేసిన ఉత్తర్వు

అనంతపురం : పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులపట్ల టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్దయతో వ్యవహరిస్తోంది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన పలువురిని దేహదారుఢ్య పరీక్షలకు అనుమతించకుండా తీరని అన్యాయం చేస్తోంది. రెండేళ్ల క్రితం ఇచ్చిన నోటిఫికేషన్ నాటికి వారు వయసు రీత్యా అర్హులే. కానీ.. కోర్టు కేసు, ఎన్నికల కారణంగా గతంలో దేహదారుఢ్య పరీక్షలు ఆగిపోయాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే ఈవెంట్స్ పెట్టి, నియామకాలు చేపట్టకుండా ఐదు నెలలపాటు కాలయాపన చేసింది. ఇప్పుడు వయసు మీరిపోయిందంటూ అనేకమందిని ఇళ్లకు పంపేస్తోంది. వారు అర్హులైనప్పటికీ, వారి తప్పేమీ లేకపోయినప్పటికీ నిర్దయగా తిరస్కరిస్తోంది. దీంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇదేమిటని సెలక్షన్ అధికారులను అడిగితే.. తామేమీ చేయలేమని, ఏదైనా ఉంటే రిక్రూట్‌మెంట్ బోర్డుకు విన్నవించుకోవాలని సూచిస్తున్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 411 ఎస్ఐ, 6,100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎస్ఐ పోస్టులకు ప్రిలిమ్స్, దేహదారుఢ్య పరీక్షలు పూర్తయ్యాయి. కానిస్టేబుల్ పోస్టులకు 2023 జనవరి 22న ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించారు. తమ సర్వీసును సైతం పరిగణనలోకి తీసుకోవాలని హోంగార్డులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈవెంట్స్ (దేహదారుఢ్య పరీక్షలు) బ్రేక్‌పడింది. అనంతరం సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అనంతరం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదునెలలపాటు ఈ పోస్టుల భర్తీని పట్టించుకోలేదు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులంతా మళ్లీ ఆన్‌లైన్‌లో ఈవెంట్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని రెండునెలల క్రితం ప్రకటించింది. అప్పట్నుంచి కష్టపడి దేహదారుఢ్య పరీక్షలకు సిద్ధమైన పలువురు అభ్యర్థులను వయసు మీరిందంటూ అనుమతించకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

అన్యాయమైన నిర్ణయం




దేహదారుఢ్య పరీక్షలు జనవరి 17న నిర్వహిస్తున్నట్లు హాల్‌టికెట్ ఇచ్చారు. అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియానికి వెళ్లాక.. 'మీకు వయసు అయిపోయింది. అర్హతలేద'ని చెప్పారు. నోటిఫికేషన్ జారీ సమయానికి వయసును పరిగణనలోకి తీసుకోవాలిగానీ అందుకు విరుద్ధంగా తీసుకుంటున్నారు. ఈ పరీక్షలకు నెలన్నర నుంచి సిద్ధమయ్యాను. తీరా ఇప్పుడు అర్హతలేదనడంతో కానిస్టేబుల్ కల చెదిరిపోతోంది. నాలాగ ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే 100 మంది వరకు అన్యాయానికి గురయ్యారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మా విన్నపాన్ని పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలి.

– ఎస్. చంద్రశేఖర్, కానిస్టేబుల్ అభ్యర్థి, అనంతపురం


● 'విశ్వంభర'లో చిరంజీవి


● 'కన్నప్ప'లో విష్ణు మంచు


● 'జై హనుమాన్'లో రిషబ్ శెట్టి


● 'మహేంద్రగిరి వారాహి'లో సుమంత్


● నిఖిల్

భక్తి చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. అయితే ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు డివోషనల్ టచ్ ఉన్న చిత్రాలు ఎక్కువగా నిర్మాణంలో ఉన్నాయి. అంతా భక్తిమయం అంటూ దేవుడి చుట్టూ తిరిగే చిత్రాలు కొన్నయితే, కథలో భక్తి టచ్ ఉన్న చిత్రాలు కొన్ని. ఆ భక్తిమయ చిత్రాల గురించి తెలుసుకుందాం.


● 'జయహో రామానుజ'లో సాయి వెంకట్


● 'డియర్ కృష్ణ' పోస్టర్

అంతా భక్తిమయం

హనుమంతుడి సాక్షిగా...

ఆంజనేయస్వామికి హీరో చిరంజీవి ఎంత పెద్ద భక్తుడో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అవకాశం వచ్చినప్పుడల్లా వెండితెరపైనా హనుమంతుడి పట్ల తన భక్తి భావాన్ని ప్రదర్శిస్తుంటారాయన. చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'లోనూ హనుమంతుడి నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ఉంటాయని ఈ మూవీ టీజర్ చూస్తే స్పష్టంగా తెలుస్తోంది. హనుమంతుడి సాక్షిగా చిరంజీవి.. విలన్లను రఫ్ఫాడిస్తున్న దృశ్యాలు కనిపిస్తాయి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహించిన చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు. విక్రమ్ రెడ్డి సమర్పణలో వంశీ కృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మించారు. సోషల్ ఫ్యాంటసీ, పురాణాల నేపథ్యంలో ఈ మూవీ రూపొందింది. ఈ సినిమాలో కీలకమైన ఓ యాక్షన్ ఎపిసోడ్ కోసం హైదరాబాద్ శివార్లలోని ముచ్చింతల్ వద్ద 54 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని నెలకొల్పారు మేకర్స్. టీజర్ చూస్తే.. విలన్లను రఫ్ఫాడిస్తున్న చిరంజీవి వెనుక నిలువెత్తు హనుమాన్ విగ్రహం కనిపిస్తుంది. ఫైట్ మాస్టర్స్ రామ్–లక్ష్మణ్ ఆధ్వర్యంలో చిత్రీకరించిన ఈ యాక్షన్ సీక్వెన్స్ సినిమాకి ఓ హైలైట్‌గా నిలుస్తాయని టాక్. 'విశ్వంభర' సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 10న విడుదల కావాల్సింది. అయితే చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ హీరోగా నటించిన 'గేమ్ చేంజర్' మూవీ కోసం 'విశ్వంభర' రిలీజ్‌ని వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ మూవీ ఏప్రిల్ లేదా మేలో విడుదల కానుందని టాక్.

శివ శక్తి నాగసాధు పాత్రలో...

హీరోయిన్ తమన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'ఓదెల 2'. 'ఓదెల రైల్వేస్టేషన్' (2021)కి సీక్వెల్‌గా 'ఓదెల 2' రూపొందుతోంది. తొలి భాగాన్ని తెరకెక్కించిన అశోక్ తేజ రెండో భాగానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా, యువ, నాగ మహేశ్, వంశీ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, భూపాల్, పూజా రెడ్డి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి. మధు నిర్మిస్తున్నారు. సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ సినిమాలో శివ శక్తి నాగ సాధు పాత్రలో తమన్నా నటిస్తున్నారు. కాశీలోని గంగా నది తీరాన ఓ చేతిలో డమరుకం, మరో చేతిలో దండం పట్టుకుని నడిచి వస్తున్న తమన్నా ఫస్ట్ లుక్‌ని మహాశివరాత్రికి విడుదల చేశారు మేకర్స్. అలాగే డిసెంబరు 21న తమన్నా పుట్టినరోజు సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో.. పుర్రెలపై ధైర్యంగా నడుస్తుండగా, పైన రాబందులు ఎగరడం టెర్రిఫిక్‌గా ఉంది. గ్లామర్ బ్యూటీగా పేరొందిన తమన్నా నటిస్తున్న భక్తి చిత్రం 'ఓదెల 2'పై మంచి అంచనాలున్నాయి.


● 'ఓదెల 2'లో తమన్నా

పరమ శివుడి భక్తుడి కథ

మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటించిన పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. ఈ సినిమాకి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మంచు మోహన్‌బాబు నిర్మించారు. పరమ శివుడికి ప్రియ భక్తుడైన కన్నప్ప కథతో ఈ చిత్రం రూపొందింది. 'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్ వంటి ఇతిహాసాల స్ఫూర్తితో 'కన్నప్ప' తెరకెక్కుతోంది. ''భక్తి, శౌర్యం, ఆధ్యాత్మిక అన్వేషణతో కూడిన ప్రయాణంగా ఈ మూవీ ఉంటుంది'' అంటూ మంచు విష్ణు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, మధుబాల, ప్రీతీ ముకుందన్, ఐశ్వర్య, దేవరాజ్, ముఖేష్ రిషి వంటి వారు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా నటీనటుల లుక్స్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. స్టార్ హీరోలు, ఇతర సీనియర్ నటీనటులు నటిస్తున్న ఈ సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ నెలకొంది. ఈ సినిమా ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది.

జై హనుమాన్

ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన 'హనుమాన్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో తేజ సజ్జ, అమృతా అయ్యర్ జోడీగా నటించారు. కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన 'హనుమాన్' మూవీ 2024 సంక్రాంతి కానుకగా జనవరి 12న రిలీజై, పాన్ ఇండియా స్థాయిలో భారీ హిట్ సాధించి, అద్భుతమైన వసూళ్లు రాబట్టింది. 'హనుమాన్'కి కొనసాగింపుగా 'జై హనుమాన్' మూవీని ప్రకటించారు. ఈ మూవీలో ఆంజనేయ స్వామి పాత్రలో కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి (కాంతారా మూవీ ఫేమ్) నటిస్తున్నారు. ఈ మూవీ నుంచి రాముడు విగ్రహాన్ని హత్తుకుని ఉన్న హనుమంతుడిగా విడుదలైన ఆయన ఫస్ట్ లుక్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన 'హనుమాన్' మూవీ బ్లాక్‌బస్టర్‌గా నిలవడంతో దానికి సీక్వెల్‌గా రూపొందుతున్న 'జై హనుమాన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. పైగా 'కాంతారా' మూవీతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న రిషబ్ శెట్టి ఇందులో టైటిల్ రోల్‌లో నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్రేజ్ నెలకొంది. ఈ సినిమా ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుందని ఫిల్మ్‌నగర్ టాక్.

సీక్వెల్‌లోనూ భక్తి

హీరో నిఖిల్ సిద్ధార్థ్, దర్శకుడు చందు మొండేటిలది హిట్ కాంబినేషన్. వీరిద్దరి కలయికలో వచ్చిన తొలి చిత్రం 'కార్తికేయ' (2014) సూపర్ హిట్‌గా నిలిచింది. అలాగే వీరి కాంబోలో వచ్చిన ద్వితీయ సినిమా 'కార్తికేయ 2' (2022) పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్ బస్టర్ అయింది. ద్వారకా నగరం, శ్రీకృష్ణుడి నేపథ్యంలో ఈ చిత్రకథ ఉన్న సంగతి తెలిసిందే. తొలి, మలి సినిమాలు సూపర్ హిట్ కావడంతో వీరి కలయికలో రానున్న మూడో సినిమా 'కార్తికేయ 3'పై ఫుల్ క్రేజ్ నెలకొంది. అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ మూవీలోనూ పురాణాల నేపథ్యం, భక్తి కోణం ఉంటుందని టాక్. డా.కార్తికేయగా నిఖిల్ నటించనున్నారు. 'కార్తికేయ 2' పాన్ ఇండియా హిట్ కావడంతో 'కార్తికేయ 3' స్పాన్, స్కేల్ పరంగా చాలా పెద్దగా, అదే విధంగా భక్తి టచ్‌తో ఉండబోతోందని సమాచారం. ఇదిలా ఉంటే... ప్రస్తుతం నిఖిల్ హీరోగా 'స్వయంభూ' సినిమా చిత్రీకరణ జరుపుకుంటోంది. మరో వైపు నాగచైతన్య హీరోగా 'తండేల్' సినిమా తెరకెక్కిస్తున్నారు చందు మొండేటి. అటు నిఖిల్ 'స్వయంభూ', ఇటు చందు మొండేటి 'తండేల్' పూర్తయ్యాక 'కార్తికేయ 3' సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాదే పట్టాలెక్కే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే 'తండేల్' ఫిబ్రవరి 7న విడుదల కానుంది.

వారాహి అమ్మవారి ఆలయం నేపథ్యంలో...

సుమంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మహేంద్ర గిరి వారాహి'. సంతోష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. రాజశ్యామల బ్యానర్‌పై కాలిపు మధు నిర్మించారు. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథాంశంతో ఈ సినిమా రూపొందింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు బ్రహ్మానందం కీలక పాత్రలో నటించారు. ఈ చిత్రం గ్లింప్స్‌ను ప్రముఖ దర్శకుడు క్రిష్ విడుదల చేయగా, హీరో విశ్వక్ సేన్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ గ్లింప్స్‌కు విశేష స్పందన లభించింది. ఈ చిత్రాన్ని ఈ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించినా, విడుదల వాయిదా పడింది. అయితే ఎప్పుడు రిలీజ్ చేస్తారనేది మాత్రం వెల్లడించలేదు చిత్రబృందం.

శ్రీ కృష్ణుడి సందేశం

అక్షయ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'డియర్ కృష్ణ'. 'ప్రేమలు' చిత్రం ఫేమ్ మమితా బైజు, ఐశ్వర్య హీరోయిన్లు. దినేష్ బాబు దర్శకుడు. పీఎన్ బలరామ్ రచయితగా, నిర్మాతగా పరిచయమవుతున్నారు. పీఎన్‌బీ సినిమాస్‌పై రూపొందిన 'డియర్ కృష్ణ' ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ''శ్రీకృష్ణుడికి, భక్తుడికి మధ్య జరిగిన ఒక అద్భుతాన్ని ప్రేరణగా తీసుకొని, వాస్తవ ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాం. కృష్ణుడి సందేశాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

రామానుజాచార్యుల గొప్పదనం

సాయి వెంకట్ నటించి, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'జయహో రామానుజ'. జో శర్మ, సుమన్, ప్రవల్లిక ఇతర పాత్రలు చేస్తున్నారు. సుదర్శనం ప్రొడక్షన్స్‌లో సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ మూవీ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. భగవత్ శ్రీ రామానుజాచార్యుల గొప్పదనం నేటి తరం వారికి తెలియాలనే ఉద్దేశంతో 'జయహో రామానుజ' చిత్రం తీసినట్లు తెలిపారు మేకర్స్.

ఇవే కాదు... మరికొన్ని సినిమాలు కూడా భక్తి నేపథ్యంలో తెరకెక్కుతున్నాయి.

– దేరంగుల జగన్ మోహన్

నేటి తరం కోసమే కన్నప్ప

– విష్ణు మంచు


● ముఖేష్ కుమార్ సింగ్, 'రాక్‌లైన్' వెంకటేశ్, విష్ణు మంచు, శరత్ కుమార్, ప్రభుదేవా

''కన్నప్ప' సినిమా నాకు ఎంతో ప్రత్యేకం. కన్నప్ప ఎవరు? ఆయన కథ ఏంటి? ఆయన చేసిన గొప్ప కార్యాలు ఏంటి? వంటి అంశాలను నేటి తరానికి స్పష్టంగా చూపించాలనే 'కన్నప్ప' చేశాం. శివుని ఆజ్ఞతోనే ఈ చిత్రం ప్రారంభమైందనిపిస్తోంది. ఆ పరమ శివుని ఆశీస్సులతో ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం'' అని విష్ణు మంచు చెప్పారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో విష్ణు మంచు కలల ప్రాజెక్ట్‌గా రూపొందిన చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు నిర్మించారు. ఈ సినిమా ఏప్రిల్ 25న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. కాగా బెంగళూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విష్ణు మంచు మాట్లాడుతూ– ''కన్నప్ప' ప్రమోషన్స్‌ను కన్నడ నేల నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉంది. కన్నడ కంఠీరవ రాజ్ కుమార్‌గారు మొదటిసారిగా 'కన్నప్ప' చిత్రాన్ని చేశారు. ఆ తర్వాత శివ రాజ్‌కుమార్‌గారు చేశారు. తెలుగులో కృష్ణంరాజుగారు 'కన్నప్ప' చేశారు.. మళ్లీ ఇప్పుడు మేం కన్నప్ప కథను చెప్పబోతున్నాం'' అన్నారు. ముఖేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ– ''కన్నడలో రాజ్ కుమార్‌గారు చేసిన కన్నప్ప పాత్రను రీ క్రియేట్ చేయడమంటే మామూలు విషయం కాదు. కానీ, నాకు అద్భుతమైన నటీనటులు దొరికారు.. వారంతా అద్భుతంగా నటించారు. ఈ సినిమా ప్రేక్షకులకు విజువల్ ట్రీట్ ఇచ్చేలా ఉంటుంది'' అని తెలిపారు. నటుడు **ప్రభుదేవా** మాట్లాడుతూ– ''ముఖేష్ కుమార్ సింగ్‌గారు 'కన్నప్ప'ని అద్భుతంగా తీశారు. మోహన్‌బాబుగారు, విష్ణు ఈ సినిమా కోసం చాలా కష్టపడుతున్నారు. నేను ఈ చిత్రం కోసం మూడు పాటలకు కొరియోగ్రఫీ చేశాను. ఈ మూవీ హిట్ అవ్వాలి'' అని పేర్కొన్నారు. **నటుడు శరత్ కుమార్** మాట్లాడుతూ– ''కన్నప్ప అంటే శివ భక్తుడు అని అందరికీ తెలిసిందే. కానీ కన్నప్ప గురించి తెలియని ఎన్నో విశేషాల్ని ఈ చిత్రంలో చూపించబోతున్నారు. నాస్తికులు–ఆస్తికులు అనే కాన్సెప్ట్‌ను ఈ చిత్రంలో చూస్తారు'' అని తెలిపారు. **నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ రాక్ లైన్ వెంకటేశ్** మాట్లాడుతూ– ''కన్నప్ప' చిత్రాన్ని నేను కర్ణాటకలో రిలీజ్ చేయనుండటం ఆనందంగా ఉంది. ఈ చిత్రం పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు.


● నారా రోహిత్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు

యాక్షన్ టీజర్ రెడీ

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ లీడ్ రోల్స్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో పెన్ స్టూడియోస్ డా. జయంతి లాల్ గడా సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కేకే రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ని ఈ నెల 20న విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించి, ఓ యాక్షన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ''ఇప్పటికే విడుదల చేసిన లీడ్ స్టార్స్ ఫస్ట్ లుక్ పోస్టర్స్‌కి మంచి స్పందన లభించింది. ఈ పోస్టర్స్ సినిమాపై బజ్‌ని క్రియేట్ చేశాయి. అలాగే 'ఓ వెన్నెల...' సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. అదితీ శంకర్, దివ్యా పిళ్లై, ఆనంది హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, కెమేరా: హరి కె. వేదాంతం, ఛోటా కె.ప్రసాద్.

బాఫ్టాకి మంకీ మ్యాన్

ప్రతిష్ఠాత్మక 'బ్రిటీష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్' (బాఫ్టా) కు 'మంకీ మ్యాన్' మూవీ నామినేట్ అయింది. 'స్లమ్ డాగ్ మిలియనీర్' ఫేమ్ దేవ్ పటేల్ ప్రధాన పాత్రలో నటించి, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన హాలీవుడ్ చిత్రం 'మంకీ మ్యాన్'. ఇందులో శోభిత ధూళిపాళ హీరోయిన్‌గా నటించగా, మకరంద్ దేశ్‌పాండే, సికిందర్ ఖేర్, షార్ల్టో కోప్లీ, పిటోబాష్, విపిన్ శర్మ, అదితీ కాల్కుంటే ముఖ్య పాత్రలు పోషించారు. 2024 ఏప్రిల్ 5న ఈ సినిమా విడుదలైంది. ఈ చిత్రంలో తన నటనకు గాను అంతర్జాతీయంగా శోభితకు పేరొచ్చింది. కాగా 'బ్రిటిష్ రచయిత, దర్శక నిర్మాత అత్యుత్తమ అరంగేట్రం' విభాగంలో 'మంకీ మ్యాన్' నామినేట్ అయింది. అవినీతి ప్రపంచం నుంచి విముక్తిని కోరుకునే మాజీ దోషి జీవిత ప్రయాణంపై తెరకెక్కిన సినిమా ఇది. 'మంకీ మ్యాన్' అంతర్జాతీయంగా విడుదలైనా ఇండియాలో రిలీజ్ కావాల్సి ఉంది.


● శోభితా ధూళిపాళ

జైపూర్ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో మా కాళి

రైమా సేన్, అభిషేక్ సింగ్ లీడ్ రోల్స్‌లో విజయ్ యెలకంటి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మించిన త్రిభాషా చిత్రం 'మా కాళి'. ఈ చిత్రం ప్రతిష్ఠాత్మక జైపూర్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో బెస్ట్ పొలిటికల్ మూవీ అవార్డును గెలుచుకుంది. ఈ అవార్డు అందుకున్న అనంతరం దర్శకుడు విజయ్ యెలకంటి మాట్లాడుతూ– ''మా కాళికి బెస్ట్ పొలిటికల్ మూవీ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. మార్పును ప్రేరేపించే చిత్రాలను రూపొందించడానికి ఈ అవార్డు ఓ ప్రోత్సాహం. భారతీయ చరిత్రలో చెరిపివేయబడిన ఓ అధ్యాయం ఆధారంగా శక్తివంతమైన కథతో ఈ చిత్రాన్ని రూపొందించాం. కలకత్తా, నోఖాలీలో జరిగిన క్రూరమైన నరమేధ రక్తపాత సత్యాన్ని హైలైట్ చేస్తూ, భారతదేశ విభజనకు దారితీసిన డైరెక్ట్ యాక్షన్ డే వెనుక ఉన్న సత్యాన్ని ముందుకు తీసుకురావాలనేది 'మా కాళి' లక్ష్యం'' అన్నారు. ''మా కాళి' ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నాకు తెలుసు. మంచి కథలని చెప్పే శక్తిని ఈ గుర్తింపు మాకు ఇచ్చింది. మహిళా ప్రధాన చిత్రం కాబట్టి, 'జేఐఐఎఫ్' (జైపూర్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్) నుండి ఈ గుర్తింపు పొందడం మరింత సంతృప్తికరంగా ఉంది'' అని రైమా సేన్ పేర్కొన్నారు. హిందీలో రూపొందిన ఈ చిత్రం బెంగాలీ, తెలుగులో ఈ ఏడాదే విడుదల కానుంది.


● రైమా సేన్


● 'జాబిలమ్మ నీకు అంత కోపమా...' పోస్టర్

జాబిలమ్మ నీకు అంత కోపమా...

ధనుష్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన తాజా తమిళ చిత్రం 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబం'. ఈ రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్ మూవీలో పవీష్, అనిఖా సురేంద్రన్, ప్రియా ప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్, వెంకటేశ్ మీనన్, రబియా ఖతూన్, రమ్యా రంగనాథన్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు తెలుగులో 'జాబిలమ్మ నీకు అంత కోపమా' అనే టైటిల్‌ని ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అలాగే ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 21న రిలీజ్ చేయనున్నట్లుగా వెల్లడించారు. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ తెలుగులో ఈ సినిమాను విడుదల చేస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

సాక్షి ప్లస్
ఆదివారం । 19-1-2025



బీవైడీ సీలయన్-7..

చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజం బీవైడీ భారత్‌లో సీలయన్-7 కూపే-ఎస్‌యూవీ ఆవిష్కరించింది. కంపెనీ నుంచి ఇది భారత మార్కెట్లో నాల్గవ మోడల్‌గా నిలవనుంది. 82.5 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్ చేస్తే వేరియంట్‌నుబట్టి 542-567 కిలోమీటర్లు పరుగెడుతుంది. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని పర్ఫామెన్స్ వేరియంట్ 4.5 సెకన్లలో, ప్రీమియం వేరియంట్ 6.7 సెకన్లలో అందుకుంటుంది.

బిజినెస్ రీల్

జీడీపీ వృద్ధి రేటు 6.5-7 %

కోల్‌కత: అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి అంచనాలను సవరిస్తున్నట్టు నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రఖ్యాత ఆర్థికవేత్త అరవింద్ విర్మాణి శనివారం తెలిపారు. అంతకుముందు 6.5-7.5 శాతం శ్రేణిలో జీడీపీ వృద్ధిని అంచనా వేసిన విర్మాణి.. తాజాగా 6.5-7 శాతానికి సవరించారు. 'యుఎస్ ఎన్నికల అనిశ్చితి ఎన్నో రెట్ల ప్రభావాన్ని చూపుతోంది. ఇది యూరప్, చైనా, ఇతర ప్రాంతాలను ప్రత్యక్షంగా, భారత్‌ను పరోక్షంగా ప్రభావితం చేస్తోంది. చైనా యొక్క అధిక సామర్థ్యం, దాని మందగమన ఆర్థిక వ్యవస్థ.. వెరశి ప్రపంచ అనిశ్చితిని పెంచింది. ఈ పరిస్థితులు భారత వృద్ధి పథాన్ని మరింత ప్రభావితం చేయవచ్చు' అని అన్నారు. ఈ సవాళ్లు ఉన్నప్పటికీ భారత దీర్ఘకాలిక అవకాశాల గురించి ఆశాజనకంగానే ఉన్నట్టు విర్మాణి తెలిపారు.

బడ్జెట్‌లో కొత్త ఆదాయపు పన్ను బిల్లు?

న్యూఢిల్లీ: తదుపరి పార్లమెంటు బడ్జెట్ సెషన్‌లో కొత్త ఆదాయపు పన్ను బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇది ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టాన్ని సులభతరం, అర్థమయ్యేలా చేస్తుందని, అలాగే పేజీల సంఖ్యను 60% తగ్గిస్తుందని అధికార వర్గాలు వెల్లడించాయి. 'ఇది కొత్త చట్టం. ప్రస్తుత చట్టానికి సవరణ కాదు. ముసాయిదా చట్టాన్ని న్యాయ మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోంది. దీనిని బడ్జెట్ సెషన్ రెండవ భాగంలో పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉంది' అని తెలిపాయి. ఆరు దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం-1961ని ఆరు నెలల్లో సమగ్రంగా సమీక్షిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024 జూలై బడ్జెట్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే.

విశ్వసముద్ర గ్రూప్ ఎండీగా శివదత్ దాస్

హైదరాబాద్: ఇంజినీరింగ్, ఏవియేషన్ తదితర రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న విశ్వసముద్ర గ్రూప్ కొత్త మేనేజింగ్ డైరెక్టర్‌గా శివదత్ దాస్, వైస్ చైర్‌పర్సన్‌గా లక్ష్మీ ప్రియదర్శిని చింతా నియమితులయ్యారు. కొన్నేళ్లుగా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న దాస్.. గతంలో యునైటెడ్ స్పిరిట్స్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ తదితర సంస్థల్లో పనిచేశారు. కంపెనీ సీఎస్‌ఆర్ కార్యకలాపాల్లోను, గ్రూప్ విస్తరణలోను ప్రియదర్శిని కీలకంగా వ్యవహరిస్తున్నారు. కొత్త నాయకత్వంలో విశ్వసముద్ర గ్రూప్ అంతర్జాతీయ దిగ్గజంగా ఎదగగలదని ఆశిస్తున్నట్లు గ్రూప్ చైర్మన్ చింతా శశిధర్ తెలిపారు.

జెన్ టెక్నాలజీస్ మోర్టార్ ట్రైనింగ్ సిమ్యులేటర్ డిజైన్‌కు గుర్తింపు

హైదరాబాద్: అధునాతన '60 ఎంఎం మోర్టార్ ట్రైనింగ్ సిమ్యులేటర్' డిజైన్‌ను విజయవంతంగా రిజిస్టర్ చేసినట్లు జెన్ టెక్నాలజీస్ తెలిపింది. వినూత్నమైన మిలిటరీ శిక్షణ సాంకేతికతలను రూపొందించడాన్ని కొనసాగించేందుకు ఈ గుర్తింపు తోడ్పడగలదన్నారు. ఆధునిక యుద్ధరంగంలో మోర్టార్ల ప్రయోగానికి అవసరమైన నైపుణ్యాలను సాధించేందుకు ఈ సిమ్యులేటర్ ఉపయోగపడుతుందన్నారు. దీనితో ప్రత్యక్ష ఫైరింగ్ శిక్షణ ఖర్చులతోపాటు సంప్రదాయ శిక్షణల్లో ఉండే రిస్కులూ తగ్గుతాయని తెలిపింది.

శ్రీరామ్ లైఫ్ నుంచి సునిశ్చిత్ లాభ్ పథకం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తాజాగా సునిశ్చిత్ లాభ్ పేరిట ప్రత్యేక పథకాన్ని ఆవిష్కరించింది. ఇటు పొదుపు అటు బీమా రక్షణ ప్రయోజనాలను కూడా కల్పించే సాధనంగా దీన్ని తీర్చిదిద్దినట్లు సంస్థ తెలిపింది. కట్టిన మొత్తం ప్రీమియంపై 668 శాతం మేర కచ్చితమైన రాబడులను అందించడం దీని ప్రత్యేకత అని పేర్కొంది. రిటైర్మెంట్, పిల్లల చదువులు, ఆర్థిక భద్రతను ఏర్పర్చుకోవడం తదితర లక్ష్యాలకు ఇది అనువుగా ఉంటుందని వివరించింది. కనీస వార్షిక ప్రీమియం రూ. 30,000గా ఉంటుంది. ఈ ప్లాన్ కింద మెచ్యూరిటీ తర్వాత పన్నురహితంగా 40 ఏళ్ల పాటు ఆదాయాన్ని అందుకోవచ్చు. వార్షిక ప్రీమియంపై 160 రెట్లు డెత్ బెనిఫిట్స్ కూడా ఈ పథకంలో ఉంటాయి.

కేఐవోసీఎల్-ఎన్ఎండీసీ విలీన యోచనలో కేంద్రం

న్యూఢిల్లీ: నష్టాల్లో ఉన్న పెల్లెట్ల తయారీ సంస్థ కేఐవోసీఎల్‌ను ప్రభుత్వ రంగ ఇనుప ఖనిజ దిగ్గజం ఎన్ఎండీసీలో విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం సహకరించకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఆయన పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-1-2025

విశాఖ	505-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	503-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	480-00
వరంగల్	482-00
రిటైల్ ధర	5.40

- రెండు మోడళ్ల ఆవిష్కరణ
- ఈ ఏడాదే మార్కెట్లోకి

భారత్‌కు విన్‌ఫాస్ట్ ఆటో



న్యూఢిల్లీ: భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో రెండో రోజు వివిధ కంపెనీల నుంచి నూతన ఎలక్ట్రిక్ వాహనాలు కొలువుదీరాయి. వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్ ఆటో భారత్‌కు ఎంట్రీ ఇస్తున్నట్టు ప్రకటించింది. వీఎఫ్-7, వీఎఫ్-6 ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలను ఆవిష్కరించింది. ఈ ఏడాది చివరినాటికి వీటిని మార్కెట్లోకి తేనున్నట్టు తెలిపింది. తమిళనాడులోని ట్యూటికోరిన్ వద్ద 500 మిలియన్ డాలర్ల పెట్టుబడితో తయారీ కేంద్రం స్థాపించనున్నట్టు వెల్లడించింది. ఈ ఏడాది రెండవ అర్ధ భాగంలో ఈ ప్లాంటు రెడీ అవుతుందని విన్‌ఫాస్ట్ ఆసియా సీఈవో పామ్ సాన్ ఛావ్ తెలిపారు.

ఒలెక్ట్రా బ్లేడ్ బ్యాటరీ ఛాసీ..

హైదరాబాద్ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో వేదికగా 12 మీటర్ల పొడవున్న బ్లేడ్ బ్యాటరీ ఛాసీని ఆవిష్కరించింది. 9 మీటర్ల పొడవున్న సిటీ బస్, 12 మీటర్ల పొడవుతో కోచ్ బస్ సైతం ప్రదర్శించింది. బ్లేడ్ బ్యాటరీ ఒకసారి చార్జింగ్‌తో 500 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. 2024 సెప్టెంబర్ 30 నాటికి 2,200లకుపైగా యూనిట్ల ఎలక్ట్రిక్ బస్‌లను సరఫరా చేసి ప్రజా రవాణా రూపురేఖలను మార్చినట్టు ఒలెక్ట్రా సీఎండీ కె.వి.ప్రదీప్ తెలిపారు.






అశోక్ లేలాండ్ సాథీ

వాణిజ్య వాహనాలు, బస్‌ల తయారీ దిగ్గజం అశోక్ లేలాండ్ సాథి పేరుతో తేలికపాటి చిన్న వాణిజ్య వాహనాన్ని ఆవిష్కరించింది. అత్యాధునిక ఎల్ఎస్‌టీ సాంకేతికతతో తయారైంది. 45 హెచ్‌పీ పవర్, 110 ఎన్ఎం టార్క్ అందిస్తుంది. 1,120 కిలోల బరువు మోయగలదు. ధర రూ.6.49 లక్షలు. అలాగే మల్టీ యాక్సెల్, ఫ్రంట్ ఇంజన్, 15 మీటర్ల పొడవున్న గరుడ్-15 ప్రీమియం బస్ సైతం కొలువుదీరింది. 42 స్లీపర్ బెర్తులను ఈ బస్‌లో ఏర్పాటు చేశారు. కాగా, ఈ-టిరాన్ పేరుతో ఎలక్ట్రిక్ పోర్ట్ టెర్మినల్ ట్రాక్టర్‌ను సైతం కంపెనీ ఆవిష్కరించింది.



హ్యుండై టీవీఎస్ జోడీ

హ్యుండై మోటార్ కంపెనీ, టీవీఎస్ మోటార్ కంపెనీ చేతులు కలిపాయి. అధునాతన ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లు, చిన్న ఫోర్-వీలర్లను అభివృద్ధి చేసే లక్ష్యంతో భాగస్వామ్యాన్ని అన్వేషించనున్నట్లు ప్రకటించాయి. ఈ సందర్భంగా హ్యుండై తన మైక్రో మొబిలిటీ కాన్సెప్ట్ ఈవీలను ఆవిష్కరించింది. ఈ భాగస్వామ్యం కార్యరూపం దాలిస్తే డిజైన్, ఇంజనీరింగ్, సాంకేతిక నైపుణ్యాన్ని అందించాలని హ్యుండై యోచిస్తోంది. అయితే భారత్‌లో ఈ వాహనాల తయారీ, మార్కెటింగ్‌పై టీవీఎస్ దృష్టి పెడుతుంది.



జేబీఎం ఎలక్ట్రిక్ కొత్త వాహనాలు

జేబీఎం ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఎక్స్‌పో వేదికగా గెలాక్సీ లగ్జరీ కోచ్, ఎక్స్‌ప్రెస్ ఇంటర్‌సిటీ బస్, లో ఫ్లోర్ మెడికల్ మొబైల్ యూనిట్ ఈ-మెడిలైఫ్, దేశంలో తొలిసారిగా 9 మీటర్ల పొడవున్న టార్మాక్ కోచ్ ఈ-స్కైలైఫ్‌ను విడుదల చేసింది. లిథియం-అయాన్ బ్యాటరీలు కలిగిన ఈ వాహనాలకు అల్ట్రా ఫాస్ట్ చార్జింగ్ సదుపాయం ఉంది. ఇప్పటికే కంపెనీ భారత్‌తోపాటు యూరప్, పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాల్లో 1,800 ఎలక్ట్రిక్ బస్‌లను విక్రయించింది. 10,000 పైచిలుకు ఈ-బస్‌లకు ఆర్డర్ బుక్ ఉందని జేబీఎం గ్రూప్ వైస్ చైర్మన్ నిశాంత్ ఆర్య తెలిపారు.



మైక్రో మొబిలిటీతో బజాజ్?

స్విట్జర్లాండ్‌కు చెందిన మైక్రో మొబిలిటీ సిస్టమ్స్‌లో వాటాను కొనుగోలు చేయడంతో సహా ఎలక్ట్రిక్ క్వాడ్రిసైకిళ్లను ఉత్పత్తి, ఎగుమతి చేయడానికి వ్యూహాత్మక భాగస్వామ్యం కోసం బజాజ్ ఆటో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. మైక్రోలీనో పేరుతో రెండు సీట్ల ఎలక్ట్రిక్ క్వాడ్రిసైకిల్‌ను, అలాగే మైక్రోలెటా పేరుతో మూడు చక్రాల ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మైక్రో మొబిలిటీ తయారు చేస్తోంది. నగరాల్లో తక్కువ దూరం ప్రయాణానికి అనువైన వాహనాల తయారీలో మైక్రో మొబిలిటీ సిస్టమ్స్‌కు పేరుంది.

కొలువుదీరిన ఎంజీ మోడళ్లు

జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా మజెస్టర్ పేరుతో మధ్యస్థాయి ఎస్‌యూవీని ఆవిష్కరించింది. కాంపాక్ట్ కార్స్ కంటే పెద్దగా, పూర్తి స్థాయి కార్స్ కంటే చిన్నగా ఉంటుందని కంపెనీ తెలిపింది. అంతర్జాతీయంగా అందుబాటులో ఉన్న ఐఎం5, ఐఎం6, ఎంజీ హెచ్‌ఎస్, ఎంజీ7 ట్రోఫీ ఎడిషన్ మోడళ్లను సైతం కంపెనీ ప్రదర్శించింది.

మోంట్రా ఎలక్ట్రిక్ కొత్త మోడళ్లు

మురుగప్ప గ్రూప్ కంపెనీ మోంట్రా ఎలక్ట్రిక్ రెండు కొత్త వాహనాలను లాంచ్ చేసింది. ఈవియేటర్ పేరుతో చిన్న తరహా వాణిజ్య వాహనాన్ని, సూపర్ కార్గో పేరుతో త్రీవీలర్‌ను ఆవిష్కరించింది. ఒకసారి చార్జింగ్‌తో ఈవియేటర్ 245 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఢిల్లీ ఎక్స్‌షోరూంలో ధర రూ.15.99 లక్షలు. సూపర్ కార్గో ఈ-త్రీవీలర్ 200 కిలోమీటర్లపైగా పరుగెడుతుంది. పూర్తి ఛార్జింగ్ కోసం 15 నిమిషాలు సమయం తీసుకుంటుంది. ఢిల్లీ ఎక్స్‌షోరూంలో ధర రూ.4.37 లక్షలు. కంపెనీ 55 టన్నుల హెవీ కమర్షియల్ ఎలక్ట్రిక్ ట్రక్ రైనో సైతం ప్రదర్శించింది.



ఫారెక్స్‌లో ఆర్‌బీఐ జోక్యంతో ఒడిదుడుకులకు కళ్లెం

ఆర్‌బీఐ అధ్యయనంలో వెల్లడి



ముంబై: ఫారెక్స్ మార్కెట్లో రిజర్వ్ బ్యాంక్ జోక్యం చేసుకోవడమనేది .. విదేశీ పెట్టుబడుల రాకపోకల వల్ల కరెన్సీ మారకంపరంగా తలెత్తే ఒడిదుడుకులను కట్టడి చేసేందుకు గణనీయంగా తోడ్పడుతోంది. రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన తాజా బులెటిన్‌లోని అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. భారత్‌లో మారకం రేటు తీవ్ర హెచ్చుతగ్గులకు లోను కావడానికి విదేశీ పెట్టుబడుల ప్రవాహంలో మార్పులు కూడా కారణమని ఇందులో పేర్కొన్నారు. 2008-09లో అంతర్జాతీయంగా ఆర్థిక సంక్షోభ సమయంలో, 2013లో ఉద్దీపన ప్యాకేజీల ఉపసంహరణ వార్తలు వచ్చినప్పుడు, 2018లో ఐఎల్‌ఎఫ్ఎస్ సంక్షోభం తలెత్తినప్పుడు, ఆ తర్వాత కోవిడ్-19 మహమ్మారి సమయంలో రూపాయి ఒడిదుడుకులకు గురైనట్లు అధ్యయన నివేదిక వెల్లడించింది. ఆర్‌బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ పాత్రా సారథ్యంలోని బృందం దీన్ని రూపొందించింది. జనవరి 10తో ముగిసిన వారంలో భారత ఫారెక్స్ నిల్వలు 8.714 బిలియన్ డాలర్లు తగ్గి 625.871 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

బ్యాంకింగ్ కాల్స్‌కు ప్రత్యేక నంబర్ల సిరీస్: ఆర్‌బీఐ సూచన

ముంబై: ఆర్థిక మోసాలను నివారించే దిశగా బ్యాంకింగ్ లావాదేవీల విషయంలో కస్టమర్లకు చేసే కాల్స్‌కి సంబంధించి '1600' ఫోన్ నంబరింగ్ సిరీస్‌ను మాత్రమే ఉపయోగించాలని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ సూచించింది. అలాగే, ప్రమోషనల్ అవసరాల కోసం బ్యాంకులు, ఇతరత్రా నియంత్రిత సంస్థలు (ఆర్‌ఈ) '140' నంబర్ల సిరీస్‌నే ఉపయోగించాలని పేర్కొంది. బ్యాంకులు, ఆర్‌ఈలు ఎప్పటికప్పుడు తమ కస్టమర్ల డేటాబేస్‌ను అప్‌డేట్ చేసుకుంటూ ఉండాలని ఆర్‌బీఐ ఒక సర్క్యులర్‌లో తెలిపింది. డిజిటల్ రూపంలో ఆర్థిక లావాదేవీల నిర్వహణ సులభతరంగా మారినప్పటికీ, దీనితో మోసాల ఉదంతాలు కూడా పెరుగుతున్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తాజా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. నిర్దేశిత ఆదేశాలను మార్చి 31 కల్లా అమలు చేయాలని సూచించింది.

మార్కెట్లోకి మరింత మంది రావాలి: సెబీ చైర్‌పర్సన్ బచ్



న్యూఢిల్లీ: మరింత మంది భారతీయులు మార్కెట్ వ్యవస్థలోకి రావాలని, సంపద సృష్టి అవకాశాలను దక్కించుకోవాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ కోరుకుంటున్నట్లు సంస్థ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్ తెలిపారు. వ్యవస్థ ఎంత సమర్థవంతమైనదైనప్పటికీ కేవలం కొద్దిమందికే పరిమితమైతే.. దేశ పురోగతికి ఉపయోగపడదని బచ్ చెప్పారు. ఈ నేపథ్యంలోనే మార్కెట్లను సమ్మిళితంగా తీర్చిదిద్దడంపై సెబీ దృష్టి పెడుతోందన్నారు. ఇక, సాధ్యమైనంత ఎక్కువ మందికి టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చేందుకు, నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు సెబీ చేస్తున్న ప్రయత్నాల్లో కృత్రిమ మేధ (ఏఐ) ఒక 'హీరో'లాగా ఎంతగానో ఉపయోగపడుతోందని ఆమె పేర్కొన్నారు. మరోవైపు, నిర్దిష్ట మూడు నెలల వ్యవధిలోగా పబ్లిక్ ఇష్యూల పత్రాలను క్లియర్ చేసేందుకు సెబీ, కృత్రిమ మేధను ఉపయోగిస్తున్నట్లు ఇన్ఫోసిస్ చైర్మన్ నందన్ నీలేకని వివరించారు.

ఇంటర్నెట్ యూజర్లు 90 కోట్లు

2025పై ఐఏఎంఏఐ-కాంటార్ నివేదిక



గతేడాదితో పోలిస్తే 8% అప్ ● ప్రాంతీయ భాషల్లో కంటెంట్‌కు డిమాండ్

న్యూఢిల్లీ: భారతీయ భాషల్లో డిజిటల్ కంటెంట్‌కు డిమాండ్ నెలకొనడంతో దేశీయంగా ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య ఈ ఏడాది 90 కోట్ల స్థాయిని దాటనుంది. గతేడాదితో పోలిస్తే 8 శాతం వృద్ధి చెందనుంది. 2024లో యాక్టివ్ ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య 88.6 కోట్లుగా ఉంది. ఐఏఎంఏఐ, కాంటార్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ఇంటర్నెట్ యూజర్లలో దాదాపు సగం మంది గ్రామీణ భారతదేశంలో ఉన్నారు. వీరి సంఖ్య 48.8 కోట్లుగా ఉంది. దాదాపు 98 శాతం యూజర్లు భారతీయ భాషల్లో కంటెంట్‌ను వినియోగిస్తున్నారు. తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో కంటెంట్ లభ్యత, డిమాండ్ అధికంగా ఉంది. పట్టణ ప్రాంత యూజర్లలో సగం మంది (సుమారు 57 శాతం) ప్రాంతీయ భాషల్లో కంటెంట్ వైపు మొగ్గు చూపుతున్నారు. డిజిటల్ వినియోగంలో లింగ అసమానతలు క్రమంగా తగ్గుతున్నాయని, ప్రస్తుతం మొత్తం ఇంటర్నెట్ యూజర్లలో 47 శాతం మంది మహిళలు ఉంటున్నారని నివేదిక పేర్కొంది. ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్నప్పటికీ, విస్తృతి వేగం నెమ్మదిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ ధోరణి ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం వృద్ధి రేటు రెండంకెల స్థాయిలో వృద్ధి చెందుతోంది. స్మార్ట్‌టీవీలు, స్మార్ట్ స్పీకర్లలాంటి సాంప్రదాయేతర సాధనాల వినియోగంలో పట్టణ ప్రాంతాలు ముందంజలో ఉన్నాయి. 2023తో పోలిస్తే 2024లో ఇది 54 శాతం పెరిగింది. ఓటీటీ వీడియోలు, మ్యూజిక్ స్ట్రీమింగ్, సోషల్ మీడియా మొదలైన వాటి వినియోగంలో పట్టణ యూజర్లను మించి గ్రామీణ యూజర్లు ముందుంటున్నారు. డిజిటల్ చెల్లింపులు, ఈ-కామర్స్, ఆన్‌లైన్ చదువులు తదితర అంశాల్లో పట్టణ ప్రాంతాల వారు ముందంజలో ఉంటున్నారు.

క్యూ3 ఫలితాలు

కోటక్ నికర లాభం రూ.4,701 కోట్లు

10% పెరిగిన నికర వడ్డీ ఆదాయం



ముంబై: ప్రైవేటు రంగ కోటక్ మహీంద్రా బ్యాంకు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.4,701 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌తో పోలిస్తే లాభం 10% పెరిగింది. టర్నోవర్ రూ.13,507 కోట్ల నుంచి రూ.16,050 కోట్లకు చేరింది. వ్యయాలు రూ.9,530 కోట్ల నుంచి రూ.10,869 కోట్లకు పెరిగాయి. నికర వడ్డీ ఆదాయం రూ.7,196 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే క్వార్టర్‌లో నమోదైన రూ.6,554 కోట్లతో పోలిస్తే ఇది 10% అధికంగా ఉంది. నికర వడ్డీ మార్జిన్ 5.22% నుంచి 4.93 శాతానికి దిగివచ్చింది. స్థూల ఎన్‌పీఏలు 1.49% నుంచి 1.50 శాతానికి పెరిగాయి. రాని బాకీల కోసం చేసిన కేటాయింపులు రూ.579 కోట్ల నుంచి రూ.794 కోట్లకు చేరాయి. ఇతర ఆదాయాలు 14% వృద్ధి చెంది రూ.2,623 కోట్లుగా ఉంది.

ఇండియన్ హోటల్స్ లాభం జూమ్

క్యూ3లో రూ. 582 కోట్లు



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ ఆతిథ్య రంగ దిగ్గజం ఇండియన్ హోటల్స్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 29 శాతం జంప్ చేసి రూ. 582 కోట్లను అధిగమించింది. వైమానిక, సంస్థాగత కేటరింగ్ బిజినెస్‌లను కన్సాలిడేటెడ్ చేసిన నేపథ్యంలో లాభదాయకత పుంజుకుంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 452 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 29 శాతం ఎగసి రూ. 2,592 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 2,004 కోట్ల టర్నోవర్ నమోదైంది. అయితే మొత్తం

బీఎస్‌ఈలో ఇండియన్ హోటల్స్ షేరు 0.3 శాతం బలపడి రూ. 814 వద్ద ముగిసింది.

జియో ఫైనాన్షియల్ లాభం ఫ్లాట్

క్యూ3లో రూ. 295 కోట్లు

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 295 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 294 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 8 శాతం బలపడి రూ. 449 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 414 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు రూ. 99 కోట్ల నుంచి రూ. 131 కోట్లకు పెరిగాయి. అసెట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలో కార్యకలాపాల కోసం బ్లాక్‌రాక్‌తో కలసి భాగస్వామ్య కంపెనీ(జేవీ) ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మ్యూచువల్ ఫండ్ బిజినెస్‌ను ప్రారంభించేందుకు వీలుగా జేవీ 2023 అక్టోబర్ 19న సెబీకి దరఖాస్తు చేసింది. మరోపక్క జియో పేమెంట్ సొల్యూషన్స్ ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్స్‌ను పొందినట్లు జియో ఫైనాన్షియల్ పేర్కొంది.

ఎస్‌బీఐ లైఫ్ లాభం 71 శాతం అప్..

క్యూ3లో రూ. 551 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ రూ. 551 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో నమోదైన రూ. 322 కోట్లతో పోలిస్తే లాభం 71 శాతం వృద్ధి చెందింది. దీనికి కొత్త ప్రీమియంతో పాటు రెన్యువల్ ప్రీమియం పెరగడం తోడ్పడింది. సమీక్షాకాలంలో నికర ప్రీమియం ఆదాయం రూ. 22,316 కోట్ల నుంచి రూ. 24,828 కోట్లకు పెరిగింది. మేనేజ్‌మెంట్ వ్యయాలు రూ. 2,188 కోట్ల నుంచి రూ. 2,417 కోట్లకు చేరాయి. సంస్థ నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) 2023 డిసెంబర్ 31 నాటికి రూ. 3,71,410 కోట్లుగా ఉండగా గతేడాది డిసెంబర్ ఆఖరు నాటికి రూ. 4,41,678 కోట్లకు చేరింది.



చాంపియన్ కర్ణాటక

ఐదోసారి విజయ్ హజారే ట్రోఫీ కైవసం

- ఫైనల్లో విదర్భపై 36 పరుగుల తేడాతో విజయం
- స్మరణ్ సూపర్ సెంచరీ
- ధ్రువ్ షోరే, హర్ష్ దూబే మెరుపులు వృథా
- 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా కరుణ్ నాయర్

వడోదర: దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక జట్టు విజేతగా నిలిచింది. సీజన్ ఆసాంతం నిలకడగా రాణించిన కర్ణాటక... తుది పోరులోనూ భారీ స్కోరు చేసి టైటిల్ ఖాతాలో వేసుకుంది. ఐదోసారి ఫైనల్‌కు చేరిన కర్ణాటక ఐదు సార్లూ టైటిల్ సొంతం చేసుకోవడం మరో విశేషం. శనివారం జరిగిన ఫైనల్లో కర్ణాటక 36 పరుగుల తేడాతో విదర్భను చిత్తుచేసింది. ఈ సీజన్‌లో పరుగుల వరద పారించిన విదర్భ సారథి కరుణ్ నాయర్ (31 బంతుల్లో 27; 4 ఫోర్లు) ఆఖరి పోరులో ఎక్కువ సేపు నిలవకపోవడంతో ఆ జట్టుకు పరాజయం తప్పలేదు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 348 పరుగులు చేసింది. రవిచంద్రన్ స్మరణ్ (92 బంతుల్లో 101; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో కదంతొక్కగా... క్రిష్ణన్ శ్రీజిత్ (74 బంతుల్లో 78; 9 ఫోర్లు, ఒక సిక్స్), అభినవ్ మనోహర్ (42 బంతుల్లో 79; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ శతకాలతో విజృంభించారు. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (32; 5 ఫోర్లు), టీమిండియా ఆటగాడు దేవదత్ పడిక్కల్ (8), అనీశ్ (21) విఫలమయ్యారు. 67 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన దశలో శ్రీజిత్‌తో కలిసి స్మరణ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఈ జంట నాలుగో వికెట్‌కు 160 పరుగులు జోడించారు. ఇక చివర్లో అభినవ్ మనోహర్ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో కర్ణాటక భారీ స్కోరు చేయగలిగింది. విదర్భ బౌలర్లలో దర్శన్ నల్కండే, నచికేత్ భూటె చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో విదర్భ జట్టు 48.2 ఓవర్లలో 312 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ధ్రువ్ షోరే (111 బంతుల్లో 110; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో పోరాడగా... హర్ష్ దూబే (30 బంతుల్లో 63; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) వీరవిహారం చేశాడు. క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్లోనూ సెంచరీలు చేసిన ధ్రువ్ షోరే తుది పోరులోనూ అదే జోరు కొనసాగించగా... అతడికి సహచరుల నుంచి సరైన సహకారం లభించలేదు. కెప్టెన్ కరుణ్ నాయర్, యశ్ రాథోడ్ (22), యష్ కదమ్ (15); జితేశ్ శర్మ (34), శుభమ్ దూబే (8), అపూర్వ వాంఖడే (12) విఫలమయ్యారు. కర్ణాటక బౌలర్లలో వాసుకి కౌశిక్, ప్రసిద్ధ్ కృష్ణ, అభిలాశ్ శెట్టి తలా 3 వికెట్లు పడగొట్టారు. సెంచరీతో చెలరేగిన కర్ణాటక బ్యాటర్ స్మరణ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తాజా టోర్నీలో 389.5 సగటుతో 779 పరుగులు చేసి 'టాప్ స్కోరర్'గా నిలిచిన కరుణ్ నాయర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు లభించింది.

ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ బోణీ

- మహిళల అండర్-19 ప్రపంచకప్
- నేడు వెస్టిండీస్‌తో భారత్ ఢీ


కేమీ బ్రే

కౌలాలంపూర్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా జట్లు శుభారంభం చేశాయి. మలేసియా వేదికగా జరుగుతున్న ఈ టోర్నమెంట్‌కు తొలి రోజు వర్షం ఆటంకం కలిగించింది. శనివారం మొత్తం 6 మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా... అందులో మూడింట మాత్రమే ఫలితం వచ్చింది. గ్రూప్ 'డి'లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 9 వికెట్ల తేడాతో స్కాట్లండ్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన స్కాట్లండ్ 15.1 ఓవర్లలో 48 పరుగులకే ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కేమీ బ్రే 1 పరుగే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టగా, ఎలెనార్ లరోసా 7 పరుగులిచ్చి 3 వికెట్లు తీసింది. అనంతరం ఆస్ట్రేలియా 6.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 49 పరుగులు చేసి గెలిచింది. గ్రూప్ 'డి'లో భాగంగా జరిగిన మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు 5 వికెట్ల తేడాతో నేపాల్‌పై నెగ్గింది. మొదట నేపాల్ 18.2 ఓవర్లలో 52 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో బంగ్లాదేశ్ 13.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 53 పరుగులు చేసింది. గ్రూప్ 'సి'లో భాగంగా దక్షిణాఫ్రికా 22 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. వర్షం వల్ల మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించగా... మొదట దక్షిణాఫ్రికా 7 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది. అనంతరం న్యూజిలాండ్ 11 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 69 పరుగులకు పరిమితమైంది. పాకిస్తాన్, అమెరికా మధ్య జరగాల్సిన గ్రూప్ 'బి' మ్యాచ్... నైజీరియా, సమోవా మధ్య జరగాల్సిన గ్రూప్ 'సి' మ్యాచ్ ఒక్క బంతి పడకుండానే రద్దు కాగా... ఇంగ్లండ్, ఐర్లాండ్ మధ్య గ్రూప్ 'బి' మ్యాచ్‌లోనూ ఫలితం తేలలేదు.

మన అమ్మాయిలకు తొలి పరీక్ష

డిఫెండింగ్ చాంపియన్ హోదాలో అండర్-19 ప్రపంచకప్‌లో అడుగుపెట్టిన భారత్... గ్రూప్ 'ఎ'లో భాగంగా తమ తొలి పోరులో ఆదివారం వెస్టిండీస్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. 2023లో తొలిసారి నిర్వహించిన ఈ టోర్నీలో షఫాలీ వర్మ సారథ్యంలోని భారత జట్టు చాంపియన్‌గా నిలవగా... ఇప్పుడు అదే ప్రదర్శన పునరావృతం చేయాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. నికీ ప్రసాద్ సారథ్యంలోని భారత జట్టులో గొంగడి త్రిష, షబ్నమ్ షకీల్ రూపంలో ఇద్దరు తెలుగమ్మాయిలు ఉన్నారు. ఈ ఇద్దరూ రెండేళ్ల క్రితం జరిగిన అండర్-19 వరల్డ్‌కప్‌లోనూ భాగస్వాములు కావడం భారత జట్టుకు కలిసిరానుంది. సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవాలనుకుంటున్న యంగ్ ప్లేయర్లకు ఇది చక్కటి అవకాశం కానుంది. మరోవైపు టి20 ఫార్మాట్‌లో ప్రమాదకర జట్టుగా గుర్తింపు ఉన్న వెస్టిండీస్ అమ్మాయిలు కూడా ఈ మ్యాచ్‌లో గెలిచి టోర్నీలో శుభారంభం చేయాలనుకుంటున్నారు.

సాత్విక్-చిరాగ్ జంట ఓటమి

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్ పోరాటం ముగిసింది. సింధు సహా పలువురు ప్రధాన ఆటగాళ్ల పరాజయాలతో టోర్నీ నుంచి నిష్క్రమించగా... ఇప్పుడు పురుషుల డబుల్స్ విభాగంలో మాజీ చాంపియన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి కూడా పరాజయం పాలైంది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ 18-21, 14-21తో మూడో సీడ్ జె ఫెగో-నూరుజుద్దీన్ (మలేసియా) ద్వయం చేతిలో ఓడింది. 37 నిమిషాల్లో ముగిసిన పోరులో భారత జంట వరుస గేమ్‌ల్లో ఓటమి పాలైంది. సాత్విక్-చిరాగ్ జోడీ సెమీఫైనల్లో ఓడటం ఇది వరుసగా మూడో సారి. గతేడాది చైనా మాస్టర్స్ టోర్నీలో, ఈ ఏడాది మలేసియా సూపర్-1000 టోర్నీలోనూ ఈ జంట సెమీఫైనల్లో ఓడింది. తొలి గేమ్‌లో ఒక దశలో 6-9తో వెనుకబడ్డ భారత జంట... ఆ తర్వాత జోరు పెంచి 15-12తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇతే తీవ్రత కొనసాగిస్తూ గేమ్ సొంతం చేసుకుంటుంది అనుకుంటే... అనూహ్యంగా విజృంభించిన ప్రత్యర్థి జంట వరుస పాయింట్లు కొల్లగొడుతూ గేమ్ గెలిచింది. రెండో గేమ్ ఆరంభంలోనే 5-0తో ఆధిక్యంలోకి వెళ్లిన మలేసియా షట్లర్లు... అదే జోరు కొనసాగిస్తూ గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు.



అంకితా రైనా జంటకు టైటిల్

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ ప్లేయర్ అంకితా రైనా... ఈ సీజన్‌లో తొలి డబుల్స్ టైటిల్ కైవసం చేసుకుంది. ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ (ఐటీఎఫ్) డబ్ల్యూ50 టోర్నమెంట్‌లో అంకితా రైనా-నైక్తా బైన్స్ (ఇంగ్లండ్) జోడీ విజేతగా నిలిచింది. అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన ఈ జంట శనివారం జరిగిన ఫైనల్లో 6-4, 3-6, 10-8తో నాలుగో సీడ్ జెస్సీ యానీ-జెస్సికా ఫైలా (అమెరికా) ద్వయంపై విజయం సాధించింది. గంటా 42 నిమిషాల పాటు సాగిన పోరులో మూడో సెట్‌లో అంకితా రైనా జోడీ 'సూపర్ టై బ్రేక్' తీవ్రంగా పోరాడి విజయం సాధించింది. మహిళల సింగిల్స్ విభాగంలో తొలి రౌండ్‌లోనే పరాజయం పాలైన అంకిత... డబుల్స్‌లో మాత్రం వరుస విజయాలతో చాంపియన్‌గా నిలిచింది. గత ఏడాది ఏప్రిల్‌లో జపాన్‌లో జరిగిన టోర్నీ తర్వాత అంకిత తిరిగి టైటిల్ గెలవడం ఇదే తొలిసారి.

శ్రీనిధి, షిల్లాంగ్ మ్యాచ్ 'డ్రా'



సాక్షి, హైదరాబాద్: ఐ లీగ్‌లో శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ రెండో 'డ్రా' నమోదు చేసుకుంది. శనివారం శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్, షిల్లాంగ్ లాజోంగ్ ఫుట్‌బాల్ క్లబ్‌ల మధ్య జరిగిన మ్యాచ్ 5-5 గోల్స్‌తో 'డ్రా'గా ముగిసింది. శ్రీనిధి జట్టు తరఫున డేవిడ్ మునోజ్ (11వ, 16వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో చెలరేగగా... గాబ్రియల్ (71వ నిమిషంలో), విలియమ్ అల్వెస్ (81వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ప్రత్యర్థి జట్టు ఆటగాడు మానస్ దూబే (90+7వ నిమిషంలో) సెల్ఫ్ గోల్ కొట్టడంతో డెక్కన్ జట్టు స్కోరు 5కు చేరింది. షిల్లాంగ్ ఫుట్‌బాల్ క్లబ్ తరఫున డోగ్లాస్ టార్డిన్ (4వ, 15వ, 77వ నిమిషాల్లో) హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించగా... ఫరాంగ్‌కీ బువామ్ (21వ నిమిషంలో), గ్లాడి నెల్సన్ (90+1వ ని.లో) ఒక్కో గోల్ కొట్టారు. ఈ సీజన్‌లో 9 మ్యాచ్‌లాడిన శ్రీనిధి 3 విజయాలు , 4 ఓటములు, 2 'డ్రా'లతో 11 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఆరో స్థానంలో కొనసాగుతోంది. శుక్రవారం జరగనున్న తమ తదుపరి మ్యాచ్‌లో బెంగళూరు స్పోర్టింగ్ క్లబ్‌తో శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ తలపడనుంది.

సినెర్, స్వియాటెక్ అలవోకగా...


స్వియాటెక్


సినెర్

- ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన అగ్రశ్రేణి ఆటగాళ్లు
- ఆస్ట్రేలియన్ ఓపెన్

సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కొందరు సీడెడ్ ప్లేయర్లకు అనూహ్య పరాజయాలు ఎదురవుతుంటే... టాప్ స్టార్లు అలవోక విజయాలతో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకోగా... వీరికి దీటుగా యువ క్రీడాకారులు సైతం మేటి ఆటగాళ్లను ఢీకొట్టి మరీ మూడో రౌండ్‌ను దాటేశారు. క్వాలిఫయర్ లెర్నర్ టియెన్, 22 ఏళ్ల మిచెల్సన్ తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ ఈవెంట్‌లో ప్రిక్వార్టర్స్‌లోకి అడుగుపెట్టారు.

మెల్‌బోర్న్: పురుషుల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, ఇటలీ స్టార్ యానిక్ సినెర్...మహిళల విభాగంలో ఫ్రెంచ్ ఓపెన్ 'హ్యాట్రిక్' చాంపియన్, పోలాండ్ స్టార్ ఇగా స్వియాటెక్‌లు ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ప్రిక్వార్టర్స్‌లోకి దూసుకెళ్లారు. మహిళల సింగిల్స్‌లో స్వియాటెక్‌తో పాటు ఆరో సీడ్ ఎలినా రిబాకినా (కజకిస్తాన్), ఎనిమిదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా), తొమ్మిదో సీడ్ డారియా కసత్కినా (రష్యా) ప్రిక్వార్టర్స్ చేరారు. వీరితో పాటు ఎనిమిదో సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా), 13వ సీడ్ హోల్గర్ రూన్ (డెన్మార్క్) నాలుగో రౌండ్ చేరుకున్నారు. ఇరు విభాగాల్లో నాలుగో సీడ్ ప్లేయర్లు ఫ్రిట్జ్ (అమెరికా), పావొలిని (ఇటలీ)లకు మూడో రౌండ్లోనే చుక్కెదురైంది. భార్యభర్తలు స్వితోలినా (ఉక్రెయిన్), మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) చెప్పుకోదగిన విజయాలతో ఆరంభ గ్రాండ్‌స్లామ్‌లో ముందంజ వేశారు. స్వితోలినా గత సీజన్ రెండు గ్రాండ్‌స్లామ్‌ల రన్నరప్ పావొలినిని కంగుతినిపిస్తే, మోన్‌ఫిల్స్... గత యూఎస్ ఓపెన్ రన్నరప్ టేలర్ ఫ్రిట్జ్‌కు చెక్ పెట్టాడు.

సినెర్ జోరు...

డిఫెండింగ్ చాంపియన్, టాప్‌సీడ్ యానిక్ సినెర్ అలవోక విజయంతో ప్రిక్వార్టర్స్ చేరాడు. శనివారం పురుషుల సింగిల్స్‌లో జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో అతను 6-3, 6-4, 6-2తో అమెరికాకు చెందిన 46వ ర్యాంకర్ మార్కోస్ గిరోన్‌ను వరుస సెట్లలో ఓడించాడు. గత సీజన్‌లో ఆసీస్, ఫ్రెంచ్ ఓపెన్‌లను గెలుచుకున్న 23 ఏళ్ల ఇటలీ టాప్‌స్టార్ ఈ సీజన్‌లోనూ అదే జోరు కొనసాగిస్తున్నాడు. మరో మ్యాచ్‌లో గేల్ మోన్‌ఫిల్స్ ప్రిక్వార్టర్స్ చేరడం ద్వారా వన్నె తగ్గని వెటరన్ ప్లేయర్‌గా టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ సరసన నిలిచాడు. మూడో రౌండ్లో 38 ఏళ్ల మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) 3-6, 7-5, 7-6 (7/1), 6-4తో నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)కు షాకిచ్చాడు. 2020లో ఫెడరర్ 38 ఏళ్ల వయసులో తన ఆఖరి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడి సెమీస్ చేరాడు. డి మినార్ (ఆసీస్) 5-7, 7-6 (7/3), 6-3, 6-3తో సెరుండొలో (అర్జెంటీనా)పై, 13వ సీడ్ రూన్ (డెన్మార్క్) 6-7 (5/7), 6-3, 4-6, 6-4, 6-4తో కెక్మనోవిచ్ (సెర్బియా)పై గెలిచారు. సంచలన క్వాలిఫయర్ లెర్నర్ టియెన్ (అమెరికా) 7-6 (12/10), 6-3, 6-3తో ఫ్రాన్స్‌కు చెందిన మౌటెట్‌ను ఓడించాడు. అన్‌సీడెడ్ మిచెల్సన్ (అమెరికా) 6-3, 7-6 (7/5), 6-2తో 19వ సీడ్ కచనొవ్ (రష్యా)ను కంగుతినిపించాడు.

స్వితోలినా ముందంజ

మోన్‌ఫిల్స్ భార్య ఎలీనా స్వితోలినా (ఉక్రెయిన్) తన భర్త నెగ్గిన కోర్టులోనే అనంతరం జరిగిన మ్యాచ్‌లో 2-6, 6-4, 6-0తో గత ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ (2024)ల రన్నరప్ జాస్మిన్ పావొలిని (ఇటలీ)ని కంగుతినిపించింది. రెండో సీడ్ స్వియాటెక్ 6-1, 6-0తో యూఎస్ ఓపెన్ (2021) మాజీ చాంపియన్, బ్రిటన్ ప్లేయర్ ఎమ్మా రాడుకానుపై అలవోక విజయం సాధించింది. 19వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 6-4, 6-4తో పదోసీడ్ సహచర ప్లేయర్ కొలిన్స్‌ను ఓడించింది. 6వ సీడ్ రిబాకినా 6-3, 6-4తో డయానా యాస్ట్రెస్కా (ఉక్రెయిన్)పై, 8వ సీడ్ నవారో 6-4, 3-6, 6-4తో ఓన్స్ జాబెర్ (ట్యూనిషియా)పై, 9వ సీడ్ కసత్కినా (రష్యా) 7-5, 6-1తో పుతిన్‌త్సెవా (కజకిస్తాన్)పై గెలుపొందారు.

బాలాజీ జోడీ అవుట్

ఈ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఈవెంట్ నుంచి భారత డబుల్స్ ప్లేయర్ శ్రీరామ్ బాలాజీ నిష్క్రమించాడు. మెక్సికన్ భాగస్వామి మిగుల్ ఏంజిల్ రేయెస్ వారెలతో జోడీ కట్టిన భారత ఆటగాడు రెండో రౌండ్లోనే ఇంటిదారి పట్టాడు. పురుషుల డబుల్స్‌లో శనివారం జరిగిన పోరులో బాలాజీ-ఏంజిల్ రేయెస్ ద్వయం 6-7 (1/7), 6-4, 3-6తో పోర్చుగల్‌కు చెందిన న్యూనో బోర్జెస్-ఫ్రాన్సిస్కో కాబ్రల్ జోడీ చేతిలో పరాజయం చవిచూసింది.





తుది పోరుకు భారత్

ఫైనల్ చేరిన పురుషుల, మహిళల జట్లు

- నేపాల్ జట్లతో అమీతుమీ నేడు
- ఖోఖో ప్రపంచకప్

న్యూఢిల్లీ: మొట్టమొదటి ఖోఖో ప్రపంచకప్‌లో భారత జట్ల హవా కొనసాగుతోంది. గ్రామీణ క్రీడలో మన పురుషుల, మహిళల జట్లు గర్జన ఫైనల్స్‌కు చేర్చింది. శనివారం ఇక్కడి ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన సెమీ ఫైనల్స్‌లో ఆతిథ్య జట్ల జోరుకు దక్షిణాఫ్రికా జట్లు తోక ముడిచాయి. భారత మహిళల బృందం 66-16 స్కోరు తేడాతో సఫారీ జట్టుపై ఏకపక్ష విజయాన్ని సాధించింది. నిర్మలా భాటి, వైష్ణవి అదరగొట్టారు. తొలి క్వార్టర్‌లో చైత్ర 5 పాయింట్లతో చక్కని ఆరంభమిచ్చింది. నజియా బీబీ, నిర్మల అవుటైనప్పటికీ ఆమె జట్టుకు కీలక పాయింట్లు తెచ్చిపెట్టింది. రెండో క్వార్టర్‌లో రేష్మ జోరుతో భారత్ స్కోరు శాసించే స్థితికి చేరింది. దీంతో 33-10తో భారత్ సంపూర్ణ ఆధిపత్యం చెలాయించింది. మూడో క్వార్టర్‌లో వైష్ణవి పావార్, నస్రీన్ షేక్, బిలార్‌దేవిల సమన్వయంతో పాయింట్లు కూడగట్టగా, ఆఖరి క్వార్టర్‌లో నస్రీన్ షేక్, రేష్మ రాథోడ్‌లు రాణించడంతో భారత్ భారీతేడాతో జయకేతనం ఎగరవేసింది. మరో సెమీస్‌లో నేపాల్ జట్టు 89-18తో ఉగాండాపై ఏకపక్ష విజయం నమోదు చేసింది. అమ్మాయిల విభాగంలో చేతులెత్తేసిన సఫారీ జట్టు పురుషుల ఈవెంట్‌లో పోరాడింది. దీంతో భారత్ గెలిచేందుకు చెమటోడ్చింది. చివరకు భారత పురుషుల జట్టు 62-42 స్కోరు తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచి ఫైనల్ చేరింది. ఆతిథ్య జట్టులో ప్రతీక్ వాయ్‌కర్, ఆదిత్య, నిఖిల్, గౌతమ్, రామ్‌జీ కశ్యప్, పబని సబర్, సుయశ్ రాణించారు. రెండో సెమీఫైనల్లో నేపాల్ 72-29తో ఇరాన్‌ను ఓడించి ఆతిథ్య జట్టుతో టైటిల్ సమరానికి సై అంటోంది. ఆదివారం జరిగే ఫైనల్స్‌తో ఈ ప్రపంచకప్‌కు తెరపడుతుంది.



జపాన్ రాజధాని టోక్యోలోని కంద మియోజిన్ షింటో ఆలయం వద్ద శనివారం వార్షిక 'శీతల సహన' ఉత్సవంలో అతి చల్లటి నీటిని నెత్తిపై కుమ్మరించుకుంటున్న మహిళలు



మహా కుంభమేళా సందర్భంగా శనివారం ప్రయాగ్‌రాజ్‌లోని సంగంలో సెల్ఫీ తీసుకుంటున్న నాగా సాధువు



పట్నాలో శనివారం జరిగిన వినూత్నమైన తిండి పోటీలో పరుగుపరుగున 'పెరుగు' తింటున్న అమ్మాయిలు

ఢిల్లీ బరిలో 981 మంది

70 సీట్లకు 1,521 నామినేషన్లు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీలోని 70 స్థానాలకు ఫిబ్రవరి 5వ తేదీన జరుగనున్న పోలింగ్ కోసం 981 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 1,521 నామినేషన్లు దాఖలయ్యాయని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. శుక్రవారం సాయంత్రంతో నామినేషన్ల దాఖలు గడువు ముగియడంతో 981 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన శనివారం పూర్తి కాగా నామినేషన్ల ఉపసంహరణకు 20వ తేదీ తుది గడువు. ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్, ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు ఉంటాయి.

న్యూఢిల్లీ సీటుకు అధిక పోటీ

ఆప్ చీఫ్, మాజీ సీఎం కేజ్రీవాల్ పోటీలో ఉన్న న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానానికి అత్యధికంగా 29 మంది అభ్యర్థులు 40 నామినేషన్లు దాఖలు చేశారు. కేజ్రీవాల్‌పై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రుల కుమా రులు.. బీజేపీకి చెందిన సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు ప్రవేశ్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థిగా షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్నారు. కాగా, కస్తూర్బా నగర్ అసెంబ్లీ స్థానానికి అతి తక్కువగా నామినేషన్లు అందాయి. ఇక్కడ కేవలం ఆరుగురు అభ్యర్థులు 9 నామినేషన్లు వేశారు. ఈ స్థానం నుంచి అధికార ఆప్ నుంచి రమేశ్ పెహల్వాన్, బీజేపీ నుంచి నీరజ్ బసోయా, కాంగ్రెస్ తరఫున అభిషేక్ దత్ బరిలో నిలిచారు. సీఎం ఆతిశీ బరిలో ఉన్న కల్కాజీ స్థానంలో మొత్తం 18 మంది అభ్యర్థులు 28 నామినేషన్లు దాఖలు చేశారు. సీఎం ఆతిశీకి బీజేపీ అభ్యర్థి రమేష్ బిధూరి, కాంగ్రెస్ అభ్యర్థి అల్కా లాంబా గట్టి పోటీదారులుగా నిలిచారు. ఇంకా, సెంట్రల్ ఢిల్లీలో 154, తూర్పు ఢిల్లీలో 119 నా మినేషన్లు వచ్చాయి. ముఖ్యంగా పటేల్ నగర్, రా జేందర్ నగర్ వంటి కీలక నియోజకవర్గాలు ఉన్న న్యూఢిల్లీ ప్రాంతంలో 135 నామినేషన్లు వచ్చాయి. ఉత్తర ఢిల్లీలో 183, ఈశాన్య ఢిల్లీలో 116, నార్త్ వెస్ట్ ఢిల్లీలో 139, షాహదారాలో 124 నామినేషన్లు వచ్చాయి. మాలవీయ నగర్, మెహ్రౌలీ వంటి నియోజకవర్గాలున్న దక్షిణ ఢిల్లీలో 88 నామినేషన్లు వచ్చాయి. కాగా, సౌత్ ఈస్ట్ ఢిల్లీలో 140, నైరుతి ఢిల్లీలో 153 నామినేషన్లందాయి. మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా 2013 నుంచి గెలుస్తూ వచ్చిన పట్‌పడ్‌గంజ్ బదులుగా ఈసారి జంగ్‌పురా సీటుకు పోటీ చేస్తున్నారు.

కేజ్రీవాల్ సంపద తగ్గింది..

ఆతిశీ సంపద పెరిగింది!

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు దేశ రాజధాని ఢిల్లీ సిద్ధమైంది. ఇప్పటికే పోటాపోటీ ప్రచార హోరు, మాటల జోరు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లలో వారి ఆస్తుల వివరాలను వెల్లడించారు. మాజీ సీఎం కేజ్రీవాల్ ఆస్తులు కొంత మేర తగ్గగా.. ప్రస్తుత సీఎం ఆతిశీ ఆస్తులు కొంతమేర పెరిగాయి. రూ.185 కోట్లతో అత్యధిక ధనిక అభ్యర్థిగా బీజేపీకి చెందిన మంజిందర్‌సింగ్ ఉండగా, రూ.57.43లక్షలతో అతి తక్కువ ఆస్తి ఉన్న ఎమ్మెల్యేగా మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా నిలిచారు.

కేజ్రీవాల్ నికర ఆస్తి రూ.1.73 కోట్లు

న్యూఢిల్లీ అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్న కేజ్రీవాల్ నికర ఆస్తి విలువ రూ.1.73 కోట్లుగా ప్రకటించారు. 2020 ఎన్నికల సమయంలో కేజ్రీవాల్ నికర విలువ రూ.1.87 కోట్లు ఉండగా ప్రస్తుత అఫిడవిట్‌లో రూ.14 లక్షల మేర తగ్గినట్లు చూపారు. సీఎం ఆతిశీ రూ.76.93 లక్షల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్ సమర్పించారు. 2020 ఎన్నికల్లో రూ.59.79 లక్షలు ఉన్నట్లు ఆమె వెల్లడించారు. తాజా అఫిడవిట్‌ను బట్టి ఆమె ఆస్తులు రూ.17 లక్షల మేర పెరిగినట్లయింది.

సిసోడియా ఆస్తులు రూ.57.43 లక్షలు

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో జైలుపాలైన ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఆస్తులపై ఉత్కంఠకు తెరపడింది. జంగ్‌పురా స్థానం నుంచి పోటీలో ఉన్న సిసోడియా ఇటీవల దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్‌లో రూ.57.43 లక్షల ఆస్తి ఉన్నట్లు వెల్లడించారు. 2020లో ఈయన ఆస్తులు రూ.25.74 లక్షలు. లిక్కర్ కుంభకోణంలో కోట్లు సంపాదించారంటూ బీజేపీ చేసిన ఆరోపణలకు సిసోడియా ఆస్తి ప్రకటనలకు పొంతనలేకుండాపోయింది. దీంతో, బీజేపీ కేవలం రాజకీయ విమర్శలు చేసిందని ఢిల్లీ ప్రజలు చెప్పుకుంటున్నారు. ఇక బీజేపీ నుంచి రాజౌరీ గార్డెన్ నియోజకవర్గం నుంచి మంజిందర్ సింగ్ సిర్సా బరిలో ఉన్నారు. ఈయన ఆస్తులు రూ.185.92 కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఢిల్లీలో అత్యధిక ధనిక అభ్యర్థిగా మంజిందర్‌సింగ్ ఉన్నారు. ఇక ఇదే లిక్కర్ కేసులో జైలుకు వెళ్లొచ్చిన మరో అభ్యర్థి సత్యేందర్ జైన్ తన ఆస్తి రూ.4.42కోట్లు ఉన్నట్లు ప్రకటించారు.

ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తోపాటు పలు ప్రాంతాలపై శనివారం ఉదయం రష్యా డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. ఇందుకు సంబంధించిన ఘటనల్లో కీవ్‌లో ముగ్గురు చనిపోగా వేర్వేరు ప్రాంతాల్లో మరో 14 మంది గాయాలపాలయ్యారు. రష్యా ఆర్మీ ప్రయోగించిన 39 షహీద్ డ్రోన్లు, నాలుగు బాలిస్టిక్ క్షిపణుల్లో తాము రెండు క్షిపణులతోపాటు, 24 డ్రోన్లను కూల్చినట్లు ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. మరో 14 డ్రోన్లు దారి తప్పాయని పేర్కొంది.

నైజీరియాలో ట్యాంకర్ పేలి 70 మంది మృతి

అబూజా: నైజీరియాలో ఘోరం జరిగింది. నైగర్ రాష్ట్రంలోని సులేజా ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున గ్యాస్ ట్యాంకర్ పేలి ఏకంగా 70 మందికి పైగా మృత్యువాత పడ్డారు. ట్యాంకర్ నుంచి మరో ట్రక్కులోకి గ్యాస్‌ను బదలాయిస్తుండగా పేలుడు సంభవించింది. దాని ధాటికి సమీపంలో ఉన్నవారంతా మరణించినట్టు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది. నైజీరియాలో ఆయిల్, గ్యాస్ ట్యాంకర్ల పేలుళ్లు పరిపాటి. రైలు వ్యవస్థ లేకపోవడంతో వాటిని ప్రమాదకర రీతిలో రోడ్డు మార్గంలోనే రవాణా చేస్తుంటారు. 2020లోనైతే గ్యాస్ ట్యాంకర్ పేలుడు ఏకంగా 535 మందిని బలి తీసుకుంది.

ఫిబ్రవరి 14న రైతులతో కేంద్రం భేటీ

చండీగఢ్: పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత వంటి డిమాండ్లతో ఆందోళన బాటలో ఉన్న పంజాబ్ రైతులతో చర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఫిబ్రవరి 14వ తేదీన చండీగఢ్‌లో రైతుల డిమాండ్లపై రైతు సంఘాల నేతలతో చర్చలు జరుపుతామని తెలిపింది. నిరాహార దీక్ష సాగిస్తున్న జగ్జీత్ సింగ్ దల్లేవాల్‌తోపాటు సంయుక్త కిసాన్ మోర్చా నాయకులతో కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రియా రంజన్ సారథ్యంలోని బృందం చర్చలు జరిపిన మీదట కేంద్రం ఈ మేరకు నిర్ణయం తీసుకుందని ఓ అధికారి వెల్లడించారు. దీంతోపాటు, 54 రోజులుగా దీక్ష సాగిస్తున్న దల్లేవాల్‌ను వైద్య సాయం తీసుకోవాల్సిందిగా అధికారుల బృందం విజ్ఞప్తి చేసింది. ఆయన కోలుకున్నాక ప్రభుత్వంతో జరిగే చర్చల్లో పాల్గొనవచ్చని కూడా వివరించింది.

టిక్ నో టాక్

నేటి నుంచి అమెరికాలో బంద్!

వినోదం పంచిన యాప్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన వైనం

స్వల్పనిడివి వీడియో మెసెంజింగ్ యాప్‌గా ప్రపంచవ్యాప్తంగా దాదాపు అందరి స్మార్ట్‌ఫోన్లలో స్థానం సంపాదించిన టిక్‌టాక్ యాప్ ఇప్పుడు అమెరికాలో అదృశ్యంకానుంది. ఆదివారం (జనవరి 19వ తేదీ) నుంచి అమెరికాలో యాప్ సేవలు దాదాపు ఆగిపోయినట్లేనని టిక్‌టాక్ యాజమాన్యం శుక్రవారం అర్ధరాత్రిదాటాక ఒక ప్రకటనలో పేర్కొంది. యాప్ యూజర్ల డేటా దాని మాతృ సంస్థ అయిన 'బైట్‌డ్యాన్స్'ద్వారా చైనా వామపక్ష ప్రభుత్వానికి చేరుతోందని అమెరికా ప్రధాన ఆరోపణ. చైనాతో బంధం తెంచుకుని, టిక్‌టాక్‌ను ఆదివారం కల్లా అమెరికా కేంద్రంగా పనిచేసే ఏదైనా అమెరికన్ కంపెనీకి అమ్మేస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అమెరికా దేశ సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టంచేసినప్పటికీ బైట్‌డ్యాన్స్ ఈ దిశగా అడుగులువేయలేదు. దీంతో అమెరికాలో టిక్‌టాక్ సేవలు నేటి నుంచి నిలిచిపోనున్నాయి. వినోదం పంచిన యాప్ తర్వాత దేశభద్రత అంశంతో ముడిపడి చివరకు అగ్రరాజ్యాన్నే వదిలేస్తున్న వైనం ఆద్యంతం ఆసక్తిదాయకం.

అగ్రస్థానం నుంచి అదృశ్యం దాకా..

చైనా వ్యాపారి ఝాంగ్ యిమిన్ 2012లో బైట్ డ్యాన్స్ అనే సంస్థను స్థాపించారు. తర్వాత రెండేళ్లకు అలెక్స్ ఝూ అనే వ్యాపారి Musical.ly అనే స్టార్టప్‌ను రూపొందించాడు. వీడియోలకు తగ్గట్లు పెదాలు కదిలిస్తూ వీడియో తీసి అప్‌లోడ్ చేసే యాప్‌గా దీనిని అందుబాటులోకి తెచ్చాడు. ఇది 2015 జూలైకల్లా ఆపిల్ యాప్‌స్టోర్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ Musical.lyను బైట్‌డ్యాన్స్ ఒక బిలియన్ డాలర్లకు కొనుగోలుచేసి సొంత 'డౌయిన్'యాప్‌లో విలీనంచేసి విదేశీ యూజర్ల కోసం కొత్తగా టిక్‌టాక్ యాప్‌ను తెచ్చింది. ర్యాపర్ లిల్ నాస్ 'ఓల్డ్ టౌన్ రోడ్'పాటకు చేసిన డ్యాన్స్ వీడియో టిక్‌టాక్‌లో పాపులర్ అవడంతో అందరూ టిక్‌టాక్ బాట పట్టారు. పాపులర్ డ్యాన్స్ స్టెప్పులు, వంటల విశేషాలు, బ్యూటీ టిప్స్, పాటలకు తగ్గ పార్ఫార్మెన్స్ ఛాలెంజ్‌లను ప్రోత్సహిస్తూ సాగే వీడియోలతో టిక్‌టాక్ అనతి కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా నంబర్‌వన్ షార్ట్‌వీడియో మెసేజింగ్ యాప్‌గా అవతరించింది.

చైనా వ్యతిరేకత అస్సలు కనపడదు

ట్రెండింగ్‌లో ఉన్న ప్రతి అంశం ఒక పాటగానో, డ్యాన్స్‌గానో టిక్‌టాక్‌లో ప్రత్యక్షమైనా చైనా వ్యతిరేక వీడియోలు మాత్రం అస్సలు కనబడవు. 1989 తియానన్మెన్‌స్క్వేర్ ఉద్యమం, నాటి ఊచకోత, టిబెటన్ల స్వాతంత్ర్యపోరాటం, హాంకాంగ్‌లో ప్రజాస్వామ్య ఉద్యమంపైనా అన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌లు కనిపించినా టిక్‌టాక్‌లో మాత్రం అలాంటివేమీ దర్శనమివ్వలేదు. కానీ ట్రంప్‌కు మద్దతు పలుకుతూ పెట్టిన #trump2020 హ్యాష్‌ట్యాగ్‌తో వచ్చిన పోస్టులు మాత్రం కోట్లాదిగా షేర్ అయ్యాయి.

2019లో అమెరికాలో తొలి ఆందోళన

సెన్సార్‌టవర్ అంచనా ప్రకారం ప్రపంచంలో అత్యధికంగా డౌన్‌లోడ్ అవుతున్న యాప్‌గా టిక్‌టాక్ నిలిచింది. టిక్‌టాక్‌కు ప్రస్తుతం అమెరికాలో 17 కోట్ల మంది యూజర్లు ఉన్నారు. అయితే అమెరికా సైన్యానికి చెందిన సమాచారాన్ని టిక్‌టాక్ తన మాతృసంస్థకు చేరవేస్తోందని 2019లో తొలిసారిగా ఆందోళన వ్యక్తమైంది. దీంత అన్ని స్మార్ట్‌ఫోన్లలో టిక్‌టాక్ యాప్ తొలగించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అయినాసరే విపరీతంగా యాప్‌కు బానిసలుగా మార్చేసి అమెరికా చిన్నారుల పరిరక్షణా చట్టాలను టిక్‌టాక్ ఉల్లంఘిస్తోందని 2020 లో ప్రైవసీ సంస్థలు ఆందోళనకు దిగాయి. దీంతో తాము అమెరికన్లకు దగ్గరి వాళ్లమని మభ్యపెట్టేందుకు డిస్నీ ఉన్నతాధికారి కెవిన్ మేయర్‌కు టిక్‌టాక్ తన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించుకుంది.

భారత్‌లో బ్యాన్

సరిహద్దుల్లో చైనా సైనికులతో ఘర్షణ తర్వాత జాతీయభద్రత ప్రమాదంలో పడిందని పేర్కొంటూ భారత్ టిక్‌టాక్‌ను 2020 జూలైలో నిషేధించింది. కోవిడ్ సంక్షోభంలో వాస్తవాలను ప్రపంచానికి వెల్లడించని చైనాకు బుద్ధిచెప్పేందుకైనా టిక్‌టాక్‌ను నిషేధించాలని డొనాల్డ్ ట్రంప్ సైతం నిషేధాన్ని సమర్థించారు. 90 రోజుల్లోపు అమెరికా నుంచి వైదొలిగితే మంచిదని 2020 ఆగస్టులో ట్రంప్ ఒక ప్రభుత్వ ఉత్తర్వు జారీచేశారు. తర్వాత టిక్‌టాక్‌ను కొనేందుకు మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, వాల్‌మార్ట్ ప్రయత్నించినా అది కార్యరూపం దాల్చలేదు.



బైడెన్ వచ్చాక..

2021 ఫిబ్రవరిలో కొత్త అధ్యక్షుడు బైడెన్ టిక్‌టాక్‌పై నిషేధానికి ట్రంప్ ఇచ్చిన ఉత్తర్వులు అమలుకాకుండా మూలనపడేశారు. అయితే బక్కచిక్కిపోయేలా అతి ఆహార నియమాల వంటి తప్పుడు సూచనలు ఇచ్చే వీడియోల వరద టిక్‌టాక్‌లో ఎక్కువైందని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక నివేదిక ఇవ్వడంతో టిక్‌టాక్‌పై బైడెన్ మళ్లీ దృష్టిసారించారు. అమెరికాలో ప్రభుత్వ వ్యతిరేకతను తట్టుకుంటూనే ఇన్‌స్టా గ్రామ్‌ను వెనక్కినెట్టి ప్రపంచంలో అత్యధిక డౌన్‌లోడ్లు జరిగిన యాప్‌గా టిక్‌టాక్ చరిత్ర సృష్టించింది. వంద కోట్ల మంది నెలకు తమ యాప్ వాడుతున్నారని ప్రకటించింది. మరోవైపు అమెరికా యూజర్ల డేటా భద్రతపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీంతో నష్టపరిహార చర్యలకు టిక్‌టాక్ దిగింది. అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ పర్యవేక్షణలో ఉండే సర్వర్లకు డేటాను బదిలీచేస్తున్నట్లు ప్రకటించింది.

రంగంలోకి ఎఫ్‌బీఐ

జాతీయ భద్రత కీలకాంశం కావడంతో అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ రంగంలోకి దిగింది. అమెరికన్లను ప్రభావితం చేసేలా యాప్ అల్గారిథమ్‌ను చైనా మాతృసంస్థ మార్చేస్తోందని ఎఫ్‌బీఐ డైరెక్టర్ క్రిస్టఫర్ వ్రే 2022 డిసెంబర్‌లో ఆరోపించారు. 30 రోజుల్లోపు అన్ని ప్రభుత్వం జారీచేసిన స్మార్ట్‌ఫోన్ల నుంచి యాప్‌ను తీసేయాలని శ్వేతసౌధం 2023 ఫిబ్రవరిలో ఆదేశాలిచ్చింది. యాప్ నిబద్ధతపై టిక్‌టాక్ సీఈవో షూఝీ ఛెవ్‌ను మార్చిలో అమెరికా పార్లమెంటరీ కమిటీ గంటలతరబడి ప్రశ్నించింది.

నిషేధానికి తొలి అడుగు

అమెరికన్ సంస్థకు టిక్‌టాక్‌ను అమ్మాలని లేదంటే నిషేధిస్తామని 2024 మార్చిలో అమెరికా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టారు. పార్లమెంట్ ఆమోదం పొందిన బిల్లుపై 2024 ఏప్రిల్‌లో అధ్యక్షుడు బైడెన్ సంతకంచేశారు. దీంతో ప్రభుత్వ నిర్ణయంపై బైట్‌డ్యాన్స్ కోర్టును ఆశ్రయించింది. మిగతా యాప్‌లను వదిలేసి మా సంస్థపైనే ప్రభుత్వం కక్షగట్టిందని వాదించింది. అయితే నిషేధాన్ని సమర్థిస్తూ ఫెడరల్ అప్పీళ్ల కోర్టు 2024 డిసెంబర్ ఆరున తీర్పు చెప్పింది.

మాట మార్చిన ట్రంప్

అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నిషేధిస్తానని ప్రతిజ్ఞచేసిన ట్రంప్ ఆ తర్వాత పదవి నుంచి దిగిపోయాక మాటమార్చారు. 2024 జూన్‌లో మళ్లీ టిక్‌టాక్ ఖాతా తెరచి ఈ యాప్‌కు మద్దతు పలికారు. టిక్‌టాక్‌ను నిషేధిస్తే ఫేస్‌బుక్‌కు లాభం చేకూరుతుందని ట్రంప్ వింత వాదన చేశారు. టిక్‌టాక్‌పై నిషేధం ఉత్తర్వులను తాము అధికారంలోకి వచ్చేదాకా నిలుపుదల చేయాలని ట్రంప్ తరఫు లాయర్లు సుప్రీంకోర్టును కోరారు. అయినాసరే వ్యక్తుల వ్యక్తిగత డేటా భద్రత కంటే దేశభద్రత ముఖ్యమని తేల్చిచెబుతూ కోర్టు 2025 జనవరి 17న వ్యాఖ్యానించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

పాలోమంటూ రెడ్‌నోట్ డౌన్‌లోడ్

టిక్‌టాక్ కనుమరుగు దాదాపు ఖాయంకావడంతో ఇప్పటికే ఇలాంటి వీడియోలకు బానిసలైన అమెరికన్లు వెంటనే రెడ్‌నోట్ యాప్‌కు జై కొట్టారు. దీంతో అమెరికాలో అత్యంత ఎక్కువ డౌన్‌లోడ్‌లు ఉన్న యాప్‌గా రెడ్‌నోట్ రికార్డు సృష్టించింది. అయితే రెడ్ నోట్ కూడా చైనా యాప్ కావడం విశేషం. లైఫ్‌స్టైల్ సోషల్‌మీడియా యాప్ అయిన రెడ్ నోట్‌లోనూ చిన్నపాటి వీడియోలు చేయొచ్చు. ఫొటోలు, సందేశాలు పంపొచ్చు. లైవ్ స్ట్రీమింగ్, షాపింగ్ చేసుకోవచ్చు. గ్జియోహోంగ్షు యాప్‌నే సులభంగా రెడ్‌నోట్‌గా పిలుచుకుంటారు. దీనిని ప్రస్తుతం 30 కోట్ల మంది యూజర్లు ఉన్నారు. బద్ధశత్రువుల దేశాలకు చెందిన పౌరులు ఒకే ప్లాట్‌ఫామ్‌లను ఆశ్రయించడం వింతే. ఇన్‌స్టా గ్రామ్, 'ఎక్స్'యాప్‌లను చైనీయులు వాడలేరు. చైనా ఇంటర్నెట్‌లో వీటిని అక్కడి ఫైర్‌వాల్స్ అడ్డుకుంటాయి. మరోవైపు చైనా యూజర్లు టిక్‌టాక్‌ను వాడలేరు. వీళ్లనూ బుట్టలో వేసుకునేందుకు వాళ్ల కోసం చైనాలోనే డౌయిన్ అనే యాప్‌ను బైట్‌డ్యాన్స్ అందుబాటులో ఉంచింది.

నన్ను విడుదల చేయండి

- అభిశంసనకు గురైన దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్ వాదన
- ఆయన అరెస్ట్‌పై త్వరలోనే వెలువడనున్న కోర్టు తీర్పు

సియోల్: నిర్బంధం నుంచి తనను వెంటనే విడుదల చేయాలని అభిశంసనకు గురైన దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్ కోర్టులో వాదించారు. డిసెంబర్ 3న దేశంలో అత్యవసర పరిస్థితిని విధించిన ఆరోపణలపై బుధవారం అధికార నివాసంలో ఉన్న యూన్‌ను అతికష్టమ్మీద దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకుని, డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. యూన్ అధికారిక అరెస్ట్‌కు అనుమతించాలని దర్యాప్తు విభాగం కోరుతుండగా, తనను అరెస్ట్ చేయడం అక్రమమని యూన్ వాదిస్తున్నారు. సియోల్ పశ్చి జిల్లా కోర్టులో శనివారం దాదాపు 5 గంటలపాటు రహస్య విచారణ జరిగింది. ఈ సందర్భంగా యూన్ జడ్జితో 40 నిమిషాలపాటు మాట్లాడారని ఆయన లాయర్లు తెలిపారు. అయితే, ఆయన ఏం మాట్లాడారనేది వెల్లడించలేదు. విచారణ ముగిసిన తర్వాత శనివారం సాయంత్రం అధ్యక్షుడి వాహన శ్రేణి తిరిగి డిటెన్షన్ సెంటర్ దిశగా వెళ్లిపోయింది. ఒక వేళ యూన్ అరెస్ట్‌కు కోర్టు అనుమతిస్తే 20 రోజులపాటు తమకు అప్పగించాలని దర్యాప్తు అధికారులు కోరే అవకాశముంది. అనుమతివ్వకుంటే మాత్రం ఆయన వెంటనే విడుదలై తిరిగి అధికార నివాసానికి వెళ్లిపోతారు.

ఇరాన్‌లో ఇద్దరు జడ్జీల కాల్చివేత


దుబాయ్: ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఓ దుండగుడు ఇద్దరు ప్రముఖ న్యాయమూర్తులను కాల్చి చంపాడు. 1988లో అసమ్మతివాదులకు సామూహిక మరణ శిక్షలను అమలు చేసిన కేసుతో వీరికి సంబంధముందని భావిస్తున్నారు. అత్యంత భద్రత ఉండే న్యాయశాఖ ప్రధాన కార్యాలయం సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో ఓ బాడీ గార్డు కూడా గాయపడ్డారు. అనంతరం అదే హ్యాండ్‌గన్‌తో ఆగంతకుడు తనను తాను కాల్చేసుకున్నాడు. ఇరాన్ సుప్రీం కోర్టులో పని చేసిన మత పెద్దలు మహ్మద్ మొఘెయిసె, అలీ రజీనీలపై కాల్పుల ఘటనకు బాధ్యులమంటూ ఎవరూ ప్రకటించుకోలేదు. రజీనీపై 1999లోనూ హత్యాయత్నం జరిగింది. అనేక అక్రమ తీర్పులిచ్చారంటూ అమెరికా ప్రభుత్వం 2019లో మొఘెయిసేపై ఆంక్షలు విధించింది. కాగా, ఇరాన్‌లో న్యాయవ్యవస్థ లక్ష్యంగా దాడులు జరగడం చాలా అరుదు. దుండగుడిపై సుప్రీంకోర్టుతోపాటు ఇతర శాఖల్లోనూ ఎటువంటి కేసులు లేవని దర్యాప్తులో తేలిందని అధికారులు వెల్లడించారు. అయితే, ఘటన జరిగిన కార్యాలయంలో అతడు ఉద్యోగి అని అధికార మీడియా పేర్కొంది.

అద్దెకుండే వారికీ ఉచితాలు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరో ఎన్నికల హామీ ప్రకటించారు. ఢిల్లీలో తమ పార్టీకి మళ్లీ అధికారమిస్తే ఇళ్లలో అద్దెకు ఉండే వారికి సైతం ఉచిత విద్యుత్, నీటి వసతిని వర్తింప జేస్తామని తెలిపారు. ఇళ్ల అద్దెలతో సతమతమవుతున్న తాము ఢిల్లీలో మంచి స్కూళ్లు, ఆస్పత్రులు ఉన్నా సేవలను వినియోగించుకోలేకపోతున్నామని, ఉచిత విద్యుత్, నీటి పథకాలు దూరమయ్యాయంటూ వారు తరచూ ఫిర్యాదులు చేస్తున్నారని శనివారం కేజ్రీవాల్ మీడియాతో అన్నారు. వీరి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తాజాగా ఈ మేరకు హామీ ఇస్తున్నామన్నారు. ఢిల్లీలో ఎక్కువగా ఉండే పూర్వాంచల్ ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉందని చెప్పారు. మూడోసారి ఢిల్లీలో వరుసగా అధికార పగ్గాలు చేపట్టాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్న ఆప్ పలు సంక్షేమ పథకాలు, ఉచితాలు, సేవా కార్యక్రమాలను ప్రకటిస్తూ వస్తోంది.

ఓహియో గవర్నర్ పదవి రేసులో వివేక్

వాషింగ్టన్: భారత మూలాలున్న అమెరికా వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు వివేక్ రామస్వామి(39) ఓహియో రాష్ట్ర గవర్నర్ పదవికి పోటీ పడనున్నట్లు సమాచారం. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేసి విఫలమైన వివేక్..కాబోయే అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు అత్యంత సన్నిహితుడని పేరుంది. ప్రభుత్వ పాలనలో చేపట్టాల్సిన సంస్కరణల బాధ్యతను టెస్లా యజమాని ఎలాన్ మస్క్‌తోపాటు వివేక్‌కు ట్రంప్ అప్పగించారు. ఓహియో రాష్ట్ర గవర్నర్ పదవి పోటీ విషయమై త్వరలోనే నిర్ణయం వెలువరించే అవకాశాలున్నట్లు వివేక్ సన్నిహితుడొకరు తెలిపారని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఓహియో గవర్నర్ ఎన్నిక 2026 నవంబర్‌లో జరగనుంది.



మిషెల్‌కు ఒబామా 'హ్యాపీ బర్త్‌డే'

విడాకుల వార్తలకు చెక్

వాషింగ్టన్: విడాకుల వార్తలకు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా దంపతులు స్వయంగా చెక్ పెట్టారు. భార్య మిషెల్ 61వ పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు కవితాత్మక రీతిలో శుభాకాంక్షలు తెలిపారు. 'నా ప్రాణసఖీ! నీ హుందాతనం, సునిశిత మేధ, సున్నితత్వం, హాస్యప్రియత్వంతో నా జీవితాన్ని ప్రేమాస్పదంగా మార్చేశావు. నీతో కలిసి జీవితం పంచుకున్నందుకు నేనెంతో అదృష్టవంతున్ని. నీకు పుట్టినరోజు శుభాకాంక్షలు. లవ్ యూ'' అంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. డైనింగ్ టేబుల్‌కు ఇరువైపులా ఇద్దరూ చేతులు కలిపి చిరునవ్వులు చిందిస్తున్న ఫొటోను జత చేశారు. ఇటీవల దివంగత అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ సంతాప కార్యక్రమానికి మాజీ అధ్యక్షులంతా వచ్చినా మిషెల్ మాత్రం రాకపోవడం తెలిసిందే. దాంతో వారు విడిపోనున్నారంటూ వార్తలొచ్చాయి. ఏళ్లనాటి సంప్రదాయాన్ని తోసిరాజని సోమవారం డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష ప్రమాణ స్వీకారానికి సైతం డుమ్మా కొడుతున్నట్టు మిషెల్ ప్రకటించడంతో వాటికి మరింత బలం చేకూరింది. అయితే ఆ వార్తలను ఆమె సన్నిహితులు తోసిపుచ్చారు. ''సంప్రదాయాల కంటే వ్యక్తిగతాంశాలకే మిషెల్ ప్రాధాన్యమిస్తారు. ఇష్టం లేకున్నా ట్రంప్ ప్రమాణానికి వచ్చి కృత్రిమ చిరునవ్వులు చిందించలేకే దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఒబామా దంపతులపై ట్రంప్ చేసిన వెటకారపు వ్యాఖ్యలు, చర్యలే ఆ నిర్ణయానికి కారణం'' అని చెప్పారు.

20-25 నిమిషాల తేడాతో మృత్యువును తప్పించుకున్నా

ఆగస్ట్ 5వ తేదీ నాటి పరిణామాలను గుర్తు చేసుకున్న షేక్ హసీనా

న్యూఢిల్లీ: పదవీచ్యుత బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా(77) గతేడాది ఆగస్ట్ 5వ తేదీన జరిగిన అనూహ్య పరిణామాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థి సంఘాల సారథ్యంలో వెల్లువెత్తిన ప్రజా ఉద్యమంతో హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ ప్రభుత్వం పడిపోవడం తెలిసిందే. ఆ రోజు తన సోదరి షేక్ రెహానాతో కలిసి దేశాన్ని వీడి రావడానికి దారి తీసినప్పటి పరిణామాలను హసీనా ఓ సంక్షిప్త వీడియోలో వెల్లడించారు. ఈ వీడియోను అవామీ లీగ్ పార్టీ తన ఫేస్‌బుక్ పేజీలో షేర్ చేసింది. కేవలం 20–25 నిమిషాల సమయంలో తాము మృత్యుముఖం నుంచి బయటపడ్డామని, ఆ దేవుడే తమను కాపాడడని హసీనా చెప్పారు. 'కేవలం 20–25 నిమిషాల సమయంలోనే మృత్యువును తప్పించుకున్నాం. 2004 ఆగస్ట్ 21న బాంబు నుంచి తప్పించుకోవడం, గతేడాది ఆగస్ట్ 5న ఆందోళనకారుల నుంచి బయటపడటం వంటివన్నీ ఆ అల్లా కృపవల్లే. ఆయన హస్తమే. లేకుంటే మేం బతికి ఉండేవారం కాదు'అంటూ వణుకుతున్న స్వరంతో ఆమె అన్నారు. 'రాజకీయ శత్రువులు నన్ను అంతం చేయడానికి కుట్ర పన్నారు. నేనిప్పుడు నా దేశం.. నా ఇల్లు.. సహా సర్వస్వం కోల్పోయిన స్థితిలో ఉన్నా'అని చెప్పారు. విద్యార్థుల ఉద్యమం కారణంగా పదవిని కోల్పోయిన హసీనా గతేడాది ఆగస్ట్ 5వ తేదీ నుంచి భారత్‌లో ఉంటున్న విషయం తెలిసిందే. గతంలో పలుమార్లు ఆమె హత్యాయత్నాల నుంచి తప్పించుకున్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో 2004 ఆగస్ట్ 21వ తేదీన ఆమె పాల్గొన్న ర్యాలీలో గ్రెనేడ్ దాడి జరిగింది. ఈ ఘటనలో 24 మంది చనిపోయారు. 2000లో ప్రధానిగా ఉండగా కొటాలిపారాలో ఆమె పాల్గొనే ర్యాలీలో స్టేజీకి కేవలం 50 అడుగుల దూరంలో అమర్చిన 76 కిలోల భారీ బాంబును ముందుగానే గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది. గతేడాది ఆగస్ట్ 5వ తేదీన ఉద్యమం తీవ్ర రూపం దాల్చిన సమయంలో ఢాకాలో అధికార నివాసాన్ని 45 నిమిషాల్లోనే వీడి వెళ్లిపోవాలి, లేకుంటే ప్రమాదముందంటూ భద్రతా సిబ్బంది ఆమెకు హెచ్చరికలు పంపారు. దీంతో, ఆమె హెలికాప్టర్‌లో సమీపంలోని వైమానిక స్థావరానికి చేరుకుని, అక్కడి నుంచి భారత్‌కు వచ్చేశారు. అనంతరం కొద్దిసేపటికే ఆందోళనకారులు హసీనా అధికార నివాసాన్ని ధ్వంసం చేశారు.

జాతీయ విద్యా సమితి ఎప్పుడు ఆవిర్భవించింది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ఆధునిక భారతదేశ చరిత్ర - బ్రిటీషర్ల పాలన

వైస్రాయ్‌లు

లార్డ్ కానింగ్

ఇతడిని 1858 నవంబర్ 1న అలహాబాద్ కోటలో తొలి రాజప్రతినిధిగా ప్రకటించారు.

మొదటి లార్డ్ ఎల్జిన్ (1862-63)

ఇతడి కాలంలో ప్రధానంగా వహాబీ ఉద్యమం జరిగింది. సుప్రీమ్, సాదర్ కోర్టులను హైకోర్టులో కలిపారు.

సర్ జాన్ లారెన్స్ (1864-69)

లారెన్స్ 1866లో ఒడిశాలో,1868–69లో రాచపుతానాలో సంభవించిన క్షామానికి సంబంధించిన నివారణన చర్యలు తీసుకోవడానికి సలహా సంఘం నియమించాడు. 1866లో వితంతు వివాహ సంస్థను డి.కె. కార్వే ఆధ్వర్యంలో బొంబాయిలో స్థాపించారు. సర్ జాన్ లారెన్స్ అనేక రైల్వే, తంతి తపాలా సౌకర్యాలను కల్పించాడు. ఇతడు యూరప్‌లో మొదటిసారిగా తంతి సౌకర్యం కల్పించాడు. పంజాబ్ కౌలు చట్టాన్ని జారీ చేశాడు. దీని ప్రకారం కౌలుదార్లకు అధికారాలు ఇచ్చారు. భూటాన్ యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో మద్రాస్, బొంబాయి, కలకత్తాలో కోర్టులు ఏర్పాటు చేశారు.

లార్డ్ మేయో (1869-72)

ఇతడు స్టాటిస్టికల్ సర్వే ఆఫ్ ఇండియా, వ్యవసాయ, వాణిజ్య శాఖలను ఏర్పాటు చేశాడు. ఇతడు ఆఫీసులోనే హత్యకు గురైన మొదటి గవర్నర్ జనరల్. అజ్మీర్‌లో విద్య కోసం ఒక కళాశాల, రాజ్‌కోట్‌లో రాజకీయ శిక్షణ ఇవ్వడానికి మరో కళాశాల స్థాపించాడు.

లార్డ్ నార్త్ బ్రూక్ (1872-76)

ఇతడి కాలంలో 1875లో వేల్స్ రాజు (ఏడో ఎడ్వర్డ్) భారతదేశాన్ని సందర్శించాడు. 1872లో బహు భార్యత్వ నిషేధ చట్టాన్ని జారీ చేశారు.

లార్డ్ లిట్టన్ (1876-80)

ఇతడి కాలంలో 1878లో ఆయుధ చట్టం, దేశభాషా పత్రికల చట్టాలను చేశారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే జాతీయ వాదులను అణచివేయడం కోసం దేశభాషా పత్రికల చట్టాన్ని ప్రవేశపెట్టారు. లిట్టన్ 1878లో ఐ.సి.ఎస్. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల గరిష్ఠ వయసును 21 ఏళ్ల నుంచి 19 సంవత్సరాలకు తగ్గిస్తూ కొత్త నిబంధనలు ప్రకటించాడు. ఇతడు రెండో అఫ్గాన్ యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో తీసుకువచ్చిన యుద్ధ చట్టం యావత్ జాతిని నిరాయుధులను చేసింది. రాయల్ టైటిల్స్ యాక్ట్ చేశారు. 1877లో ఢిల్లీ దర్బార్ జరిగింది. ఇతడి కాలంలో మొదటిసారిగా కరవుపై కమిషన్ ఏర్పాటు చేశారు.



1919లో స్వాతంత్ర్యోద్యమ నాయకులైన డాక్టర్ సైఫుద్దీన్ కిచ్లూ, డాక్టర్ సత్యపాల్ అరెస్ట్‌కు నిరసనగా అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో సమావేశమైన ప్రజానీకంపై జనరల్ డయ్యర్ విచక్షణారహితంగా కాల్పులు జరిపించాడు. ఈ ఊచకోతకు నిరసనగా రవీంద్రనాథ్ టాగూర్ బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన నైట్‌హుడ్ బిరుదును త్యజించారు. 1929లో లాహోర్ కాంగ్రెస్ సమావేశంలో సంపూర్ణ స్వాతంత్ర్య సాధనే కాంగ్రెస్ ఆశయంగా ప్రకటించారు. ఇదే సంవత్సరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

లార్డ్ రిప్పన్ (1880-84)

ఇతడు 1882లో దేశభాషా పత్రికల చట్టాన్ని రద్దు చేసి స్వేచ్ఛా ప్రతిపత్తిని కల్పించాడు. 1881లో మొదటి కర్మాగార చట్టం ప్రవేశపెట్టాడు. దీని ద్వారా కర్మాగారంలో పని చేసే శ్రామికుల పరిస్థితులు మెరుగయ్యాయి. 1882లో ఆర్థిక వికేంద్రీకరణ చేసి ఆదాయాన్ని 3 భాగాలుగా విభజించారు. అవి.. 1) కేంద్ర ప్రభుత్వ ఆదాయం, 2) రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం, 3) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆదాయం. 1882లో స్థానిక ప్రభుత్వాలకు పునాది వేసిన ఘనత రిప్పన్‌దే. ఇతడు 1882–85లో స్థానిక ప్రభుత్వ వ్యవహార చట్టం జారీ చేశాడు. ఇదే సంవత్సరంలో సర్ విలియం హంటర్ అధ్యక్షతన విద్యకు సంబంధించి ఒక కమిషన్‌ను నియమించాడు. ఈ కమిషన్ సూచనల ఆధారంగా ప్రాథమిక పాఠశాల విద్యను స్థానిక సంస్థలకు అప్పగించాడు. స్త్రీ విద్య కూడా ప్రవేశపెట్టారు. ఇతడి కాలంలో యూరోపియన్ల ఒత్తిడి మేరకు 'ఇల్బర్ట్ బిల్లు'ను సవరించారు.

ఈ బిల్లు క్రిమినల్ కేసుల్లో యూరోపియన్లను విచారించడానికి భారతీయ జిల్లా మెజిస్ట్రేటులు, సెషన్స్ జడ్జీలకు అవకాశం కల్పించే శాసనంగా ఉండేది. 1879లో వాసుదేవ్ బలవంత్ పాడ్కే అనే ఉద్యోగి అమోషి రైతులను కూడగట్టి మహారాష్ట్రలో సాయుధ తిరుగుబాటు ప్రారంభించాడు. లార్డ్ రిప్పన్ కాలంలో భారతదేశంలో మొదటిసారిగా జనాభా లెక్కలు గణించారు.

లార్డ్ డఫ్రిన్ (1884-88)

ఇతడి కాలంలో 1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు ఎ.ఒ. హ్యూమ్ తుది రూపం ఇచ్చాడు. ఇదే సంవత్సరం డిసెంబర్‌లో బొంబాయిలో ప్రథమ జాతీయ కాంగ్రెసు సమావేశానికి డబ్ల్యు.సి. బెనర్జీ అధ్యక్షత వహించాడు. మూడో బర్మా యుద్ధం డఫ్రిన్ కాలంలోనే జరిగింది.

లాండ్జన్ (1888-94)

ఇతడి కాలంలో ఫ్యాక్టరీ చట్టం చేశారు. సివిల్ సర్వీసులను విభజించారు. 'డ్యూరాండ్ కమిషన్' బ్రిటిష్ ఇండియా, అఫ్గానిస్తాన్ మధ్య సరిహద్దును నిర్ణయించింది. 1892లో 'భారత కౌన్సిళ్ల చట్టం' జారీ చేశారు. దీని ప్రకారం కేంద్ర, రాష్ట్ర శాసనసభల్లో సభ్యుల సంఖ్య పెరిగింది. వీరిలో కొందరిని భారతీయులు పరోక్షంగా ఎన్నుకునే వీలు కలిగింది. కానీ ప్రభుత్వం నియమించే సభ్యుల సంఖ్యాధిక్యత యథాతథంగానే ఉంది. నూతన సభ్యులకు వార్షిక బడ్జెట్‌పై చర్చలో పాల్గొనే అవకాశం కల్పించారు. కానీ, వీరికి ఓటు హక్కు లేదు.

ఎల్జిన్ (1894-99)

ఇతడి కాలంలో 1896–97లో భయంకరమైన క్షామం సంభవించింది. దీనికి కారణాలు తెలుసుకోవడానికి 'లియల్' అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించాడు. ఇది నివేదిక సమర్పించక ముందే 1899లో మళ్లీ క్షామం వచ్చింది.చాపేకర్ సోదరులు 1897లో ఇద్దరు బ్రిటిష్ అధికారులను హత్య చేశారు.

లార్డ్ కర్జన్ (1899-1905)

కర్జన్ 1904లో యూనివర్సిటీ చట్టాన్ని జారీ చేశాడు. 'సర్‌థామస్' ర్యాలీ అధ్యక్షతన యూనివర్సిటీలకు సలహాలు ఇవ్వడానికి ఒక కమిషన్ నియమించాడు. 1904లో ప్రాచీన కట్టడాల (మాన్యుమెంట్స్) రక్షణ చట్టం, ప్రిజర్వేషన్ యాక్ట్‌ను జారీ చేశాడు. బిహార్‌లోని 'పూసా'లో వ్యవసాయ పరిశోధన సంస్థను స్థాపించాడు. 1905లో బెంగాల్‌ను విభజించాడు. కర్జన్ కాలంలోనే 1904లో వి.డి సావర్కర్ 'అభినవ భారత్' పేరుతో ఒక రహస్య విప్లవ సంస్థను స్థాపించాడు.

లార్డ్ మింటో (1905-10)

ఇతడి కాలంలో అతివాదులు, విప్లవ కారులు విజృంభించారు. వీరి కార్యకలాపాలను అరికట్టడానికి 1908లో 'ఎక్స్‌ప్లోజివ్ సబ్‌స్టెన్స్ యాక్ట్' చేశాడు. పత్రికలు, ప్రజావేదికలపై ఆంక్షలు విధించాడు. దీని కారణంగా 1908లో 'లోక్‌మాన్య' బాలగంగాధర్ తిలక్‌ను మాండలే కారాగారంలో నిర్బంధించారు.లార్డ్ మింటో కాలంలోనే 1906లో 'భారత ముస్లింలీగ్'ను స్థాపించారు. ఆగాఖాన్, ఢాకా నవాబు దీని ఏర్పాటుకు కృషి చేశారు. 1907లో భారత జాతీయ కాంగ్రెస్ అతివాదులు, మితవాదులుగా చీలిపోయింది. బెంగాల్ విభజనకు నిరసనగా ప్రతిఘటనోద్యమ నాయకులు 1905 అక్టోబర్ 16ను జాతీయ సంతాప దినంగా ప్రకటించారు. 1906 ఆగస్టు 15న జాతీయ విద్యా సమితి ఆవిర్భవించింది. కలకత్తాలో జాతీయ కళాశాలను ప్రారంభించారు. అరవింద్ ఘోష్ దీనికి మొదటి ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. 1905 తర్వాత అనేక పత్రికలు విప్లవ హింసావాదాన్ని ప్రచారం చేయడం ప్రారంభించాయి. వీటిలో బెంగాలీలో వెలువడే సంధ్య, యుగంధర్; పుణే నుంచి వెలువడే 'కాల్ ప్రముఖ్' పత్రికలు ముఖ్యమైనవి. 1909లో భారత శాసనసభల చట్టం ద్వారా రాజ్యాంగపరమైన రాయితీలు ప్రకటించారు. వీటినే మింటో–మార్లే సంస్కరణలు అంటారు. వీటి ద్వారా కేంద్ర, రాష్ట్ర శాసనసభల్లో ఎన్నికైన సభ్యుల సంఖ్యను పెంచారు. వీరిలో ఎక్కువ మందిని పరోక్ష పద్ధతి ద్వారా ఎన్నుకునే విధానం ప్రవేశపెట్టారు. మత ప్రాతిపదికన ప్రత్యేక నియోజకవర్గాలను కూడా ఏర్పాటు చేశారు. హిందూ–ముస్లింలను విభజించి పాలించడమే ఇందులోని ప్రధాన ఉద్దేశం.

లార్డ్ హార్డింజ్ (1910-1916)

ఇతడి కాలంలో 1911లో బెంగాల్ విభజనను రద్దు చేశారు. భారత రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చారు. అయిదో జార్జి ఢిల్లీ దర్బారును ఏర్పాటు చేశారు. 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. భారత సైనికులు,పౌరులను అనుమతి లేకుండానే యుద్ధంలోకి నెట్టారు. 1915లో గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి భారత్ తిరిగి వచ్చారు. ఇదే సంవత్సరంలో అనిబిసెంట్ హోమ్ రూల్ ఉద్యమాన్ని, మదన్ మోహన్ మాలవ్య 'హిందూ మహాసభ'ను స్థాపించారు. 1915లోనే గోఖలే, ఫిరోజ్‌షా మెహతా మరణించారు.

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్‌లో 350 ప్రొబేషనరీ ఇంజనీర్ ఉద్యోగాలు

ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) పలు ఉద్యోగాలకు ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా 350 ప్రొబేషనరీ ఇంజనీర్ పోస్టులకు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. బీఈ/బీటెక్, బీఎస్సీ పట్టభద్రులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టులు:** 350(ప్రొబేషనరీ ఇంజనీర్ ఎలక్ట్రానిక్స్ 200,మెకానికల్ 150 ఖాళీలున్నాయి).

» **అర్హతలు:** ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ /కమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్/మెకానికల్ బ్రాంచ్‌లతో బీఈ/బీటెక్/బీఎస్సీ /బీఎస్సీ ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించినవారై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు అర్హత కోర్సు ఉత్తీర్ణులైతే సరిపోతుంది. ఐవే బ్రాంచ్‌లతో ఏఎంఐఈ

» **వయసు:** 01.01.2025 నాటికి 25 ఏళ్లు మించకూడదు.

» **ఎంపిక ఇలా:** అభ్యర్థుల అకడమిక్ అర్హతల ఆధారంగా కంప్యూటర్ ఆధారిత రాత పరీక్షకు ఎంపిక చేస్తారు. రాత పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారు. దీంట్లోనూ అర్హత సాధించిన వారికి మెడికల్ టెస్టులు నిర్వహించి తుదిగా ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

» **రాత పరీక్ష:** ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ఈ పరీక్ష 125 ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. టెక్నికల్ ప్రశ్నలు 100, జనరల్ ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ నుంచి 25 ప్రశ్నలుంటాయి. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు లభిస్తుంది. ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు.

» **వేతనం:** ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.40,000– రూ.1,40,000 మూలవేతనంగా లభిస్తుంది. వీటితోపాటు డీఏ, హెచ్ఆర్ఏ ఇతర ప్రయోజనాలు లభిస్తాయి.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 31.01.2025

» **వెబ్‌సైట్:** https://bel-india.in

పగటి సమయంలో చంద్రుడి సగటు ఉష్ణోగ్రత ఎంత?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక శాస్త్రం

ఉష్ణం

ఉష్ణోగ్రత మాపక రకాలు

వాయు ఉష్ణోగ్రతా మాపకాలు

ఘన, ద్రవ పదార్థాలతో పోలిస్తే వాయువుల ఉష్ణవ్యాకోచం అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వీటిని ఉపయోగించి తక్కువ ఉష్ణోగ్రతను కచ్చితంగా కొలవచ్చు. ఈ ఉష్ణోగ్రత మాపకాల్లో ఎలాంటి వాయువులైనా ఉపయోగించవచ్చు. ఇవి పరిమాణంలో పెద్దవిగా ఉంటాయి. అందువల్ల వీటిని ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తీసుకెళ్లడం సాధ్యం కాదు. వీటిలో హైడ్రోజన్, నైట్రోజన్, హీలియంలతో పాటు ఏ వాయువునైనా నింపవచ్చు.

నిరోధక ఉష్ణోగ్రతా మాపకాలు

లోహాలను వేడిచేస్తే వాటి నిరోధం పెరుగుతుందనే సూత్రం ఆధారంగా ఈ ఉష్ణోగ్రతా మాపకాలు పనిచేస్తాయి. కానీ వేర్వేరు లోహాల నిరోధాలు వేర్వేరుగా ఉండటం వల్ల వీటిని ఉపయోగించి ఉష్ణోగ్రతలను కచ్చితంగా కొలవలేం. నిరోధక ఉష్ణోగ్రతా మాపకాల్లో ప్లాటినంను వాడతారు.దీన్ని ఉపయోగించి కొలిచే ఉష్ణోగ్రత స్థాయి –200°C నుంచి 1200°C.

అయస్కాంత ఉష్ణోగ్రత మాపకం

పరమశూన్య ఉష్ణోగ్రత –273°C లేదా 0°K-ను కొలవడానికి ఈ ఉష్ణోగ్రతా మాపకాలను ఉపయోగిస్తారు. సాధారణంగా ద్రవస్థితిలో ఉన్న హీలియంను ఇలాంటి మాపకాల్లో వాడతారు.

ఉష్ణ విద్యుత్ ఉష్ణోగ్రతా మాపకం

ఇది సీబెక్ ఫలితం ఆధారంగా పనిచేస్తుంది. దీన్ని ఉపయోగించి క్రిమికీటకాల ఉష్ణోగ్రతలను 0.025°C వరకు కచ్చితంగా కొలవవచ్చు. ఇలాంటి ఉష్ణోగ్రత మాపకాలను Sb, Bi అనే ఉష్ణయుగ్మంతో నిర్మిస్తారు.

సిక్స్ గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతా మాపకం

ఇందులో పాదరసం, ఆల్కహాల్‌ను ఉపయోగిస్తారు. 24 గంటల కాల వ్యవధిలో వాతావరణంలో సంభవించే కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలను కొలవవచ్చు.

బెక్‌మెన్స్ ఉష్ణోగ్రతా మాపకం

వివిధ స్వభావాలు ఉన్న నీటిఆవిరి ఉష్ణోగ్రతలను కొలవడానికి ఈ మాపకాన్ని వాడతారు.

ఉదాహరణ:
1) స్వచ్ఛమైన నీరు 100°C
2) సముద్ర జలం 101°C
3) మలినమైన నీరు 99°C (సుమారు)

బెథిస్కోప్

సముద్రగర్భంలో ఉన్న ఉష్ణోగ్రతలను కొలవడానికి దీన్ని జలాంతర్గామిలో అమరుస్తారు.

క్లినికల్ థర్మోమీటర్

దీన్ని సెంటారియో అనే శాస్త్రవేత్త 1602లో కనుగొన్నాడు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఆధునిక క్లినికల్ థర్మామీటర్‌ను 1866లో సర్ థామస్ క్లిఫర్డ్ ఆల్బట్ రూపొందించాడు.

పైరో మీటర్

పరిశ్రమల్లోని బట్టీలు లేదా కొలిమిల నుంచి వెలువడే అత్యధిక ఉష్ణోగ్రతలను కొలవడానికి పైరో మీటర్‌ను ఉపయోగిస్తారు. దీని సహాయంతో 3000°C - 3500°C వరకు ఉష్ణోగ్రతలను కొలవడం సాధ్యపడుతుంది.

ఆప్టికల్ పైరోమీటర్

సూర్యుడు లేదా నక్షత్రాల్లో ఉండే అత్యధిక ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగిస్తారు.

పైరోమీటర్, ఆప్టికల్ పైరోమీటర్లు ఉష్ణ వికిరణం ఆధారంగా పనిచేస్తాయి. కాబట్టి వస్తువుల ఉష్ణోగ్రతలను కొలిచేటప్పుడు వేడి వస్తువులు, ఉష్ణోగ్రత మాపకాల మధ్య భౌతిక స్పర్శ ఉండాల్సిన అవసరం లేదు.

విశిష్టోష్ణం

పదార్థం విశిష్టోష్ణం $S = \frac{1}{m}\frac{Q}{t}$

$$\Rightarrow S \propto \frac{1}{\Delta t}$$

m = పదార్థ ద్రవ్యరాశి,

Q = పదార్థానికి అందించిన ఉష్ణరాశి.

విశిష్టోష్ణం, ఆయా పదార్థాల (ఘన, ద్రవ, వాయు) స్వభావంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి వేర్వేరు పదార్థాల్లో విశిష్టోష్ణ విలువలు వేర్వేరుగా ఉంటాయి.

పాదరసం

ఇది గది ఉష్ణోగ్రత వద్ద ద్రవస్థితిలో లభించే ఒక లోహ మూలకం. పాదరసాన్ని సిన్నబార్ అనే ముడిపదార్థం నుంచి సంగ్రహిస్తారు. స్వభావరీత్యా వెండిలా మెరవడం వల్ల దీన్ని క్విక్ సిల్వర్ అని కూడా అంటారు. పాదరసం లోహాలతో చర్య జరిపినప్పుడు ఏర్పడిన పదార్థాలను అమాల్గమ్‌లు అంటారు. ఇది Fe(ఇనుము)తో చర్య జరపదు. కాబట్టి దీన్ని ఇనుప పాత్రలో రవాణా/నిల్వ చేస్తారు. పాదరసం మంచి ఉష్ణ వాహకం, విద్యుత్ వాహకం. పాదరస కాలుష్యం వల్ల 'మినిమిటా' అనే వ్యాధి వస్తుంది. తొలిసారిగా ఈ వ్యాధిని జపాన్‌లో కనుగొన్నారు.

ఉష్ణ వ్యాకోచాలు

ఘన పదార్థాల ఉష్ణ వ్యాకోచాలు

ప్రతి ఘన పదార్థంలో ద్రవ్యరాశి మూడు అంశాల వెంబడి అంటే X, Y, Z (X– పొడవు, Y– వెడల్పు, Z– ఎత్తు)లలో విభజితమై ఉంటుంది. ఒక ఘన పరిమాణాన్ని వేడిచేస్తే అది మూడు రకాల వ్యాకోచాలను కలిగి ఉంటుంది.

దైర్ఘ్య వాకోచం: ఘన పదార్థాన్ని వేడిచేస్తే ఏదైనా ఒక అక్షం వెంట వ్యాకోచిస్తే దాన్ని దైర్ఘ్య వ్యాకోచం అంటారు.

విస్తీర్ణ వ్యాకోచం: ఒక ఘన పదార్థాన్ని వేడిచేస్తే ఏదైనా రెండు అంశాల వెంట వ్యాకోచిస్తే దాన్ని విస్తీర్ణ వ్యాకోచం అంటారు.

ఘనపరిమాణ వ్యాకోచం: ఒక ఘన పదార్థాన్ని వేడిచేస్తే అన్ని అక్షాల వెంట వ్యాకోచిస్తే దాన్ని ఘన పరిమాణ వ్యాకోచం అంటారు.

ఒక ఘన పదార్థాన్ని వేడిచేస్తే దానిలో ఉండే వివిధ వ్యాకోచాల నిష్పత్తి 1:2:3గా ఉంటుంది. కాబట్టి ప్రతి ఘనపదార్థం దాని ఘనపరిమాణంలో గరిష్ఠ వ్యాకోచాన్ని కలిగి ఉంటుంది. ఘన పదార్థాలను వేడిచేసినప్పుడు వాటి స్వభావాన్ని బట్టి అణువుల మధ్య బంధ దూరంలో మార్పు వస్తుంది.

* కొన్ని ఘన పదార్థాలను వేడిచేస్తే వీటి అణువుల మధ్య బంధ దూరం పెరగడం వల్ల ఆ పదార్థాలు వ్యాకోచిస్తాయి.
  ఉదా: Al, Cu, Fe...
* కొన్ని ఘన పదార్థాలను వేడిచేస్తే వాటి అణువుల మధ్య బంధ దూరం తగ్గి పదార్థాలు సంకోచిస్తాయి.
  ఉదా: ప్లాస్టిక్, రబ్బర్, గాజు, సిల్క్ వస్త్రాలు, తల వెంట్రుకలు, ఫ్యూజు తీగ.
* కొన్ని ఘన పదార్థాలను వేడి చేసినా లేదా చల్లబర్చినా వాటి అణువుల మధ్య బంధదూరం మారదు. కాబట్టి ఇలాంటి పదార్థాలు సంకోచ, వ్యాకోచాలు చెందవు.
  ఉదా: చెక్కదిమ్మ.

అనువర్తనాలు

* రెండు వరుస రైలు పట్టాల మధ్యలో తగినంత ఖాళీ వదలడం వల్ల అవి స్వేచ్ఛగా సంకోచ, వ్యాకోచాలు చేయగలుగుతాయి.
  అందుకే రెండు విద్యుత్ స్తంభాలు లేదా టెలిఫోన్ స్తంభాల మధ్య తీగలను కొంచెం వదులుగా బిగిస్తారు.
* ఒక అల్యూమినియం పాత్రలో ఇనుపపాత్ర బంధించి ఉన్నప్పుడు వాటిని విడదీయాలంటే వేడిచేయాలి. ఇనుము కంటే అల్యూమినియం ఎక్కువగా వ్యాకోచిస్తుంది. అందువల్ల ఇనుప పాత్ర పరిమాణం కంటే అల్యూమినియం పాత్ర పరిమాణం పెరుగుతుంది.
* ఒకవేళ ఇనుప పాత్రలో అల్యూమినియం పాత్ర బంధించి ఉంటే వాటిని వేరు చేయడం కోసం చల్లబర్చాలి. ఈ సందర్భంలో ఇనుప పాత్ర కంటే అల్యూమినియం పాత్ర ఎక్కువగా సంకోచిస్తుంది.
* గది ఉష్ణోగ్రత వద్ద ఒక లోహ పలక మధ్య బిందువు వద్ద ఒక రంధ్రం ఉంది. లోహ పలకను వేడిచేసినప్పుడు అది వ్యాకోచించడం వల్ల రంధ్రం వ్యాసం కూడా పెరుగుతుంది.
* ఎడ్లబండి కొయ్య చక్రంపై వేడిచేసిన ఇనుప చక్రాన్ని అమర్చి నీటిని చల్లినప్పుడు అది సంకోచించి చక్రాన్ని గట్టిగా అదిమి పట్టుకుంటుంది.
* విద్యుత్ బల్బులను సీల్ చేయడం కోసం ప్లాటినం(Pt)ను ఉపయోగిస్తారు. గాజు, ప్లాటినంల సంకోచ వ్యాకోచాలు పరస్పరం సమానంగా ఉండటమే దీనికి కారణం.
* ఇంటి పైకప్పుల నిర్మాణంలో కాంక్రీట్‌తో పాటు స్టీలును ఉపయోగిస్తారు. ఆ రెండు పదార్థాల సంకోచం, వ్యాకోచాలు పరస్పరం సమానంగా ఉండటమే దీనికి కారణం.
* ఇనుప బ్రిడ్జిలను నిర్మించాక వాటిని గోళాకారం లేదా స్తూపాకారం ఉన్న నిర్మాణాలపై ఉంచితే అవి స్వేచ్ఛగా సంకోచ వ్యాకోచాలు చెందుతాయి.
* వేడి గాజు పలకపై చల్లటి ద్రవాన్ని చల్లితే గాజు పొరల మధ్య అసమాన సంకోచాల వల్ల అది పగిలిపోతుంది.
* గాజు పలకపై వేడి ద్రవాన్ని చల్లితే గాజు పొరల మధ్య అసమాన వ్యాకోచాల వల్ల అది పగిలిపోతుంది.
* ఇన్వార్ స్టీల్ అనే పదార్థంలో సంకోచ, వ్యాకోచాలు పరిగణనలోకి తీసుకోలేనంత తక్కువగా ఉంటాయి. కాబట్టి ఈ పదార్థాన్ని శృతి దండాలు, మీటర్ స్కేలు, గోడ గడియారాల్లోని లోలకాల తయారీలో ఉపయోగిస్తారు.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. ఏ ఉష్ణోగ్రత వద్ద నీటికి గరిష్ఠ సాంద్రత ఉంటుంది?
   ఎ) –4°C బి) 4°C
   సి) 60°C డి) 100°C
2. నీటి అసంగత వ్యాకోచ ధర్మాన్ని ఏ పదార్థ స్వభావంతో పోల్చవచ్చు?
   ఎ) రబ్బర్ బి) ప్లాస్టిక్
   సి) ట్రైప్‌మెటల్ డి) పైవన్నీ
3. క్రిమి కీటకాల ఉష్ణోగ్రత కొలవడానికి ఉపయోగించే ఉష్ణోగ్రతా మాపకం?
   ఎ) సిక్స్–గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతా మాపకం
   బి) పైరోమీటర్
   సి) సీబెక్ ఉష్ణవిద్యుత్ ఉష్ణోగ్రతా మాపకం
   డి) అయస్కాంత ఉష్ణోగ్రతా మాపకం
4. ఉష్ణశక్తి యాంత్రికశక్తిగా ఎందులో మారుతుంది?
   ఎ) వాహనం బి) ఫ్యాన్
   సి) ఇస్త్రీపెట్టె డి) విద్యుత్ హీటర్
5. 80°C వద్ద ఉన్న వేడి టీ 70°Cకు చల్లారడానికి అయిదు నిమిషాల సమయం అవసరం. తిరిగి 70°C నుంచి 60°Cకు చల్లారడానికి కావాల్సిన సమయం?
   ఎ) అయిదు నిమిషాలు
   బి) అయిదు నిమిషాల కంటే ఎక్కువ
   సి) అయిదు నిమిషాల కంటే తక్కువ
   డి) ఏదీకాదు
6. ఒక ఇంధనం నుంచి వెలువడే ఉష్ణరాశిని దేనితో కొలుస్తారు?
   ఎ) ఉష్ణోగ్రతా మాపకం
   బి) సాధారణ కెలోరీమీటర్
   సి) బోలోమీటర్
   డి) బాంబు కెలోరీమీటర్
7. రాగి పాత్రలో వేడి ద్రవాన్ని నింపి ఇనుపబల్లపై ఉంచితే అది ఏ పద్ధతి వల్ల చల్లారుతుంది?
   ఎ) ఉష్ణవహనం బి) ఉష్ణ సంవహనం
   సి) ఉష్ణ వికిరణం డి) ఎ, బి
8. ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించేందుకు ఉపయోగించే థర్మోస్టాట్‌ను దేనితో తయారుచేస్తారు?
   ఎ) ఇనుము, ఇత్తడి బి) ఇనుము, రాగి
   సి) రాగి, ఉక్కు డి) ఇత్తడి, రాగి
9. థర్మాస్‌ఫ్లాస్క్‌లోని వేడిద్రవం ఏ పద్ధతి వల్ల ఉష్ణాన్ని నష్టపోదు?
   ఎ) ఉష్ణవహనం బి) ఉష్ణ సంవహనం
   సి) ఉష్ణ వికిరణం డి) పైవన్నీ
10. ఉష్ణోగ్రత మాపకం కనిష్ఠ రీడింగ్ ఎల్లప్పుడూ దేనికి సమానం?
   ఎ) మంచు ఉష్ణోగ్రత
   బి) పాదరస ఉష్ణోగ్రత
   సి) ఆల్కహాల్ ఉష్ణోగ్రత
   డి) నీటి ఆవిరి ఉష్ణోగ్రత
11. ఇనుప పాత్రలో అల్యూమినియం పాత్ర ఉంచారు. వీటిని వేరు చేయాలంటే?
   ఎ) ఆ రెండు పాత్రలు వేడి చేయాలి
   బి) ఆ రెండు పాత్రలూ చల్లని నీటిలో ముంచాలి
   సి) ఆ రెండు పాత్రలను సుత్తితో కొట్టాలి
   డి) పైవన్నీ
12. నీటి అసంగత వ్యాకోచం తగ్గించేందుకు దానిలో ఏ ద్రవం కలపాలి?
   ఎ) ఇథైల్ గ్లైకాల్ బి) బెంజీన్
   సి) పెట్రోలు డి) కిరోసిన్
13. విద్యుత్ ఇస్త్రీపెట్టెను కనుగొన్నవారు?
   ఎ) ప్రీవోస్ట్ బి) కూలుంబ్
   సి) హెన్రీషెలె డి) విలియం గిల్‌బర్ట్
14. పగటి సమయంలో చంద్రుడి సగటు ఉష్ణోగ్రత ఎంత?
   ఎ) 25°C బి) 50°C
   సి) 75°C డి) 100°C

సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) ఎ; 5) బి; 6) డి; 7) డి; 8) ఎ; 9) డి; 10) ఎ; 11) బి; 12) ఎ; 13) సి; 14) డి.

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

వివిధ శాస్త్రాలు - అధ్యయనాలు

కార్పొలజీ	:	విత్తనాలపై అధ్యయనం
సైటాలజీ	:	మొక్కలు, జంతువుల కణాలపై అధ్యయనం
కార్డియాలజీ	:	గుండె వ్యాధులకు సంబంధించిన అధ్యయనం
కాస్మాలజీ	:	విశ్వం గురించిన అధ్యయనం
క్రిప్టోగ్రఫీ	:	రహస్య సంకేతాలతో రాసిన చేతిరాతలపై అధ్యయనం
సైటోపాథాలజీ	:	మొక్కల వ్యాధులపై అధ్యయనం

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
ఆదివారం । 19-1-2025

అచ్చ తెలుగులో రాసిన తొలి గ్రంథం ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

తెలంగాణ కవులు - సాహిత్యం

కాకతీయుల కాలం

విశ్వేశ్వర దేశికుడు (1200-1290): ఇతడినే విశ్వేశ్వర దేశికుడు లేదా శివదేవుడు అంటారు. ఇతడు 'శివతత్వ రసాయనం' రచించాడు. శివదేవుడు కేరళ ప్రాంతానికి చెందిన కీర్తి శంభుని శిష్యుడు. ఇతడు తెలంగాణకు వచ్చి స్థిర పడ్డాడు. ఇక్కడ అనేక మఠాలు (కాళేశ్వరం, ఏలేశ్వరం), దేవాలయాలు (మంథెన, వెల్లాల, గోళగి) నిర్మించాడు. ఇతడు కాకతీయ గణపతి దేవుడి దీక్షా గురువు. ఇతడు రుద్రమదేవి పాలనను, ప్రతాపరుద్రుడి యువరాజత్వాన్ని ప్రశంసించాడు. గణపతి దేవుడి నుంచి 'మందిరం', రుద్రమదేవి నుంచి 'వెలగపూడి' అనే గ్రామాలను పొందాడు. ఈ రెండింటినీ కలిపి 'గోళగి' అనే అగ్రహారంగా మార్చాడు. అక్కడ శివాలయం, ప్రసూతి వైద్యశాల నిర్మించాడు.

గోన బుద్ధారెడ్డి (1210-1240): రంగనాథ రామాయణం రాశాడు. ఇది తెలుగులో తొలి రామాయణం. ఇందులో.. ఇంద్రుడు కోడై కూయడం, లక్ష్మణుడు ఏడుగీతలు గీయడం, ఊర్మిళ నిద్ర, లక్ష్మణ దేవుడి నవ్వు లాంటి కథలు కూడా రాశాడు. దీన్ని ద్విపద కావ్యంలో రచించాడు.

శివదేవయ్య: 'పురుషార్థసారం' గ్రంథాన్ని రచించాడు. ఇతడు గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడి వద్ద మంత్రిగా పనిచేసి మన్ననలు పొందాడు. సంస్కృతాంధ్ర కవితా పితామహుడిగా కీర్తి పొందాడు.

ఈశ్వర భట్టోపాధ్యాయుడు (1262): ఇతడు మయూరసూరి పుత్రుడు. తన తల్లి పేరుతో, భార్య పేరుతో బూదపురంలో రెండు చెరువులు తవ్వించాడు. అక్కడ దేవాలయాలు నిర్మించాడు. ఇతడు బూదపుర శాసనాన్ని నిర్మించాడు. ఇది మహబూబ్‌నగర్ జిల్లాలో ఉంది.

కుప్పాంబిక (1230-1300): ఈమె తొలి తెలుగు/తెలంగాణ కవయిత్రి. మొల్ల కంటే ముందే అనేక కవిత్వాలు రచించారు.

చక్రపాణి రంగనాథుడు: శివభక్తి దీపిక, గిరిజాదినాయక శతకం, చంద్రాభరణ శతకం, శ్రీగిరినాథ విక్రయం, వీరభద్ర విజయం (సంస్కృతం) రచించాడు. ('వీరభద్ర విజయం' తెలుగులో పోతన రాశాడు)

కపర్థి: అపస్తంభ శ్రౌత సూత్ర భాష్యం, భరద్వాజ గృహ్యసూత్ర భాష్యం, అపస్తంభ గృహ్యపరిశిష్ట భాష్యం, శ్రౌత కల్పకావృత్తి, దివ్య పూర్ణభాష్యం ఇతడి ప్రసిద్ధ గ్రంథాలు. ఇతడు ప్రఖ్యాత వ్యాఖ్యాత మల్లినాథసూరి తండ్రి. మెదక్ జిల్లా కొలిచెలిమివాసి. ఇతడు గొప్ప భాష్యకారుడు.

గంగాధర కవి: మహాభారతాన్ని నాటక రూపంలో రచించాడు.

అప్పయార్యుడు: జినేంద్రకల్యాణాభ్యుదయం రాశాడు.

మంచన: కేయూర బాహు చరిత్ర రాశాడు.

శేషాద్రి రమణ: ఇతడు సంస్కృతంలో యయాతి చరిత్ర, ఉషా రాగోదయం (నాటకం) రచించాడు. యయాతి చరిత్రను తెలుగులో పొన్నెగంటి తెలగనచార్యుడు గోల్కొండ రాజు ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో రాశాడు.

మారన (1289-1323): ఇతడు తెలుగులో తొలి పురాణమైన 'మార్కండేయ పురాణం' తెలుగులో తొలి వ్యాకరణ గ్రంథమైన 'ఆంధ్రభాషాభూషణం' రాశాడు.

కేతన: ఇతడు 'విజ్ఞానేశ్వరీయం' రాశాడు. ఇది తెలుగులో తొలి శిక్షాస్మృతి. ఇది యజ్ఞవల్క్యుడి స్మృతికి అనువాదం.

విద్యానాథుడు (1289-1323): ప్రతాపరుద్ర యశోభూషణం, ప్రతాపరుద్ర కల్యాణం గ్రంథాలను రాశాడు. వీటిలో ప్రతాపరుద్రుడి యశోగానం కనిపిస్తుంది.

కుమారస్వామి: 'సోమిపథి రత్నాపణ' గ్రంథాన్ని రాశాడు.

చిలకమర్రి తిరుమలాచార్యులు: 'రత్నశాణ' రచించాడు. భట్టుమూర్తి 'నరసభూపాతియం' దీని అనువాదమే.

అగస్త్యుడు (1289-1323): బాల భారతం, కృష్ణచరిత్ర (గద్య కావ్యం), నలకీర్తి కౌముది (పద్య కావ్యం), మణిపరీక్ష (లక్ష్మీ స్తోత్రం), లలిత సహస్రనామం, శివ సంహిత, శివస్తవం తదితర 74 గ్రంథాలు రచించాడు.

గంగాదేవి అగస్త్యుడి శిష్యురాలు. ఈమె విజయనగర రాజైన కుమార కంపరాయలను వివాహం చేసుకుంది. 'మధుర విజయం' గ్రంథంలో భర్త ఘన విజయాలను వివరించింది.

తిక్కన: ఈయన భారతాన్ని తెలుగులోకి అనువదించారు.

- 'నన్నయ' రాజరాజనరేంద్రుడి, 'తిక్కన' గణపతిదేవుడి, 'ఎర్రన' ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలో ఉన్నారు. ఈ ముగ్గురిని 'కవిత్రయం'గా పేర్కొంటారు.
- మల్లికార్జునుడు, హుళక్కి భాస్కరుడు, రుద్రదేవుడు.. ఈ ముగ్గురు కలిసి 'భాస్కర రామాయణం' రచించారు.

రేచర్ల పద్మనాయకులు

విద్యారణ్య స్వామి: ఈయన శృంగేరి పీఠాధిపతి. 'సంగీతసారం' గ్రంథాన్ని రచించారు. విద్యారణ్య స్వామి మహామేధావి, కవి, తాత్వికుడు. హరిహర రాయలు, బుక్కరాయలకు విజయనగర రాజ్యాన్ని స్థాపించడానికి ప్రేరణ ఇచ్చారు. విద్యారణ్యుడు ఏకశిలానగరవాసి అని 21వ శృంగేరి పీఠాధిపతి సచ్చిదానంద భారతి ఆస్థాన విద్వాంసుడైన కాశీ లక్ష్మణ శాస్త్రి 'గురువంశ కావ్యం'లో పేర్కొన్నాడు.



సాయనుడు: ఇతడు చతుర్వేదాలకు భాష్యం రాశాడు. పురుషార్థ సుధానిధి, ఆయుర్వేద సుధానిధి, యజ్ఞతంత్ర సుధానిధి తదితర రచనలు చేశాడు.

పద్మనాయక భూపాలుడు: ఇతడు సారంగధర చరిత్ర రాశాడు. ఇతడికి 'సర్వజ్ఞ' అనే బిరుదు ఉంది.

విశ్వేశ్వరుడు: చమత్కార చంద్రిక, వీరభద్ర విజృంభణ గ్రంథాలను రాశాడు.

కవిభల్లటుడు: గుణమంజరి, పదమంజరి, శూద్రక రాజచరిత్రం, బేతాళ పంచవింశతి ఇతడి ప్రసిద్ధ రచనలు.

మడికి సింగన: సకలనీతి సమ్మతం, పద్మపురోణోత్తర ఖండం, భాగవత దశమ స్కంధం (ద్విపదం), జ్ఞాన వాశిష్ట రామాయణం మొదలైనవి రచించాడు.

సర్వజ్ఞ సింగభూపాలుడు: రసావర్ణ సుధాకరం, సంగీత సుధాకరం, కందర్ప సంభవం, కువలయావళి (రత్నపాంచాలిక) లాంటి రచనలు చేశాడు. ఇతడు బహుముఖ ప్రజ్ఞాశాలి. సంగీత నాట్య మర్మజ్ఞుడు. కవి, నాటకకారుడు. ఇతడు అనేక మంది కవి, పండితులను పోషించాడు. సారంగదేవుడు రచించిన 'సంగీత రత్నాకరం' గ్రంథానికి 'సంగీత సుధాకరం' పేరుతో వ్యాఖ్యానం చేశాడు. రసావర్ణ సుధాకరం అనేది అలంకార శాస్త్రం.

గౌరన: నవనాథ చరిత్ర (దీన్నే శ్రీగిరి పండితుడు చంపువుగా రాశాడు), లక్ష్మణ దీపిక, హరిశ్చంద్రోపాఖ్యానం లాంటి అనేక గ్రంథాలు రచించాడు. ఇతడికి 'సరస సాహిత్య లక్షణ చక్రవర్తి', 'ప్రతివాద మదగజ వంచాననుడు' అనే బిరుదులు ఉన్నాయి. మార్కండేయ, స్కంధ పురాణాల్లో ఉన్న హరిశ్చంద్ర మహారాజు కథే హరిశ్చంద్రోపాఖ్యానం మూల కథ. శ్రీగిరి పండితుడు రెడ్డిరాజుల కాలంలో నవనాథ చరిత్రను చంపువుగా రాశాడు.

బమ్మెర పోతన: పోతన 'వీరభద్ర విజయం', 'భోగినీ దండకం', 'మహాభాగవతం' (తెలుగులో) రచించాడు. ఈయన కొంతకాలం మూడో సింగభూపాలుని ఆస్థానంలో ఉన్నారు. పోతన భాగవతంలో పేర్కొన్న ఏకశిలానగరం నేటి ఓరుగల్లే (వరంగల్). పోతన జన్మస్థలమైన బమ్మెర ఈ జిల్లాలోనే ఉంది. అంతకుముందు ఇది నల్లగొండ జిల్లాలోని గ్రామం. వీరభద్ర విజయంలోని మూలకథ.. శివుడిని ఆహ్వానించకుండా దక్షుడు యజ్ఞం నిర్వహించడం, శివుడి కోప సంకల్పంతో పుట్టిన వీరభద్రుడు దాన్ని ధ్వంసం చేయడం, దక్షుడి శిరస్సు ఖండించడం. భోగినీ దండకంలో నాటి పాలకుల భోగ లాలసత్వాన్ని వర్ణించారు. పోతన భాగవతం తెలుగులో భక్తికి మారుపేరుగా నిలిచింది. ఇందులో ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం, వామనావతార ఘట్టం, శ్రీకృష్ణ చరిత్ర మొదలైనవాటిని పోతన రమ్యంగా వర్ణించారు.

కొరవి గోపరాజు: 'సింహాసన ద్వాత్రింశిక' రచించాడు. ఇది కథాకావ్యం. ఈ గ్రంథానికి మూలం విక్రమార్క చరిత్ర అనే సంస్కృత కావ్యం. పాల్కురికి తర్వాత తెలంగాణ సాంఘిక జీవితాన్ని విస్తృతంగా వర్ణించిన కావ్యం ఇదే.

కుతుబ్‌షాహీల యుగం (1518-1687)

సుల్తాన్ కులీ: ఇతడికి బడే మాలిక్ (దొడ్డ ప్రభువు) అనే బిరుదు ఉంది.

జంషీద్: కూచిపూడి భాగవతులకు 'కూచిపూడి' గ్రామాన్ని దానం చేశాడు.

ఇబ్రహీం కుతుబ్‌షా: ఇతడిని మల్కిభరాముడిగా పేర్కొన్నారు. ఇతడి ఆస్థానంలో అనేకమంది కవులు ఉండేవారు. వీరిలో ముఖ్యమైనవారు..

అద్దంకి గంగాధరుడు: ఇతడు 1565లో తపతీ సందరోపాఖ్యానం (తపతీ సంవరణోపాఖ్యానం) రచించి ఇబ్రహీం కుతుబ్‌షాకు అంకితం చేశాడు. 'వసుచరిత్ర'ను దీని ఆధారంగానే రాశారు (1570). అద్దంకి గంగాధరుడు రామరాజ భూషణుడితో పోల్చదగిన ప్రతిభావంతుడైన కవి.

కందుకూరి రుద్రకవి: సుగ్రీవ విజయం (తొలి యక్షగానం), నిరంకుశోపాఖ్యానం, జనార్దనాష్టకస్తోత్రం, గువ్వల చెన్నని శతకం మొదలైనవాటిని రచించాడు. అగ్రశ్రేణి కవుల్లో ఒకరైన రుద్రకవి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ సమీపంలో ఉన్న కందుకూరు గ్రామ నివాసి. నిరంకుశోపాఖ్యానం శృంగార ప్రధానమైన సాంఘిక కావ్యం.

పొన్నెగంటి తెలగన: ఇతడు 'యయాతి చరిత్ర' రాశాడు. ఇది అచ్చ తెలుగులో రచించిన తొలి గ్రంథం.

మహమ్మద్ కులీకుతుబ్‌షా: ఇతడు తన ప్రేయసి భాగమతి పేరుపై భాగ్యనగరం నిర్మించాడు. బాగ్ అంటే 'ఉద్యానం' అని అర్థం. చార్మినార్ (1591), హైదరాబాద్ (1593)ను కూడా ఇతడే నిర్మించాడు. ఇతడు మీర్జా మహమ్మద్ అమిన్, వజీహీ, గవాసీ తదితర ప్రముఖ కవులను ఆదరించాడు. మహమ్మద్ కులీకుతుబ్‌షా ఉర్దూ కవితల సంకలనాన్ని దివాన్ పేరుతో అతడి అల్లుడు సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా వెలువరించాడు.

సారంగు తమ్మయ్య: హరిభక్తి సుభోదయం, వైజయంతీ విలాసం రచించాడు. సారంగు తమ్మయ్య కుతుబ్‌షాకు ఆప్తుడిగా వ్యవహరిస్తూనే.. కలంపట్టి కమనీయమైన కావ్యరచనలు చేశాడు. వైజయంతీ విలాసం గ్రంథం తెలుగు శృంగార కావ్యాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. నాటి పాలకుల భోగలాలసతను మరో కోణం నుంచి చిత్రించిన కావ్యం ఇది.

నేబతి కృష్ణమంత్రి: 'రాజనీతి రత్నాకరం' అనే గ్రంథం రాశాడు.

ఎల్లారెడ్డి: బాలభారతం (అగస్త్యుడి రచనకు అనువాదం), కిరాతార్జునీయం (భారవి రచనకు అనువాదం) రాశాడు.

మల్లారెడ్డి: షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం, పద్మపురాణం తదితర రచనలు చేశాడు.

అబ్దుల్లా కుతుబ్‌షా: సంస్కృత 'శుకసప్తతి'ని 'యతినామా' పేరుతో పర్షియన్ భాషలోకి అనువాదం చేశాడు. ఇతడి పాలనా కాలం ఉర్దూ భాషకు స్వర్ణయుగంగా ఉంది. ఇతడు కవి, పండిత పోషకుడే కాకుండా స్వయంగా గొప్ప కవి. అబ్దుల్లా పేరుతో కవితలు రాశాడు. ఇతడి ఆస్థానంలో అనేక మంది పండితులు ఉండేవారు. వారిలో ప్రధాన కవులు-వారి రచనలు..

- గవాసి ఇబిన్ నిషాత్ - తోతినామా.
- తబియా - బహురావగుల్.
- తులసీమూర్తి - సంగీత విద్వాంసుడు.
- క్షేత్రయ్య - రాజుపై 12 వేల కృతులు రాశారు.
- మరింగంటి వేంకట నరసింహాచార్యులు - హరివాసర మాహాత్మ్యం.
- చరిగొండ నరసింహ - శశిబిందు చరిత్ర.
- రాజలింగ కవి - కూర్మపురాణం.
- కోన నారాయణ - వజ్రాభ్యుదయం.
- పిల్లలమర్రి వేంకటపతి - రాజేశ్వర విలాసం.
- గోపతి లింగ కవి - చెన్నబసవ పురాణం.

సురభి మాధవరాయలు: చంద్రికా పరిణయం అనే ప్రౌఢ కావ్యాన్ని శ్లేష అనుప్రాసాది శబ్ద చిత్ర నిపుణత్వంతో రచించాడు.

ఎలకూచి బాలసరస్వతి: సుభాషిత రత్నావళి, మాధవ రాఘవ పాండవీయం రాశాడు. ఇతడు భర్తృహరి సంస్కృతంలో రాసిన శృంగార, నీతి, వైరాగ్య శతకాలను సుభాషిత రత్నావళి పేరుతో అనువాదం చేసి మాధవ రాయల తండ్రి మల్లభూపాలుడికి అంకితం చేశాడు.

అప్పకవి: సాధ్వీజన ధర్మం (ద్విపద కావ్యం), అనంతవ్రతకల్పం (కావ్యం), అంబికావాదం (యక్షగానం), కవి కల్పకం (లక్షణ గ్రంథం) రాశాడు.

పోనుగోటి జగన్నాథాచార్యులు: కుముదవల్లి విలాసం (ఇది భక్తరామదాసు జీవితానికి దగ్గరగా ఉండటం గమనార్హం)

కంచర్ల గోపన్న: దాశరథీ శతకం రాశారు. ఈయనను భక్తరామదాసుగా పేర్కొంటారు. ఈయన అక్కన్న, మాదన్న మేనల్లుడు. 1650లో భద్రాచలం తహశీల్దార్‌గా నియమితులయ్యారు. భద్రాచలంలో రామాలయం నిర్మించారు. అబుల్‌హసన్ తానీషా ఈయనను గోల్కొండలో బంధించాడు. గోపన్న భక్తికి మెచ్చి చివరకు విడుదల చేశారు.

పెన్గలూరి వెంకటాద్రి: భువన మోహిని విలాసం రాశారు.

విశ్వనాదయ్య: సిద్ధేశ్వర పురాణం (ద్విపదం) రచించారు.

అన్నంభట్టు: తర్క సంగ్రహం రాశారు.

కృష్ణమాచార్యులు: భగవద్గీత (ద్విపద) రాశారు.

What is the profession of Bharat?



Model Questions

Directions (Q.1-5): Study the following information to answer the given questions.

Seven friends, viz Manjit, Naveen, Parul, Hitesh, Tarun, Raghu and Sahil, are pursuing their PhD in different subjects Maths, History, Political Science, Chemistry, Economic, Accounts and Geography, but not necessarily in the same order. They study in three different universities, viz P, Q and S. At least two friends study in the same university. Hitesh is studying Political Science in university P. The one who is studying History is not from university S. Sahil is studying Geography in university Q with only Naveen. Manjit is not studying Economics and is not from university P. Raghu is studying Accounts and is not from university P. Tarun is studying Chemistry but not from university P. No one studies Maths or Economics in university P.

1. Which of the following represents the group that studies in university S?
   1) Hitesh, Naveen
   2) Parul, Raghu, Tarun
   3) Manjit, Tarun
   4) Tarun, Raghu, Manjit
   5) None of these
2. Parul is studying in which of the following universities?
   1) P 2) Q 3) S
   4) Can't be determined
   5) None of these
3. Which of the following combinations is true?
   1) Manjit-Economics-university S
   2) Naveen-History-university Q
   3) Parul-History-university S
   4) Tarun-Chemistry-university Q
   5) None of these
4. Naveen studies which subject in PhD?
   1) History 2) Maths
   3) Economics
   4) Can't be determined
   5) None of these
5. Who among the following is studying History in PhD?
   1) Naveen 2) Parul
   3) Raghu 4) Manjit
   5) None of these

Directions (Q.6-11): Read the following information carefully and answer the given questions.

Eight friends Aman, Bharat, Rohit, Dinesh, Ishant, Farhan, Aditya and Hirender are sitting around a circular table, facing the centre but not necessarily in the same order. Each of them has a different designation, viz Banker, Teacher, Company MD, Politician, Corporate Leader, General Manager, Specialist Officer and CEO. Aman sits third to the right of the CEO. Only two people sit between the CEO and Hirender. The Specialist Officer and the Company MD are immediate neighbours. Neither Aman nor Hirender is either a Specialist Officer or a Company MD. The Specialist Officer is not an immediate neighbour of the CEO. The Banker sits second to the left of Ishant. Ishant is not an immediate neighbour of Hirender. The Banker is an immediate neighbour of both the Politician and the Corporate Leader. The Corporate Leader sits third to the right of Bharat. Bharat is not a Specialist Officer. Rohit sits on the immediate right of the Teacher. Aman is not a Teacher. Farhan is not an immediate neighbour of Aman. Aditya is not an immediate neighbor of the Banker.

6. Four of the following five are alike in a certain way based on the given arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
   1) Farhan – Teacher
   2) Aditya – General Manager
   3) Dinesh – Banker
   4) Aman – Corporate Leader
   5) Bharat – CEO
7. Who amongst the following sits third to the left of Ishant?
   1) Banker 2) Aditya 3) Aman
   4) Corporate Leader 5) Bharat
8. Who among the following is a General Manager?
   1) Aman 2) Rohit 3) Hirender
   4) Aditya 5) Dinesh
9. What is the profession of Bharat?
   1) Teacher 2) Banker
   3) Company MD
   4) Specialist Officer
   5) Corporate Leader
10. Who among the following is a Politician?
    1) Rohit 2) Farhan 3) Aditya
    4) Hirender 5) Aman
11. Which of the following is true with respect to the given seating arrangement?
    1) The Politician is an immediate neighbour of the Specialist Officer.
    2) Aditya sits second to the right of Dinesh.
    3) The Politician and the Company MD are immediate neighbours.
    4) The Teacher sits on the immediate left of the CEO
    5) None of these

Directions (Q.12-16): Study the following information to answer the given questions.

In a certain code language:

'firefighters are armymen' is written as 'tee mee kee',
'courageous people are armymen' is written as 'kee loo nee tee',
'courageous being enthusiastic' is written as 'loo pee jee',
'people are enthusiastic' is written as 'kee nee pee' and
'positive people are unpleasant'is written 'nee kee dee see'.

12. What is the code for 'being'?
    1) loo 2) jee 3) kee
    4) pee 5) None of these
13. Which of the following may be the possible code for 'unpleasant firefighters are positive'?
    1) dee see tee mee
    2) dee see kee mee
    3) see tee mee kee
    4) dee see jee lee
    5) None of these
14. What does 'pee' stand for?
    1) courageous 2) positive
    3) army men 4) enthusiastic
    5) None of these
15. Which of the following is represented by the code 'see jee tee pee dee kee loo'?
    1) unpleasant armymen enthusiastic being are positive firefighters
    2) unpleasant armymen enthusiastic courageous positive are being
    3) unpleasant armymen being enthusiastic are positive people
    4) unpleasant armymen being are enthusiastic people.
    5) None of these
16. Which of the following is the code for 'firefighters armymen belong to positive people'?
    1) tee kee cee que loo dee
    2) mee cee loo dee kee see
    3) mee tee cee too dee nee
    4) mee tee cee toe nee see
    5) Can't be determined

Directions (Q.17-21): Study the information and answer the given questions:

Seven people P, Q, R, S, T, U and V live on separate floors of a 7-floor building. Ground floor is numbered 1, first floor is numbered 2 and so on until the topmost floor is numbered 7. Each one of these is travelling to a different city, viz Delhi, Mumbai, Patna, Chennai, Kolkata, Bengaluru and Lucknow but not necessarily in the same order. Only three people live above the floor on which P lives. Only one person lives between P and the one travelling to Bengaluru. U lives immediately below the one travelling to Mumbai. The one travelling to Mumbai lives on an even-numbered floor. Only three people live between the ones travelling to Bengaluru and Patna. T lives immediately above R. T is not travelling to Patna. Only two people live between Q and the one travelling to Kolkata. The one travelling to Kolkata lives below the floor on which Q lives. The one travelling to Delhi does not live immediately above or immediately below Q. S does not live immediately above or immediately below P. V does not travel to Chennai.

17. Which of the following is true with respect to V as per the given information?
    1) The one who lives immediately below V is travelling to Mumbai.
    2) V lives on floor no. 7
    3) V lives immediately below T
    4) V lives on the lowermost floor
    5) V is travelling to Bengaluru
18. Who among the following lives on floor no. 3?
    1) The one travelling to Chennai
    2) The one travelling to Kolkata
    3) R 4) V 5) T
19. Who lives on the floor immediately above T?
    1) P 2) Q 3) S 4) V 5) U
20. To which of the following cities is S travelling?
    1) Mumbai 2) Bengaluru
    3) Patna 4) Kolkata
    5) Chennai
21. How many people live between the floors on which S and the one travelling to Mumbai live?
    1) None 2) Two 3) One
    4) More than three 5) Three


Answers and Explanations

(1-5):

Friend	University	Subject
Manjit	S	Maths
Naveen	Q	Economics
Parul	P	History
Hitesh	P	Political Science
Raghu	S	Accounts
Sahil	Q	Geography
Tarun	S	chemistry

1. 4 2. 1 3. 5
4. 3 5. 2

(6-11):



6. 5 7. 4 8. 1
9. 3 10. 2 11. 4

(12-16):

firefighters are armymen → tee mee kee...(i)
courageous people are armymen → kee loo nee tee...(ii)
courageous being enthusiastic → loo pee jee...(iii)
people are enthusiastic → kee nee pee...(iv)
positive people are unpleasant → nee kee dee see...(v)
From (i), (ii) and (iv) are → kee
From (i) and (ii) armymen → tee
From (i) firefighters → mee
From (iii) and (iv) enthusiastic → pee
From (ii), (iv) and (v) people → nee
From (ii) and (iii) courageous → loo
From (iii) being → jee
From (v) positive/unpleasant → dee/see

12. 2 13. 2 14. 4
15. 2 16. 5

(17-21):

Person	Floor	City
S	7	Chennai
Q	6	Patna
V	5	Lucknow
P	4	Mumbai
U	3	Kolkata
T	2	Bengaluru
R	1	Delhi

17. 1 18. 2 19. 5
20. 5 21. 2